# ఉపాధ్యాయుల కరదీపిక

# తెలుగు

## 6 నుండి 10 తరగతులు

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, (తెలుగు), ప్ర.ఉ.పా.పా. కన్నాల, మంథని (మం), పెద్దపల్లి జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** భాషోపాధ్యాయుడు, సి.పి.ఎల్., అంబర్‌పేట, హైదరాబాదు.

**శ్రీ పల్లెర్ల రామమోహన రావు,** స్కూ.అ., వేముల, మహబూబ్‌నగర్.

**శ్రీ వొజ్జల శరత్ బాబు,** స్కూ.అ., రాజ్‌భవన్ పాఠశాల, హైదరాబాదు.

**శ్రీ కొండ్రు జనార్ధన్,** స్కూ.అ., మంచిర్యాల, మంచిర్యాల జిల్లా.

**శ్రీ కందాడై రంగరాజు,** స్కూ.అ., రంగాపురం, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ వి.చెన్నయ్య,** స్కూ.అ., శామీరుపేట్, మేడ్చల్ జిల్లా.

**శ్రీ కటుకోజ్వల మనోహరాచారి,** స్కూ.అ., జి.ప.ఉ.పా, కోరుట్ల, జగిత్యాల జిల్లా

**శ్రీ అవుసుల భానుప్రకాశ్,** స్కూ.అ., లోనికలాన్, సంగారెడ్డి జిల్లా.

**డా॥ గట్టు త్రివేణి,** భాషోపాధ్యాయిని, తెలుగు పండిట్, చెన్నూరు, మంచిర్యాల జిల్లా.

**శ్రీ పల్లి మాధవి,** భాషోపాధ్యాయిని, భారతీయ విద్యాభవన్, హైదరాబాదు.

**శ్రీ నందిగామ కిశోర్,** భాషోపాధ్యాయుడు, ఇప్పటూరు, మహబూబ్‌నగర్.

## సమన్వయం-సహకారం-సలహాదారులు

**డా॥ ఎన్.ఉపేందర్‌రెడ్డి,** రిటైర్డ్ ప్రొఫెసర్, కరిక్యులం & పాఠ్యపుస్తక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ ఎస్. జగన్నాథ్‌రెడ్డి,** సంచాలకులు,
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, తెలంగాణ.

## ముఖ్య సలహాదారులు

**శ్రీ జి. కిషన్,** ఐ.ఏ.ఎస్. సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ, తెలంగాణ.

## కవర్ పేజి, బొమ్మలు

**కె. సుధాకరాచారి,** యు.పి.యస్ నీలికుర్తి, వరంగల్ జిల్లా.

# ముందుమాట

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర మొదలగునవి ప్రతిబింబించేలా తెలుగు పాఠ్యపుస్తకాలను సమీక్షించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీనికూడా నియమించింది. సుదీర్ఘ చర్చలు, కార్యశాలల ద్వారా 2010-11 నుండి 2014 వరకు రూపొందించిన తెలుగు వాచకాలను సమూలంగా మార్పులు చేసి నూతన తెలుగు వాచకాలను రూపొందించారు. 1 నుండి 5వ తరగతి పుస్తకాలకు 'జాబిలి' అని, 6 నుండి 8వ తరగతి పుస్తకాలకు 'నవవసంతం' అని, 9, 10 తరగతుల పుస్తకాలకు 'సింగిడి' అని పేర్లుతో తెలంగాణ సాహిత్యం, సంప్రదాయాలు, చరిత్ర, స్ఫూర్తిదాతలు మొదలగునవి చేర్చి రూపొందించారు.

పాఠశాల విద్యలో భాషాబోధన యొక్క ముఖ్య ఉద్దేశ్యం పిల్లల్లో ఆలోచన, సృజనాత్మకత, కల్పన, వ్యక్తీకరణ శక్తులను వృద్ధిపరచడం. ఇందుకనుగుణంగా నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు. ఐతే ఎంత మంచి పాఠ్యపుస్తకమైన ఉపాధ్యాయుల వినియోగం మీదనే ఆధారపడి ఉంటుంది.

NCF-2005, RTE-2009, SCF-2011 లలోని మౌలిక సూత్రాలకు లోబడి రూపొందించబడిన ఈ వాచకాలను ఉపాధ్యాయులు అర్థం చేసుకొని ప్రణాళికబద్ధంగా బోధించాల్సి ఉంటుంది. పిల్లల్లో జ్ఞాన నిర్మాణం అంటే అవగాహన చేసుకొని ప్రతిస్పందించగలగడం, సృజనాత్మక వ్యక్తీకరించగల్గడం చేయగల్గాలి. ఇందుకనుగుణంగా సామర్థ్యాల వారీగా పొందుపరిచిన అభ్యాసాలను సరిగా నిర్వహించగలగాలి.

పైన తెల్పిన అంశాలను దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులకోసం ఈ కరదీపికను రూపొందించారు. దీంతో నూతన వాచకాల ప్రత్యేకతలు, సాధించాల్సిన సామర్థ్యాలు, విశేషాంశాలు, వార్షిక మరియు పాఠ్యప్రణాళికలు, నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు, నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాల వివరాలు నమూనా ప్రశ్నపత్రాలు, ఉపయుక్త గ్రంథాలు మొదలగునవి పొందుపర్చారు.

ఈ కరదీపిక ఉపాధ్యాయులకు తెలుగు వాచకాల వినియోగంలో దిశానిర్దేశం చేస్తుంది. దీని రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులకు, విషయనిపుణులకు అభినందనలు.

సంచాలకులు

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,

తెలంగాణ.

# విషయసూచిక


| వ.సం | అధ్యాయం పేరు | పేజి సంఖ్య |
|---|---|---|
| I. | నూతన వాచకాలు - ఆవశ్యకత - ప్రత్యేకతలు | 1 |
| II. | పాఠాల ప్రత్యేకతలు - సాధించాల్సిన సామర్థ్యాలు | 12 |
| III. | పాఠాల వారీగా విశేషాంశాలు - వివరణలు | 71 |
| IV. | పాఠ్య పుస్తక వినియోగము - బోధనాభ్యసన ప్రక్రియలలో మార్పులు | 80 |
| V. | ఉపాధ్యాయుల తయారీ - ప్రణాళికలు | |
| | ♦ పరిచయ వాక్యాలు | 86 |
| | ♦ వార్షిక ప్రణాళికలు | 88 |
| | ♦ పాఠ్య ప్రణాళిక - పరిచయం | 95 |
| VI. | సి.సి.ఇ. / పరీక్షణ సంస్కరణలు - అమలు | |
| | ♦ పరిచయ వాక్యాలు | 131 |
| | ♦ నిర్మాణాత్మక మూల్యాంకనం - ఆవశ్యకత | 148 |
| | ♦ సంగ్రహణాత్మక మూల్యాంకనం | 162 |
| | ♦ మాదిరి ప్రశ్న పత్రాలు | 185 |
| VII. | నూతన పాఠ్యపుస్తకాల వినియోగం - వనరులు - ఉపయుక్త గ్రంథాలు | 222 |
| VIII. | ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, ఉపకరించే సంస్థలు, కార్యక్రమాలు | 226 |
| IX. | భాషాభివృద్ధి కార్యక్రమాలు | 232 |
| X. | సృజనాత్మకత - వ్యవహార రూపాలు | 234 |
| XI. | అనుబంధాలు | 245 |

# Chapter-I

## నూతన వాచకాలు - ఆవశ్యకత - ప్రత్యేకతలు

తెలంగాణ రాష్ట్రం... దశాబ్దాల కల. ఉద్యమాల ఫలితం. త్యాగాల గుర్తు. రాష్ట్రావిర్భావం నూతనోత్తేజాన్నిచ్చింది. సరికొత్త స్ఫూర్తితో ముందుకు సాగవలసిన అవసరాన్ని తెలియజేసింది. ఈ బృహత్‌యజ్ఞంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విద్యాసంస్కరణలకు శ్రీకారంచుట్టింది. ముఖ్యంగా నూతన వాచక నిర్మాణం ద్వారా సొంతగొంతును వినిపించదలచింది. తెలంగాణ భావి పౌరులకు మన ఘనమైన భాష, సాహిత్య వారసత్వ సంపద ఇదీ అని చాటదలచింది. స్వాభిమానాన్ని ప్రేరేపించడానికి సమాయత్తమైంది. ఫలితంగా 'తెలంగాణ వాచకాలు' పురుడుపోసుకున్నాయి. 1 నుండి 10వ తరగతి వరకు వాచకాలు ఒకేసారి రూపుదిద్దుకున్నాయి. ఇలా 'దశావతారాలు' ఏకకాలంలో ఆవిర్భవించడం బహుశా దేశచరిత్రలోనే అపూర్వం.

### తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి :

నూతన వాచక గంగ 'భాష, సాహిత్య, సంస్కృతుల 'త్రిపథగామిని'గా సాగింది. స్వస్థాన వేషభాషల గురించి తెలుసుకోవడంవల్ల ఆత్మాభిమానం అంతకు అంత పెరుగుతుంది.

### తెలంగాణ భాష :

తెలంగాణ భాష, యాస తనదైన విశిష్టతను కలిగి ఉన్నది. ఈ సౌందర్యాన్ని ఆవిష్కరించే విధంగా తెలంగాణ మాండలికంలో రాయబడిన 'కొత్తబాట' లాంటి పాఠాలు మరికొన్ని పాఠాలు తెలంగాణ పలుకుబడులను పుణికిపుచ్చుకున్నాయి. తెలంగాణ పదాలను, సామెతలను, జాతీయాలను పట్టికలుగా ఇవ్వడం జరిగింది. పదపట్టికలో ఆయా పదాల అర్థాలను ఇవ్వడం జరిగింది. తెలంగాణ భాషపై చిన్నచూపును వదిలేయాలని ప్రబోధించడానికి 'ఎవరిభాష వాళ్లకు వినసొంపు' అన్న పాఠాన్ని పెట్టడం జరిగింది. మన భాషపట్ల ఆత్మన్యూనతను వీడి ఆత్మాభిమానంతో మాట్లాడే నైపుణ్యమలవడడానికి సులభమైన చిట్కాలతో కూడిన 'వాగ్భూషణమ్ భూషణమ్' పాఠాన్ని వాచకంలోకి తీసుకోవడం జరిగింది.

### తెలంగాణ సాహిత్యం :

తెలంగాణలో విస్తృతమైన సాహిత్యం వచ్చింది. మార్గ, దేశీ పద్ధతులతో పద్య, గేయ, వచన రూపంలో సమున్నత స్థాయిలో సాహిత్య సృజన జరిగింది. అయితే దురదృష్టవశాత్తు కొంత ఉండిపోయింది. ఈ స్థితిని సవరించడానికి వాచకాలు

నడుంబిగించాయి. మరుగున పడిన కవి మాణిక్యాలను పాఠాల ద్వారా పరిచయం చేశాయి. కొఱవిగోపరాజు, పొన్నగంటి తెలగన, వానమామలై వరదాచార్యులు, పల్లా దుర్గయ్య, బిరుదురాజు రామరాజు, పి.వి.నరసింహారావు వంటి సాహితీ స్రష్టల రచనలను పాఠాల రూపంలో ఇవ్వడం జరిగింది. తెలంగాణలో 'పాట'కు విడదీయరాని సంబంధం ఉంది. అందుకే పాటలు కూడా పాఠాల రూపంలో దర్శనమిస్తాయి.

తెలంగాణలో ఉన్న శతకసంపద అమూల్యం. పుష్కలం. అందులోని కొన్ని శతకాలను సంబంధిత కవులు శిరశినగల్ కృష్ణమాచార్యులు, శేషప్ప, ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు, గౌరీభట్ల రఘురామశాస్త్రి, గడిగె భీమకవి లాంటి వారిని ముందుంచడం జరిగింది.

**తెలంగాణ సంస్కృతి :**

అచ్చమైన మనసుకు పట్టిన అద్దం తెలంగాణ సంస్కృతి. కుల మత ప్రాంతాలకతీతంగా అందరినీ, అన్నిటినీ ఆత్మీయంగా అక్కునజేర్చుకునే విలక్షణ సంస్కృతి ఇక్కడ విలసిల్లింది. కొన్ని సంప్రదాయాలు తెరమరుగయ్యి ఉండవచ్చు. కొన్నింటిని గూర్చిన అవగాహన ఈ తరానికి లేకపోవచ్చు. వాటిని మరొకసారి జ్ఞాపకంచేయడం ద్వారా ఉజ్జ్వలమైన తెలంగాణ వైభవాన్ని చాటిచెప్పడమేగాక, దీనిని కొనసాగించాలన్న సందేశాన్ని కూడా అందించడం జరిగింది. ఇందుకు తెలంగాణ పల్లెల్లో సంస్కృతి, 'గ్రామాలలోని వేడుకలు, క్రీడా వినోదాలు, మన పండుగలు, జానపద కళలు, గోలకొండ పట్టణము', చెరువు' వంటి పాఠాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఆయా పాఠాలను బోధిస్తున్నప్పుడు పైన పేర్కొన్న విషయాల గురించి విద్యార్థులను ఉత్తేజితులను చేయగలగాలి. అప్పుడే నూతన వాచకాలకు సార్థకత.

**కీలక సూత్రాలు :**

### 1) తమకున్న శక్తి సామర్థ్యాలనుపయోగించి పిల్లలు నేర్చుకోవడం :

ప్రాథమిక స్థాయి పూర్తిచేసిన పిల్లలు ధారాళంగా చదవగలగడం, తెలిసిన దానిని గురించి మాట్లాడగలగడం, వివరించగలగడం, విన్నదానిని గురించి ప్రతిస్పందిచడం చేయగలుగుతారు. తమకున్న అనుభవాలు ఆలోచనల ద్వారా అభిప్రాయాలు చెప్పగలుగుతారు. పరిశీలించడం, విశ్లేషించడం, వివరించడం వంటివి చేయగలుగుతారు.

ఈ ప్రాథమిక సామర్థ్యాలు కలిగిన పిల్లలు ఉన్నత స్థాయిలో వీటి ఆధారంగా విశ్లేషణాత్మక, విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. సృజనాత్మకంగా వ్యక్తీకరణ సామర్థ్యం పెంపొందాలి. ఇందుకోసం పాఠ్యపుస్తకాలలో పాఠాలలోని విషయాల అమరిక అభ్యాసాలు పొందుపరిచారు.

ఏ పాఠం తీసుకున్నా పిల్లలు తమ గతానుభవాల ఆధారంగా ప్రతిస్పందిచడానికి, మాట్లాడడానికి 'ఆలోచించండి – చెప్పండి' అనే పేరుతో పాఠం ప్రారంభంలోనే ఒక శీర్షిక ఉంది. చిత్రాలు, సన్నివేశాలు, సంఘటనలు, కార్టూనులు వంటి రూపాల్లో ఉంది. వీటి గురించి ఆలోచించి ప్రతిస్పందించడానికి ప్రశ్నలు కూడా ఉన్నాయి.

ఉదా: చిన్నప్పుడే – 8వ తరగతి పాఠం.

"ఆలోచించండి – చెప్పండి" చిత్రం.

చిత్రం – గ్రామంలో సభ జరుగుతున్న చిత్రం.

ప్రశ్నలు : 1. చిత్రంలోని సన్నివేశం ఎక్కడ జరుగుతున్నది?

2. మీ గ్రామంలో ఇటువంటి దృశ్యం ఎప్పుడైనా చూశారా?

3. మాట్లాడుతున్న నాయకుడు ఏం చెప్పుతున్నారని మీరనుకుంటున్నారు?

అట్లే పాఠం, పాఠంలోని విషయం కూడా పిల్లలు ఆలోచించే అవకాశం కల్పిస్తుంది, ప్రతిస్పందించే అవకాశం కల్పిస్తుంది. ప్రతి పాఠంలో "ఇవిచేయండి" పేరుతో ఉన్న అభ్యాసాలు పిల్లలు తమ అనుభవాలు, శక్తి సామర్థ్యాలు మదింపుచేసుకోవడానికి వీలుకల్గిస్తాయి.

## 2) తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు దైనందిన జీవితంలో ఉపయోగించడం :

- పిల్లలు మాట్లాడడం, చదవడం, రాయడం వంటి పనులను లేదా చేయగలిగిన సామర్థ్యాలను సందర్భోచితంగా అవసరంమేరకు వినియోగించగలగాలి. అంటే లేఖలు రాయడం, పుస్తకాలు చదివి అర్థం చేసుకోవడం, ప్రశ్నించడం, సమాచారాన్ని తెలుసుకోవడం, తెలిసిన వాటిని రాసుకోవడం లాంటివి చేయగలగాలి. ఇందుకు అనుగుణంగా అభ్యాసాలు ఉన్నాయి.

దైనందిన జీవితంలో ఎవరైనా ఇతరులతో సంభాషించడం, సమాచారం తెలుసుకోవడానికి ప్రశ్నించడం, వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లు, కరపత్రాలు, పోస్టర్‌లు, సమాచార పట్టికలు మొదలగు వాటిని చదివి అర్థం చేసుకోవడం, తమ అవసరాల మేరకు లేఖలు రాయడం, దరఖాస్తులు రాయడం లాంటివి చేయాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాలలో ఇతరులపై ఆధారపడకుండా తమకున్న భాషాసామర్థ్యాలను దైనందిన జీవితంలో పిల్లలు వినియోగించుకోగలగాలి.

ఈ సామర్థ్యాలను పెంపొందించటానికి వీలుగా పాఠ్య పుస్తకంలో వినడం - మాట్లాడడం, ధారాళంగా చదవడం, స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస, ప్రాజెక్ట్ పనులు వంటివి ఉన్నాయి.

ఉదా: 1. వార్తా పత్రికలు, లేఖ రాయడం.

2. వివిధ పత్రికల్లో వచ్చిన ఇంటర్వ్యూలలో ఏదైనా ఒక దానిని సేకరించి తరగతిలో చదివి వినిపించండి (రంగాచార్యతో ముఖాముఖి - 9వ తరగతి).

3. మీ చుట్టూ ఉన్న సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను పారదోలడానికి మీరు ఏం చేయగలరు (భాగ్యోదయం - 10వ తరగతి).

## 3) పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా సమాజం ద్వారా, పరిసరాల ద్వారా, పఠన సామగ్రి ద్వారా పిల్లలు నేర్చుకోవడం :

- సామెతలు, సూక్తులు, వార్తలు, శతక పద్యాలు / గీతాలు / గేయాలు, కథలను, ప్రసిద్ధుల చరిత్రలు సేకరించడం, బాలసాహిత్యం చదవడం, తెలిసిన కవుల గురించి, రచనల గురించి చదవడం, ప్రశంసాత్మక కృత్యాలు పూర్తిచేయడం, ప్రాజెక్టుపనులు చేయడం మొదలగు అవకాశాలు కల్పిస్తూ అనేక అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా: 1. అందరికి అన్నం పెట్టె రైతు కృషిని ప్రశంసిస్తూ అభినందన పత్రాన్ని తయారుచేయండి. (కాపుబిడ్డ - 8వ తరగతి).

2. మీకు బాగా నచ్చిన శతకాల్లోని ఏవైనా 5 పద్యాలను సేకరించండి. భావాలు రాయండి. చదివి వినిపించండి. (శతక సుధ - 6వ తరగతి).

3. వివిధ పండుగల సందర్భంగా వివిధ మతాలవారు చేసే దాన ధర్మాలను తెలుసుకోండి. పట్టిక రాసి ప్రదర్శించండి. (దానశీలం – 10వ తరగతి).

**4) బట్టీ విధానాలకు బదులు అర్థవంతమైన రీతిలో ప్రతిచర్యలు, కృత్యాలు, అన్వేషణల ద్వారా పిల్లలు నేర్చుకోవడం :**

♦ వాచకాల్లోని పాఠాలు – అభ్యాసాలు ఆలోచించడానికి, వ్యక్తీకరించడానికి ఉద్దేశించినవి. పాఠ్యపుస్తకంలో వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి కృత్యాలు ఉన్నాయి. ఇవి వివిధ సామర్థ్యాల ఆధారంగా ఉన్నాయి. ఆలోచించి రాయడం, చదవడం, అవగాహన చేసుకోవడం, సృజనాత్మక వ్యక్తీకరణ మొదలగు సామర్థ్యాలు అభ్యాసాల రూపంలో ఉన్నాయి.

ఉదా: 1. 'మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది' – అని సినారె ఎందుకు అని ఉంటాడు? (జీవనభాష్యం – 10వ తరగతి).

2. 'వినేవారి రక్తము ఉడుకెత్తునట్లు కథ చెప్పడం' అంటే మీరు ఏమనుకుంటున్నారో రాయండి. (గ్రామాల్లోని వేడుకలు – క్రీడావినోదాలు – 7వ తరగతి).

3. 'రైతులు మన అన్నదాతలు' – సమర్థిస్తూ రాయండి. (అసామాన్యులు – 8వ తరగతి).

**5) భాష, తమ స్థానిక కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఉత్పత్తుల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడం :**

♦ మన రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వివిధ జిల్లా మాండలిక యాసల్లో పిల్లలు మాట్లాడుతుంటారు. అన్ని ప్రాంతాలకు సంబంధించిన మాండలికాలతో పాఠాలు కొత్త పుస్తకాలల్లో పెట్టడం జరిగింది. దీనివల్ల ఆయా మాండలికాలను, స్థానిక కళలను సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలు తెలుసుకోగలుగుతారు.

ఉదా: 1. కాపాడుకుందాం! (6వ తరగతి); వాగ్భూషణం (9వ తరగతి), తెలుగుజానపదగేయాలు (8వ తరగతి).

2. కొత్తబాట (10వ తరగతి).

3. సీత ఇష్టాలు శిల్పి (7వ తరగతి)

♦ పిల్లల్లో స్థానిక సంస్కృతీ సంప్రదాయాలపట్ల, స్థానిక కళలపట్ల అభిరుచి కల్పించటానికి సంబంధించిన పాఠాలు అభ్యాసాలు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రాజెక్ట్ పనులు కూడా ఉన్నాయి.

పాఠాలకు ఉదా: లేఖ – 6వ తరగతి; గోలకొండపట్టణం – 10వ తరగతి; గ్రామాల్లోని వేడుకలు – క్రీడావినోదాలు – (7వ తరగతి)

ప్రశ్నలు : 1. మీ జిల్లాలోని వివిధ కోటల చిత్రాలు లేదా మీరు చూసిన కోట / ప్రాచీన గుడి / కట్టడం ఆధారంగా నివేదిక రాయండి. ప్రదర్శించండి. (గోలకొండపట్టణం – 10వ తరగతి).

2. పాఠంలో రామప్పగుడి, గద్వాలకోట, వరంగల్‌కోట, చార్‌మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం మొదలైన వాటి గురించి కొన్ని విషయాలు తెలుసుకున్నారు కదా! వీటిలో ఏదైనా ఒక దాని గురించి పూర్తి వివరాలు సేకరించండి. రాసి, చదివి వినిపించండి. (లేఖ – 6వ తరగతి).

3. గ్రామీణ వేడుకలు లేదా క్రీడలకు సంబంధించిన పాట / గేయం / కథ / వ్యాసం సేకరించి తరగతిలో ప్రదర్శించండి.

- స్థానిక భాషను ఉపయోగిస్తూ వివిధ ప్రక్రియల్లో, వివిధ ఇతి వృత్తాలతో రాయగలగడం.

  ఉదా: పాఠాన్ని ఆధారంగా చేసుకొని మీ అనుభవాలతో ఒక చిన్న కథ రాయండి.

  ప్రక్రియలకు ఉదా : ధర్మార్జునులు (ప్రాచీన పద్యం) 9వ తరగతి

  జీవన భాష్యం (గజల్స్) 10వ తరగతి

  ప్రేరణ (ఆత్మకథ) - 7వ తరగతి

  మంజీర (గేయం) - 8వ తరగతి

  రంగాచార్యతో ముఖాముఖి (ఇంటర్వ్యూ) - 9వ తరగతి

  బాలనాగమ్మ (జానపద కథ) - 6వ తరగతి

## 6) ఇతర కీలక సూత్రాలు :

### అ) ఆలోచింపజేయడం :

- ప్రతి పాఠం **'ఆలోచించండి - చెప్పండి'** లేదా **'చదవండి - ఆలోచించండి - చెప్పండి'** అనే శీర్షికలతో మొదలౌతుంది. ఇందులో పిల్లలు ఆలోచించడానికి అనుగుణంగా చిత్రం / పద్యం / సంభాషణ / గేయం / పేరా / సన్నివేశాలు / సంఘటనలు / కార్టూను మొదలగునవి ఇవ్వడం జరిగింది. వీటికి అనుబంధంగా ప్రశ్నలున్నాయి. పిల్లలు ఆలోచించి ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పాల్సి ఉంటుంది.
- అర్థసంగ్రహణం సమయంలో పిల్లలు ఆయా అర్థాలను ఏయే సందర్భాల్లో ఎలా ఉపయోగించాలో ఆలోచించాల్సి ఉంటుంది. పాఠ్యాంశంలో ఉన్న కీలక వాక్యాలు, కీలకాంశాల గురించి ఆలోచించి జవాబులు చెప్పాల్సి ఉంటుంది. రాయాల్సి ఉంటుంది.
- "ఇవి చేయండి" శీర్షిక కింద ఉన్న అభ్యాసాల్లో ప్రతి అభ్యాసం పిల్లల ఆలోచనలకు పదునుపెట్టే విధంగా ఉన్నాయి. ప్రధానంగా సృజనాత్మకత, స్వీయరచన, ప్రశంస అనేవి పిల్లలు బహుకోణాల్లో, సృజనాత్మకంగా ఆలోచించేలా ఉన్నాయి.

### ఆ) వ్యక్తీకరణలు :

- **'ఆలోచించండి - చెప్పండి'** శీర్షికలో పిల్లలు వారి వారి ఆలోచనలకనుగుణంగా సమాధానాలను వ్యక్తపరుస్తారు.
- వినడం-మాట్లాడడం, చదవడం-అవగాహనచేసుకోవడం, స్వీయరచన, సామ ర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాలు పిల్లల వ్యక్తీకరణలకు అద్దంపట్టేలా ఉన్నాయి. పిల్లలు ప్రతిస్పందించేలా, వ్యక్తీకరించడానికి దోహదపడతాయి.

ఇ) **సృజనాత్మకత :** పిల్లల్లో సృజనాత్మకత పెంచే విధంగా శాంతికాంక్ష, ప్రేరణ మొదలగు పాఠాలున్నాయి. ప్రతి పాఠంలోను సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపయోగపడే అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా : రాణిశంకరమ్మ చరిత్రను ఏకపాత్రాభినయానికి చేయటానికి వీలుగా తగిన అంశాలతో రచన చేయండి. ప్రదర్శన చేయండి. (రాణీశంకరమ్మ - 7వ తరగతి).

ప్రశంసను అలవాటుచేయడాన్ని ఉద్దేశించే విధంగా పాఠాలు – అభ్యాసాలు రూపొందాయి.

ఉదా : ...... తల్లి, దండ్రి, గురువు, మంచి మిత్రులు, గొప్పవాళ్లు... ఇట్లా ఎవరి గురించైనా వందనాలు వందనాలు... అని అభినందనలు తెలుపుతూ ఒక చిన్న గేయాన్ని రాయండి.

ప్రాజెక్టుపనులు కూడా సృజనాత్మకతను పెంపొందించడానికి తోడ్పడతాయి.

**ఈ) కాల్పనికత :** పిల్లల్లో కల్పనాశక్తిని పెంచడం చాలా ముఖ్యం. పిల్లల్లో సహజంగా కల్పనాశక్తి ఉంటుంది. దాన్ని మెరుగుపరచడానికి ఈ పాఠ్యపుస్తకాలు తోడ్పడుతాయి. ఉదా : www.కారడవి.కామ్.

ఉదా : "సాయంత్రం గండభేరుండ పక్షి రాంగనే....." అనే పేరా నుంచి చివరివరకు పాఠం చదువండి. దీని ఆధారంగా గండభేరుండ పక్షి, బాలవద్దిరాజు, మాయలఫకీరుల మధ్య జరిగిన సంభాషణలను ఊహించి రాయండి.

**ఉ) భాషాభిరుచి :** పిల్లలకు సహజంగానే మూడేళ్ళ వయసులో దాదాపు మూడువేల పదాల భాషా సంపద కల్గిఉంటారు. అందువల్ల ఈ భాషా సంపద వారి అభిరుచిని పెంచాలి. భాషా సాహిత్యాలపై అవగాహన కల్గించాలి. భాషౌన్నత్యాన్ని తెలపాలి. ఇందుకు వేదికగా ఈ పాఠ్యపుస్తకాల రూపకల్పన జరిగింది. వివిధ ప్రక్రియలతో ప్రత్యేకంగా పాఠాలను కూర్చడం జరిగింది. విస్తార పఠనం ద్వారా భాషాభిరుచి పెంపొందించడానికి ఉపవాచక పాఠాలను చేర్చారు.

ఉదా : ఎవరి భాష వారికీ వినసొంపు – 10వ తరగతి; చెలిమి – 9వ తరగతి.

ప్రక్రియలకు ఉదా : కథానిక, ప్రబంధం, సమీక్ష, వార్తావ్యాఖ్య మొదలగునవి.

**ఊ) భాషావినియోగానికి అధిక ప్రాధాన్యం :** భాష అనేది భావవ్యక్తీకరణకు, భావగ్రహణకు ఉపయోగించే సాధనమని మనకు తెలుసు. అయితే ఈ భాషా వినియోగమనేది వివిధ రూపాల్లో ఉంటుందనే విషయం మనం గ్రహించాలి. పిల్లలు తాము ఇంటివద్ద నేర్చుకున్న భాషను, జ్ఞానాన్ని ఆధారం చేసుకొని వాళ్ళను ఆలోచింపచేయడానికి, అభిప్రాయాలను వ్యక్తీకరణ చేయడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరింప చేయడానికి, వివిధ వ్యవహార రూపాలను వినియోగింపచేయడానికి వీలుగా నూతన పాఠ్యపుస్తకాలు ఉన్నాయి. దైనందిన జీవితంలో సందర్భోచితంగా భాషను వినియోగించే సామర్థ్యాల పిల్లల్లో వృద్ధిచెందాలి. అంటే తమ అవసరాలకోసం దరఖాస్తు రాయడం, లేఖలు రాయడం, సంభాషించడం, సమాచారాన్ని సేకరించడం, పఠనాంశాలను విశ్లేషించి వాస్తవాలను గ్రహించడం వంటివి చేయగల్గాలి. ఇందుకనుగుణంగా అభ్యాసాలను పొందుపర్చారు.

ఉదా : "ఇవిచేయండి" శీర్షికలోని వినండి–మాట్లాడండి, స్వీయరచన, సృజనాత్మకత, పదజాలం, భాషాంశాలు అనేవి భాషావినియోగసంబంధాన్ని సూచించేవే.

ప్రతి పాఠంలోని కీలకపదాలు, కీలకవాక్యాలు, నిత్యజీవితంలో భాషావినియోగానికి ఉపయోగపడ్తాయి. వీటిపై అభ్యాసాల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది.

**ఎ) మొత్తం పాఠ్యపుస్తకం విద్యాప్రమాణాల సాధనకు దోహదపడడం :** సాధారణంగా మనంచేసే ప్రతిపనికి ఒక ప్రయోజనం ఆశిస్తాం. అలాగే మనం పాఠ్యపుస్తకం బోధించటంవల్ల కూడా ఓ ప్రయోజనాన్ని ఆశించాలి. అదే విద్యాప్రమాణాల సాధన. ప్రస్తుత పాఠ్యపుస్తకాలు ఏడు రకాల విద్యాప్రమాణాల సాధనకు ఉద్దేశించాయి.

**6, 7, 8 తరగతులలో ఉన్న సామర్థ్యాలు :**

i) **వినడం-మాట్లాడడం :** విని అర్థం చేసుకొనే సామర్థ్యంతో ప్రాథమికోన్నత స్థాయిలో ప్రవేశించిన పిల్లలు విన్న విషయాన్ని విశ్లేషించగలగాలి. ప్రతిస్పందించగలగాలి. అభిప్రాయాలు చెప్పగలగాలి.

ii) **చదవడం-అవగాహనతో రాయడం :** ఇచ్చిన విషయాన్ని అవగాహనతో చదువుతూ, చదివిన విషయాన్ని విశ్లేషించడం, భావాన్ని గ్రహించడం, వ్యాఖ్యానించడం, అంతరార్థాన్ని గ్రహించడం, రచయిత ఉద్దేశాన్ని గుర్తించడం, భాషాశైలిని అర్థం చేసుకోవడం వంటివి చేయగలగాలి.

iii) **స్వీయరచన :** అడిగిన విషయం గురించి తనసొంత ఆలోచనలతో, తన అభిప్రాయాలను, విమర్శలను, విశ్లేషణలను ఆధారంగా చేసుకొని జవాబులు రాయగలగాలి.

iv) **పదజాలం :** భాషావినియోగానికి ఉపయోగపడే జాతీయాలు, సామెతలు, అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి-వికృతులు, వ్యుత్పత్త్యర్థాలు మొదలగువాటిని అర్థం చేసుకోవాలి, తిరిగి వాటిని సందర్భోచితంగా ఉపయోగించగలగాలి.

v) **సృజనాత్మకత :** తెలుగు భాషా వ్యవహార రూపాలను పిల్లలు వాళ్ళ శక్తి సామర్థ్యాల మేరకు సృష్టించగలగాలి. ఒక కథ, గేయం, కరపత్రం, లేఖ, సంభాషణ మొదలగు ప్రక్రియలను సృష్టించటానికి అనువుగా అభ్యాసాలు ఉన్నాయి.

vi) **ప్రశంస :** విద్యార్థుల్లో ద్వేషభావాన్ని రూపుమాపి ఉత్తమ పౌరులుగా రూపొందించడానికి 'ప్రశంస' అనే సామర్థ్యం ఉంది.

vii) **వ్యాకరణాంశాలు :** భాషా నిర్మాణానికి సంబంధించిన వ్యాకరణాంశాలు భాషా భాగాలు, వాక్యనిర్మాణాలు - భేదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు మొదలగు అంశాలున్నాయి. వీటిని తెల్సుకోవడానికి పాఠ్యపుస్తకాలు చక్కగా ఉపయోగపడతాయి.

ఇవే కాకుండా ప్రమాణాల సమాహారంగా ప్రాజెక్ట్ పనులు ఆయా పాఠాల్లో ఉన్నాయి. 6, 7, 8 తరగతులలో ఉన్న సామర్థ్యాలు / విద్యాప్రమాణాలను వాటి వాటి స్వభావాల కనుగుణంగా 9, 10వ తరగతుల్లో మూడింటికి కుదించడం జరిగింది.

**సామర్థ్యాలు :**

**9, 10 తరగతులలో కింద విధంగా సామర్థ్యాలున్నాయి :**

i) **అవగాహన ప్రతిస్పందన :** ఇందులో విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం, ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని ప్రతిస్పందిచడం సామర్థ్యాలు మిళితమై ఉంటాయి.

ii) **వ్యక్తీకరణ - సృజనాత్మకత :** ఇందులో పదజాలం, వ్యాకరణాంశాలు సామర్థ్యాలు మిళితమై ఉంటాయి.

iii) **భాషాంశాలు :** ఇందులో పదజాలం, వ్యాకరణాంశాలు సామార్థ్యాలు మిళితమై ఉంటాయి.

ఏ) **పరస్పర ప్రతి చర్యలకు కేంద్రంగా ఉండడం :** పాఠ్యపుస్తకంలోని అర్థసంగ్రహణం, వినడం-మాట్లాడడం, స్వీయరచన, ప్రాజెక్టపనులు పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా ఉన్నాయి.

ఉదా : అర్థసంగ్రహణంలో తన మిత్రులతోను, ఉపాధ్యాయునితోను చర్చిస్తారు. వినడం-మాట్లాడడంలో మిత్రులతో జట్లుగా చర్చించే అవకాశం ఉంది. స్వీయరచనలో కూడా జట్లుగా ఏర్పడి సమాధానాలను కూర్చాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్‌పనులలో కొన్ని సామూహిక కృత్యాలుగా ఉన్నాయి.

ఐ) **తోటివారి ద్వారా, అదనపు సామగ్రిద్వారా, సమాజసభ్యుల ద్వారా నేర్చుకోవడానికి వీలుండుట :** తోటి విద్యార్థులతో చర్చించిగాని, పాఠ్యపుస్తకేతర సామగ్రిని సంపాదించటం ద్వారాగాని, సమాజంలో ప్రముఖులను కలవడంద్వారాగాని, వివిధ సంస్థలతో సంపర్కం ఏర్పరుచుకొనిగాని విద్యార్థులు అదనపు జ్ఞానం పొందే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణమైన అభ్యాసాలున్నాయి. ప్రధానంగా ప్రాజెక్టు పనులు ఇందుకు ఉద్దేశించినవి.

ఉదా : మీ ప్రాంతంలో బడికి పోకుండా ఉండే పిల్లల్ని కలువండి. వారెందుకు బడికి రావడంలేదో, బడి గురించి, చదువు గురించి వారేమనుకుంటున్నారో రాయండి.

ఒ) **ఉన్నతవైఖరులు, మానవత్వపువిలువలు - సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినవిగా ఉండడం :** పిల్లల్లో ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు, మానవ సంబంధాలు పెంపొందించడానికి పాఠాల్లో, ప్రశంస పేరుతో అభ్యాసాలున్నాయి. పాఠ్యాంశాల ఎంపిక కూడా ఈ ఇతివృత్తాల నేపథ్యంలోనే జరిగింది. ఇందుకనుగుణంగా ప్రముఖ కవులు, రచయితలు రచించిన సాహిత్యం నుండి పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. పాఠాల్లోని విషయాన్ని కూడా పిల్లల్ని ఆలోచింపజేసేలా, సమకాలిన అంశాలకు అన్వయించేలా పొందుపర్చారు.

పాఠకులకు ఉదా : పల్లెటూరి పిల్లగాడా! - 6వ తరగతి; నాయనమ్మ - 7వ తరగతి; మాట్లాడేనాగలి - 8వ తరగతి; తీయని పలకరింపు - 9వ తరగతి, నగరగీతం - 10వ తరగతి.

అభ్యాసాలకు ఉదా : వృద్ధులకు సేవ చేయవలసిన అవసరాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి. (నాయనమ్మ - 7వ తరగతి).

ఓ) **సోపానక్రమంలో బోధించడానికి వీలుగా పాఠాల అమరిక ఉండడం :** బోధన అనేది ప్రణాళిక బద్ధంగా జరగాలి. పిల్లల్ని పాఠంపట్ల మానసికంగా సిద్ధం చేయాలి. ఇతివృత్తం, సందేశంపట్ల ఆలోచనలు రేకెత్తించాలి. స్వయం అభ్యసనానికి కృత్యాలు ఉండాలి. లక్ష్యసాధనకు అనుగుణంగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ జరగాలి. ఇందుకనుగుణంగా పాఠంలోని విషయాన్ని ఒక క్రమంలో పొందుపర్చారు. ఇందుకోసం ఉన్ముఖీకరణతో మొదలుకొని శ్రవణ, భాషణ, పఠన లేఖనం సామర్థ్యాలు, సృజనాత్మకత మొదలగునవి పెంపొందింపజేయడానికి వరుసక్రమంలో పాఠాలలోని విషయాన్ని కూర్చారు. ఒక పాఠం బోధించడం అంటే అందులోని విషయాన్ని చెప్పి వదిలేయడంగాక 'ఉన్ముఖీకరణ' నుండి 'నేనివిచేయగలనా?' వరకు చెప్పడం - చేయించడం జరగాలి. అందుకనుగుణంగా పాఠాన్ని అమర్చడం జరిగింది. అదెలా ఉందో చూడండి.

| | | | |
|---|---|---|---|
| 1. | ఉన్ముఖీకరణ | - | ఆలోచించండి - చెప్పండి (శ్రవణం, భాషణం సామర్థ్యాలు)<br>ఉద్దేశం - నేపథ్యం |
| 2. | అర్థసంగ్రహణ | - | విద్యార్థులకు సూచనలు (పఠన కృత్యాలు); ప్రవేశిక (విద్యార్థుల్లో ఊహాశక్తిని పెంపెందించడానికి) |
| 3. | విషయావగాహన-చర్చ | - | పాఠ్యాంశవిషయం (శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం, పదజాలం) |

4. పిల్లల అవగాహన-పరిశీలన - ఇవిచేయండి (అన్ని సామర్థ్యాలు)

5. మూల్యాంకనం - నేనివిచేయగలనా? (స్వీయమూల్యాంకనం)

ఔ) **బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉండడం :** విద్యార్థులు ఒక విషయం గూర్చి, సమస్యగూర్చి అనేక కోణాల్లో ఆలోచించడం, వాటిని విశ్లేషణ చేయడం లేదా విమర్శన చేయడం లేదా సమీక్ష చేయడం లాంటి సామర్థ్యాలు పెంపొందించడానికి అనువుగా అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా : నేడు నగర జీవనం ఎందుకు సంక్లిష్టంగా మారిందో విశ్లేషించండి. (నగరగీతం - 10వ తరగతి)

అం) **సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం :** పిల్లలు వారి సమాజాన్ని, పరిసరాలను, పరిశీలిస్తూంటారు. ఆ పరిశీలనలతో వారి జ్ఞానాన్ని పెంచుకుంటూంటారు. అలా పెంచుకోవడంలో పాఠ్యపుస్తకం కూడా ప్రముఖ పాత్ర పోషించే విధంగా నూతన పాఠ్యపుస్తకాలున్నాయి. వారికి సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తిని రేకెత్తించే రకంగా ఉన్నాయి.

ఉదా : చెఱువు - 6వ తరగతి; వలసకూలీ - 9వ తరగతి; చిన్నప్పుడే - 8వ తరగతి

క) **పాఠ్యపుస్తకం గురించి అవగాహన పెంపొందించడం**

- పాఠ్యపుస్తకం తాత్వికతను ప్రతిబింబించేలా “ముందుమాట” ఉంది.
- పాఠ్యపుస్తకాన్ని వినియోగించే విధానాన్ని తెలియజేసేలా “ఉపాధ్యాయులకు సూచనలు” ఉన్నాయి.
- పిల్లలు పాఠ్యపుస్తక ఉపయోగం గూర్చి తెలుసుకోవడానికి “విద్యార్థులకు సూచనలు” ఉన్నాయి.
- పాఠ్యపుస్తకం పూర్తయ్యేసరికి పిల్లలు ఏయే ప్రమాణాలను సాధించాలో తెలుసుకోవడానికి “ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు” అనే శీర్షిక కింద సామర్థ్యాల జాబితా ఇవ్వడం జరిగింది. అందుకనుగుణంగా సామర్థ్యాల వారీగా పాఠాల్లో అభ్యాసాలు “ఇవిచేయండి” శీర్షిక కింద ఇవ్వడం జరిగింది.
- 6, 7 తరగతులకు పదాలు అర్థాలు, విశేషాంశాలు. 8, 9, 10 తరగతులకు “పద విజ్ఞానం” శీర్షిక పాఠ్యపుస్తకం చివర ఇవ్వడం జరిగింది. ఇది నిఘంటువు చూసే అలవాటు పెంపొందటానికి స్వయం అధ్యయనానికి అలవాటుపడేలా చేస్తుంది.

ఖ) **పాఠాలు - ఇతివృత్తాలు - ప్రక్రియలు - కృత్యాలు :**

ఆయా పాఠ్యాంశాలను కింది ఇతివృత్తాల ఆధారంగా ఎంపిక చేశారు.

- భాషాభిమానం, ప్రకృతివర్ణన, నైతిక విలువలు సామాజిక స్పృహ, సామాజిక విలువలు, నైతిక విలువలు, మానవతా విలువలు, వ్యక్తిత్వవికాసం, జంతుప్రేమ, సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువలు, జాతీయసమైక్యత, కళలు - దర్శనీయ స్థలాలు, కృతజ్ఞత, ప్రకృతి పరిశీలన, గ్రామీణ జీవనం, పర్యావరణం, సాహిత్యాభిరుచి, వర్ణన మొదలగునవి.

గ) **పాఠాలు వివిధ ప్రక్రియలు - అంటే వివిధ వ్యవహార రూపాల్లో ఎంపికచేయబడ్డాయి :** పాట, కథ, కథానిక, గేయం, కవిత, సంభాషణ, ఆత్మకథ, అనువాదకథ, వ్యాసం, అభినందనవ్యాసం, స్వగతం, జానపదకథ, పుస్తకసమీక్ష, బుర్రకథ, రేడియో ప్రసంగం, లేఖ, పద్యం, ద్విపద, శతకం, ఇతిహాసం, గజల్, రుబాయి, ప్రబంధం, కథాకావ్యం

యాత్రారచన, ఇంటర్వ్యూ సంపాదకీయ వ్యాసం మొదలగునవి. వివిధ ప్రాంతాలకు చెందిన మాండలికాల్లో కూడా పాఠాలు ఉన్నాయి.

**ఘ) వివిధ కృత్యాలు :**

విద్యార్థులచే సామర్థ్యాల సాధన చేయించడానికి వివిధ రకాల కృత్యాలు ఉన్నాయి.

1. వ్యక్తిగత కృత్యం, 2. జట్టు కృత్యం, 3. పూర్తి తరగతి కృత్యం.

పిల్లలు వ్యక్తిగతంగా ఆలోచించడానికి, ప్రతిస్పందించడానికి వ్యక్తిగతకృత్యాలు, జట్లలో పనిచేయడానికి జట్టుకృత్యాలు (సృజనాత్మకత, ప్రాజెక్టుపనులు), పూర్తి తరగతి కృత్యాలు అంటే చర్చించడానికి, అభిప్రాయాలు చెప్పడానికి (వినడం, మాట్లాడడం) కూడా అభ్యాసాలు ఉన్నాయి.

ఇప్పటివరకు చెప్పుకొన్న అంశాలన్నీ అవగాహన చేసుకున్నట్లైతే పాఠ్యపుస్తకాల తాత్త్వికత అర్థమైనట్లే. ఈ తాత్త్వికతనే మనకు విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపయోగపడుతుంది అనే విషయాన్ని గుర్తుంచుకొని మనం ముందుకెళ్ళాలి.

## స్ఫూర్తిదాతలు :

తమ విశిష్ట, విలక్షణ, జీవన విధానం ద్వారా జాతికి ఒజ్జవంతులైన వారెందరో ఉన్నారు. త్రికరణ శుద్ధితో సాగిన వారి జీవితం భవిష్యత్తరాలకు ఆదర్శం. వారి మాటలు, చేతలు ప్రేరణనిస్తాయి. మన జీవన విధానాన్ని సంస్కరిస్తాయి. అటువంటి మహా మనీషుల గురించి తెలుసుకొని, స్ఫూర్తి పొందితే, ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణం, తద్వారా ఉత్తమ సమాజనిర్మాణం సాధ్యమవుతుంది. ఈ దృష్టితోనే కొందరు మహానుభావులను, వాచకంలోను ప్రధానంగా ఉపవాచకాలలో పరిచయం చేయడం జరిగింది.

కుల, మత, ప్రాంతాలకతీతంగా త్యాగ, ధైర్య, సాహసాలను దృష్టిలో పెట్టుకొని వీరిని ఎంపిక చేయడం జరిగింది. ఇందులో చారిత్రక వ్యక్తులు, సామాజికోద్యమ నిర్మాతలు, భక్తులు, కవులు, కళాకారులున్నారు. 'రుద్రమదేవి, సోమనాద్రి, రాణిశంకరమ్మ, కొమురంభీం, జయశంకర్, షోయబుల్లాఖాన్, ఆరుట్లకమలాదేవి, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, పి.వి.నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు, దాశరథిరంగాచార్య, రామదాసు, చిందుఎల్లమ్మ వంటి పాఠాలు సరికొత్త స్ఫూర్తినందించడానికి సంసిద్ధంగా ఉన్నాయి.

*పదో తరగతికి "రామాయణం" ఉపవాచకాన్ని ఎంపిక చేయడం జరిగింది.*

జీవితంలో ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగాలో ఆలోచింపచేయడానికి, సమున్నత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముందు తరాలవారికి స్ఫూర్తికోసం పదో తరగతికి రామాయణాన్ని ఉపవాచకంగా ఎంపికచేయడం జరిగింది.

## చదువండి - తెలుసుకోండి :

పాఠ్యాంశాల చివర, అక్కడక్కడా వివిధ అంశాలకు, వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని సంక్షిప్తంగా 'చదువండి-తెలుసుకోండి' శీర్షికన ఇవ్వడం జరిగింది. మహామంత్రి మాదన్న, గాంధీమహాత్ముడు, డా॥ బి.ఆర్.అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్, కెప్టెన్ విజయరఘునందన్ రావు, టి.ఎన్.సదాలక్ష్మి, బి.ఎన్.శాస్త్రి, మలాలా, ఉప్పుల మల్సూర్ వంటి మహామహుల జీవన సరళిని, తద్వారా అందుకోవలసిన సందేశాన్ని ఇది తెలుపుతుంది. శ్లోకాలు, బమ్మెరపోతన పద్యాలు, చమత్కార పద్యాలు, పొడుపు పద్యాలు, సామెతలు, జాతీయాలు భాషా, సాహిత్యంపట్ల అభిరుచిని కలిగిస్తాయి.

'స్నేహసంపద' వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుంది. 'మాట్లాడటమూ ఒక కళే' మాట తీరును వివరిస్తుంది, సవరిస్తుంది.. జానపదకళారూపం 'ఒగ్గుకథ' వైశిష్ట్యాన్ని తెలుసుకుంటాం.

**మీకు తెలుసా :**

కొన్ని పాఠ్యాంశాల చివరన 'మీకు తెలుసా' శీర్షిక కింద కొంత సంక్షిప్త సమాచారాన్ని ఇవ్వడం జరిగింది. మల్లినాథసూరి, మదర్‌థెరిసా, దాశరథి, గోర్కీ, చెకోవ్, చార్లెస్ డికెన్స్‌ల గురించి సంక్షిప్తంగా తెలుపడం జరిగింది. కుంటుంబం కుటుంబమే (పెండ్యాలవారు) సమాజసేవకు అంకితమైన అరుదైన సమాచారాన్ని, 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, తెలంగాణ సాయుధపోరాటం, నియాన్‌దీపాలు, పాలమూరులేబర్, మన్నెంకొండ దేవుడిని గురించి ఇవ్వడం జరిగింది. బొగ్గగనుల్లో పనిచేసే సిబ్బంది చేసే పనుల వివరాలను జిబ్రాల్టర్ రేవు, బే ఆఫ్ బిస్కే, స్టెర్లింగ్ సౌండ్, పాస్‌పోర్టు గ్రేట్‌బ్రిటన్ గురించి సంక్షిప్త పరిచయం చేయడం జరిగింది. ఇవన్నీ విద్యార్థుల జ్ఞానపరిధిని పెంచుతాయి.

'చదువండి - తెలుసుకొండి', 'మీకు తెలుసా' శీర్షికలో ఇచ్చిన విషయాలను అదనపు కాలాంశాలలోనో, విద్యార్థుల తీరిక సమయంలోనో చదివేటట్లు ప్రోత్సహించాలి. ఆయా విషయాలను మరింతగా తెలుసుకునేటట్లు ప్రేరేపించాలి.

**పాఠాల సంఖ్య - పనిభారం :**

6 నుండి 10 తరగతుల్లో గత పాఠ్యపుస్తకాల్లో 14 పాఠాలు ఉంటే ఈసారి అవి ఆయా తరగతుల్లో 12 పాఠాలకు కుదించబడ్డాయి. పాఠ్యాంశాలు, వాటి నిడివి, పద్యాలసంఖ్యను కూడా పై విషయాన్ని దృష్టియందుంచుకొనే కూర్చడం జరిగింది. బోధనాభ్యసనలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు కూడా పనిభారం విషయంలో తగినంత వెసులుబాటు కల్పించి, సామర్థ్యాల సాధనపై దృష్టిపెట్టేలా చేయడం ఈ పాఠ్యపుస్తకాల మరో ప్రత్యేకత.

అభ్యాసాలు : సామర్థ్యాల సాధనకుగాను పాఠ్యాంశాల వెనుక 'ఇవి చేయండి' పేరుతో చేర్చబడిన ప్రశ్నాంశాలు కూడా గతపుస్తకాల్లోకంటే తగ్గిన విషయాన్ని గ్రహించాలి.

వినడం - మాట్లాడడం సామర్థ్యానికి చెందిన ప్రశ్నలు రెండు లేదా మూడు నుండి ఒక ప్రశ్నకు తగ్గిపోయింది. అట్లే చదవడం-అవగాహన సామర్థ్యం క్రింద ఇవ్వబడిన 'పాఠ్యాంశం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి' పేరుతో ఇవ్వబడిన ప్రశ్నలు కూడా ప్రస్తుత పుస్తకాల్లో చేర్చబడలేదు. దీనివల్ల గైళ్ళు, స్టడీమెటీరియళ్ళు, క్వశ్చిన్‌బ్యాంకులు మొదలగు వాటిని పూర్తిగా దూరంగా ఉంచి బట్టీ విధానాన్ని సమూలంగా పెకిలించివేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఇదిగాక స్వీయరచన సామర్థ్యంలో వ్యాసరూప ప్రశ్నల్ని కూడా ఒక్కో ప్రశ్నకు కుదించడం జరిగింది. సృజనాత్మకతకు చెందిన ప్రశ్న కూడా ఒకటే చేయాల్సి ఉంటుంది. ఇక వ్యాకరణ విషయాల్లోకి వచ్చినా గతంలో చేర్చబడిన చాలా రకాల సంధుల పరిచయం చేయడమే ప్రధానం అని భావించక దాదాపు ఆయా పాఠ్యాలకనుగుణమైన సంధులను మాత్రమే ఇచ్చి ఈ స్థాయిలో అవసరం లేదని భావించిన పలు సంధులను తొలగించడం జరిగింది.

ఈ విధంగా నూతన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పనిభారం తగ్గించి బోధనాభ్యసన ప్రక్రియల్ని మరింత సావకాశంగా అర్థవంతంగా కొనసాగించేలా రూపొందించడం జరిగింది.

**ముగింపు :**

ఆర్.టి.ఇ.-2009, రాష్ట్ర విద్యా ప్రణాళిక-2011 ప్రకారం నూతన భాషావాచకాలు రూపొందించారు. ప్రధానంగా ఇవి ఆలోచింపచేయడం, వ్యక్తీకరించడం, సృజనాత్మకత, విలువలు, వైఖరులు పెంపొందింపచేయడానికి ఉద్దేశించినవి. విమర్శనాత్మక, హేతుబద్ధమైన చింతనతో విచక్షణా జ్ఞానంతో వ్యవహరించేలా చేయడానికి ఈ పాఠ్యపుస్తకాలు దోహదపడతాయి. ఇందుకనుగుణంగా ఇతివృత్తాలు, పాఠ్యాంశాల ఎంపిక, అభ్యాసాలకూర్పు ఉన్నాయి. వీటిని ప్రణాళికాబద్ధమైన బోధనాభ్యసన ప్రక్రియలను అనుసరించి ఫలితాలు సాధించాలి.

# Chapter-II

## పాఠాల ప్రత్యేకతలు – సాధించాల్సిన సామర్థ్యాలు

తరగతి (పిల్లల) స్థాయియిననుసరించి, అందించాల్సిన జ్ఞానాన్ననుసరించి, పరిచయం చేయవలసిన అంశాన్ననుసరించి రాష్ట్రంలో మారిన పరిస్థితులను, విద్యావిధానంలో చోటుచేసుకున్న విప్లవాత్మకమైన మార్పులను దృష్టిలో ఉంచుకొని పాఠాలను ఎంపిక చేయడం జరిగింది. పిల్లలు సాధించవలసిన సామర్థ్యాలను నిర్దేశించుకొని రూపొందించుకున్న కొత్త పాఠ్యపుస్తకాల ప్రత్యేకతలను, వాటి ద్వారా సాధించగలిగే సామర్థ్యాలను గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

### పాఠాల ప్రత్యేకతలు – సాధించాల్సిన సామర్థ్యాలు

### 6వ తరగతి

**ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు**

**I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం**

- ఉపన్యాసాలు, సందేశాలు, వక్తృత్వాలు, వార్తలు, కథలు విని, అర్థంచేసుకొని, ప్రతిస్పందించగలగాలి.
- స్వీయ అభిప్రాయాలను, కారణాలను చెప్పగలగాలి.
- తమ ఇష్టాయిష్టాలను, ఆసక్తులను గూర్చి చెప్పగలగాలి.
- నిజజీవిత సంఘటనలపై సమర్థిస్తూ లేదా విభేదిస్తూ / విశ్లేషిస్తూ నిర్భయంగా మాట్లాడగలగాలి, ప్రశ్నించగలగాలి.
- పద్య తాత్పర్యాలను, గేయ/పాఠ సారాంశాలను, కథలను చెప్పగలగాలి.
- కవి యొక్క ఆలోచనను, పాత్రల స్వభావాన్ని వివరించి చెప్పగలగాలి.

**II. ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని ప్రతిస్పందించడం**

- పద్యం, వచనం, పాట, గేయం, వచనకవిత, జానపదకథ, సంభాషణ, స్వగతం తదితర అంశాలను శైలీభేదంతో అవగాహనతో హావభావాలతో చదువగలగాలి.

- అపరిచిత పద్య, గద్య అంశాలను చదివి, అర్థంచేసుకొని ప్రతిస్పందించగలగాలి.
- చదువుతున్న అంశాల్లోని కీలకాంశాలు గుర్తించి రాయగలగాలి. శీర్షికలు సూచించగలగాలి.
- చదివిన అంశాలను విశ్లేషించడం, పోలికలను గుర్తించడం, పట్టికారూపంలో రాయడం మొదలైనవి చేయగలగాలి.
- చదివిన అంశంలోని జాతీయాలు, సామెతలు కీలకాంశాలు గుర్తించగలగాలి. కీలకాంశం గురించి నిష్కర్షగా మాట్లాగలగాలి.
- భాషకు సంబంధించిన పఠన సామగ్రి / ప్రసార మాధ్యమాల సామగ్రి అనగా రేడియో, టి.వి. వార్తాపత్రికలు, పత్రికలు, విషయానికి సంబంధించిన పుస్తకాలు, అంతర్జాలంలో ఉన్న అంశాలు మొదలగు వాటగిని అర్థం చేసుకొంటూ చదవగలగాలి. వాటిని మౌఖికంగా / రాతపూర్వకంగా / బ్రెయిలీ లిపిలో / సాంకేతిక భాషలో తన ఇష్టాయిష్టాలను, అభిప్రయాలను వ్యాఖ్యానాలను చేయగలగాలి.

## III. స్వీయరచన

- పాఠాల నుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు సొంతమాటల్లో రాయగలగాలి.
- తాము అర్థం చేసుకొన్న విషయాలను, తెలిసిన విషయాలను స్పష్టంగా రాయగలగాలి.
- విభిన్న సందర్భాలలో వివిధ ఉద్దేశాల కొరకు రాసేటప్పుడు అవసరమైన నూతన పదాలు, వాక్యనిర్మాణాలు జాతీయాలు సామెతలు తగు రీతిలో ఉపయోగించగలగాలి.
- తెలుసుకొన్న అంశాన్ని సమర్థిస్తూ కారణాలు వివరిస్తూ, విశ్లేషిస్తూ సొంత మాటల్లో రాయగలగాలి.
- ఇతరులు వ్యక్తీకరించిన అనుభవాలను, అవసరానికి అనుగుణంగా రాయగలగాలి.

  ఉదా: జనసమ్మర్ధం గల స్థలాలలో రచ్చబండ వద్ద విన్న విషయాలను రాయగలగాలి.
- విరామచిహ్నాలను పాటిస్తూ, వాక్యభేదాలను సందర్భోచితంగా ఉపయోగించి రాయగలగాలి.
- భావాలను క్రమపద్ధతిలో సరైన పదజాలాన్ని ఉపయోగించి దోషరహితంగా రాయగలగాలి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

- తను చదివిన, అనుభవంలోఉన్న, విన్న, చూసిన అంశాలను వర్ణించి రాయగలగాలి.
- కథలు, కవితలు అల్లడం, పాత్రలు పోషించడం, పాటలను, గేయాలను పాడడం, కథలు, కవితలు, గేయాలు రాయడం, బొమ్మలను చూసి సంభాషణలను, కథలను రాయడం మొదలైనవి చేయగలగాలి.
- లేఖలు, వ్యాసాలు, సంభాషణలు, పట్టిక, ఆత్మకథ మొదలైనవి రాయగలగాలి.
- జాతీయాలు, సామెతలు ఉపయోగించి కథను రాయగలగాలి.

- వివిధ ప్రక్రియలలోని భాషాసౌందర్యాన్ని ప్రశంసించగలగాలి. (ఉదా: కవితలలోని ప్రాస పదాలు, వ్యాసాలు, కథలలోని జాతీయాలు, సామెతలు మొదలగునవి)
- ఇతర భాషలు, మతాలు, సంస్కృతులను అర్థంచేసుకొని, మంచిని గ్రహించి, గౌరవించగలగాలి.
- స్థానికంగా ప్రాచుర్యం పొందిన గేయాలను ప్రశంసించగలగాలి, చర్చించగలగాలి.
- తోటి బాలికలు, ప్రత్యేకావసరాలు గల పిల్లలు మనతో సమానమని గుర్తించి వాళ్ళలోని గొప్పతనాన్ని ప్రశంసించగలగాలి.

**V. పదజాల వినియోగం**

- ప్రకృతి వికృతులు, సమానార్థకపదాలు, ధ్వన్యనుకరణ పదాలు, వ్యతిరేకపదాలు, జాతీయాలు, సామెతలు గుర్తించి, అవగాహన చేసుకొని, కళలు, వృత్తులకు సంబంధించిన కొత్తపదాలతోపాటు సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి.
- నిఘంటువును ఉపయోగిస్తూ, స్వీయ అధ్యయనం చేయగలగాలి.
- వివిధ వృత్తుల కళలకు (ఉదా: వ్యవసాయం, నృత్యం, సంగీతం, వాస్తుకళ, హస్తకళ మొదలగునవి) సంబంధించిన పదాలను తెలుసుకొనుటకు ఆసక్తి కనబరచగలగాలి. వాటిని ప్రశంసించగలగాదలి.
- మాండలిక భాషారూపాలను గుర్తించి వినియోగించగలగాలి.

**VI. భాషను గూర్చి తెలుసుకుందాం**

- వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. వర్ణమాల, విభాగాలు, భాషాభాగాలు, విభక్తులు, ద్వంద్వసమాసం, పదాలు కలపడం, విడదీయడం మొదలైన వాటిని చేయగలగాలి.

**పాఠం పేరు :** 1. అభినందన **కవి పేరు :** శేషం లక్ష్మీనారాయణాచార్య **ప్రక్రియ :** గేయం

**ఉద్దేశం :** నిరంతరం శ్రమిస్తూ దేశప్రజల క్షుధార్తిని తీర్చేవారు రైతులు. ప్రజలు గుండెల మీద చేయివేసుకొని హాయిగా నిద్రించేట్టు రక్షణగా నిలిచేవారు సైనికులు. అటువంటి కర్మవీరుల గొప్పదనాన్ని తెలియజెప్పడం, శేషం లక్ష్మీనారాయణాచార్యుల రచనాశైలిని విద్యార్థులకు పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- గేయాన్ని అభినయంతో పాడగలగాలి. సమాజానికి ప్రగతి మార్గదర్శకుల అవసరం గూర్చి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పాఠంలోని కీలక పదాలను గుర్తించడం, అపరిచితగేయాన్ని చదివి ఖాళీలను పూరించడం చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- దేశాభివృద్ధికి తోడ్పడిన వారి గూర్చి, గేయసారాంశాన్ని, గేయరచయితను గూర్చి సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తల్లి, తండ్రి, గురువు, మంచిమిత్రులు, గొప్పవాళ్ళు ఇట్లా ఎవరి గురించైనా వందనాలు, వందనాలు అని అభినందనలు తెలుపుతూ గేయాన్ని రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- సమానార్థక పదాలు గుర్తించగలగాలి. రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- అక్షరాల్లోని వర్ణాలను, ధ్వనులను, ప్రత్యేక వర్గానికి చెందిన అక్షరాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 2. స్నేహబంధం **మూలం :** పంచతంత్ర కథ **ప్రక్రియ :** కథ

**ఉద్దేశం :** మంచివారితో స్నేహం ఎలాంటి ఆపదలనుండైనా గట్టెక్కిస్తుంది. అనేక విధాలుగా మేలుచేస్తుంది. అటువంటి 'స్నేహం' యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ అనేక కథలు ప్రచారంలో ఉన్నవి. ఎన్నో పుస్తకాలు రాయబడ్డాయి. అటువంటి కథాపుస్తకాల్లో విష్ణుశర్మ రాసిన పంచతంత్రం కూడా ఒకటి. పశుపక్ష్యాదులను పాత్రలుగా చేసి నైతిక విలువలను పిల్లల హృదయాల్లోకి సున్నితంగా చొప్పించగల నైపుణ్యం అందులో కనిపిస్తుంది. ఆ కథలను తెలుగులో, చిన్నయసూరి, కందుకూరి వంటివారు గ్రాంథికశైలిలో రాశారు. దానికి సరళ వచన రూపమే ఈ పాఠం. విద్యార్థుల్లో పరస్పర సహకారగుణం, స్నేహభావం పెంపొందింపజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- కథను సొంతమాటల్లో చెప్పగలగాలి. పిల్లలు తమ స్నేహితులకు చేసిన సాయం గురించి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- కీలక పదాలను పాఠంలో గుర్తించగలగాలి.
- అపరిచిత గద్యాంశాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- కథను సొంతమాటల్లో రాయగలగాలి. కథ ద్వారా గ్రహించిన మంచి విషయాలను రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- జంతువులను, పక్షులను పాత్రలుగా ఉపయోగించి సొంతంగా ఒక కథ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ప్రకృతి - వికృతులను, సమానార్థక పదాలను గుర్తించగలగాలి. ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- తెలుగు భాషలో వర్ణవిభాగాన్ని గ్రహించి వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 3. వర్షం **కవి పేరు :** డా॥ పల్లా దుర్గయ్య **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** ఋతువుల మార్పు అందమైన ప్రకృతికి మరింత అందాన్ని కల్గిస్తుంది. వసంత ఋతువులో చెట్లు చిగిర్చి ప్రకృతి పచ్చని రామచిలుకలా శోభిస్తుంటే ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో మాటల్లో చెప్పలేము. అట్లే ఎంతో తీవ్రంగా బాధించిన వేసవి నుంచి ఉపశమనాన్ని కల్గిస్తూ వర్షాకాలం వచ్చిందంటే ఆబాలగోపాలం ఆనందడోలికల్లో తేలియాడుతారు. అటువంటి వర్షాకాలపు సొబగును డా॥ పల్లా దుర్గయ్య అందమైన పద్యాల్లో వర్ణించాడు. కవి యొక్క శైలిని, వర్షాకాలంలో ప్రకృతి రామణీయకతను, ఆ వర్షాలకు కొంతమంది సామాన్యులు పడే ఇబ్బందులు విద్యార్థులకు తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- విద్యార్థి తనకు నచ్చిన కాలం గురించి చెప్పగలగాలి. కవి యొక్క అభిప్రాయాన్ని సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- సూచించిన కీలకాంశాలను పాఠంలో గుర్తించగలగాలి. అపరిచిత కవితను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- కవి గురించి, పాఠ్యభాగసారాంశాన్నీ సొంత మాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తనకు నచ్చిన ప్రకృతి దృశ్యాన్ని వర్ణిస్తూగాని; ఎండాకాలంలో వాతావరణాన్ని ప్రజల స్థితిగతులను వర్ణిస్తూగాని వ్యాసం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- చదివిన పాఠాల్లో నిర్దేశిత గుణింతాలతో కూడిన పదాలు వెతికి రాయగలగాలి.
- ఇచ్చిన పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- పుంలింగ, స్త్రీలింగ, నపుంసక లింగ పదాలను గుర్తించి, రాయగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 4. లేఖ **రచయిత :** -------- **ప్రక్రియ :** లేఖారచన

**ఉద్దేశం :** వ్యక్తి లేదా వ్యక్తుల నుండి ఇతరులకు సమాచారం చేరవేయడానికి ఉపయోగపడేది లేఖ. వ్యక్తినిబట్టి, విషయాన్ని బట్టి, అవసరాన్ని బట్టి లేఖల్లో వైవిధ్యం కనిపిస్తుంది. అటువంటి లేఖలు రాసేవిధానం విద్యార్థులకు తెలియజెప్పుతూ తెలంగాణాలో ఉన్న దర్శనీయస్థలాల్లో కొన్నింటిని పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**ii) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- తమ ప్రాంతంలో ఉన్న దర్శనీయ స్థలాల గురించి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- సూచించిన కీలకాంశాలను పాఠంలో గుర్తించగలగాలి. అపరిచిత లేఖను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- యాత్రలకు వెళ్ళినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, ఆయా ప్రాంతాల్లో ప్రవర్తించాల్సిన విధానాన్ని గురించి, విజ్ఞానయాత్రలవల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుంది. అనే విషయాన్ని సమర్థిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తాము చూసిన యాత్రా విశేషాలను వివరిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- సమానార్థక పదాలను, ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- విభక్తి ప్రత్యయాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 5. శతకసుధ **కవి :** శతక కవులు **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** సమాజశ్రేయస్సును కోరిన కవులు కొంతమంది ఆ హితాన్ని లోకానికి బోధించడానికి పద్యాన్ని మార్గంగా ఎంచుకున్నారు. భక్తి, నీతి, వైరాగ్య శతకాల రూపంలో ఆ రచనలు ప్రసిద్ధికెక్కాయి. అతి ప్రాచీన కాలం నుండి ఈ నాటి వరకు చెక్కుచెదరకుండా సమాజానికి సన్మార్గాన్ని చూపే ఆ శతక పద్యాలు విద్యార్థులకు తెలియడం ఎంతో అవసరం. ప్రసిద్ధులైన పూర్వకవుల శతకాల నుండీ కాక తెలంగాణములో ప్రసిద్ధిచెందిన కవుల శతకాల నుండి కూడా పద్యాలు ఈ పాఠంలో పొందుపర్చడం జరిగింది. ఈ పాఠంలో బద్దెన - సుమతి శతకం; ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర శతకం; పక్కి వెంకట నరసింహకవి - కుమారీ శతకం; శిరశినగల్ కృష్ణమాచార్యులు - గాంధీతాత శతకం; సూరోజు బాలనరసింహాచారి - బాలనృసింహ శతకం; డా॥ టి.వి.నారాయణ - భవ్యచరిత శతకం మొదలైన వాటిలో నుండి ప్రస్తుత పాఠంలో పద్యాలు పెట్టడం జరిగింది.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- శతక పద్యాల గొప్పదనాన్ని పద్యాల భావాలనూ చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- భావాల ఆధారంగా సరైన పద్యపాదాలను పాఠంలో గుర్తించగలగాలి.
- అపరిచిత పద్యాన్ని చదివి తప్పొప్పులను గుర్తించడం, తమ ప్రవర్తనలోగల మంచి చెడులను స్వీయమూల్యాంకనం చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- శతక కవుల వల్ల సమాజానికి కలిగే మేలు గురించి రాయగలగాలి.
- మంచివారితో స్నేహం చేస్తే కలిగే ఫలం గూర్చి, ఇతరులకు ఎందుకు మేలు చెయ్యాలి అన్న విషయం గూర్చి రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- శతక పద్యాల ఆధారంగా చేయగూడని మరియు చేయదగిన పనులను పట్టిక రూపంలో రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, పాఠంలోని పదాలను, అర్థాలను పదవిజ్ఞాన పట్టికలో గుర్తించడం చేయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన వాక్యాల్లో అవ్యయాలను గుర్తించగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 6. పోతనబాల్యం **కవి :** డా॥ వానమామలై వరదాచార్యులు **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** విలువలతో కూడిన జీవితాన్ని గడిపినపుడే మనిషి నరుడు అవుతాడు లేనిచో వానరుడౌతాడు. దయ, కరుణ, సహానుభూతి, సహకారం మాతృ / పితృ / సోదర ప్రేమను కల్గియుండడం... ఇవన్నీ మానవీయ విలువల్లో ఒక భాగం. అటువంటి అనేక పార్శ్వాల్ని స్పృశిస్తూ డా॥ వానమామలై వరదాచార్యులు 'పోతన చరిత్రము' అనే మహాకావ్యాన్ని రచించారు. అందులో ప్రథమాశ్వాసంలో 'పోతన బాల్యం' రమణీయంగా వర్ణింపబడింది. పోతన – అతని అన్నయగు తిప్పనలమధ్య సోదరప్రేమ ఎలా ఉండేది? వారు ఏయే బాల్యక్రీడలు ఆడేవారు ఇత్యాది విషయాలను ఈ పాఠం ద్వారా విద్యార్థులకు తెలియజెప్పడం తద్వారా నైతిక విలువలను, పెంపొందించడం రసానుభూతిని కల్గించడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ఈ నాటి కాలంలో సోదరులమధ్య ప్రేమలు ఎలా ఉన్నవో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పద్యాన్ని చదివి, ఖాళీలను పూరించగలగాలి.

**iii) స్వీయరచన :**

- మంచి పేరు రావాలంటే చేయదగిన మంచి పనులను గూర్చి రాయగలగాలి.
- పోతన బాల్యం గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తాము ఆడుకునే ఆటల గురించి, వాటి అవసరం గురించి రాయగలగాలి. ఆడుకునే పిల్లల్ని చూసి పెద్దలు ఏం మాట్లాడుకుంటారో ఊహించి సంభాషణలు రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ప్రకృతి - వికృతులను జతపరుచగలగాలి. ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- భాషాభాగాలను గుర్తించి రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 7. ఉడుతసాయం **కవి :** గోన బుద్ధారెడ్డి **ప్రక్రియ :** ద్విపద

**ఉద్దేశం :** పశుపక్ష్యాదులను చూసి కూడా మానవుడు నేర్చుకోదగిన మంచి లక్షణాలు ఎన్నో ఉంటాయి. ఐకమత్యం, క్రమశిక్షణ, సహకారగుణం ఇత్యాదులెన్నో మనకు పశుపక్ష్యాదుల్లో కనిపిస్తాయి. లంకకుచేరడానికి సముద్రంపై వారధి నిర్మిస్తున్న వానరులకు ఒక ఉడుతసాయం చేసింది. దీనికి ప్రతిఫలంగా తరతరాలకు తరగని ప్రయోజనాన్ని పొందింది. ఈ విషయాన్ని 'గోనబుద్ధారెడ్డి' తన 'రంగనాథరామాయణం'లో 'ద్విపద' రూపంలో సరళంగా మధురంగా వర్ణించారు. ప్రతిఫలాపేక్షలేకుండా సహాయం చేయడంవల్ల కల్గే ప్రయోజనం గూర్చి చెప్పడం ద్విపద యొక్క ప్రాచీన సాహిత్యం యొక్క స్వరూప స్వభావాలు తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ద్విపదను రాగయుక్తంగా పాడగలగాలి. తాము ఇతరులకు సాయం చేసినప్పుడు వారు ప్రతిస్పందించిన విధానాన్ని గురించి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పద్యాన్ని చదివి బహుళైచ్ఛిక సమాధానాల్లో సరైన వాటిని గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- గోనబుద్ధారెడ్డి శైలిని వివరించగలగాలి, పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పాఠాన్ని గేయ రూపంలో రాయగలగాలి లేదా బొమ్మను చూసి సంభాషణలు రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- సమానార్థక పదాలను ప్రకృతి వికృతులను గుర్తించగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- విభక్తి ప్రత్యయాలను, భాషాభాగాలను గుర్తించి పట్టికరూపంలో రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 8. చెరువు **కవి :** --- **ప్రక్రియ :** స్వగతం

**ఉద్దేశం :** తెలంగాణాలో ప్రజల జీవితానికి చెరువులకు విడదీయరాని అనుబంధం ఉంది. గుడి లేదా బడి లేకుండానైనా ఊరున్నదేమో కాని చెరువు లేకుండా ఏ ఊరూ ఉండదు. అట్లాంటి చెరువుల ఉనికి వివిధ కారణాలవల్ల కనుమరుగౌతున్నది. అట్లాకాకుండా చెఱువులను కాపాడుకోవడం ద్వారా మనల్నేకాదు, ప్రతి ప్రాణిని కాపాడవచ్చు. అని ఈ పాఠంలో తెలియజెప్పబడుతుంది. తమకు సంబంధించిన విషయాలను తామే అనుకోవడం. ఇతరులకు తెలిసేటట్లుగా చెప్పుకోవడం అనేది "స్వగతం" అనే ప్రక్రియ యొక్క లక్షణం. ఈ పాఠంలో చెఱువు తన వృత్తాంతాన్ని "స్వగతం"గా చెప్పింది.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- చెరువుకు సంబంధించిన అంశంపై మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- సూచించిన పేరాలు చదివి వాటికి శీర్షికలు పెట్టగలగాలి.
- అపరిచిత గద్యాన్ని (పేరాను) చదివి ప్రశ్నలు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- చెరువుల వల్ల కలిగే లాభాలను గూర్చి, చెరువులవల్ల గ్రామాలు సుభిక్షంగా ఉంటాయనే విషయాన్ని గూర్చి రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- చెరువు యొక్క గొప్పదనాన్ని ప్రశంసిస్తూ కవిత లేదా పాట రాయగలగాలి. (లేదా)
  చెరువు మాట్లాడుతున్నట్టుగా ఏకపాత్రాభినయం చేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- జాతీయాలను గుర్తించి, వాటిని వివరించగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సంధి పదాలను విడదీసి రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 9. చీమలబారు **కవి :** పొట్లపల్లి రామారావు **ప్రక్రియ :** గేయకవిత

**ఉద్దేశం :** సృష్టిలో ఉండే ప్రతి ప్రాణి నుండి మనం నేర్చుకోదగిన మంచి విషయాలు ఎన్నో ఉన్నాయి. చీమల నుండి మనం నేర్చుకోవలసింది క్రమశిక్షణతో మెలుగడం, 'ముందుచూపు కలిగి ఉండడం!' ఈ విషయాల్ని పొట్లపల్లి రామారావుగారు తమ 'ఆత్మవేదన' అనే కవితా సంపుటంలో అందమైన గేయకవిత రూపంలో వివరించారు.

క్రమశిక్షణ కల్గియుండడం, నిరంతరం శ్రమించడం వాటివల్ల కలిగే ప్రయోజనాలు మొ॥న వాటిని గూర్చి విద్యార్థులకు తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- క్రమశిక్షణ పాటించే విషయంలో మనిషి తీరు ఎట్లా ఉంటున్నదో వివరించి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత గేయాన్ని చదివి తప్పొప్పులను గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- సోమరులుగా ఉంటే కలిగే అనర్థాలను వివరించగలగాలి.
- చీమలు మానవాళికి ఇచ్చే సందేశాన్ని వివరించగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తన చుట్టూ ఉండే పక్షుల్లో తాను గమనించిన ప్రత్యేకతలను గేయ / కవిత రూపంలో రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- పదాలకు అర్థాలు, ప్రకృతి - వికృతులు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ద్వంద్వ సమాస పదాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 10. బాలనాగమ్మ **కవి :** ----- **ప్రక్రియ :** జానపద కథ

**ఉద్దేశం :** జానపదకథలంటే ఆబాలగోపాలం ఇష్టపడుతారు మాయలు, మంత్రాలు, తంత్రాలు, పశుపక్ష్యాదులు ఉపకారం, వీరత్వం, కథల్లో ఉండే మలుపులు ఇవన్నీ పాఠకులను ఆకర్షిస్తాయి. అటువంటి జానపదకథల్లో తెలంగాణాలో అత్యంత ప్రసిద్ధి చెందింది బాలనాగమ్మకథ. దీనికి ప్రత్యేకంగా కర్త అంటూ ఎవరూ లేరు. జానపదకథలనేవి ఆనోట ఈనోట ఒకరినుంచి ఒకరికి ప్రసారమవుతూ ప్రసిద్ధికెక్కుతూ ఉంటాయి. బహుళప్రజాదరణపొందిన ఆ బాలనాగమ్మకథను విద్యార్థులకు తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- కథలో తమకు ఆసక్తికలిగించిన సంఘటనను గూర్చి చెప్పగలగాలి.
- తమకు తెలిసిన ఏదైనా జానపద కథను చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పాఠంలో జాతీయాలను ఉపయోగించిన సందర్భాన్ని వివరించగలగాలి.
- పాత్రల స్వభావాన్ని తెలిపే కీలక పదాలను పట్టికలో రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- తమకు వచ్చిన విద్యలగూర్చి, వాటిలో తమకు ఇష్టమైన వాటి గూర్చి రాయగలగాలి.
- కథను సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- కథలోని పాత్రలమధ్య జరిగిన సంభాషణలను ఊహించి రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- వ్యతిరేకార్థక పదాలను సమానార్థక పదాలను రాయగలగాలి. జాతీయాలలో సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- (సంధి) పదాలను కలిపి రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 11. పల్లెటూరి పిల్లగాడా **కవి :** సుద్దాల హనుమంతు **ప్రక్రియ :** పాట

**ఉద్దేశం :** ఈనాడు ఎంతోమంది బాలబాలికలు అనేక కారణాలతో పొట్టకూటికోసం ఎన్నో కష్టమైన పనులను చేస్తూ ఆపదల్లో పడుతూ జీవితాన్ని గడుపుతున్నారు. అలాంటి ఒక పిల్లవాని జీవితాన్ని హృద్యంగా వర్ణించిన మహనీయుడు సుద్దాల హనుమంతు. ఆయన శతజయంతి సందర్భంగా ప్రచురించిన కవితా సంకలనంలోనిది ఈ 'పల్లెటూరి పిల్లగాడా' పాట. దైన్యంతో కూడిన బాలకార్మికుల జీవిత పార్శ్వాలను స్పృశిస్తూ అటువంటి వ్యవస్థ నిర్మూలించాలనే ఆలోచనల్ని పిల్లల్లో రేకెత్తింప జేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పాటను రాగయుక్తంగా పాడగలగాలి. పిల్లవాని బాధలను చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- తారుమారుగా ఉన్న వాక్యాలను సరిచేసి రాయగలగాలి. అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. తప్పొప్పులను గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- పిల్లవాడు బాధడడానికి గల కారణాలను రాయగలగాలి.
- 'చదువుకుంటే జీవితాలు బాగుపడుతాయి' అనే అంశాన్ని సమర్థిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- 'పల్లెటూరి పిల్లగాని' జీవితాన్ని ఆత్మకథగా రాయగలగాలి. (లేదా)
- బొమ్మను చూసి సంభాషణలను ఊహించి రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- అర్థాలను, ప్రకృతి వికృతులను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- పదాలను విడదీసి రాయడం, కలిపి రాయడం, విగ్రహవాక్యాలు, సమాసం పేరు రాయడం మొ॥వి చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 12. కాపాడుకుందాం **కవి :** -- **ప్రక్రియ :** సంభాషణ

**ఉద్దేశం :** ప్రకృతిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. మానవుని 'స్వయంకృతాపరాధంవల్ల' తను కష్టాలను కొనితెచ్చుకోవడమే కాకుండా సమస్త ప్రాణికోటికి వినాశనాన్ని తెచ్చిపెడుతున్నారు. కాబట్టి ప్రకృతిలో అంతర్థానమైన తను ప్రకృతిని కాపాడుతూ తన ఉనికిని కాపాడుకోవాలని తెలియజెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పాఠం ద్వారా తాను గ్రహించిన విషయాన్ని చెప్పగలగాలి.
- 'పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత' అనే అంశాన్ని సమర్థిస్తూ మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో సందర్భాన్ని వివరించి చెప్పగలగాలి.
- అపరిచిత పేరాను చదివి పట్టిక పూరించగలగాలి.

**iii) స్వీయరచన :**

- 'ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు భవిష్యత్తు' అనే అంశాన్ని విశ్లేషిస్తూ రాయగలగాలి.
- ప్రకృతిపట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో వివరించి రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- 'పర్యావరణ పరిరక్షణ' అందరి బాధ్యత అన్న అంశంతో పోస్టరు తయారుచేయగలగాలి.
- బొమ్మను చూసి సంభాషణలు రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాల్లో భిన్నమైన పదాన్ని గుర్తించగలగాలి.
- పట్టికలో ఉన్న ప్రకృతి - వికృతులను గుర్తించి రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- విభక్తులు, పదాలు కలిపి రాయడం, పదాలు విడదీసి రాయడం, ద్వంద్వ సమాసం - విగ్రహవాక్యాలు రాయడం భాషాభాగాల పేర్లు రాయడం మొ॥వి చేయగలగాలి.

❁ ❁ ❁

## 7వ తరగతి

**ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు**

**I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం**

- ఉపన్యాసాలు, సందేశాలు, వక్తృత్వాలు, వార్తలు విని, అర్థంచేసుకోడం, ప్రతిస్పందించగలగాలి.
- ఇతరు వ్యక్తీకరించిన అనుభవాలను అర్థంచేసుకోగలగాలి, వ్యక్తపరచగలగాలి, రాయగలగాలి. ఉదా: గ్రామంలోని రచ్చబండ వద్ద జరిగే ముచ్చట్లు, బస్తీలో జరిగే జరపబోయే కార్యక్రమాల గురించి మాట్లాడగలగాలి.
- చర్చల్లో పాల్గొనడం, అభిప్రాయాలను స్పష్టంగా సొంత మాటలలో వ్యక్తీకరించగలగాలి.
- కళారూపాలను చూసి, విని అర్థం చేసుకోవడం, ఆసక్తిని, అభిరుచిని పెంచుకోగలగాలి.
- పాత్రల స్వభావాలను వాటి తేడాలను విచక్షణతో గ్రహించి ఆలోచించగలగాలి, ప్రశ్నించగలగాలి.
- సాహిత్య ప్రక్రియలలోని భేదాలను గుర్తించి, అవగాహనతో అభిప్రాయాలు వ్యక్తీకరించగలగాలి.
- చిన్నచిన్న సంఘటనలను పరిశీలించి వర్ణించగలగాలి. (ఉదా: వర్షాకాలానికి ప్రకృతిపచ్చగా ఉండటానికి కారణాలు)

**II. ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని ప్రతిస్పందించడం**

- పద్యం, వచనం, గేయం, వచన కవిత, గేయకథ, బుర్రకథ తదితర అంశాలను శైలీభేదంతో అవగాహనతో చదువగలగాలి. వాటి గుర్తించి జట్లలో చర్చించగలగాలి.
- కథలు, కవితలు మొదలగు వాటిని చదివి చరనా శైలిని తెలుసుకోగలగాలి. ఉదా: వర్ణణాత్మకం, ప్రకృతి వర్ణన / చిత్రణ మొదలగునవి.
- అపరిచిత పద్య, గద్య అంశాలు చదివి అర్థంచేసుకొని, ప్రతిస్పందించగలగాలి, ప్రశంసించగలగాలి.
- చదువుతున్న అంశాల్లోని కీలకాంశాలు గుర్తించడం, రాయడం, శీర్షికలు గుర్తించగలగాలి. అభ్యాసాల ద్వారా స్వీయ నిర్ధారణ చేసుకోగలగాలి.
- ప్రాసపదాలు, వాక్యాల ఆధారంగా పద్యపాదాలు, పోల్చిన అంశాలను గుర్తించగలగాలి.
- చదివిన అంశాలను విశ్లేషించడం, పోలికలను గుర్తించి, పట్టికలో నమోదుచేయగలగాలి.

**III. స్వీయరచన**

- పాఠాల నుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు సొంతమాటల్లో రాయగలగాలి.
- తాము అర్థం చేసుకొన్న విషయాలను, తెలిసిన విషయాలను స్పష్టంగా రాయగలగాలి.

- ♦ వివిధ రకాల భాషా పఠన సామగ్రి ఉదా: వార్తాపత్రికలు, లేఖలు, మ్యాగజైన్లు, కథలు, సమాచార వనరులు, అంతర్జాలంలోని విషయాలు మొదలగునవి చదివి అర్థంచేసుకోగలగాలి. మరియు మౌఖికంగా / రాత పూర్వకంగా / బ్రెయిలీ లిపి/ సాంకేతిక భాషలో తన ఇష్టాయిష్టాలను, అభిప్రాయాలను సహేతుకంగా వివరించగలగాలి.
- ♦ తెలుసుకొన్న అంశాన్ని సమర్థిస్తూ/విభేదిస్తూ, కారణాలు వివరిస్తూ సొంత మాటల్లో రాయగలగాలి.
- ♦ ఏదైనా రచనను / విషయాన్ని చదివేటప్పుడు రచయిత యొక్క ఉద్దేశాన్ని అర్థంచేసుకొని, దానికి తన స్వీయ అనుభవాలను అన్వయించుకొని దానితో సమ్మతించడం లేదా వ్యతిరేకించడం చేయగలగాలి.
- ♦ విరామచిహ్నాలను పాటిస్తూ, వాక్యభేదాలను సందర్భోచితంగా ఉపయోగించి, విశ్లేషిస్తూ రాయగలగాలి.
- ♦ భావాలను క్రమపద్ధతిలో, సరైన పదజాలాన్ని ఉపయోగించి, దోషరహితంగా రాయగలగాలి.
- ♦ వివిధ విషయాల గురించి, సమస్యల గురించి ఉదా: జాతి, ధర్మం, వర్ణాలు, లింగం, ఆచార వ్యవహారాలు మొదలగు వాటి గురించి మౌఖికంగా / సాంకేతికంగా సహేతుకంగా వ్యక్తపరచగలగాలి.
- ♦ పాఠశాల పత్రిక, వార్తాపత్రికల కొరకు వివిధ రకాల సామగ్రి సేకరించగలగాలి. సొంతంగా రాయగలగాలి, పరిశీలించుకొని సరిదిద్దుకోగలగాలి.

**IV. సృజనాత్మకత / ప్రశంస**

- ♦ తను చదివిన, అనుభవంలోఉన్న, విన్న, చూసిన అంశాలను వర్ణించి చెప్పగలగాలి. (మౌఖికంగా/ రాతపూర్వకంగా / సాంకేతికపరంగా)
- ♦ కథలు, కవితలు అల్లడం, సంభాషణలు రాయడం, నాటకంలో పాత్రలు పోషించడం, పాటలను, గేయాలను పాడడం, కథలు, గేయాలు పొడిగించడం, వివరించడం చేయగలగాలి.
- ♦ వివిధ విషయాలలో సమస్యలలో ఉదా: జాతి, ధర్మం, వర్ణాలు, లింగం, ఆచారవ్యవహారాలు మొదలగు వాటిలో మౌఖికంగా, రాతపూర్వకంగా, సాంకేతికంగా అర్థంచేసుకొని సహేతుకంగా వ్యక్తపరచగలగాలి.
- ♦ ఇంటర్వ్యూ ప్రశ్నావళి, పోస్టర్ తయారీ, శుభాకాంక్షలు తెలిపే కార్డులు తయారుచేయగలగాలి.
- ♦ అభినందన, కృతజ్ఞత లేఖలను రాయగలగాలి.
- ♦ ఏకపాత్రాభినయం, ఆత్మకథ, స్వీయ అనుభవాలు, స్పష్టంగ, వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- ♦ నినాదాలు, సూక్తులు రాయడం, బొమ్మలు గీయడం, బొమ్మలకు రంగులువేయడం, నాటకీకరణ చేయగలగాలి.
- ♦ ఇతర భాషలు, మతాలు, కళలు, సంస్కృతులను అర్థంచేసుకోవడం, మంచిని గ్రహించడం, గౌరవించడం చేయగలగాలి.
- ♦ తన ప్రాంతంలో ప్రాచుర్యం పొందిన కథలను పాటలను ప్రశంసించగలగాలి. వాటి గురించి చర్చించగలగాలి.
- ♦ బాలికలు, ప్రత్యేకవసరాల పిల్లలు అందరితో సమానమని గుర్తించి వాళ్ళలోని గొప్పతనాన్ని ప్రశంసించగలగాలి.

**V. పదజాల వినియోగం**

- ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం, అవగాహన చేసుకొని, కొత్తపదాలతోపాటు సొంత వాక్యాలలో ఉపయోగించగలగాలి, వాటిని ప్రశంసించగలగాలి.
- వివిధ వృత్తుల (ఉదా: వ్యవసాయం, నృత్యం, సంగీతం, వాస్తుకళ, హస్తకళ) సంబంధించిన పదాలను తెలుసుకొనుటకు ఆసక్తికనబరచగలగాలి. అర్థంచేసుకోవడానికి ప్రయత్నించాలి.
- భావనాచిత్రం, కారణాల పట్టిక, నుడికట్టు, పదవివరణ, ఖాళీలు పూరించగలగాలి.
- నూతన పదాలకు అర్థాలు తెలుసుకొనే క్రమంలో తోటివిద్యార్థుల ఉపాధ్యాయుల లేదా పఠన సామగ్రిని, నిఘంటువును, mindmap అంతర్జాలం మొదలగు వాటిని ఉపయోగించి స్వీయ అధ్యయనం చేయగలగాలి.
- మాండలిక భాషారూపాలను గుర్తించడం, వినియోగించగలగాలి.

**VI. భాషను గూర్చి తెలుసుకుందాం**

- వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. భాషాభాగాలు, విభక్తులు, సంధులు, సమాసాలు, క్రియాభేదాలు, వాక్యభేదాలు స్పష్టంగా గుర్తించడం, దైనందిన జీవితంలో ప్రయోగించగలగాలి.
- వివిధ రకాల ఉద్దేశాల కొరకై రాసేటప్పుడు పదాలను, వాక్యాలను, జాతీయాలను, సామెతలను విరామ చిహ్నాలను ఇతర వ్యాకరణాంశాలను అనగా కాలాలు, క్రియ విశేషణం మొదలగునవి ఉపయోగించగలగాలి.

**పాఠం పేరు :** 1. చదువు **కవి :** కొఱవి గోపరాజు **ప్రక్రియ :** కథాకావ్యం

**ఉద్దేశం :** తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రసిద్ధ ప్రాచీన కవి కొఱవి గోపరాజు. ఆకర్షణీయమైన కథాకావ్యాల్లో సింహాసన ద్వాత్రింశిక ఒకటి. ఈ కావ్యంలో భోజరాజుకు సాలభంజికాలు విక్రమార్క చక్రవర్తి గురించి రోజుకో కథ చెబుతాయి. చదువు యొక్క గొప్పతనాన్ని తెలిపే కథను తొమ్మిదో సాలభంజిక చెబుతుంది. అదే ఈ పాఠం. పిల్లల్లో చదువు పట్ల గౌరవాభిమానాలు పెంపొందింపజేస్తుంది ఈ పాఠం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- సమాజంలో ఇంకా చదువుకోకుండా ఉండిపోయే పిల్లలు ఏం కోల్పోతున్నారో, వాళ్లు చదువుకోవడానికి మనం ఏం చేయాలో ఆలోచించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన భావాలకు తగిన పద్యపాదాలను గుర్తించడం, అపరిచిత పద్యాన్ని చదివి, స్వంతమాటల్లో భావం రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- కమలాకరుని స్వభావం, చదువుకోకపోతే కలిగే కష్టాలను మరియు 'చదువు' పాఠం యొక్క సారాంశాన్ని స్వంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- చదువు ఆవశ్యకతను తెలిపేటట్లుగా కొన్ని నినాదాలు, చదువుకొనేటట్లుగా ప్రేరేపించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలను వివరిస్తూ, పదాలకు అర్థాలు, పర్యాయపదాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన పేరాలో భాషాభాగాలను గుర్తించి పట్టికలో రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 2. నాయనమ్మ **కవి / రచయిత :** -- **ప్రక్రియ :** కథానిక

**ఉద్దేశం :** పిల్లలకి కథలంటే చాలా ఇష్టం. సమాజంలోని వృద్ధులపట్ల పిల్లలు ఎలా నడుచుకోవాలో తెలియజేసే కథే ఈ 'నాయనమ్మ'. పెద్దలు, ముసలి వాళ్లపట్ల గౌరవమూ, ప్రేమ పెంపొందించేలా ఈ కథ తీర్చబడింది. ఈ పాఠం ద్వారా పిల్లల్లో మానసిక పరివర్తన కలిగించడం, ఎక్కడ వృద్ధులు కనిపించినా ఆదరించి, గౌరవించగలిగే స్థితికి పిల్లలు ఎదిగేట్లు చేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పిల్లల స్వభావాన్ని గురించి చెప్పగలగాలి. 'నాయనమ్మ' పాఠం కథను సొంతంగా చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పేరాను చదివి ముఖ్యమైన పదాలు గుర్తించి రాయగలగాలి. వాక్యాల తప్పొప్పులు గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- పిల్లలు తనకున్న మంచి మిత్రుని గురించి, వృద్ధులకు చేసే సేవల గురించి కుటుంబంలో తాత, నాయనమ్మ అందరూ ఎందుకు కలిసి ఉండాలి అనే వాటి గురించి రాయగలగాలి. నేటి కాలంలో ఎక్కువ మంది వృద్ధులు ఎక్కువగా వృద్ధాశ్రమాల్లో ఉండడానికి గల కారణాలను స్వంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- వృద్ధులకు సేవచేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలను పట్టికలో వెదికి రాయగలగాలి. పాఠం చదివి పట్టికలో సూచించిన వాటికి పదాలను వెదికి రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సరైన విభక్తి ప్రత్యయాలతో ఖాళీలను పూరించగలగాలి. క్రియాభేదాలను తెలుసుకొని వాటిని గుర్తించి రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 3. శతకసుధ **కవి :** శతకకవులు **ప్రక్రియ :** శతకపద్యాలు

**ఉద్దేశం :** శతక ప్రక్రియ ద్వారా ఆయా ప్రసిద్ధ కవులు విలువల్ని బోధిస్తూ వెలువరించిన పలు పద్యాల్ని పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం. ఈ పాఠం ద్వారా సుమతీ, దాశరథీ, నరసింహ, వేమన వంటి ప్రసిద్ధ శతకాలతోపాటు నృకేసరి శతకం, నగ్నసత్యాల శతకం, శ్రీనివాస బొమ్మల శతకం, యాదగిరి లక్ష్మీనరసింహశతకం వంటి శతకాల ద్వారా తెలంగాణలోని పలువురు శతకకవులను వెలుగులోకి తేవడం జరిగింది.

పిల్లల్లో నైతిక విలువల్ని, సామాజిక బాధ్యతల్ని పెంపొందింపజేస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేలా దిశానిర్దేశం చేయగలుగుతాయి. ఈ శతర పద్యాలు. నీతుల్ని బోధించే ఈ పద్యాల ధారణ చేయించడం కూడా అవసరం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పద్యాల్లో మంచి అలవాట్ల గురించి కవులు ఏం చెప్పారో, వాటిని అలవర్చుకోవడానికి ఏం చేయాలో, శతక పద్యాలు ఎందుకు నేర్చుకోవాలో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- శతక పద్యాల ఆధారంగా... మన నడవడిక, ప్రవర్తన ఎలా ఉండాలో వివరిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పద్యాల ఆధారంగా నీతిని తెలిపే పలు సూక్తులు తయారుచేసి, ప్రదర్శించగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాల అర్థాలను జతపరచగలగడం, వాక్యాలను చదివి అదే అర్థాన్నిచ్చే పదాల్ని గుర్తించగలగడం, నానార్థాలను గుర్తించడం, పేరాను చదివి ఖాళీలలో తగిన పదాల్ని పూరించడం చేయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- భాషాభాగాలను గుర్తించి పట్టిక పూరించడం, విడదీసిన పదాల్ని కలిపి రాయడం చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 4. అమ్మజ్ఞాపకాలు **కవి :** టి.కృష్ణమూర్తి యాదవ్ **ప్రక్రియ :** కవిత

**ఉద్దేశం :** కరీంనగర్ జిల్లాకు చెందిన ఆధునిక కవి టి.కృష్ణమూర్తి యాదవ్ రాసిన శబ్నం కవితా సంపుటినుండి తీసుకున్న ఈ పాఠం 'అమ్మ' గొప్పతనాన్ని అమ్మ అనురాగాన్ని తెలుపుతుంది. పిల్లలలో అమ్మపట్ల మమకారాన్ని, ఆప్యాయత, అనురాగాన్ని పెంచడం, అమ్మ విలువను తెలుపడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పిల్లలు వాళ్ల అమ్మ గురించి మాట్లాడగలగాలి. అమ్మను సంతోషపెట్టడానికి ఏమేం చేస్తారో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పాఠం చదివి వివిధ అంశాలను కవి ఎట్లా పోల్చాడో తెలుపుతూ పట్టిక రాయగలగాలి. అపరిచిత పేరా చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- కవి రచనా శైలిని, కవి ఉద్దేశాన్ని, అమ్మగొప్పతనాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- అమ్మ చిత్రాన్ని గీయగలగాలి. అమ్మ గురించి చిన్న కవిత రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు అర్థాలు, పర్యాయపదాలు ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన పదాలను విడదీసి కలిపిరాయడం, ఉకార సంధిని గురించి తెలుసుకొని, ఉకారసంధి పదాలను కలిపి, విడదీసి రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 5. పల్లె అందాలు **కవి :** ఆచ్చివేంకటాచార్యులు **ప్రక్రియ :** లఘుకావ్యం

**ఉద్దేశం :** కరీంనగర్ జిల్లాకు చెందిన ఆచ్చివేంకటాచార్యులు ఆధునిక కవిగా వెలుగులోకి వచ్చారు. 'మా ఊరు' అనే లఘు పద్యకావ్యం ద్వారా పల్లెటూళ్ళ సౌభాగ్యాన్ని, శాంతి సౌఖ్యాలను, పచ్చదనాన్ని, ప్రకృతి సొబగులను కండ్లకు కట్టారు.

పట్టణ వలసలకు అలవాటు పడుతున్న నేటి యువతరానికి పల్లెటూరి అందాన్ని తెలుపుతూ, పల్లెలపట్ల మమకారాన్ని పెంచడం దీని ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పాఠంలో వర్ణించిన ఊరుతో పిల్లలు తాము చూసిన ఊరును పోల్చి మాట్లాడగలగాలి. పద్యాలను రాగయుక్తంగా చదివి, భావాలు చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పేరాను చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు, ఇచ్చిన పద్యభావాలకు తగిన పద్యపాదాల్ని పాఠంలో గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- ఊరికి అందాన్నిచ్చే అంశాలను, ప్రస్తుతం అవి ఊళ్లల్లో ఎట్లు ఉన్నాయన్న అభిప్రాయాలను, ఆదర్శగ్రామం ఎట్లా ఉండాలో, ఊరుకు చెరువుకుగల బంధం గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తెలిసిన / చూసిన ఊరును వర్ణిస్తూ రాయగలగాలి. పద్యభావానికి తగిన చిత్రాన్ని గీసి, దానిపై చిన్న కవితను రాయగలగాలి!

**v) పదజాల వినియోగం :**

- గీత గీసిన పదాలకు అదే అర్థాన్నిచ్చే పదాలు, అర్థాలు, పాఠం ఆధారంగా ఇచ్చిన అంశాలకు తగిన కారణాలు రాయగలగాలి. ఇచ్చిన అంశాల ఆధారంగా / భావనాచిత్రాన్ని పూరించగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన పదాలను కలిపి రాసి సంధిపేర్లు గుర్తించడం, ఇత్వసంధి జరిగిన తీరును గుర్తించి ఇచ్చిన పదాలను విడదీయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 6. ప్రేరణ **కవి :** ఎ.పి.జె.అబ్దుల్‌కలాం **ప్రక్రియ :** ఆత్మకథ

**ఉద్దేశం :** కృషి, దీక్ష, పట్టుదలతో అత్యున్నత శిఖరాలు అధిరోహించిన వ్యక్తుల్లో అబ్దుల్‌కలాం ప్రథమగణ్యుడు. భారత రాష్ట్రపతిగా, ఎదిగిన ఆ మహోన్నత శాస్త్రవేత్త జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. బాల్యంలో లక్ష్యం నిర్దేశించుకొని ఆయన ఎదిగిన తీరు నేటి తరానికి ప్రేరణ కావాలని ఆ దిశగా పిల్లలను ప్రోత్సహించడమే ఈ పాఠం ఉద్దేశం – అబ్దుల్ కలాం, అరుణ్ తివారీతో కలిసి రాసిన “ఒక విజేత ఆత్మకథ”లోనిది ఈ పాఠ్యాంశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పాఠం పేరును గురించి, అబ్దుల్‌కలాం బాల్యం నాటి విద్యావిధానం గురించి చర్చించగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇవ్వబడిన వాక్యాలు ఏ పేరాల్లో ఉన్నాయో గుర్తించి పూర్తి వాక్యం రాయగలగాలి. అపరిచిత పేరా చదివి తప్పొప్పులు గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- “ఇతరుల్ని అర్థం చేసుకున్నవాడు జ్ఞాని” అనే వాక్యంపై అభిప్రాయాన్ని, కలాం తన ఆశయసాధనలో ఎలా కృతకృత్యుడయ్యాడో ఆయన విద్యాభ్యాసం ఎలా జరిగిందో సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పిల్లలు, తమలో ఉండే కోరికల్ని చిన్న చిన్న కవితల రూపంలో రాయగలగాలి. అబ్దుల్ కలాం ఏకపాత్రాభినయం చేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ♦ పదాలకు అర్థాలు రాయడం, శాస్త్ర సంబంధ పదాలతో పట్టిక రాయడం, ఇచ్చిన వాక్యాల్లోని సమానార్థక పదాలను గుర్తించి రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ♦ ఇచ్చిన సంధి పదాలను విడదీయడం, సంధులను గుర్తించడం, వాక్యాల్లోని గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తికి చెందినవో గుర్తించి రాయడం చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 7. శిల్పి **కవి :** గుఱ్ఱం జాషువా **ప్రక్రియ :** ఖండకావ్యం

**ఉద్దేశం :** నిర్జీవమైన బండరాళ్ళకు జీవం పోసేవాడు శిల్పి. అట్లాంటి శిల్పి యొక్క కళానైపుణ్యాన్ని తెలియచేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ♦ "శిల్పి శాశ్వతుడనీ, ఆయన ప్రజ్ఞకు నమస్కారం చేయమని కవి చెప్పిన వాక్యంపై" తన అభిప్రాయాన్ని కళలు మరియు కళాకారుల గొప్పతనాన్ని గురించి చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ♦ ఇచ్చిన పద్యపాదాలు ఏ పద్యాల్లో ఉన్నాయి? వాటి సందర్భమేమిటి? కవికి – శిల్పికి మధ్యగల పోలికలను గురించి చెప్పిన పద్యాలు గుర్తించాలి. అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- ♦ తెలంగాణ రాష్ట్రంలో శిల్ప కళా సంపదలను గురించి, శిల్పి గొప్పతనాన్ని గురించి వివరిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- ♦ శిల్పి ఆత్మకథను రాసి ఏకపాత్రాభినయంగా ప్రదర్శించగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ♦ గీతగీసిన పదాలకు అర్థాలు తెలుసుకొని వాటితో వాక్యాలు రాయగలగాలి. ప్రకృతి వికృతులను గుర్తించగలగాలి. ఇచ్చిన ఆధారాలతో గడులు నింపగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ♦ ఇచ్చిన ఉదాహరణల ద్వారా సంధి జరిగిన విధానాన్ని తెలుసుకొని, సంధిని సూత్రీకరించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 8. గ్రామాల్లోని వేడుకలు – క్రీడా వినోదాలు

**కవి:** దేవులపల్లి రామానుజరావు **ప్రక్రియ :** రేడియో ప్రసంగం

**ఉద్దేశం :** సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాల్లో పాల్గొంటూ, తెలంగాణ సంస్కృతిని తన రచనలో ప్రతిబింబింపజేసిన రచయిత దేవులపల్లి రామానుజరావు. వీరు రేడియోలో చేసిన ప్రసంగమే ఈ పాఠం. రేడియో ప్రసంగశైలిని అర్థం చేసుకోవడం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందక ముందు గ్రామాలలో ప్రజలు వారు నిర్వహించే వినోదాలు, వేడుకల్లో ఎలాంటి ఆనందాన్ని పొందేవారో, ఎటువంటి ఆటలు ఆడేవారో తెలుసుకోవడం. ఆనాటి సంస్కృతిని గౌరవించడం ఈ పాఠం యొక్క ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- గ్రామాల్లో నాటి కళలు, క్రీడలు నేడు కనిపించకపోవడానికి కారణాలను, అవి ప్రజలను సమైక్యంగా ఎట్లా ఉంచుతాయో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన విషయం పాఠంలో ఏ పేరాలో ఉన్నదో గుర్తించి, దానికి సంబంధించిన ముఖ్యాంశాలు పట్టికలో రాయడం, అపరిచిత పేరా చదివి ప్రశ్నలు తయారుచేయడం చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- క్రీడలు, వినోదాలు మానవజీవితానికి ఎందుకు అవసరమనే దానిపై అభిప్రాయాన్ని, ఆటలకు, పాటలకు విడదీయరాని చుట్టరికమున్నదన్న రచయిత మాటలను సమర్థిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- తెలిసిన పద్యాలను బతుకమ్మ పాటగా మార్చి రాయగలగాలి.
- గ్రామీణ కళాకారులను ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- పదాలకు అర్థాలు రాయడం, ఇచ్చిన వాక్యాల్లో సమానార్థక పదాలు గుర్తించడం. ప్రకృతి వికృతులు గుర్తించి రాయడం చేయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఆశ్చర్యార్థక, విధ్యర్థక, ప్రశ్నార్థక వాక్యాల గురించి తెలుసుకొని, వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 9. ఏ కులం **కవి :** చెరబండరాజు **ప్రక్రియ :** గేయం

**ఉద్దేశం :** తెలుగు కవిత్వంలో పదునైన వ్యక్తీకరణకు మొక్కవోని దీక్షకు, ధిక్కార స్వరానికి ప్రతినిధి, ప్రతీక చెరబండరాజు. దిగంబర కవిగా ప్రసిద్ధుడు. కుల వృత్తులు వారి సేవలు గుర్తించడం వారికి గౌరవభావాన్ని పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- "ఏ కుల మబ్బీ" పాట ఉద్దేశాన్ని గురించి, శ్రామికుల జీవితాన్ని గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత పేరా చదివి పట్టికను, పాఠంలోని ప్రాసపదాలను రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- 'చెమటోడ్చే మనుషులు చేయికలిపి నిలబడితే' అనడంలో కవి ఉద్దేశాన్ని, శ్రమచేసే వారికి తగిన గౌరవం ఉందా? దానిపై అభిప్రాయాన్ని "సమాజంలో మనుషులంతా ఒక్కటే" అనే విషయాన్ని సమర్థిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- గేయాన్ని అభినయించి చూపగలగాలి. వివిధ పనులు చేసేవారి ప్రాధాన్యత తెలిపే చిన్నకవిత, గేయం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు అర్థాలు, ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. వాక్యాల్లో ప్రకృతి, వికృతులను గుర్తించగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన సంధి పదాలను విడదీయడం, సంధి పేరు రాయడం, సరైన ప్రత్యయాలతో ఖాళీలు పూరించడం చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 10. సీత ఇష్టాలు **కవి :** -- **ప్రక్రియ :** బుర్రకథ

**ఉద్దేశం :** ఆడపిల్లల చదువు అవనికే వెలుగు. వారి పట్ల వివక్షత చూపకుండా ప్రోత్సహిస్తే, అన్ని రంగాలలో రాణిస్తారు, అని చెప్పటం. బుర్రకథ వంటి కళారూపాలను పిల్లలకు పరిచయం చేయడం కళారూపాల ప్రయోజనాన్ని తెలియజేయడం ఈ పాఠం యొక్క ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ఆడవాళ్ళు కూడా గొప్పవాళ్ళే అనడానికిగల కారణాలు గురించి, తన ఉపాధ్యాయుల గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- 'కొత్త వింత - పాత రోత' అనే అర్థాన్నిచ్చే వాక్యాలు పాఠంలో గుర్తించడం, పాఠంలో నవ్వుపుట్టించిన అంశాలు, రాయడం, అపరిచిత పేరా ఆధారంగా పట్టిక పూరించడం చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- బుర్రకథ ప్రదర్శన విధానం గురించి, ఆడపిల్లల పరిస్థితులను గురించి, 'సీత ఇష్టాలు' కథను, సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలని తెలిపే నినాదాలు రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- వాక్యంలోని విషయం ఆధారంగా సరైన పదాలను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సమాపక, అసమాపక క్రియలను ఉపయోగించి వాక్యాలు రాయగలగాలి. ఇచ్చిన వాక్యాల్లో ఆశ్చర్యార్థక, ప్రశ్నార్థక, విధ్యర్థక వాక్యాలను గుర్తించి, తగిన విరామచిహ్నాలను ఉంచగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 11. శ్రీలు పొంగిన జీవగడ్డ **కవి :** రాయప్రోలు సుబ్బారావు **ప్రక్రియ :** దేశభక్తి గేయం

**ఉద్దేశం :** 'ఏదేశమేగినా ఎందుకాలిడినా' గేయాన్ని వినగానే గుర్తుకు వచ్చే కవి రాయప్రోలు సుబ్బారావు. వీరి కవిత్వంలో తెలుగుదనం, దేశభక్తి కనిపిస్తుంది. దేశభక్తిని, భారతదేశ గొప్పతనాన్ని తెలియజెప్పటమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- గేయాన్ని రాగయుక్తంగా పాడగలగాలి. దేశభక్తి అంశాలను, గేయ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- భారతదేశం అని తెలిపే పదాలు, భావానికి సరిపోయే వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించి రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- భారతదేశ గొప్పదనం ఎందుకు తెలుసుకోవాలో, మరియు పాఠం ఆధారంగా భారతదేశ వైభవం గురించి రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- గేయాన్ని భారతమాత ఆత్మకథగా తాను పుట్టిన ఊరిని గురించి పొగుడుతూ గేయం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీత గీసిన పదాలకు అర్థాలు సమానార్థక పదాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సందేహార్థక, అనుమత్యర్థక, నిషేధార్థక వాక్యాలను గురించి తెలుసుకొని వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 12. రాణి శంకరమ్మ **కవి :** -- **ప్రక్రియ :** గేయకథ

**ఉద్దేశం :** తెలంగాణ ప్రాంతంలో వీరనారీమణులకు కొదువలేదు. వీరనారీమణులలో ఒక ప్రత్యేకతను సాధించిన రాణి శంకరమ్మ ధైర్య సాహసాలను తెలుసుకోవడం. స్త్రీలకు అవకాశమిస్తే ఏ రంగంలోనైన తమ ఘనత చాటిచెప్పగలరని చెప్పటం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ♦ రాణి శంకరమ్మ కథలో నచ్చిన, ఆశ్చర్యం కలిగించిన సంఘటనలను గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ♦ రాణి శంకరమ్మ పరాక్రమాన్ని తెలిపే పదాలు పాఠంలో గుర్తించగలగాలి. అపరిచిత పేరా ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించగలగాలి.

**iii) స్వీయరచన :**

- ♦ రాణి శంకరమ్మ పరాక్రమాన్ని గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- ♦ రాణి శంకరమ్మ చరిత్రను ఏకపాత్రాభినయం చేయడానికి వీలుగా తగిన అంశాలతో రచన చేయాలి. ప్రదర్శించగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ♦ గీతగీసిన పదాలకు అర్థాలు, వాటితో సొంతవాక్యాలు రాయగలగాలి. ఇచ్చిన పదాలను వివరించగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ♦ ఇచ్చిన ఉదాహరణల ద్వారా ద్విగు సమాసాన్ని గురించి తెలుసుకొని, ద్విగు సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాయగలగాలి.

❀ ❀ ❀

## 8వ తరగతి

**ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు**

**I. విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం**

- ♦ పద్యాలు, గేయాలు, వచన కవిత ... మొదలైన వాటిని విని అర్థం చేసుకోవాలి. మాట్లాడగలగాలి.
- ♦ పద్యాలను, గేయాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడగలగాలి.

- ఏదైనా ఒక విషయాన్ని సమర్థిస్తూ, తగిన కారణాలతో వివరించగలగాలి, అభిప్రాయం చెప్పగలగాలి.
- పద్య తాత్పర్యాలను గేయ సారాంశాలను సొంతమాటలలో చెప్పాలి. కథను సొంతమాటలలో చెప్పాలి.
- ఇచ్చిన అంశాన్ని గురించి మాట్లాడగలగాలి, చర్చించగలగాలి.
- స్థానిక కథలను, పాటలను విని వాటి గురించి చెప్పగలగాలి.
- వివిధ కార్యక్రమంలో అనగా – జాతి, ధర్మ, వర్ణ, లింగ, ఆచార వ్యవహారాలపై మిత్రులను, ఉపాధ్యాయులను, కుటుంబ సభ్యులను ప్రశ్నించగలగాలి. ఉదా: తమ వీధిలో జరిపే సామూహిక పండుగల గురించి బస్తీ వాసులతో మాట్లాగలగాలి.

## II. ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని ప్రతిస్పందించడం

- పద్యాలను, గేయాలను, గద్యభాగాలను ధారాళంగా చదువగలగాలి సంబంధించిన ఆధార పుస్తకాలను చదివి జట్లలో చర్చించగలగాలి, ప్రశ్నించగలగాలి.
- పరిచిత / అపరిచితాంశాన్ని అర్థం చేసుకొని పట్టికలు రాయడం, శీర్షికలు పెట్టడం, ప్రశ్నలు రాయడం, ఖాళీలను పూరించడం, తప్పొప్పులు గుర్తించడం, సరైన సమాధానాలు గుర్తించడం, ఆయా సందర్భాలను గుర్తించడం, పోలికలను రాయడం మొదలైనవి చేయగలగాలి.
- భాషకు సంబంధించిన వివిధ రకాల పఠన సామగ్రి ఉదా: వార్తాపత్రికలు, లేఖలు, మ్యాగజైన్లు, కథలు, విషయానికి సంబంధించిన ఇతర సామగ్రి (అంతర్జాలం) మొదలగు వాటిలోని విషయాలను చదివి అర్థం చేసుకోగలగాలి. మరియు మౌఖికంగా, రాతపూర్వకంగా, సాంకేతిక పరిభాషలో తన ఇష్టాయిష్టాలను, అభిప్రాయాలను, వ్యాఖ్యానాలను, నిష్కర్షగా వ్యక్తీకరించగలగాలి. ప్రశ్నించగలగాలి. సూక్ష్మంశాలను పరిశీలించగలగాలి. విషయాన్ని విశ్లేషించగలగాలి. విశేషాంశాలు గుర్తించగలగాలి.
- అపరిచిత విషయాలు / సంఘటనలు గురించి చదువుతున్నప్పుడు ఆ సన్నివేశాన్ని దృశీకరించుకోవాలి. (ఊహించుకోవాలి / ). వాటిపై తనలో ఏర్పడిన భావాలను, ఆలోచనలను మౌఖికంగా / రాతపూర్వకంగా సాంకేతికపరంగా వ్యక్తపరచగలగాలి.
- వివిధ రకాలు రచనలు చదివి వాటిలోని సామాజిక విలువలపై చర్చించగలగాలి. వాటికి కారణాలు అన్వేషించగలగాలి. ఇరుగు పొరుగువారి జీవన విధానంపై ప్రశ్నించగలగాలి. ఉదా: పక్కింటి రామన్న కూతురు ఈ రోజు బడికి ఎందుకు వెళ్ళలేదు? అని ప్రశ్నించాలి.

## III. స్వీయరచన

- గేయ / పాఠం సారాంశాలను సొంతమాటలలో రాయగలగాలి.
- విషయాన్ని విశ్లేషిస్తూ, ఊహిస్తూ, సమర్థిస్తూ, వివరిస్తూ, తగిన కారణాలతో రాయగలగాలి.
- అనుభూతులను, అనుభవాలు, అభిప్రాయాలను సొంతమాటలలో రాయగలగాలి.

- తన రచన యొక్క ఉద్దేశ్యాన్ని, తన రచనను చదివే పాఠకులను దృష్టిలో ఉంచుకొని తాను చెప్పదలచుకొన్న అంశాన్ని ప్రభావవంతంగా రాతపూర్వకంగా వ్యక్తపరచగలగాలి.
- వివిధ సందర్భాలలో ఇతరులు వ్యక్తపరిచిన విషయాలను సొంతంగా రాయగలగాలి. ఉదా: పాఠశాలలో జరిగిన కార్యక్రమాలపై నివేదిక రాయడం మరియు తమ గ్రామంలోని రైతులతో/వృత్తి పనివారితో/చిన్న చిన్న దుకాణదారులతో మాట్లాడిన విషయాలను తన సొంతభాషలో తనదైన శైలిలో రాయగలగాలి.

## IV. సృజనాత్మకత / ప్రశంస

- పాఠ్యాంశాలను వివిధ సాహితీ ప్రక్రియలలోనికి అంటే వ్యాసం, లేఖ, సంభాషణ, నినాదాలు, ప్రకటన, ఏకపాత్రాభినయం, ఆత్మకథ, ఇంటర్వ్యూ, కవిత, గేయం, పోస్టర్, కథ మొదలైన రూపాలలోనికి మార్చగలగాలి.
- వివిధ వృత్తుల వారిని, సంస్థలను, సాహితీవేత్తలను, వారి రచనలను, ప్రముఖ వ్యక్తులను వారిసేవలను కవి/ రచయితల శైలిని, భావాలను, దానం చేసిన వారిని జీవకారుణ్యం కలవారిని ప్రశంసించగలగాలి.
- రచయితల శైలిని ప్రశంసించగలగాలి. తన స్థాయిని అనుసరించి మౌఖికంగా / రాతపూర్వకంగా / సాంకేతిక పరంగా / బ్రెయిలీ లిపిలో వ్యక్తపరచగలగాలి. ఉదా: వర్ణణాత్మకం, భావాత్మకం, ప్రకృతి వర్ణన / చిత్రణ మొదలగునవి.
- నిజజీవితంలో తనకు ఎదురుపడే సంఘటనల గురించి, తన అనుభవాలను తనదైన శైలిలో వివిధ రకాల ప్రక్రియలలో సృజనాత్మకంగా రాయగలగాలి. సామాజిక మాధ్యమాల్లో, వార్తాపత్రికల్లో, సంపాదకునికి మొదలగునవి రాయగలగాలి.
- వివిధ కళలు, వృత్తులు ఉదా: హస్తకళ, వాస్తుకళ, నాటకాలు, వ్యవసాయం, నృత్యం, సంగీతం మొదలగు వాటిలో వ్యక్తమయ్యే భాష, పదజాలాన్ని సృజనాత్మకంగా రాయగలగాలి. కళాప్రదర్శనలు చూసి భాషలో కళాభిరుచిని ఏర్పరచుకోగలగాలి. హావభావాలను రసానుభూతిని పొందగలగాలి.

## V. పదజాల వినియోగం

- వివిధ సందర్భాలకనుగుణంగా భాషలోని పదాలను, జాతీయాలను సామెతలను ఉపయోగించగలగాలి.
- పర్యాయ పదాలు, నానార్థాలు, ప్రకృతి - వికృతులు, వ్యుత్పత్త్యర్థాలు తెలుసుకొని ప్రయోగించగలగాలి.
- నిఘంటువును అంతర్జాలాన్ని ఉపయోగించగలగాలి, పదజాలాన్ని సందర్భోచితంగా వినియోగించగలగాలి.

## VI. భాషను గూర్చి తెలుసుకుందాం

- సంధులు, సమాసాలు గుర్తించాలి. సంధి సూత్రాలను సొంతమాటలలో రాయగలగాలి.
- వాక్యభేదాలను గుర్తించి సందర్భోచితంగా వాక్యప్రయోగం చేయగలగాలి.
- అలంకారాలు, ఛందస్సుపై అవగాహన పెంచుకొని గుర్తించగలగాలి. లక్షణాలను సమన్వయం చేస్తూ, అర్థవంతంగా సొంతమాటలలో వివరించగలగాలి.

**పాఠం పేరు :** 1. త్యాగనిరతి **కవి పేరు :** నన్నయ **ప్రక్రియ :** ఇతిహాసం (పద్యం)

**ఉద్దేశం :** ఇతరుల కోసం, సమాజం కోసం త్యాగం చేయటంలో ఉండే గొప్పతనాన్ని విద్యార్థుల్లో త్యాగ గుణాన్ని పెంపొందించటం పాఠం యొక్క ముఖ్యఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- త్యాగం చేయటంలోని గొప్పతనం గురించి మరియు ఇతరులకోసం, సమాజం కోసం త్యాగం చేసిన వారి గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన భావాల ఆధారంగా పాఠంలోని పద్యపాదాలను గుర్తించడం, అపరిచిత పద్యాన్ని చదివి సరియైన సమాధానాన్ని గుర్తించడం, చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- త్యాగం చేయడంలో ఉన్న గొప్పతనాన్ని అనుభూతిని సొంతమాటల్లో వివరిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- అవయవదానంపై ప్రజలకు చైతన్యం కల్గించమని వార్తా పత్రికలకు లేఖ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు అర్థాలను, నానార్థాలను గుర్తించి రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన భావార్థక వాక్యాలు చదివి వాటికి సరిపోయే వాక్యాలతో జతపరుచగలగాలి. ఇచ్చిన పదాలను విడదీసి సంధిపేరు రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 2. సముద్రప్రయాణం **కవి పేరు :** ముద్దురామకృష్ణయ్య **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఉన్నత చదువులకోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సముద్రప్రయాణం చేసి, విదేశాలకు వెళ్ళి విజయవంతంగా చదువు ముగించుకొని వచ్చిన కరీంనగర్ జిల్లా వాసి ముద్దురామకృష్ణయ్య. మాతృదేశ సేవకంకితమై ప్రధానోపాధ్యాయులుగా జిల్లా విద్యాధికారిగా సేవలందించిన స్ఫూర్తిదాత. కార్యసాధకులు. అనుకున్న లక్ష్యాన్ని సాధించటానికి ఎన్ని ఇబ్బందులెదురైనా సంకల్పబలంతో విజయాన్ని సాధించగలరని తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ఏదైనా సాధించాలంటే పట్టుదల దృఢసంకల్పం అవసరమని సమర్థిస్తూ మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన వాక్యాలు ఏ పేరాలో ఉన్నవో గుర్తించి, ఆ పేరాకు శీర్షికను, అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- ముద్దు రామకృష్ణయ్య సముద్రప్రయాణం ఆధారంగా అనుకున్నది సాధించడంలో కలిగే తృప్తి అనంతమైందని వివరించగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- అనుకున్నది సాధించాలని మిత్రునికి లేఖ మరియు తాను చేసిన ఒక ప్రయాణ అనుభవాన్ని గురించి వ్యాసం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీత గీసిన పదాలకు అర్థాలు, జాతీయాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ద్విగు, ద్వంద్వ సమాసాలను, సవర్ణ, ఉత్వ సంధులను గుర్తించగలగాలి. అత్వసంధి గురించి తెలుసుకొని అభ్యాసం చేయగలగాలి. పాఠంలో ఆ సంధి పదాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 3. బండారిబసవన్న **కవి :** పాల్కురికి సోమనాథుడు **ప్రక్రియ :** ద్విపద

**ఉద్దేశం :** మంచి ఉద్దేశంతో చేసే పనులు మనిషిని సచ్ఛీలుడుగా నిలబెడతాయి. భక్తులు అనేవారు మంచి లక్షణాలు కలిగి ఉంటారు. అటువంటి వారినే భగవంతుడు మెచ్చుకుంటాడు. భక్తులకుండే ఔదార్యబుద్ధి, భక్తితత్వం తెలియజేయటమే బండారి బసవన్న పాఠం ఉద్దేశం.

తెలంగాణలో తొలి తెలుగు కవిగా ప్రసిద్ధిపొందిన పాల్కురికి సోమనాథుడు ద్విపద చంధస్సులో రాసిన 'బసవ పురాణం' లోనిది ఈ పాఠం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ద్విపదను రాగయుక్తంగా పాడగలగాలి, "అచంచలభక్తి పారవశ్యం కల్గిన వాళ్ళు ధనాశకు లోనుకారు" అను మాటలపై అభిప్రాయాన్ని చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన భావాలనుబట్టి పాఠంలోని పాదాలను గుర్తించి, వీటిని ఎవరు ఎవరితో అన్నారో చెప్పగలగాలి. అపరిచిత పద్యం కింద ఇచ్చిన ఖాళీలను పూరించగలగాలి.

**iii) స్వీయరచన :**

- భక్తునికి ఉండవలసిన లక్షణాలను గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- ద్విపదను సంభాషణ రూపంలోనికి మార్చి రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు అర్థాలను రాయగలగాలి, ప్రకృతి వికృతులను జతపరచగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సవర్ణదీర్ఘ, అత్వ, ఇత్వ, ఉత్వ సంధి పదాలను కొన్నింటిని కలిపి రాయడం. కొన్ని పదాలను విడదీసిరాయడం, సంధుల పేర్లను రాయడం చేయగలగాలి. గుణసంధిని ఉదాహరణ పూర్వకంగా తెలుసుకుని అభ్యాసం చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 4. అసామాన్యులు **కవి :** -- **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** వివిధ వృత్తుల వారి పట్ల గౌరవాన్ని, శ్రమ విలువలను నిర్వహించటం. అన్ని వృత్తుల సమిష్టి జీవనమే సమాజం అనే భావనను కల్గించటమే పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- ఏ వృత్తి అయినా దేనికదే గొప్పదని సమర్థిస్తూ మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- అపరిచిత గద్యాన్ని చదివి అడిగిన విధంగా పట్టిక పూరించగలగాలి. పాఠం ఆధారంగా వృత్తులు, పనిముట్లు, తయారుచేసేవస్తువుల వివరాలను పట్టికలో రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- శ్రమతోనే అభివృద్ధి సాధ్యమని తగిన కారణాలతో వివరిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- వృత్తి పనులవారి వివరాలను సేకరించడానికి ప్రశ్నావళిని తయారుచేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, ప్రకృతి వికృతులను, పర్యాయపదాలను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- వాక్యాల్లోని క్రియా భేదాలను గుర్తించి రాయగలగాలి. సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించి ఉదాహరణ పూర్వకంగా తెలుసుకుని అభ్యాసం చేసి, వాక్యాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 5. శతకసుధ **కవులు :** కవులు **ప్రక్రియ :** శతకం

**ఉద్దేశం :** విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించి, ఉత్తమ పౌరులుగా తయారుచేయటమే పాఠం ఉద్దేశం.

తెలంగాణలో ఇంతవరకు వెలుగుచూడని శతక కవులు 1. పోతన, 2. శ్రీపతి భాస్కరకవి, 3. మారద వెంకయ్య, 4. కంచర్లగోపన్న, 5. కాకుత్థ్సం శేషప్పకవి, 6. పండిత రామసింహకవి, 7. ఆసూరి మరిగంటి పురుషోత్తమాచార్యులు, 8. వేంకటరావుపంతులు మొదలైన కవుల పద్యాలను ఇందులో చేర్చటం జరిగింది.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా పాడగలగాలి. సమాజాన్ని అర్థం చేసుకోవటంలో శతక పద్యాలు తోడ్పడుతాయని వివరించగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పాఠంలోని పద్యాల ఆధారంగా ఇచ్చిన పదాలను వేటితో పోల్చారో రాయగలగాలి. అపరిచిత పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- శతక కవులు సమాజపోకడలను తెలిపే పద్యాలను ఎందుకురాసి ఉంటారో తగిన కారణాలను రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పాఠశాలలో నిర్వహించే పద్యాల పోటీకి ప్రకటనను తయారుచేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- వాక్యాలలోని సమానార్థక పదాలను గుర్తించగలగాలి. గీతగీసిన పదాలకు అర్థాలు మరియు ప్రకృతి వికృతులను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- సవర్ణ, గుణ, అత్వ, ఇత్వ, ఉత్వసంధి పదాలను విడదీసి సంధులపేర్లు, విగ్రహవాక్యాలకు సమాసపదాలు, సమాసాల పేర్లను, చంధస్సులోని గురులఘువులను తెలుసుకొని గణవిభజన చేయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 6. తెలుగు జానపద గేయాలు **కవి :** ఆచార్య బిరుదురాజు రామరాజు **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** తెలుగు జానపదగేయాలలోని వైవిధ్యాన్ని, రకాలను గుర్తించి విద్యార్థులకు తెలియజేయటమే పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- జానపదగేయాలే తెలుగువారి సంస్కృతికి ఉత్తమ దర్పణమని చర్చించగలగాలి. తెలిసిన జానపదగేయాలను పాడగలగాలి. వాటి గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన అంశాలు పేరాల సంఖ్య, వాటికి సంబంధించిన కీలక విషయాలను పట్టికలో రాయగలగాలి. అపరిచిత గద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- మన సంస్కృతిని / జానపదగేయాలు ఎట్లా ప్రతిబింబింప చేస్తాయో వివరించగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- జానపద కళారూపాల ప్రదర్శనకు సంబంధించిన "ఆహ్వాన పత్రిక"ను తయారుచేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు పర్యాయపదాలను, ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా, సంయుక్త వాక్యాలుగా మార్చి రాయగలగాలి. తత్పురుష సమాసం గురించి తెలుసుకొని ఇచ్చిన పదాలకు విగ్రహవాక్యాలు, అది ఏ తత్పురుష సమాసాలో రాయగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 7. మంజీర **కవి :** డా॥ వేముగంటి నరసింహాచార్యులు

**ప్రక్రియ :** గేయం

**ఉద్దేశం :** ప్రజల జీవనానికి, పర్యావరణానికి నదులు ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుపుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రవహించేనదుల్లో మంజీర నది ప్రాముఖ్యతను తెలియజేయటమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- నదుల్లో నీరు కనుమరుగయ్యే పరిస్థితి రావటానికి గల కారణాలను వివరించగలగాలి. గేయాన్ని రాగయుక్తంగా పాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన భావాల ఆధారంగా గేయంలోని పాదాలను గుర్తించగలగాలి. అపరిచిత గేయ పంక్తులు చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- మంజీర గేయ సారాంశాన్ని సొంతంగా రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- విద్యార్థులు తాము చూసిన వాగు / చెరువు / నదిని వర్ణిస్తూ కవిత / గేయాన్ని రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలకు సమానార్థక పదాలను పట్టికలో గుర్తించగలగాలి. గీతగీసిన పదాలకు అర్థాలను, ప్రకృతి పదాలను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- తత్పురుష సమాసాల పట్టికను పూరించగలగాలి. శబ్దాలంకారాల్లోని వృత్యానుప్రాసాలంకారం గురించి తెలుసుకొని, వాటి ఉదాహరణలను పాఠాలలో వెతికి రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 8. చిన్నప్పుడే **కవి :** వట్టికోట ఆళ్వారు స్వామి **ప్రక్రియ :** కథానిక

**ఉద్దేశం :** నిజాం రాష్ట్రంలో ఆనాడు జరిగిన పెత్తందార్ల పీడనకు, దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. ఆ ఉద్యమంలో కార్యకర్తలు ప్రజలను ఏ విధంగా చైతన్యపరిచారో తెలుపటం ఈ పాఠం ఉద్దేశం. ఆనాటి తెలంగాణ గ్రామాల్లోని పరిస్థితులను గురించి కళ్లకు కట్టినట్లుగా ఈ కథానిక వివరిస్తుంది.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- స్వాతంత్ర్యానికి ముందు గ్రామాల్లో పరిస్థితులు ఎట్లా ఉండేవో ఈ కథానిక ఆధారంగా ఊహించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన సందర్భ వాక్యాలను గూర్చి చర్చించగలగాలి. అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- కథ ఆధారంగా తెలుసుకున్న ఆనాటి పరిస్థితులు నేటి సమాజంలో ఉన్నాయా? లేదో కారణాలతో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- విద్యార్థులు పాఠం ఆధారంగా తమ అనుభవాలతో చిన్న కథను రాయగలగాలి. గ్రామం బాగుకోసం పాటుపడుతున్నవారి సేవలను ప్రశంసిస్తూ 'అభినందన' పత్రం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- గీతగీసిన పదాలకు అర్థాలను, పర్యాయపదాలను, ప్రకృతి పదాలను రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- తత్పురుష సమాసాల పట్టికలు పూరించగలగాలి. ఆమ్రేడిత సంధిని గురించి తెలుసుకొని, సంధి పదాలుకలిపి రాసి, సంధి జరిగిన విధానాన్ని చెప్పగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 9. అమరులు **కవి :** ఆచార్య కె.రుక్నుద్దీన్ **ప్రక్రియ :** వచనకవిత

**ఉద్దేశం :** సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా కవిగా తన ప్రత్యేకతను చాటుకున్న కవి రుక్నుద్దీన్. వీరు 'అమరులు' అను శీర్షికతో 1969 ఉద్యమాన్ని, వీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి నివాళులు అర్పించారు. వీరుల త్యాగాలను స్మరించుకోవటమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాల గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించి, వాటి సందర్భాన్ని గురించి, పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- "తెలంగాణ గర్భమ్మున గలిగిన శ్రీరుద్రులారా!" అని కవి ఎందుకన్నాడో, అమరవీరులపట్ల మనం ఎలాంటి గౌరవాన్ని చూపాలో, కవి ప్రతిజ్ఞను ఎలా అర్థం చేసుకున్నారో, కవి నాడు చేసిన ప్రతిజ్ఞ నేడు ఎందుకు సాకారమైనదో వివరిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాన్ని గురించి కవిత లేదా గేయం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలకు పర్యాయపదాలు, గీత గీసిన పదాలకు నానార్థాలు, ఇచ్చిన పదాలలో ప్రకృతి వికృతులను గుర్తించి, రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఉపమాలంకారాన్ని అవగాహనలో వివరించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 10. సింగరేణి **కవి పేరు :** -- **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** ఏదేశమైన, సహజసంపదలను సమర్థంగా వినియోగించగలుగుతుందో, ఆ దేశం ప్రగతిని సాధిస్తుంది. సహజ సంపదలలో నల్లబంగారంగా ప్రసిద్ధికెక్కిన బొగ్గు ద్వారా దేశ ప్రగతికి ప్రామాణికంగా నిలిచిన సింగరేణి బొగ్గుగనులను గురించి తెలియజెప్పటమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- సింగరేణి కార్మికుల కాయకష్టం గురించి, వారి జీవితం గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- గేయాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు, రాయడం, పేరా చదివి ప్రశ్నలు తయారుచేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- సింగరేణి కార్మికులతో ప్రత్యేక సంబంధం మనకు లేకపోవచ్చు. కానీ పరోక్ష సంబంధం ఉన్నది. ఎట్లాగో వివరించగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- సింగరేణి కార్మికులు గనిలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలుపుతూ పోస్టర్ తయారు చేయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- జాతీయాలను ఉపయోగించి సొంతవాక్యాలు, ఇచ్చిన పదాలకు సరిపోయే పర్యాయపదాలు, రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఉత్ప్రేక్ష అలంకారాన్ని అవగాహనతో వివరించగలగాలి. ఉదాహరణలలో వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 11. కాపుబిడ్డ **కవి :** గంగుల శాయిరెడ్డి **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** పోతన వలె హలం, కలంతో రాణించిన కవి గంగుల శాయిరెడ్డి. వీరికి రైతు కష్టాలు, శ్రమ తెలుసు. రైతు పంట పండించి, తానే తిండిదొరకని స్థితిలో ఉంటాడు. దేశానికి వెన్నెముకైన రైతు శ్రమ తెలుసుకోవడం, రైతును గౌరవించటం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- రైతు పరిస్థితిని గురించి, జీవన విధానాన్ని గురించి మాట్లాడగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పదాలను చదివి ఖాళీలు పూరించడం, ప్రశ్నలకు సరైన జవాబు గుర్తించడం చేయగలగాలి.

**iii) స్వీయరచన :**

- "రైతు సంతోషంగా ఉంటే సమాజం బాగుంటుంది" దీనిని సమర్థిస్తూ రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పాఠం ఆధారంగా రైతు ఆత్మకథను, అభినందన పత్రం రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- పదాలతో సొంతవాక్యాలు, ప్రకృతి - వికృతులు గుర్తించడం, వాక్యాలలో సమానార్థక పదాలు గుర్తించి రాయడం చేయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఉత్పలమాల, చంపకమాల పద్య లక్షణాలు తెలుసుకొని, గణవిభజన ద్వారా ఆ పద్యాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 12. మాట్లాడేనాగలి **రచయిత :** మూలం : పొన్‌కున్నం వర్కెయ్ **ప్రక్రియ :** అనువాదకథ
అనువాదం : ఎన్.వేణుగోపాల్‌రావు

**ఉద్దేశం :** మలయాళంలో పొన్‌కున్నం వర్కెయ్ అనే అభ్యుదయ రచయిత రాసిన కథను తెలుగులోకి వేణుగోపాలరావు అనువాదం చేశారు. మూగ జీవాలైనా పెంపుడు జంతువులు హృద్యంగా స్పందిస్తాయని, మనుషులతో పోలిస్తే మరింత ప్రేమాప్యాయతలు కురిపిస్తాయని ఈ కథ తెలియజేస్తుంది. సర్వ ప్రాణులపట్ల ప్రేమను, జీవకారుణ్యాన్ని పెంపొందింపచేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- కథను సొంతమాటల్లో చెప్పగలగాలి. మాట్లాడేనాగలి అనే శీర్షిక కథకు సరిపడిందో లేదో చర్చించగలగాలి.

**ii) ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- ఇచ్చిన వాక్యాలు ఏ పేరాలో ఉన్నాయో గుర్తించగలగాలి. పేరాను చదివి ఖాళీలను పూరించగలగాలి.

**iii) స్వీయరచన :**

- ఓసెఫ్ కన్నన్‌ను ఎట్లా ప్రేమించేవారో, మూగజీవాలమీద ఎందుకు ప్రేమ చూపించాలో రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- మూగజీవాలకు నోరొస్తే... అనే అంశంపై ఊహించి కథ రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలు, సమానార్థక పదాలు, నానార్థాలు రాయగలగాలి. ప్రకృతి వికృతి పదాలను జతపరుచగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- ఇచ్చిన సంధి పదాలను విడదీసి, సంధి పేర్లు గుర్తించగలగాలి. సమాసపదాలకు విగ్రహవాక్యాలురాసి సమాసాలు గుర్తించగలగాలి.

❀ ❀ ❀

## 9వ తరగతి

**9వ తరగతి**

**ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు**

### I. అవగాహన – ప్రతిస్పందన

- ఇచ్చిన అంశాన్ని గురించి ఊహిస్తూ మాట్లాడగలగాలి.
- విన్న, చూసిన, చదివిన అంశాలపై విమర్శనాత్మకంగా మాట్లాడడం, చర్చల్లో పాల్గొనడం.

- చుక్క గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- అపరిచిత అంశానికి సంబంధించిన పేర్లలో కీలకపదాలను రాయగలగాలి.
- పద్యాలను, గేయాలను, కవితలను భావస్ఫోరకంగా చదవగలగాలి.
- చదివిన అంశం గురించి తార్కికంగా ప్రశ్నించడం, సమర్థిస్తూ, విభేదిస్తూ మాట్లాడగలగాలి.
- అపరిచిత అంశాలను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.
- చదువుతున్న అంశానికి చెందిన భావాన్ని గ్రహించడం, కీలక అంశాన్ని పదాలను గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంపై అభిప్రాయాన్ని స్పష్టంగా తెలపగలగాలి.
- పాఠ్యాంశంలోని స్వభావాల గురించి చెప్పగలగాలి, రాయగలగాలి.
- సగటున నెలకు మూడు, నాలుగు కథల పుస్తకాలు, మాసపత్రికలను చదువగలగాలి.
- రచనల్లోని శైలి భేదాలననుసరించి చదువడం, కొత్త పోకడలను గుర్తించగలగాలి.

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

- కథలను, విజ్ఞానశాస్త్రానికి చెందిన కాల్పనిక అంశాలను, వివిధ ప్రక్రియలను చదివి అర్థం చేసుకొని, సొంతమాటల్లో రాయగలగాలి.
- జీవిత విశేషాలు వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- ఇచ్చిన ప్రశ్నలకనుగుణంగా విశ్లేషణాత్మకంగా జవాబు రాయగలగాలి, స్వీయరచన చేయగలగాలి.
- పాఠ్యాంశాల ఆధారంగా ప్రాజెక్టుపనులు పూర్తిచేసి, నివేదికలు రూపొందించగలగాలి.
- ప్రక్రియలను ఒకదాన్ని మరొకరూపంలోకి మార్చగలగాలి. ఉదా: (కథను గేయంగా/ సంభాషణగా)
- విరామ చిహ్నాలను సమర్థంగా ఉపయోగిస్తూ, దోషరహితంగా, క్రమపద్ధతిలో రాయగలగాలి.
- కరపత్రాలు, నివేదికలు, ఆహ్వానపత్రికలు రాయగలగాలి.
- భాషా సంఘంలో సభ్యులుగా చేరి పాఠశాల పత్రిక (మ్యాగజైన్) రూపకల్పనలో భాగస్వాములు కావడం, సాహితీ సమావేశాలు నిర్వహించడం వంటివి రాయగలగాలి.
- పాఠాల నుంచి గ్రహించిన అంశాలను వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయోగించుకోగలగాలి.
- ఇతర భాషలకు చెందిన కథలు, పాటలు, గేయాలు, వివిధ ప్రక్రియలకు చెందిన ఇతివృత్తాలను అవగాహనతో ప్రశంసించడం, బహుభాషాతత్వాన్ని గుర్తించి అభినందించడం చేయగలగాలి.

## III. భాషాంశాలు

- వివిధ రంగాలకు చెందిన (క్రీడలు, కళలు, సాంకేతిక విజ్ఞానం, నిర్మాణాలు, వృత్తులు మొ॥) పదజాలంపై పట్టుసాధించడం, చదివేటప్పుడు, రాసేటప్పుడు ఈ జ్ఞానాన్ని వినియోగించుకోగలగాలి.

- వివిధ పదజాలాలకు చెందిన అర్థపరిణామం గుర్తించగలగాలి.
- నిఘంటువుతోపాటు విద్యార్థి కల్పతరువులాంటి పుస్తకాలను వినియోగించగలగాలి.
- సంధి, సమాన లక్షణాలను అవగాహన చేసుకోవడం, ప్రయోగించడం, చేయగలగాలి.
- ప్రత్యక్ష, పరోక్ష కథనాలు, కర్తరి, కర్మణి వాక్యరూపాలు అవగాహన చేసుకోగలగాలి.
- కావ్యభాష / ప్రాచీన భాషలోని వాక్యాలను ఆధునిక వ్యావహారికరూపంలోకి మార్చగలగాలి.
- వివిధ వాక్యభేదాలను గ్రహించి, ప్రయోగించగలగాలి.

**పాఠం పేరు :** 1. ధర్మార్జునులు **కవి పేరు :** చేమకూర వేంకటకవి **ప్రక్రియ :** ప్రబంధం

**ఉద్దేశం :** అన్నదమ్ముల అనుబంధాన్ని గురించి తెలియజేయడం, విద్యార్థులలో ఉత్తమ నాయకత్వలక్షణాలను పెంపొందించడం; ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- మంచి చెడుల విచక్షణతో మాట్లాడటం, సమకాలీన అంశాలపై (నాయకత్వం) విమర్శనాత్మకంగా మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- భావస్ఫోరకంగా పద్యాలు చదవడం, భావాలకు అనుగుణంగా పద్యపాదాలను గుర్తించడం, ప్రతిపదార్థాలు రాయడం, అపరిచిత పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయడం. చేయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- శీర్షిక ఔచిత్యాన్ని గురించి పాండవులు ఉదారస్వభావులన్న దానిని సమర్థిస్తూ, ధర్మరాజు వ్యక్తిత్వాన్ని గురించి రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- మంచి గుణాలు కలిగిన వారిని అభినందిస్తూ వ్యాసం రాయగలగాలి. పాఠం ఆధారంగా చేమకూర వేంకటకవిని ప్రశంసిస్తూ రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలు, సొంతవాక్యాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఉదాహరణల ద్వారా విశేషణ పూర్వపద, విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసాల గురించి తెలుసుకొని వాటిని గుర్తించగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 2. నేనెరిగిన బూర్గుల  **కవి :** పి.వి.నరసింహారావు  **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** సమాజాన్ని తమ ప్రతిభావిశేషాలతో ప్రభావితం చేయగలిగిన వ్యక్తులు కొందరుంటారు. అట్లాంటి వారి జీవితంలో స్ఫూర్తిదాయకాలు ఎన్నో ఉంటాయి. బహుభాషావేత్తగా, పరిపాలనదక్షుడిగా, రాజనీతిజ్ఞుడుగా పేరుపొందిన బూర్గుల వారిని గురించి మరొక ప్రజ్ఞాశీలి పి.వి.నరసింహారావు రాసిన వ్యాసం ఈ పాఠం. మహోన్నత వ్యక్తుల వ్యక్తిత్వం నుండి స్ఫూర్తిని పొందేటట్లుగా చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- ఇతరుల కంటే తాను అధికుడననిపించుకోవాలనే ఉబలాటం, పెనుగులాట గురించి అభిప్రాయాలను చెప్పగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- ఇచ్చిన విషయం ఉన్న పేరా సంఖ్యను గుర్తించి, ఆ విషయానికి సంబంధించిన అంశాలు పట్టిక రూపంలో రాయగలగాలి. అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- బూర్గుల వ్యక్తిత్వంలోని మహోన్నత లక్షణాల గురించి, గొప్పవారి సాంగత్యంవల్ల కలిగే స్ఫూర్తి గొప్పగా ఉంటుందనే దానిని సమర్థిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- పాఠంలోని పదజాలం, పేర్కొన్న విశిష్ట లక్షణాల ఆధారంగా ఒక కవితను, నచ్చిన గొప్పవ్యక్తిని ప్రశంసిస్తూ సన్మానపత్రాన్ని రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- గీతగీసిన పదాలకు అర్థాలు, ఇచ్చిన జాతీయాలను ఉపయోగించి సొంతవాక్యాలు, పర్యాయపదాలు, ప్రకృతి వికృతులు వివిధ వృత్తులకు సంబంధించిన ప్రత్యేక పదజాలాన్ని రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- గీతగీసిన పదాలను విడదీసి సంధిపేర్లు, సమాసపదాలకు, విగ్రహవాక్యాలు, సమాసం పేర్లు, సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా రాయగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 3. వలసకూలీ! **రచయిత / కవి :** ముకురాలరామారెడ్డి **ప్రక్రియ :** పాట

**ఉద్దేశం :** తెలంగాణ రాష్ట్రంలో కరువు జిల్లాల్లో పాలమూరు ప్రధానమైంది. ఆ జిల్లాలోని పేదలు బతుకుదెరువుకోసం వలస వెళ్ళడం పరిపాటి. ఒక పేదరైతు బతుకుభారాన్ని మోస్తూ తూర్పుతీరప్రాంతానికి వలసవెళ్ళి చెప్పిన సమయానికి రాకపోవడంతో ఆందోళనపడిన కుటుంబసభ్యుల మనోవేదనను ముకురాల రామారెడ్డి పాటరూపంలో ఎంతో ఆర్ద్రంగా వ్యక్తీకరించారు. వలస కూలీల బాధను, వారి కుటుంబ సభ్యుల ఆవేదనను, తెలియజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- ప్రజలు ఎందుకు వలసపోతారు? ఈ వలసలను అరికట్టడానికి ఏం చేస్తే బాగుంటుందో చర్చించగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- గేయం చదివి అంత్యానుప్రాస పదాలు, అపరిచిత పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- వలసకూలీ గురించి కవి ఆవేదనను, వలసకూలీల బతుకుల్లో వెలుగులు నింపడానికి ఎట్లాంటి చర్యలు అవసరమో రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- వలసకూలీల జీవనాన్ని ఊహిస్తూ కవిత / గేయం రాయగలగాలి.
- వలసలను నిరోధించడానికి ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలను గురించి పత్రికలకు లేఖ రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- గీతగీసిన పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు వివరణ, ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన పదాలకు విడదీసి సంధిపేర్లు, సూత్రాలు రాయడం, అంత్యానుప్రాసాలంకారము సంభావన పూర్వపదకర్మధారయ, రూపక సమాసముల గురించి తెలుసుకొని వాటిని గుర్తించగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 4. రంగాచార్యతో ముఖాముఖి **కవి పేరు :** రంగాచార్య **ప్రక్రియ :** ఇంటర్వ్యూ

**ఉద్దేశం :** తన సాహిత్యం ద్వారా తెలంగాణ పోరాటంలో ముఖ్యభూమిక నిర్వహించిన దాశరథి రంగాచార్యుల అనుభవాలు, జ్ఞాపకాలు, అభిప్రాయాలు, రచనలు, ఆయన వ్యక్తిత్వాన్ని, రచనల గొప్పదనాన్ని ఇంటర్వ్యూ ప్రక్రియద్వారా పిల్లలకు తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- దాశరథి ఇంటర్వ్యూపట్ల తన అభిప్రాయం, తాను చూసిన ఇంటర్వ్యూ గురించి మాట్లాడగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- పాఠం ఆధారంగా దాశరథి రంగాచార్య నవలలు, వాటిలోని ఇతివృత్తాలను గురించి పట్టికను, అపరిచితగద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- తెలంగాణ ఏర్పాటు సంతోషానిచ్చిందనే రచయిత మాటలపై అభిప్రాయాన్ని, దాశరథి సాహిత్య సేవను వివరిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- ఇంటర్వ్యూ కోసం ప్రశ్నావళి తయారుచేయగలగాలి. దాశరథి సాహిత్య సేవను ప్రశంసిస్తూ పత్రికలకు లేఖ రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- గీతగీసిన పదాలకు అర్థాలు, ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన పదాలకు విడదీసి సంధిపేర్లు, విగ్రహవాక్యాలు రాసి సమాసం పేర్లు, ఇచ్చిన వాక్యాల్లో గల అలంకారాలను, కర్మణి వాక్యాలు రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 5. శతకమధురిమ **కవి పేరు :** శతక కవులు **ప్రక్రియ :** శతకం

**ఉద్దేశం :** తెలంగాణ శతక కవుల శతకాల నుండి ఆణిముత్యాల వంటి పద్యాలను సేకరించి విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించడానికి, పద్యాలను ధారణ చేయడానికి ఉద్దేశించిన పాఠం ఇది.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- సమాజానికి మార్గనిర్దేశనం చేసేవాళ్ళు శతకకవులు అనే దానిని గురించి చర్చించగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- భావాలకు తగిన పద్యపాదాలను పాఠంలో గుర్తించడం, పాదభంగం లేకుండా పద్యాలను రాయడం, పద్యాల భావాలు రాయడం. అపరిచిత పద్యం చదివి జవాబులు గుర్తించడం. చేయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- శతక పద్యాలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి – విమర్శిస్తాయి అనే అంశాన్ని వివరిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- పద్యభావాల ఆధారంగా కథను నీతి, విలువలపట్ల అవగాహన పెంపొందించేందుకు కరపత్రం తయారుచేయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలు, సొంతవాక్యాలు పర్యాయపదాలు మరియు ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన పదాలకు సంధులు, సమాసాలు, పద్యపాదాలకు గణవిభజన చేసి, ఏ పద్యమో రాయగలగాలి. ద్రుత ప్రకృతిక, సరళాదేశసంధుల గురించి, ఛందస్సులో శార్దూల, మత్తేభాల గురించి తెలుసుకొని గుర్తించగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 6. దీక్షకు సిద్ధంకండి **కవి పేరు :** -- **ప్రక్రియ :** కరపత్రం

**ఉద్దేశం :** 1969 తెలంగాణ ఉద్యమ తీరుతెన్నులు, ఉద్యమ స్ఫూర్తిని కరపత్రం ద్వారా విద్యార్థులకు తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- ప్రజా ఉద్యమాలను శాంతియుతంగానే నిర్వహించవలసిన అవసరం గురించి చర్చించగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- పాఠం చదివి కీలకపదాలను గుర్తించి వివరించగలగాలి. అపరిచిత గద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- 1969 నాటి తెలంగాణ ఉద్యమం ద్వారా రాష్ట్రం సాధించకపోవడానికి నేటి ఉద్యమం విజయవంతం కావడానికి కారణాలు విశ్లేషిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- చెరువుల ప్రాధాన్యతను వివరించే కరపత్రం తయారుచేయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- గీతగీసిన పదాలకు అర్థాలు, సొంతవాక్యాలు, జాతీయాలను రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- సంధులు, సమాసాలు, సంయుక్త వాక్యాలు రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 7. నా చెలిమి **కవి పేరు :** పొన్నికంటి తెలగన **ప్రక్రియ :** కావ్యం

**ఉద్దేశం :** తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి అచ్చతెలుగు కావ్యాన్ని రచించినవాడు పొన్నికంటి తెలగన. కవిని, రచనను పరిచయం చేస్తూ స్నేహితుల మధ్య వైషమ్యాలు ఎంతటి తీవ్ర పరిణామాలకు దారితీస్తాయో తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- స్నేహితులంటే ఎట్లా ఉండాలో అభిప్రాయం చెప్పగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- పాఠం ఆధారంగా శర్మిష్ఠ, దేవయాని స్వభావాలను గురించి పట్టికను, అపరిచిత గద్యాలను చదివి ప్రశ్నలకు జవాబులు, రాయగలగాలి. తప్పొప్పులను గుర్తించగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- చెలిమి పాఠాన్ని విశ్లేషిస్తూ, మంచి స్నేహితులను ఎలా సంపాదించుకోవాలో ఆ స్నేహం కలకాలం ఉండడానికి ఏం చేయాలో రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- శర్మిష్ఠ ఏకపాత్రాభినయానికి సంబంధించిన మాటలను రాసి, ప్రదర్శించగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- గీతగీసిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన పదాలకు సంధులు, సమాసాలు రాయగలగాలి. గసడదవాదేశసంధిని గురించి తేటగీతి పద్యాల గురించి తెలుసుకొని వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 8. ఉద్యమస్ఫూర్తి **రచయిత :** సంగెం లక్ష్మీబాయి **ప్రక్రియ :** ఆత్మకథ

**ఉద్దేశం :** తెలంగాణలో స్త్రీ విద్యకు ఏమాత్రం ప్రోత్సాహంలేని కాలంలో జీవితంలో ఎన్నో ఆటుపోటులను ఎదుర్కొని, చదువుకొని తన జీవితాశయమైన స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆదర్శవీరవనిత సంగెం లక్ష్మీబాయి. ఆమె యొక్క పోరాట అనుభవాలను తెలుపుతూ, తద్వారా పిల్లల్లో సామాజిక బాధ్యతను పెంపొందింపజేయడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- నేటి సమాజంలో లక్ష్మీబాయి వంటి ఆదర్శమూర్తుల అవసరం గూర్చి మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- పాఠంలోని పేరాలు చదివి వాటికి శీర్షికలు, ఆ పేరాల్లోని కీలకమైన పదాలు, అపరిచిత గద్యంలోని ఖాళీలతో సరియైన పదాలు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలలు నిజం కావాలంటే మనకు లభించిన స్వాతంత్ర్యాన్ని ఎట్లా సద్వినియోగించుకోవాలో విశ్లేషిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- నేటి కాలంలో సంగెం లక్ష్మీబాయి వంటివారు ఎందుకు అవసరమో వివరిస్తూ వ్యాసం రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలతో సొంత వాక్యాలు రాయగలగాలి. వికృతులకు ప్రకృతి పదాలు పాఠంలో వెతికి రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- సంధులు, సమాసాలను గుర్తించగలగాలి. యణాదేశసంధి గూర్చి తెలుసుకొని సూత్రీకరించగలగాలి. ఆ సంధి పదాలను గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 9. కోరస్ **కవి :** సలంద్రలక్ష్మీనారాయణ **ప్రక్రియ :** వచనకవిత

**ఉద్దేశం :** తెలంగాణ పోరాటంలో, సమసమాజ స్థాపనలో తన సాహిత్యంతో భాగం పంచుకున్న కవి సలంద్ర లక్ష్మీనారాయణ. ఆయన గురించి తెలుసుకుంటూ, వచనకవిత ద్వారా భావాలను ఎంత సూటిగా దృఢంగా ప్రకటించవచ్చో తెల్పడం, ఒక కొత్తమార్గం ఎంచుకున్నప్పుడు ఎదురయ్యే అవరోధాలను లెక్కచేయకుండా, అనుకున్న మంచిపని సాధించేందుకు ధైర్యంగా ముందడుగు వేయాలని తెలుపడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- శీర్షికపై అభిప్రాయాలను, కవికి సమాజంపట్ల ఉన్న భావన గురించి చర్చించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- భావాలకు తగిన కవితా పంక్తులను గుర్తించగలగాలి. అపరిచిత కవిత చదివి భావం రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పాఠ్యభాగ సారాంశం కవి భావనలోని అంతరార్థం రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- కవి భావనలను, కవిత అంతరార్థాన్ని ప్రశంసిస్తూ పత్రికలకు లేఖ రాయడం.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలు, సొంతవాక్యాలు, జాతీయాలను వివరిస్తూ రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- సంధులు, సమాసాలు, అలంకారాలను గుర్తించగలగాలి. కర్మణి వాక్యాలు రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 10. వాగ్భూషణం **రచయిత :** డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** తెలంగాణ సాహితీ క్షేత్రంలో మేధావిగా గుర్తించబడిన డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి కలం నుండి వెలువడిన శాస్త్రీయ సాహితీ వ్యాసం పరిచయం చేస్తూ పిల్లలలో వక్తృత్వ శక్తిని మెరుగుపరచడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- నోరు మంచిదైతే - ఊరు మంచిదౌతుందనే దానిని సమర్థిస్తూ మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- పాఠంలోని కీలక పదాలను అపరిచిత గద్యం చదివి తప్పొప్పులు గుర్తించగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- ఉపన్యాసం – ఒక గొప్ప కళ అనే దానిని వివరిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- మాట గొప్పదనం గురించి ప్రసంగ వ్యాసం రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- పదాలను సొంతవాక్యాల్లో ప్రయోగించడం, పరిచయపదాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులను గుర్తించడం చేయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- సంధులు, సమాసాలు గుర్తించగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 11. వాయసం **కవి పేరు :** మామిండ్ల రామాగౌడ్ **ప్రక్రియ :** పద్యం

**ఉద్దేశం :** ప్రకృతిలోని ప్రాణులన్నీ స్వేచ్ఛగా జీవించాలని, ప్రతి ప్రాణికి ప్రత్యేకతలుంటాయని, దేనిపట్ల చులకన భావం తగదని తెల్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- కాకిని చిన్నచూపు చూడటం సరైందికాదని మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- పాఠం ఆధారంగా పట్టికను పూరించడం. అపరిచిత గద్యం చదివి పట్టికను పూరించగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- కాకి విశిష్టతను గురించి రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- కాకి – మనిషి సంభాషణ రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- పర్యాయపదాలు, ప్రకృతి వికృతులు, వ్యుత్పత్తులు గుర్తించగలగాలి. ఇచ్చిన జాతీయాలను, సామెతలను ఏ సందర్భంలో వినియోగిస్తారో రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- పాఠంలోని సవర్ణదీర్ఘ, ఉత్వ సంధుల పదాలను గుర్తించి, విడదీసి రాసి సూత్రాలు, సమాసాలు, రాయగలగాలి. యమకాలంకారాన్ని గురించి తెలుసుకొని, గుర్తించి రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 12. తీయని పలకరింపు **రచయిత్రి :** ఇల్లిందల సరస్వతిదేవి **ప్రక్రియ :** కథానిక

**ఉద్దేశం :** నానాటికి దిగజారుతున్న మానవ సంబంధాలు కుటుంబ విలువలు గురించి తెలుపుతూ సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- ముసలివాళ్ళు వృద్ధాశ్రమంలో చేరడానికి గల కారణాలు చర్చించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- పాఠం ఆధారంగా ఇచ్చిన మాటలు ఎవరు ఎవరి గురించి చెప్పారో రాయగలగాలి.
- అపరిచిత కవిత చదివి, ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- వృద్ధాప్యం మనిషికి శాపం కాకూడదన్న దానిపై అభిప్రాయం, వృద్ధులకు ఏమికావాలో, కుటుంబ సభ్యులు వాళ్లను ఎట్లా చూసుకోవాలో రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- తీయని పలకరింపు కథను పొడిగించి మంచి ముగింపు రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- పట్టికద్వారా ఇచ్చిన పదాలకు పర్యాయపదాలు, పాఠం ఆధారంగా వికృతులకు ప్రకృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన పదాలను కలిపి సంధిపేర్లు, విగ్రహవాక్యాలకు సమాసం పేర్లు, కర్తరి / కర్మణి వాక్యాలను గుర్తించగలగాలి, రాయగలగాలి.

❁ ❁ ❁

# 10వ తరగతి

**ఈ పాఠ్యపుస్తకం ద్వారా విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు**

## I. అవగాహన - ప్రతిస్పందన

- పాఠాల ద్వారా కలిగిన అనుభూతులను వివరించగలగాలి.
- ఏదైనా విషయాన్ని తగిన ఉదాహరణలతో సమర్థిస్తూ మాట్లాడగలగాలి.
- పద్యాలను భావస్ఫోకరంగా చదువగలగాలి, ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- వివిధ విషయాల గురించి మాట్లాడటానికి చర్చల్లో పాల్గొనగలగాలి.
- విషయం ఆధారంగా పట్టికలను పూరించగలగాలి.
- తన అనుభవాల నుండి నచ్చిన / నచ్చని అంశాల గురించి తెలుపగలగాలి.
- ఇచ్చిన కవితాపంక్తులు / పద్యాల్లోను చదివి అంతర్థాన్ని రాయగలగాలి.
- వివిధ విషయాల / అంశాల మధ్య ఉన్న పోలికలను తెలుపుతూ మాట్లాగలగాలి.
- పాఠాల్లోని ముఖ్యభాగాలను / ఇచ్చిన పంక్తులను / పదాలను గుర్తించగలగాలి.
- శీర్షికలను పెట్టగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ఉపన్యాసాన్ని ఇవ్వగలగాలి.
- పాఠ్యాంశాలలోని కీలకాంశాలను గుర్తించి రాయగలగాలి.
- పరిచిత, అపరిచిత గద్యాలను / పద్యాలను చదివి ప్రశ్నలకు జవాబులు, సమాధానాలను గుర్తించడం, ప్రశ్నలు తయారుచేయడం, కీలకాంశపదాలను గుర్తించడం లాంటివి చేయగలగాలి.

## II. ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని ప్రతిస్పందించడం

- ఇచ్చిన అంశాన్ని సరైన కారణాలతో సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.
- కవి / రచయితల భావనలను , రచనాశైలిని వివరించగలగాలి, అభినందిస్తూ రాయగలగాలి.
- పాఠ్యాంశాలలోని పాత్రల అంతర్యాలను, స్వభావాలను వివరిస్తూ రాయగలగాలి.
- పాఠాల ద్వారా తాను గ్రహించిన అంశాలను వివరించగలగాలి.
- విషయాన్ని విశ్లేషిస్తూ / విమర్శిస్తూ రాయగలగాలి.
- ఇచ్చిన అంశంపై తన అభిప్రాయాలను వివరిస్తూ రాయగలగాలి.
- ఆత్మకథ, వ్యాసం లేఖ, నినాదాలు, సూక్తులు, వచనకవిత, కరపత్రం, అభినందన వ్యాసం, సంపాదకీయవ్యాసం ప్రక్రియలు రాయగలగాలి.

## III. భాషాంశాలు

- ఇచ్చిన పదాల ద్వారా సొంతవాక్యాలు రాయగలగాలి.
- పదాలకు అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్త్యర్థాలు రాయగలగాలి.
- ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయగలగాలి.
- సంశ్లిష్ట, సంయుక్త, కర్తరి, కర్మణి, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలను రాయగలగాలి, మార్పులు చేయగలగాలి.
- వృద్ధి, త్రిక, రుగాగమ సంధులను గుర్తించి రాయగలగాలి.
- సీసం, ఆటవెలది ఛందోరీతులను గుర్తించి రాయగలగాలి.
- కర్మధారయ, బహువ్రీహి సమాసాలను గుర్తించి రాయగలగాలి.
- అతిశయోక్తి, స్వభావోక్తి అలంక ఆరాలను గుర్తించగలగాలి.

## IV. ప్రాజెక్టు పనులు

- రిఫరెన్సు పుస్తకాలు చదువడం, ఇతరుల ద్వారా సమాచారాన్ని సేకరించడం, పరిశీలనలు మొదలైనవాటి ద్వారా సేకరించిన సమాచారాన్ని నివేదిక రూపంలో ప్రదర్శించగలగాలి.

**పాఠం పేరు :** 1. దానశీలము **కవి పేరు :** బమ్మెర పోతన **ప్రక్రియ :** ప్రాచీన పద్యం

**ఉద్దేశం :** సహజ కవిగా ప్రసిద్ధిగాంచిన పోతన రచించిన శ్రీమదాంధ్ర మహాభాగవతము నుండి 'దానశీలము' అనే పాఠ్యభాగము గ్రహించబడింది. దీని ద్వారా విద్యార్థులు దానగుణమును, సత్యసంధతను అలవర్చుకుంటారు. ఆడిన మాట తప్పకపోవడం, మాటకు కట్టుబడే తత్త్వాన్ని, దానం గొప్పదనాన్ని తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

## I. అవగాహన ప్రతిస్పందన :

**i) వినడం - మాట్లాడడం :**

- నేటి కాలంలోని రక్తదానం, మరణానంతరం చేసే అవయవ దానాల ప్రాధాన్యత గురించి చర్చించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- పువ్వు గుర్తుగల పద్యాలను భావస్ఫోరకంగా చదివి ప్రతిపదార్థాలను రాయగలగాలి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :

**i) స్వీయరచన :**

- నేటి సమాజానికి దాతృత్వం గల వ్యక్తుల ఆవశ్యకతను గురించి, పాఠ్యభాగ సారాంశాన్ని రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- ఆడిన మాట తప్పకపోవడం, దానగుణం కలిగి ఉండడం మొదలైన విశిష్ట లక్షణాల ఆవశ్యకతను తెలిపేలా నినాదాలు - సూక్తులు రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలకు వ్యుత్పత్త్యర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన సంధిపదాలను విడదీసి సంధిపేర్లు, సమాసపదాలకు విగ్రహవాక్యాలు, సమాసం పేర్లు, పద్యపాదాలకు గణవిభజన చేసి పద్యలక్షణాలను రాయగలగాలి. త్రికసంధిని గురించి తెలుసుకొని ఆ సంధి పదాలను పాఠాలలో గుర్తించి రాయగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 2. ఎవరిభాష వాళ్ళకు వినసొంపు **రచయిత :** డా॥ సామల సదాశివ **ప్రక్రియ :** వ్యాసం

**ఉద్దేశం :** ఏ భాష అయినా భౌగోళికంగా సమీపంలో ఉన్న ఇతర భాషల ప్రభావం చేత ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది. అదే ఆ భాష యొక్క యాస అవుతుంది. ఆ యాసలే ఆ భాష మాట్లాడేవారి ప్రాంతీయతను తెలుపుతాయి. భాషలోని నుడికారపు సొంపు, పలుకుబడులు, జాతీయాలు ఆ భాషను ఎంత సౌందర్యంగా, పరిపూర్ణంగా చేస్తాయో వివరిస్తూ తెలంగాణ భాష గొప్పతనాన్ని, ప్రాంతీయ భాషలోని మాధుర్యాన్ని తెలుపడం ఈ పాఠం ఉద్దేశ్యం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- తెలుగు భాష గొప్పతనాన్ని గూర్చి ఇతర భాషా పదాలు వాడకుండా మాట్లాడగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- పరిచిత, అపరిచిత గద్యాలను చదివి అర్థం చేసికొని ఇచ్చిన ప్రశ్నలకు సరియైన జవాబులు గుర్తించగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పాఠం ద్వారా సామల సదాశివ గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- పిల్లలు ప్రాథమిక విద్యాభ్యాస కాలంలో మరచిపోలేని జ్ఞాపకాలను గురించి వ్యాసం, పరిసరాల్లో జరిగిన సంఘటనను గురించి సంభాషణలు రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన వాక్యాలను సామాన్య, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయగలగాలి. రుగాగమ సంధి జరిగే విధానాన్ని తెలుసుకుని విశ్లేషించగలగాలి. ఆ సంధిపదాలను గుర్తించగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 3. వీర తెలంగాణ **కవి పేరు :** డా॥ దాశరథి కృష్ణమాచార్య **ప్రక్రియ :** ఆధునిక పద్యం

**ఉద్దేశం :** ఏ దేశ చరిత్రలోనైనా ప్రభువుల నిరంకుశత్వానికి ప్రజలు తిరగబడడం కనిపిస్తూనే ఉంటుంది. అలాంటి సందర్భాల్లో మేధావులు, కవులు, కళాకారుల తమ తమ ప్రాణాలను దుర్మార్గంగా పీడించి రక్తమాంసాలు త్రాగిన ఏ నిరంకుశ ప్రభుత్వమైనా పతనంకాక తప్పదు. తెలంగాణ నేలమీద జరిగిన విముక్తి ఉద్యమాలు, సాయుధ పోరాటాల్లో వీరుల తిరుగుబాటు జోరును, త్యాగాల తీరును, తెలంగాణ వీరత్వాన్ని కీర్తించడమే ఈ పాఠం ఉద్దేశ్యం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- రచయిత "వీర తెలంగాణ" అనడాన్ని తగిన ఉదాహరణలతో సమర్థిస్తూ మాట్లాడగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- అపరిచిత కవితను చదివి ప్రశ్నలకు జవాబులు, పువ్వు గుర్తుగల పద్యాలకు ప్రతిపదార్థాలను రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- వీర తెలంగాణ పాఠ్యభాగ సారాంశాన్ని, దాశరథి రచనాశైలిని గురించి రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- తెలంగాణ తల్లి గొప్పతనాన్ని వివరిస్తూ ఏకపాత్రాభినయము / ఆత్మకథను రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన వాక్యాలను చదివి గీతగీసిన పదాలకు అర్థాలు సొంతవాక్యాలు, నానార్థాలు, పర్యాయపదాలు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- పదాలను విడదీసి సంధిపేర్లను, విగ్రహవాక్యాలకు సమాసం పేర్లను రాయగలగాలి. ఛేకానుప్రాస అలంకారం గురించి తెలుసుకొని పాఠంలో గుర్తించి రాయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 4. కొత్తబాట **రచయిత్రి పేరు :** డా॥ పి.యశోదారెడ్డి **ప్రక్రియ :** కథానిక

**ఉద్దేశం :** గ్రామీణ వాతావరణంలో వేగంగా, క్రమానుగతంగా చోటుచేసుకున్న పరిణామాలను, పర్యవసానాలను, స్థానిక ఆధిపత్య శక్తులమీద సామాన్యుని కొత్త విజయాలను, పల్లెల్లో స్వాతంత్ర్య సంబరాలను విద్యార్థులకు తెలంగాణ పల్లె భాషలో పరిచయం చేయడం, పల్లె వాతావరణం, చోటుచేసుకుంటున్న మార్పులు తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- ఈ పాఠానికి కొత్తబాట అనే పేరు తగినదా? అన్న విషయాన్ని సమర్థిస్తూ చర్చించగలగాలి.
- పట్టికలో అడిగిన వివరాలను పాఠ్యాంశం ఆధారంగా పూరించగలిగాలి.

**ii) చదువడం – రాయడం :**

- అపరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు, పాఠం ఆధారంగా ఇచ్చిన పేరా సంఖ్యను బట్టి పేరా శీర్షిక, పేరాలోని జాతీయాలు, సామెతలు, ముఖ్య విషయాలను తెలుపుతూ పట్టిక రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పిల్లలు, తమ ఊరి ప్రత్యేకతలను, చెరువుల ప్రాముఖ్యతను, పల్లెల్లో వచ్చిన మార్పులను విశ్లేషిస్తూ, రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- పల్లె సౌందర్యాన్ని వర్ణిస్తూ వచన కవిత రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన వాక్యాలలో గీతగీసిన పదాలనుపయోగించి సొంత వాక్యాలు, పర్యాయపదాలు, ప్రకృతి - వికృతులు, జాతీయాలను వివరిస్తూ రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన సంధి పదాలను విడదీసి సంధుల పేర్లు రాయగలగాలి. 'వృద్ధిసంధి'ని గురించి తెలుసుకొని ఆ సంధి పదాలను పాఠాలలో గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 5. నగరగీతం **కవి పేరు :** అలిశెట్టి ప్రభాకర్ **ప్రక్రియ :** వచనకవిత

**ఉద్దేశం :** ఆధునిక కాలంలో ప్రజలు నగర జీవితాన్ని కోరుకుంటున్నారు. ఉపాధిలేక బ్రతుకు తెరువుకోసం కూడా నగరాలకు వలసలు పెరుగుతున్నాయి. దీనితో క్రిక్కిరిసిన నగరం అనేక సమస్యలతో అసౌకర్యాల నిలయంగా మారింది. మానవీయ విలువలు నానాటికి అడుగంటిపోయాయి. సగటు నగర జీవి యాంత్రిక జీవనాన్ని అనుభవిస్తున్నాడు "దూరపు కొండలు నునుపు" అన్న చందంగా నగరం తయారయింది. అక్కడ జీవనాన్ని అలిశెట్టి ప్రభాకర్ "మినీ కవిత" ద్వారా వ్యంగ్యంగా చురకలతో చిత్రించిన విధానాన్ని, నగర జీవితంలో వాస్తవ పరిస్థితులను గురించి తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- విద్యార్థులు తాము చూసిన నగరాలలో తమకు నచ్చిన, నచ్చని అంశాలను వివరించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- ఇవ్వబడిన కవితా పంక్తులలో దాగిన అంతరార్థాన్ని మాట్లాడగలగాలి. అపరిచిత వచన కవితను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- అలిశెట్టి ప్రభాకర్ సిటీలైఫ్ కవితల ప్రత్యేకతను, పల్లెకు - నగరానికి గల తేడాలను రాయగలగాలి. నేడు నగర జీవనం ఎందుకు సంక్లిష్టంగా మారిందో విశ్లేషిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- నగరజీవనంలోని అనుకూల అంశాలపై కవిత రాయగలగాలి. పరిసరాల పరిశుభ్రత గురించి అందరూ కృషిచేయాలని తెలిపేటట్లుగా కరపత్రం తయారుచేయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలకు అర్థాలు, పర్యాయపదాలు వాటితో వాక్యాలు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇవ్వబడిన కవిత మరియు పద్యాలలోని అలంకారాలను గుర్తించగలగాలి. రూపకాలంకారం గురించి తెలుసుకొని లక్ష్య లక్షణ సమన్వయం చేయగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 6. భాగ్యోదయం **కవి పేరు :** కృష్ణస్వామి ముదిరాజ్ **ప్రక్రియ :** జీవిత చరిత్ర

**ఉద్దేశం :** స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో ఇతరుల గురించి వారి శ్రేయస్సుకు పాటుపడే వ్యక్తులు కరువైపోతున్నారు. మనుషులంతా సమానమని, సామాజిక సమానతలు ఉండాలని ఆలోచించిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ. ఆయన జీవితచరిత్ర పుస్తకంపై కృష్ణస్వామి ముదిరాజ్ రాసిన వ్యాసం ద్వారా భాగ్యరెడ్డి వర్మ వ్యక్తిత్వంతోపాటు, పిల్లల్లో ఇతరులకు సేవ చేయడం, వారు సామాజిక సమస్యలపై చైతన్యం కలిగి ఉండేటట్లుగా చేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- నిమ్న వర్గాలలో భాగ్యరెడ్డి వర్మ తెచ్చిన మార్పులను గురించి భాగ్యరెడ్డి వర్మ, అంబేద్కర్‌లకు మధ్యగల పోలికలను గురించి మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- అపరిచిత గద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- సమాజంలో ఉన్న మూఢనమ్మకాలను పారదోలడానికి తామేం చేయగలరో, భాగ్యరెడ్డివర్మ ఆది హిందువుల కొరకు చేసిన కృషిని, వివరిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- సమాజంకోసం పాటుపడిన వ్యక్తులకు సంబంధించి అభినందన వ్యాసం రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- అడిగిన పదాలకు పర్యాయపదాలు, అడిగిన పదాలనుపయోగిస్తూ సొంత వాక్యాలు రాయగలగాలి. పదబంధాలను వివరించి రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ప్రత్యక్ష, పరోక్ష కథనాలను గురించి తెలుసుకొని వాటిని పాఠంలో గుర్తించి రాయగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 7. శతక మధురిమ **రచన :** వివిధ కవులు **ప్రక్రియ :** శతకం

**ఉద్దేశం :** ముక్తకాలుగా పిలువబడే శతక పద్యాలు దేనికవే స్వతంత్ర భావాలతో ఉంటాయి. 'మకుటం' అనేది ప్రధానమైనప్పటకీ, కొన్ని మకుట రహితంగా కూడా ఉంటాయి. శతకాలలో నైతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రధానంగా కన్పిస్తాయి. సమాజ హితాన్ని కాంక్షించే శతక పద్యాలలోని నైతిక విలువలను విద్యార్థులకు తెలియజెప్పడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- పాఠంలోని శతక పద్యాల భావాలు ప్రస్తుత సమాజానికి కూడా తోడ్పడతాయని చర్చించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- ఇచ్చిన భావాలకు సంబంధించిన పద్యపాదాలను పాఠంలో గుర్తించగలగాలి. అపరిచిత పద్యానికి భావాన్ని రాసి, శీర్షికను పెట్టగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పద్యాలలోని నీతులు నిత్య జీవితంలో ఎలా ఉపయోగపడతాయో విశ్లేషిస్తూ, రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- ఏదైనా ఒక పద్యభావం ఆధారంగా నీతికథను రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలను, ఇచ్చిన వాక్యాలలోని పర్యాయపదాలను, ప్రకృతి - వికృతులను గుర్తించి రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇచ్చిన వాక్యాలలోని సంధి పదాలను విడదీసి, సంధుల పేర్లు రాయగలగాలి. ఇచ్చిన పద్యపాదానికి గణవిభజన చేసి ఏ పద్యపాదమో తెలపగలగాలి. 'ఆటవెలది' పద్య లక్షణాలను తెలుసుకొని, గుర్తించగలగాలి.

❖ ❖ ❖

**పాఠం పేరు :** 8. లక్ష్యసిద్ధి **కవి పేరు :** -- **ప్రక్రియ :** సంపాదకీయ వ్యాసం

**ఉద్దేశం :** తెలంగాణ రాష్ట్రం దశాబ్దాల కాలంగా తెలంగాణ ప్రజానీకం అహరహంపోరాట ఫలితంగా సాకారమైంది. ఈ సందర్భంగా పత్రికలన్నీ పతాక శీర్షికలతో ప్రత్యేక సంపాదకీయాలు ప్రచురించాయి. అందులో ఒక సంపాదకీయ వ్యాసాన్ని విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- సాధనలో కవులు, కళాకారుల పాత్ర, ఉద్యోగులు – ఉపాధ్యాయుల పాత్ర, ప్రజా ప్రతినిధుల పాత్ర, సకల జనుల పాత్ర గురించి, వారిని అభినందిస్తూ మాట్లాడగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- ఇచ్చిన అపరిచిత గద్యాన్ని చదివి సంబంధిత ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పత్రికా సంపాదకీయాలను చదివి, పత్రిక ఆలోచనా ధోరణులను, దృక్పథాన్ని అర్థం చేసుకొని అభిప్రాయాలను రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- ఏదైనా ఒక సంఘటనను, ప్రధాన సామాజిక అంశం ఆధారంగా ఒక సంపాదకీయ వ్యాసం రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- 'ఇవ్వబడిన పదాలతో సొంత వాక్యాలు, పర్యాయపదాలు రాయగలగాలి.
- దిన పత్రికలకు సంబంధించిన పదజాలం ఆధారంగా భావనా చిత్రాన్ని గీయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ప్రత్యక్ష వాక్యాలను పరోక్ష వాక్యాలుగా; పరోక్ష వాక్యాలను ప్రత్యక్ష వాక్యాలుగా మార్చగలగాలి. సంధి పదాలను విడదీసి, సంధులను గుర్తించి సూత్రాలను రాయగలగాలి. సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాసి సమాసాల

పేర్లను పేర్కొనగలగాలి. అతిశయోక్తి, స్వభావోక్తి అలంకారాలను తెలుసుకొని ఇచ్చిన వాక్యంలో వాటిని గుర్తించగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 9. జీవన భాష్యం **కవి పేరు :** డా॥ సి.నారాయణరెడ్డి **ప్రక్రియ :** గజల్

**ఉద్దేశం :** డా॥ సినారె రాసిన ఈ గజల్ ద్వారా జీవితమన్నాక మనిషికి అనేక ఆటుపోట్లు ఉంటాయి. అవరోధాలను ధైర్యంగా ఎదుర్కొని విజయాన్ని సాధిస్తూ. తోటి మానవులకు ఇతోధికంగా సహాయపడుతూ, సమాజంలో తగు గౌరవాన్ని పొందిన జీవి ధన్యుడౌతాడని తెలుపుతూ తెలుగులో గజల్ ప్రక్రియను పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**i) విని, అర్థంచేసుకొని, ఆలోచించి మాట్లాడడం :**

- 'జీవన భాష్యం' శీర్షిక గజల్‌కు ఎంతవరకు సరిపోయిందో చెప్పగలగాలి.

**ii) ధారాళంగా చదువడం - అర్థంచేసుకొని, ప్రతిస్పందించడం :**

- పాఠంలోని ప్రాస పదాలను, కీలకాంశాలను గుర్తించి పట్టికలో రాయగలగాలి. అపరిచిత గేయాన్ని చదివి, ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

**iii) స్వీయరచన :**

- పిల్లలు మంచి పంటలు పండడానికి రైతుపడే శ్రమను గురించి, చరిత్రలో పేరు నిలిచిపోవడానికి ఎట్లాంటి మంచి పనులు చేయాలో, సాహిత్య ప్రక్రియలను గురించి, "ఎడారి దిబ్బలు దున్నితే" అనే వాక్యం ద్వారా సి.నా.రె. ఇచ్చే సందేశం గురించి రాయగలగాలి.

**iv) సృజనాత్మకత / ప్రశంస :**

- పాఠంలోని అంత్యప్రాసల ఆధారంగా వచన కవితను, డా॥ సి.నా.రె.ని ఇంటర్వ్యూ చేయడానికి ప్రశ్నలు రాయగలగాలి.

**v) పదజాల వినియోగం :**

- ఇచ్చిన పదాలకు పర్యాయపదాలు, సొంతవాక్యాలు రాయగలగాలి.

**vi) భాషను గురించి తెలుసుకుందాం :**

- పదాలను కలిపి, సంధిని గుర్తించగలగాలి. వాక్యాలలోని సమాస పదాలను గుర్తించి, వాటికి విగ్రహవాక్యాలు రాసి, ఏ సమాసాలో రాయగలగాలి. ఇచ్చిన వాక్యాలలో ఉన్న అలంకారాలను గుర్తించి రాయగలగాలి.

✤ ✤ ✤

**పాఠం పేరు :** 10. గోలకొండ పట్టణము **రచయిత :** ఆదిరాజు వీరభద్రరావు **ప్రక్రియ :** చారిత్రక, సంస్కృతి వ్యాసం

**ఉద్దేశం :** కుతుబ్‌షాహీల పాలనలో గోల్కొండ పట్టణం ఘనమైన చారిత్రక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. కట్టడంలోని సాంకేతిక నిర్మాణాలు – ఆనాటి ఈ కోట కట్టడంలోని సాంకేతిక నిర్మాణాలు – ఆనాటి పాలకుల ముందుచూపు ఎంత గొప్పగా ఉందో.

ఆనాటి వర్తక వ్యాపారాలు, రక్షణ ఏర్పాటు మొదలైన విషయాలతో గోలుకొండ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలుపడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం – మాట్లాడడం :**

- పాఠ్యభాగ ఆధారంగా ఆనాటి చరిత్ర – సంస్కృతులకు సంబంధించిన అంశాల గురించి విద్యార్థి చర్చించగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- ఇవ్వబడిన పదాలు ఏయే పేరాలలో ఉన్నాయో అపరిచిత గద్యాన్ని చదివి సంబంధిత పట్టికను పూరించగలగాలి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- అడిగిన ప్రశ్నలకు తగురీతిలో సమాధానాలు రాయగలగాలి. గోల్కొండ పట్టణ అందచందాలు – వైభవం, విశిష్టత గూర్చి విశ్లేషిస్తూ రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- విద్యార్థికి తెలిసిన ఏదయినా పట్టణము / ఊరి యొక్క చారిత్రక / సాంస్కృతిక విశేషాలతో ఒక వ్యాసం రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- ఇవ్వబడిన పదాలను సొంత వాక్యాలలో ప్రయోగించగలగాలి. వివరించి రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇవ్వబడిన వాక్యాలలో ఉన్న సంధి పదాలను గుర్తించి విడదీసి సంధులను పేర్కొనగలగాలి. సమాస పదాలకు విగ్రహ వాక్యాలు రాయగలగాలి. పాఠ్య భాగంలోని కొన్ని వాక్యాలను వ్యవహార భాషలోకి మార్చగలగాలి.

✣ ✣ ✣

**పాఠం పేరు :** 11. భిక్ష **కవి పేరు :** శ్రీనాథుడు **ప్రక్రియ :** ప్రాచీన పద్యం

**ఉద్దేశం :** ఆకలి మనిషి వివేచనను నశింపజేస్తుంది. ఎంతటి గొప్పవారయినా ఈ బాధననుభవించాల్సిందే. పంచమ వేదంగా చెప్పబడే మహాభారతాన్ని రాసిన వేదవ్యాసుడు కాశీనగరంలో విశ్వనాథుని పరీక్షలో భాగంగా ఆకలి బాధను తట్టుకోలేక శపించబూనిన సందర్భంలో అన్నపూర్ణ మందలించిన తీరును, కోపం ఎంతటి వారికైనా ఎంతటి అనర్థాన్ని కలిగిస్తుందో తెలుపుతూ కోపాన్ని విడిచిపెట్టాలని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన ప్రతిస్పందన :**

**i) వినడం - మాట్లాడడం :**

- అపరిచిత పద్యాన్ని చదివి, అందులోని విషయాన్ని చెప్పగలగాలి. "అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న" అను అంశంపై చర్చించగలగాలి.

**ii) చదువడం - రాయడం :**

- చుక్క గుర్తున్న పద్యాలకు ప్రతిపదార్థం రాయగలగాలి.

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత :**

**i) స్వీయరచన :**

- పాఠంలోని కథను సంక్షిప్తంగా రాయగలగాలి. వ్యాసుని స్వభావాన్ని వివరించగలగాలి. కోపంవల్ల కలిగే దుష్పరిణామాలను గురించి రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- కోపాన్ని తగ్గించుకోవడం మంచిది అనే అంశంపై మిత్రునికి లేఖ రాయగలగాలి. భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష అనే పదాలతో చక్కని భావంతో కవిత రాయగలగాలి.

**III. భాషాంశాలు :**

**i) పదజాలం :**

- పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులు గుర్తించి రాయగలగాలి. సొంత వాక్యాలు రాయగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- పద్య పాదాల్లోని సంధులను గుర్తించి సూత్రాలను రాయగలగాలి. పద్యపాదాల్లోని ఛందో భేదాలను గుర్తించి సమన్వయం చేయగలగాలి. సీస పద్య లక్షణాలను తెలుసుకొని అన్వయించగలగాలి.

✤ ✤ ✤

## ఉపాధ్యాయుల కరదీపిక

**పాఠం పేరు :** 12. భూమిక **రచయిత పేరు :** గూడూరి సీతారాం

**ప్రక్రియ :** ముందుమాట / పుస్తకపరిచయం

**ఉద్దేశం :** ఒక గ్రంథ నేపథ్యాన్ని లక్ష్యాలను రచయితగాని మరొకరుగాని పరిచయం చేస్తూ రాసే విశ్లేషణాత్మక పరిచయ వాక్యాలు పీఠిక, ముందుమాట, భూమిక, ప్రస్తావన, మున్నుడి, ఆముఖం పేర్లతో పిలవబడుతున్నాయి. ఈ వాక్యాలు చదవడం ద్వారా గ్రంథముపై ప్రాథమిక అవగాహన కలిగి చదవాలనే కుతూహలం ఎలా ఏర్పడుతుందో విద్యార్థులకు తెలియజేయడమే ఈ పాఠ్యభాగ ఉద్దేశ్యం.

**సాధించాల్సిన సామర్థ్యాలు :**

### I. అవగాహన ప్రతిస్పందన :

**i) వినడం – మాట్లాడడం :**

- కవులు రచయితలు రాసిన పుస్తకాల ఆవిష్కరణ వంటి కార్యక్రమాలలో ఏమేం చేస్తారో విద్యార్థి చెప్పగలగాలి. నేటి సమాజానికి ఎటువంటి రచయితల అవసరమున్నదో చెప్పగలగాలి.

**ii) చదువడం – రాయడం :**

- పాఠంలోని ఏ పేరాలో దేన్ని గురించి వివరించబడిందో పట్టికను పూరించగలగాలి.

### II. వ్యక్తీకరణ – సృజనాత్మకత :

**i) స్వీయరచన :**

- అడిగిన ప్రశ్నలకు తగు విధమైన జవాబులు రాయగలగాలి. పుస్తక పరిచయాన్ని చదివి పుస్తకం గురించి ఆమూలాగ్రంగా అర్థం చేసుకోవచ్చని వివరిస్తూ రాయగలగాలి. పాఠ్యభాగమాధారంగా కేశవస్వామి రచనలగూర్చి రాయగలగాలి.

**ii) సృజనాత్మకత :**

- గ్రంథాలయంలోని ఏదయినా ఒక కథల పుస్తకం చదివి దానికి పుస్తక పరిచయం రాయగలగాలి.

### III. భాషాంశాలు :

**i) పదజాలం :**

- గీత గీసిన పదాలకు అర్థాలు రాయగలగాలి. ఇచ్చిన పదాలను వివరించగలగాలి.

**ii) వ్యాకరణాంశాలు :**

- ఇవ్వబడిన పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాలను గుర్తించగలగాలి. ప్రత్యక్ష వాక్యాలను పరోక్ష వాక్యాలుగా మార్చగలగాలి. కర్తరి వాక్యాలను కర్మణి వాక్యాలుగా మార్చగలగాలి. శ్లేషాలంకారం గురించి తెలుసుకొని ఇచ్చిన వాక్యాల్లో దానిని గుర్తించి సమన్వయం చేయగలగాలి.

❀ ❀ ❀

# Chapter-III

## పాఠాల వారీగా విశేషాంశాలు - వివరణలు

భాష అంటే ఆలోచించడం, వ్యక్తీకరించడం. దానికి పదజాలం మీద పట్టు సాధించగలిగినప్పుడే సృజనాత్మక వ్యక్తీకరణ సాధ్యమవుతుంది. సాహిత్యపరంగా, వృత్తిపరంగా, ఎన్నో పదాలున్నాయి. వాటిపై అవగాహన కలిగినప్పుడే సందర్భోచితమైన వినియోగం జరుగుతుంది.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు నూతనంగా తయారైన తెలుగు వాచకములలో వివిధ ప్రక్రియలలో రాసిన పాఠాలున్నాయి. ఆ పాఠాలలో తెలుగు వాచకములలో సాహిత్యపదాలు, మాండలిక పదాలు, వృత్తి సంబంధ పదాలు, ఎన్నో ఉన్నాయి. ఈ ప్రత్యేక పదజాలం గురించి తెలుసుకుంటే బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించగలము. కొన్ని పదాల వివరణలు పాఠ్యపుస్తకాల్లో ఇచ్చారు. పాఠ్యపుస్తకంలో ఇవ్వబడని ఆ ప్రత్యేక పదాలకు వివరణలు తెలుసుకుందాం.

### 6వ తరగతి

#### లేఖ

**1. నాగార్జున కొండ**

శాతవాహన రాజు యజ్ఞశ్రీ శాతకర్ణి శ్రీపర్వతంపై బౌద్ధ విద్యాలయం కట్టించి నాగార్జునుడిని అధ్యాపకునిగా నియమించాడు. ఆచార్య నాగార్జునుని ప్రతిభవల్ల ఈ విశ్వవిద్యాలయానికి నాగార్జున విశ్వవిద్యాలయమని, శ్రీ పర్వతానికి నాగార్జున కొండ అనే పేర్లు స్థిరపడ్డాయి.

**2. వేయిస్థంబాల గుడి**

11వ శతాబ్దంలో కాకతీయ రుద్రదేవునిచే వరంగల్‌లో నిర్మించబడ్డ ఆలయం. కాకతీయులు శిల్పకళతో అలరారే ఈ త్రికూటాలయంలో నక్షత్రాకార పీఠంపై రుద్రేశ్వరుడు ప్రధాన అర్చామూర్తిగ లింగ రూపంలో కొలువైనాడు. కళ్యాణమంటపం, ప్రధానాలయాన్ని కలిపి వేయిస్థంబాలతో నిర్మించిన కారణంగానే ఈ ఆలయానికి వేయిస్థంభాలగుడి అని ప్రసిద్ధి.

### 3. గద్వాలకోట

అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ కోట మహబూబ్ నగర్ జిల్లాలో ఉంది. దీనిని రాజా పెదసోమభూపాలుడు (నలసోమనాద్రి) 1662లో నిర్మించాడు. గద్వాల సంస్థానాధీశులు కళా ప్రియులు కావడంవల్ల ఈ కోటలో ప్రతి సంవత్సరం సంగీత, సాహిత్య సభలు జరిగేవి.

### 4. జినవల్లభుడు

తెలుగు భాషకు ప్రాచీన హోదా కట్టబెట్టిన తొలి కందపద్యాలు రాసిన కవి జినవల్లభుడు. కరీంనగర్ జిల్లాలోని కుర్క్యాల గ్రామంలో వృషభగిరి అనే బొమ్మలమ్మ గుట్టపై ఈ పద్యాలు చెక్కబడి ఉన్నాయి. ఈ శాసనం 945లో వేయించింది. తద్వారా జినవల్లభుడు నన్నయకన్నా పూర్వపు వాడని రుజువు అవుతున్నది.

### 5. శాతవాహనులు

దక్షిణ మరియు మధ్య భారతదేశాన్ని పరిపాలించిన వారు శాతవాహనులు. వీరి తొలి రాజధాని కోటిలింగాల. వీరిపాలన క్రీ.పూ. 230 నుండి మొదలై సుమారు 450 సం॥ కొనసాగింది.

## శతక సుధ

### 1. కౌరవేంద్రుడు

వందమంది కౌరవ సోదరులు మరియు ఒక సోదరి (దుస్సల) మొత్తం 101 మంది సంతానాన్ని పొందిన వాడు కౌరవేంద్రుడు. (ధృతరాష్ట్రుడు). ఈయన విచిత్ర వీర్యుని కుమారుడు. పాండురాజు సోదరుడు.

### 2. శుకుడు

శుక మహర్షి వేదవ్యాసుని కొడుకు. అన్ని వికారాలకు అతీతమైనవాడు పరీక్షిన్మహారాజుకు భాగవతం బోధించినవాడు.

## పోతన బాల్యం

### 1. హరికథ

"ధర్మ అధర్మాలను, సర్వజన మనోరంజకంగా నృత్యగీత వాద్యాలతో ఉపన్యసించడమే హరికథ. ఉపన్యసించేవాడే కథకుడు. దైవభక్తి, సత్యము, భూతదయ హరికథల్లోని ముఖ్యాంశాలు" – ఆదిభట్ల నారాయణ దాసు.

## ఉడుతసాయం

### 1. నలుడు

దేవశిల్పి అయిన విశ్వకర్మ యొక్క కుమారుడు నలుడు. శ్రీరాముడు లంకను చేరడానికి వారధి నిర్మాణం నలుని ఆధ్వర్యంలోనే జరిగింది.

## చెరువు

### 1. "పరోపకారార్థ మిదంశరీరం"

పరోపకారాయ ఫలంత వృక్షాః
పరోపకారాయ వహతి నద్యః।
పరోపకారాయ చరంతి గావః
పరోపకారార్థమిదం శరీరం॥

పరులకొరకే చెట్లు పళ్ళనిస్తున్నాయి. నదులు ఇతరుల కోసమే ప్రవహిస్తున్నాయి. గోవులు ఇతరుల కొరకే పాలనిస్తున్నాయి. ఈ శరీరం ఇతరులకు మేలు కల్గించుటకే ఉన్నది కదా!

### 2. అతిసర్వత్ర వర్జయేత్

అతి దానాత్ బలిర్బర్ధో:
అతిమానాత్ సుయోధనః।
వినష్టో రావణో తాల్యాత్
అతి సర్వత్ర వర్జయేత్॥

అతిదానం వల్ల బలిచక్రవర్తి, మిక్కిలి అహంభావంవల్ల సుయోధనుడు, అధిక తౌల్యంవల్ల రావణుడు నశించారు. కావున దేనియందైనా 'అతి' మంచిదికాదు.

**3. విరాటపర్వం**

మహా భారతంలోని 4వ పర్వమిది తిక్కన తేటతెలుగుదనం (ఆది, సభా, ఆరణ్య పర్వాలు) తరవాత ఈ పర్వంలో అడుగడుగునా కన్పిస్తుంది. సభాపర్వంలో భంగపడ్డ పాండవులు ఒప్పందం ప్రకారం పన్నెండేళ్ల అరణ్యవాసం పూర్తిచేసిన తర్వాత ఒక సం॥ అజ్ఞాతంగా విరాటరాజు కొలువులో గడపడమే ఈ పర్వంలోని కథాంశం. వర్షాలు కురవడానికి విరాట పర్వం చెప్పించడం, పారాయణం చేయించే సంప్రదాయం ఉంది.

## 7వ తరగతి

### చదువు

**1. సారస్వతం**

సరస్వతీ సంబంధమైనది సారస్వతం. అఖితమైన లేదా గ్రంథస్థమైన ఏ అంశమైనా సారస్వతమని పరిగణిస్తున్నాం సారస్వతం, సాహిత్యం, వాఙ్మయం అనేది సమానార్థకాలుగానే వ్యవహరిస్తున్నారు. చదువును జ్ఞానాన్ని, పాండిత్యాన్ని సారస్వతం అంటున్నాం.

**2. ధ్రువాప్రబంధం**

ప్రబంధ విశేషం. గీత ప్రబంధ కావ్యమిది. సంగీత నాట్య సాహిత్య సమ్మిళితమైనది.

### శతకసుధ

**1. అమృతం**

దేవదానవులు క్షీరసాగర మథనం చేస్తున్నప్పుడు వెలువడ్డది అమృతం. అమృతం సేవిస్తే మరణం ఉండదు. అమృతాన్ని విష్ణువు మోహినీ అవతారమూర్తియై దేవతలకు మాత్రమే పంచాడు.

### అమ్మజ్ఞాపకాలు

**1. ఆయుర్వేదం**

వనమూలికల ఔషధాల ద్వారా చికిత్స చేసి ఆయుష్షును పెంచే వైద్య విధానం ఆయుర్వేదం. అథర్వణ వేదానికి ఇది ఉపవేదం. "ఆయువిందతి వేత్తివా ఆయుర్వేదః" అని నానుడి. అంటే ఆయువును గూర్చిన విజ్ఞానమని అర్థం.

**2. వరాహవతారం**

దశావతారాల్లో మూడో అవతారం (మత్స్య, కూర్మ అవతారాల తరువాత) హిరణ్యాక్షుడనే రాక్షసుణ్ణి వధించడానికి విష్ణుమూర్తి ఎత్తిన అవతారమిది.

### పల్లె అందాలు

**1. అర్ఘ్యం**

చేతులు కడుక్కోవడానికి ఇచ్చేనీళ్ళు, సూర్యుని కోసం సమర్పించే నీళ్ళను కూడా అర్ఘ్యం అని వ్యవహరిస్తారు. షోడశోపచారాల్లో అర్ఘ్యం ఒకటి.

## ప్రేరణ

### 1. కంచి పరమాచార్య

కంచి కామకోటి పీఠం యొక్క జగద్గురు పరంపరలో 68వ వారు శ్రీ చంద్రశేఖర సరస్వతి. (20-05-1894 - 8-01-1994) వీరు పరమాచార్య, మహాస్వామి నడిచే దేవుడు, మున్నగు పేర్లతో పిలువబడతారు.

### 2. టాల్‌స్టాయ్ (9-9-1828 - 20-11-1910)

ప్రఖ్యాత రష్యన్ రచయిత. సుప్రసిద్ధ నవలాకారుడు, వార్ అండ్‌పీస్, అన్నాకెరీనినా మొదలగు సుప్రసిద్ధ రచనలు చేసిన రచయిత.

### 3. హార్డీ

సుప్రసిద్ధ ఆంగ్ల నవలారచయిత. ఇతని పూర్తిపేరు థామస్ హార్డీ. దిపూర్ మ్యాన్ అండ్ ది లేడీ, ఎఫైర్ ఆఫ్ బ్లూఐస్ మొదలైనవి ఈయన రచనలు.

### 4. ఏరోనాటికల్ ఇంజనీరింగ్

విమానాల తయారీకి సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం.

## శిల్పి

### 1. అజంతా గుహలు

మహారాష్ట్రలో ఔరంగాబాద్‌కు 55 మైళ్ళ దూరంలో ఉన్న గుహలివి. బుద్ధుని జాతక కథలు కుడ్యచిత్రాలుగా ఉన్న అజంతా గుహలన్నీ భారతీయ చిత్రకళకు నిదర్శనాలు.

# 8వ తరగతి

## సముద్రప్రయాణం

### 1. యునైటెడ్ కింగ్ డమ్

యునైటెడ్ కింగ్‌డమ్ యూరప్ ఖండంలోని స్వతంత్ర రాజ్యం. ఇది ద్వీపసమూహం. యూ.కె. క్రింద నాలుగు దేశాలున్నాయి. అవి ఇంగ్లండ్ వేల్స్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లండ్. వీటన్నిటిని కలిపి గ్రేట్ బ్రిటన్ అని వ్యవహరిస్తారు.

### 2. టెలిగ్రాం

ఒక చోటు నుండి మరొక చోటుకు సమాచారం పంపే సాంకేతిక వ్యవస్థ దీనికి శామ్యూల్ మోర్స్ కనిపెట్టాడు. 1844లో ప్రారంభమైన టెలిగ్రాం సేవలు 15 జూలై 2013న అంతమైనాయి.

### 3. సైక్లోస్టైల్ కాపీ

సైక్లోస్టైల్ ఒకరకమైన ప్రింటింగ్ యంత్రంలాంటిది. 1880లో డేవిడ్ జెస్టనర్ దీనిని కనుగొన్నాడు. సైక్లోస్టైల్ చెయ్యడానికి స్టెన్సిల్ పేపరు, ప్రత్యేకమైన సిరా, అనువైన తెల్లకాగితాలు అవసరం. స్టెన్సిల్ బోర్డును కార్బన్ కాగితంపై పెట్టి రాసినప్పుడు స్టెన్సిల్ కాగితం కత్తిరించబడుతుంది. అప్పుడు స్టెన్సిల్ పేపరు సైక్లోస్టైల్ యంతప్రంపై ఉంచి చక్రాన్ని తిప్పితే ప్రతులు ముద్రించబడతాయి. అలా ముద్రించబడినదే సైక్లోస్టైల్ కాపీ. జిరాక్స్ యంత్రాలు వాడకంలోకి రాకముందు సైక్లోస్టైల్ యంత్రాల ద్వారానే ప్రతుల ముద్రణ జరిగేది.

**4. జిబ్రాల్టర్**

మధ్యధరా సముద్రాన్ని, అట్లాంటిక్ మహా సముద్రాన్ని కలిపే జలభాగమిది. ఆఫ్రికా యూరప్ ఖండాను ఈ జలసంధి కలుపుతుంది. జిబ్రాల్టర్‌కు ఉత్తరంగా స్పెయిన్ ఉంటుంది.

## బండారి బసవన

**1. సురతరువు (కల్పవృక్షం)**

క్షీరసాగర మథనం నుండి ఆవిర్భవించిన వృక్షం. దేవతావృక్షాల్లో ఒకటి. కోరిన వాటిని ప్రసాదించే చెట్టు ఇది.

## అసామాన్యులు

**1. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి**

17వ శతాబ్దిలో కాలజ్ఞానతత్త్వాలను బోధించిన యోగి. హేతువాది సంఘసంస్కర్త సాక్షాత్తూ దైవస్వరూపుడు.

**2. మంత్రసాని**

ప్రసవ సమయంలో సహకరించి పురుడు పోసే స్త్రీని మంత్రసాని అంటారు.

## మంజీర

**1. కుతుబ్ సుల్తాన్**

సుల్తాన్ కులీకుతుబ్‌షా (1496-1543) గోల్కొండ రాజ్యస్థాపకుడు. ఇతడు మధ్యఆసియా (టర్కీ) నుండి వచ్చి, బహమనీ సుల్తానుల కొలువులో చేరి సేనాపతి అయినాడు. అప్పటి తెలంగాణలో తిరుగుబాటుదారులను అణచి, బహుమనీ సుల్తానుల మెప్పుపొంది, కుతుబ్ ఉల్‌ముల్క్ మరణించడంతో అతని స్థానంలో తెలంగాణ ప్రాంతానికి నాయకుడైనాడు.

**2. భాగ్యనగరం**

ఇబ్రహీం కులీకుతుబ్‌షా భార్య అయిన భాగీరథి పేరున నిర్మించిన నగరం భాగ్యనగరం. అదే కాలక్రమేణా హైదరాబాదుగా మారింది. ఇది గోలకొండ పట్టణానికి ఆవల మూసీనది ప్రక్కన నిర్మించబడింది. కాలక్రమంలో గోలకొండవాసులు హైదరాబాదుకు మకాం మార్చుకోవడంతో నగరం విస్తృతమైంది.

**3. మంజీరనది**

గోదావరికి ఉపనది. ఇది మహారాష్ట్ర, కర్ణాటకలలో ప్రవహించి, నైరుతి దిక్కు నుండి నిజామాబాదుజిల్లాలో ప్రవేశించి, కందకుర్తి గ్రామంవద్ద గోదావరిలో కలుస్తున్నది. మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీరు, సాగునీరును అందిస్తున్న జీవనది. ఈ నదీ జలాలు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకూ తాగునీరందిస్తున్నది.

## చిన్నప్పుడే

**1. పటేలు**

అంటే గ్రామాధికారి. ఈ నాయకత్వం నిజాం కాలంలో రెండు విభాగాలుగా ఉండేది. (1) పోలీస్ పటేల్ (రక్షణ విభాగం); (2) మాలీ పటేల్ (రెవిన్యూ విభాగం); గ్రామాధికారుల్లో పట్వారీ (కరణం), పటేల్‌లదే సర్వాధికారం.

**2. సర్కారీ రకం**

ప్రభుత్వ ధనం. అంటే ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులు తదితర రూపేణా సమకూరే ధనం.

**3. గిర్దావరు బరులు**

గిర్దావరు అంటే కొన్ని గ్రామాలకు రెవిన్యూ అధికారి. పాలనాపరంగా, పన్నువసూళ్ళలో తహసీల్‌దారుకు సహాయపాలకుడుగా వ్యవహరించేవాడు. గిర్దావరు 'బరులు' అంటే... పొలాలు. గిర్దావరుకు సంబంధించిన పొలాలు అని అర్థం.

**4. బందెలదొడ్డి**

పశువులను బంధించే దొడ్డి. అక్రమంగా ఎవరి పంటలనైనా, మొక్కలనైనా పశువులు మేస్తే వాటిని బంధిస్తారు. యజమాని గ్రామాధికారికి జరిమానా కడితే వాటిని విడిచిపెడతారు.

**5. శేగిదారు**

గుమాస్తా (ఎల్.డి.సి.)

**6. సేక్సింది**

సుంకరి

## కాపుబిడ్డ

**1. బ్రాహ్మీముహూర్తం**

బ్రాహ్మి అంటే సరస్వతి. ఆమె జ్ఞానానికి, బుద్ధికి ప్రతీక – సాధకులైన వారు ఈ సమయంలో లేచి కార్యసాధనకు శ్రీకారం చుడతారు. భారతీయులందరూ జ్ఞానపిపాసులు. అందరూ ఈ సమయంలోనే లేవడానికి ఇష్టపడతారు. సూర్యోదయానికి నాల్గు గడియల ముందు కాలం (ఘడియకు 24 నిమిషాలు) అనగా ఒక గంట ముప్పై ఆరు నిమిషాల ముందు సమయం.

**2. వజ్రాయుధం**

ఇంద్రుని వద్దగల తిరుగులేని శక్తి గల ఆయుధం. ఇది దధీచి అనే మహర్షి వెన్నెముకతో తయారైంది. చ్యవన మహర్షి కుమారుడు దధీచి. దధీచి భార్య సువర్చ. దేవతలకు రాక్షసులకు తరచూ యుద్ధాలు జరిగేవి. అదను చూసి రాక్షసులు దేవతల ఆయుధాలు లాక్కొని పోతూండేవాళ్ళు. దాంతో దేవతలు తమ ఆయుధాలను దాచిపెట్టుమని ఇచ్చారు. కాని చాలా కాలం వరకు ఆ ఆయుధాల కోసం వాళ్ళు రాలేదు. దాంతో అవి తుప్పుపడుతున్నాయని గమనించి, తన తపశ్శక్తితో వాటిని ద్రవీభవింపజేసి త్రాగేశాడు. తర్వాత ఆయుధాలు అవసరమై దేవతలు దధీచిని అడిగారు. జరిగిన సంగతి తెల్పినాడు దధీచి. ఆ ఆయుధాలన్నీ తన వెన్నెముకలో కలిసిపోయినాయని, దాన్ని ఆయుధంగా మలచుకుంటే తిరుగులేని ఆయుధంగా మారుతుందని తెలిపి, యోగశక్తితో తన శరీరాన్ని దహింపజేసుకొని, వెన్నెముకను దేవతలకిచ్చినాడు. ఆ విధంగా దధీచి వెన్నెముకతో తయారైన వజ్రాయుధం దేవతల రాజైన ఇంద్రుడు ధరించినాడు.

**3. నందనవనం**

స్వర్గంలోని ఇంద్రుని ఉద్యానవనం. ఎంతో అందమైంది. ఆహ్లాదకరమైంది. ఆరోగ్యప్రదమైంది. కల్పవృక్షం, పారిజాతం, మందారం, హరిచందనం, సంతానం తదితర దేవతావృక్షాలకు ఆలవాలమై ఆనందాన్నిచ్చేది. ఇటువంటి భావనకు ప్రతీకగా 'నందనవనం' అని కవులు ప్రయోగించడం పరిపాటిగా మారింది.

## మాట్లాడే నాగలి

**1. క్రయపత్రం**

ఆస్తుల కొనుగోలు సందర్భంగా క్రయవిక్రయదారులు (అమ్మకం, కొనుగోలు చేసే ఇద్దరూ) వ్రాసుకునే ఒప్పందపత్రం. దీన్ని ఆంగ్లంలో 'సేల్ డీడ్' అంటారు. ఇందులో ఇద్దరి చిరునామా, పరిచయం, ఆస్తి విలువ, చెల్లింపు విధం, సాక్షుల సంతకాలు ఉంటాయి.

**2. ఈస్టర్ పండుగ**

శుక్రవారం రోజు శిలువ వేయబడిన ఏసుక్రీస్తు ఆదివారం నాడు పునరుజ్జీవితుడైనాడు. ఆ రోజును క్రైస్తవులు పండుగదినంగా జరుపుకుంటారు. అదే ఈస్టర్ పండుగ.

## 9వ తరగతి

### ధర్మార్జునులు

**1. దేవతావృక్షాలు (5)**

(1) కల్పతరువు; (2) పారిజాతం; (3) హరిచందనం; (4) సంతానం; (5) మందారం.

### నేనెరిగిన బూర్గుల

**1. జాగీర్‌దారీ**

భూస్వామ్యం / జాగీర్దారు - భూస్వామి.

**2. కౌలుదారీ చట్టం**

పొలం సాగుచేసే రైతుకు ఇవ్వవలసిన ప్రతిఫలానికి సంబంధించిన వివరాలు తెలిపే నియమావళి.

### వలసకూలీ

**1. గోకులాష్టమి**

శ్రీకృష్ణ జన్మాష్టమి. ఇది శ్రావణ బహుళాష్టమి నాడు వచ్చే పండుగ. వర్షాలు విరివిగా కురుస్తాయి. చెరువులు, కుంటలు నిండుతాయి. వాగులు వంకలు నీటితో కళకళలాడుతుంటాయి.

**2. మన్నెంకొండ**

మహబూబ్‌నగర్ జిల్లాలోని మండలంలోని శ్రీ వేంకటేశ్వర క్షేత్రం.

### రంగాచార్యతో ముఖాముఖి

**1. పోలీస్ యాక్షన్ (1948)**

భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా హైదరాబాదు సంస్థానాధీశులు అఖండభారత దేశంలో విలీనం కావడం ఇష్టపడక స్వతంత్ర రాజులుగా చలామణికావాలని చూశారు. అటువంటి సంస్థానాలను దేశంలో విలీనం చేయడానికి సర్దార్‌పటేల్ చేపట్టిన సైనిక చర్య.

**2. వాల్మీకి**

రామాయణాన్ని సంస్కృతంలో రచించిన కవి. ఇతర అన్నిభాషల్లోని రామాయణాలకు ఈయన రచనే మూలం.

**3. వ్యాసుడు**

వేదవ్యాసుడుగా, కృష్ణద్వైపాయనుడుగా సుప్రసిద్ధుడు. నాల్గువేదాలను విభజించడమేగాక. పంచమవేదంగా పిలువబడే మహాభారత రచన (సంస్కృతం) చేసినవాడు.

**4. కాళిదాసు**

సంస్కృతకవుల్లో సుప్రసిద్ధుడు. రఘువంశం, మేఘసందేశం, వంటి అద్భుత కావ్యాలందించినవాడు. 'ఉపమాలంకార' ప్రయోగానికి పేరు ('ఉపమా కాళిదాసస్య' అని ప్రసిద్ధి).

**5. గోర్కీ**

ఆంగ్ల రచయిత. ఇతడు వ్రాసిన 'అమ్మ' నవల 130 భాషల్లోకి అనువదించబడింది.. పూర్తిపేరు మాగ్జింగోర్కీ.

**6. చెకోవ్**

ప్రపంచప్రసిద్ధ రష్యన్ రచయిత. పూర్తిపేరు అంటోన్ పావ్లోవిచ్ చకోవ్ (1860-1904).

**7. డికెన్సు**

ప్రసిద్ధ ఆంగ్ల నవలా రచయిత. పూర్తిపేరు చార్లెస్ డికెన్స్ (1812-1870). ప్రజాభిమానాన్ని చూరగొన్న రచయిత ప్రసిద్ధ రచన. 'ఎ టేల్ ఆఫ్ టూ సిటీస్' (1859).

### 8. ప్రేమ్‌చంద్

హిందీలో గొప్ప నవలలు, కథలు రాసిన రచయిత. ఈయన రచనలు వివిధ భాషల్లోకి అనువదించబడ్డాయి. (చదరంగం, రంగభూమి మొ॥ నవలలు) మానవ మనస్తత్వాలు, మానవ సంబంధాలు చిత్రించడంలో అందవేసిన చేయి.

### 9. ఉన్నవలక్ష్మీనారాయణ

సంఘసంస్కర్త, స్త్రీవిద్యను ప్రోత్సహించడంకోసం గుంటూరులో 'శారదానికేతన్' సంస్థను నడిపినవారు.

### 10. విశ్వనాథ సత్యనారాయణ

ప్రముఖ కవి, నవలాకారుడు, నాటకకర్త, కథారచయిత. తొలి జ్ఞానపీఠ అవార్డు (రామాయణ కల్పవృక్షం) పొందినవారు. వేయిపడగలు మరో ప్రసిద్ధరచన.

### 11. అల్లం రాజయ్య

తెలంగాణ జనజీవనాన్ని, పోరాటాన్ని చిత్రించిన ప్రముఖ కథారచయిత, పాత్రికేయులు...

## శతకమధురిమ

### 1. కులశైలములు - కుల పర్వతాలు. ఇవి ఏడు-

(1) మహేంద్ర; (2) మలయు; (3) సహ్య, (4) మాల్యవంత; (5) ఋక్ష; (6) వింధ్య; (7) పారియాత్ర.

మరికొన్ని చోట్ల వీటికి పాఠాంతరంగా కింది పర్వతాలపేర్లు కనిపిస్తున్నాయి.

(1) ఉదయ; (2) అస్త; (3) హిమ, (4) వింధ్య; (5) మేరు; (6) త్రికూట; (7) లోకాలోక.

## దీక్షకు సిద్ధంకండి

### 1. సత్యాగ్రహం

స్వాతంత్ర్యోద్యమంలో కీలక ఘట్టం. 1930లో శాసనోల్లంఘనకు పాల్పడ్డ పాలకులపై సత్యమైన పాలన సాగాలని గాంధీజీ నాయకత్వంలో రూపుదిద్దుకున్న ఉద్యమం. దీన్నే ఉప్పు సత్యాగ్రహం (ఉప్పు మీద పన్నువేయడాన్ని వ్యతిరేకించడం) అని కూడా అంటారు.

### 2. పికెటింగు

ఉద్యోగులు / ప్రజలు ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిర్ణీత కాలంలో తెలిపే నిరసన.

### 3. బ్రహ్మరాక్షసుడు

దుష్టకర్మల చేత రాక్షసుడుగా మారిన బ్రాహ్మణుడు (అతిగా పీడించే దుర్మార్గుడు)

## చెలిమి

### 1. యయాతి

చంద్రవంశపు రాజు. ప్రియంవదానహుషుల కుమారుడు. దేవయాని, శర్మిష్ఠలు ఇతని భార్యలు. దేవయాని ద్వారా యదువు. తుర్వసవులను, శర్మిష్ఠ ద్వారా ద్రుహ్యువు. అనువు. పూరుడు అనే కుమారులను పొందినవాడు.

### 2. దేవయాని

శుక్రాచార్యుని కుమార్తె

### 3. శుక్రాచార్యుడు

రాక్షసుల కులగురువు

### 4. శర్మిష్ఠ

రాక్షస రాజైన వృషపర్వుని కుమార్తె.

## ఉద్యమస్ఫూర్తి

**1. అప్రూవర్**

ఒక సంస్థకు / వ్యక్తులకు సంబంధించిన విషయాలను (నిజాలను) పోలీసులకు అందించే వ్యక్తి.

**2. మారెమ్మ**

జనావాసాలను అంతం చేయగల భయంకర వ్యాధిరూపం / జనక్షయకారకమైన రోగం. ఇది అంటువ్యాధి.

## కోరస్

**1. కోరస్ (అందుకోవడం)**

గాయకబృందం. ఒకే స్వరంతో, ఒకే శ్రుతిలో అందరూ కలిసిపాడటం / పాడేవాళ్ళు.

## వాగ్భూషణం

**1. ఊనికతో పలకడం**

స్ట్రెస్‌తో (నొక్కి) పలకడం.

**2. తర్కబద్ధం**

హేతుబద్ధతను అనుసరించి ఉండటం.

## వాయసం

**1. కాకి - ఒంటి చూపు**

రామాయణంలో కాకాసురుడనే రాక్షసుడు సీతను వేధించబోతే రాముడు బాణంతో అతడ్ని సంహరించబోతాడు. తనతప్పు క్షమించుమని కాకాసురుడు ప్రాధేయపడగా, ఎక్కుపెట్టిన బాణాన్ని ఉపసంహరించలేనని, నీ ప్రాణం తీయకుండా ఈ బాణంతో ఒక కంటిని మాత్రం తొలగిస్తానని - కాకిని ఒంటికంటిదాన్ని చేశాడని రామాయణ కథనం. లౌకికంగా చూసినప్పుడు కాకి ఒక కన్నుతో చూడటం మనం గమనించవచ్చు. కాకి లక్షణాన్ని బట్టే కథను అనుసంధానం చేసి ఉండవచ్చు.

**2. పిండప్రదానంలో కాకి**

పితృదేవతలకు శాస్త్రోక్తంగా పిండ (అన్నం ముద్ద) ప్రదానం చేయడం (మరణానంతరం సమర్పించే ఆహారం) భారతీయ సంస్కృతిలో భాగం. ఆ విధంగా సమర్పించిన పిండం (ఆహారం) - పితృదేవతలు కాకిరూపంలో వచ్చి స్వీకరిస్తారనేది నమ్మకం.

# Chapter-IV

## పాఠ్యపుస్తక వినియోగం - బోధనాభ్యసన ప్రక్రియలో మార్పులు

2010 సం॥లో నూతన పాఠ్యపుస్తకాలు పరిచయం చేస్తూ కరదీపికలను కూడా ఇవ్వడం జరిగింది. మూస పద్ధతిలో బోధనకు స్వస్తిపలికి జ్ఞాన వినిమయంలో కొత్తపోకడలను అనుసరించాలనే ఉద్దేశ్యంతో వీటి నిర్మాణం జరిగింది. తరగతి గదిలో విద్యార్థి కేంద్రీకృతంగా పాఠ్యబోధన జరగడం, విద్యార్థి స్వేచ్ఛగా జ్ఞానార్జన చేయడం, తరగతి గదితోపాటు పరిసర వనరులన్నిటిని ఈ ప్రక్రియను దృఢతరం చేయడానికి వినియోగించుకోవడం, సంపాదించిన జ్ఞానాన్ని నిత్య వ్యవహారానికి ఉపయోగించడం, ఆలోచన, విశ్లేషణ విమర్శ, సృజన మొ॥ భాషా ప్రయోజనాలను సాధించడం లక్ష్యంగా పాఠ్యపుస్తకాలు, కరదీపికలు రూపొందించబడ్డాయి.

**మరి వాస్తవంగా జరిగిందేమిటి?**

ప్రస్తుత తరగతి గది నిర్వహణలో గమనించిన లోపాలు

- ప్రణాళికను పట్టించుకోకుండా సిలబస్‌పైనే దృష్టిపెట్టడం.
- ఉపాధ్యాయ కేంద్రీకృత విధానం నుండి బోధన బయటపడకపోవడం.
- అభ్యాసాల సాధన సరిగా నిర్వహింపబడకపోవడం.
- గైళ్ళు, స్టడీ మెటీరియల్‌ల ఊబిలో నుంచి బయటపడలేకపోవడం.
- విద్యార్థులు సొంతంగా రాయడాన్ని ప్రోత్సహించకపోవడం.
- 8వ తరగతి వరకు నిర్దేశించిన స్వీయమూల్యాంకనం (నేనివి చేయగలనా) పట్టించుకోకపోవడం.
- పాఠ్య బోధన చర్యలో తప్పకుండా అడగవలసిన ప్రశ్నలను నిర్లక్ష్యం చేయడం. (నిర్వహించకపోవడం),..
- స్వీయరచన, సృజనాత్మక ప్రశ్నల సాధనలో తగు అవగాహన కల్పించకపోవడం. మాదిరి చూపించకపోవడం.
- పాఠ్యబోధనకు, తరగతి నిర్వహణకు బాగా ఉపకరించే ఉపాధ్యాయ సూచనలు, విద్యార్థి సూచనలు, సాధించవలసిన సామర్థ్యాలు, ముందుమాట మొ॥ కీలకమైన అంశాలు అధ్యయనం చేయకపోవడం.

**ఈ కారణంగా ఎదురైన పరిణామాలు**

- బోధనాలక్ష్యాలు నెరవేరడం లేదు.
- సామర్థ్యాల సాధన జరగడంలేదు.
- విద్యార్థులు చదివిన దానిని విశ్లేషించలేకపోతున్నారు, విమర్శించలేకపోతున్నారు. అభిప్రాయాలు జోడించలేకపోతున్నారు.
- విన్న విషయాన్ని భావం చెడకుండా చెప్పలేకపోతున్నారు.
- భాషను నిత్యజీవితంలో సముచితంగా వినియోగించుకోలేకపోతున్నారు.
- ఉపాధ్యాయులు పుస్తకం తాత్త్వికతను అర్థంచేసుకోలేక, తదనుగుణంగా బోధనా ప్రక్రియను నిర్వహించడంలో విఫలమౌతున్నారు.
- గైళ్ళు, స్టడీమెటీరియల్‌లపై ఆధారపడుతున్నారు. ఈ విషయంలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. అందువల్ల ఆలోచనాశక్తిని హరిస్తున్నారు.
- బోధనా ప్రక్రియను సమర్థంగా నిర్వహించడానికి అవసరమైన పాఠ్యపుస్తకం, కరదీపిక ఇతర వనరులు అందుబాటులో ఉన్నా, సక్రమంగా వినియోగించుకోలేక పోవుచున్నారు.
- భాషాధ్యయనం పరీక్షలు రాయడానికో, మానసికంగా ఆనందించడానికో పరిమితం కాదనే విషయం గ్రహించలేకపోతున్నారు.

**బోధనాభ్యసన ప్రక్రియ సమర్థంగా నిర్వహింపబడాలంటే రావలసిన మార్పులు**

- పిల్లల భాగస్వామ్యానికి పెద్దపీట వేయాలి.
- తరగతి గదిలో చర్చలు ఆసక్తికరంగా నిర్వహించపడాలి. పిల్లల అభివ్యక్తికి ప్రాధాన్యతనివ్వాలి.
- తరగతి గది నిర్వహణ అర్థవంతంగా సాగేందుకు అవసరమయ్యే (ఆలోచనాత్మక, భావప్రకటనకు అవకాశమిచ్చే) ప్రశ్నలు తయారుచేసుకొని, వాటిని సరిగా వినియోగించాలి.
- ప్రణాళికను ముందుగా సిద్ధం చేసుకొని దాన్ని అనుసరించాలి.
- ప్రణాళికననుసరించి బోధనా వనరులను సిద్ధం చేసుకోవాలి.
- సాంకేతిక విజ్ఞానాన్ని బోధనాభ్యసన ప్రక్రియకు అనుసంధానం చేసుకోవాలి.
- పాఠం అమరిక క్రమాన్ని అనుసరించి పీరియడ్ల విభజన, పీరియడ్లలో నిర్వహించాల్సిన నిర్దేశిత అంశాలను ఖచ్చితంగా నిర్వహించడం. అంటే ఉన్ముఖీకరణ; పఠనం; పాఠ్యభాగ పరిచయం; పాఠ్యబోధన చర్చ; సామర్థ్యాల సాధన మొ॥వి విభజించిన కాలాంశాలకనుగుణంగా నిర్వహించాలి. కాలాంశాల వారి పాఠ్యబోధనచర్చకు నిర్దేశించిన ప్రశ్నలను తప్పక వినియోగించాలి.
- స్వీయ మూల్యాంకనాన్ని అనుసరించి విద్యార్థులలో 80% కనీస సామర్థ్యాలు సాధిస్తేనే, తదుపరి పాఠానికి వెళ్ళాలి.
- అక్షర దోషాల కంటే భావవ్యక్తీకరణకే ప్రాధాన్యతనివ్వాలి. విద్యార్థుల అక్షరదోషాలు సవరించడానికి ప్రత్యేక పద్ధతులను అనుసరించాలి.

## పాఠ్యపుస్తక వినియోగం - బోధనాభ్యసన ప్రక్రియ

పుస్తకంలోని ముందుమాట, ఉపాధ్యాయులకు సూచనలు, విద్యార్థులకు సూచనలు, సాధించాల్సిన సామర్థ్యాలు ప్రతి ఉపాధ్యాయుడు విధిగా చదివి కీలక భావనలు అర్థంచేసుకోవాలి. పుస్తకం యొక్క తాత్త్వికతను అవగాహన చేసుకొని తదనుగుణమైన బోధనాభ్యసన ప్రక్రియను నిర్వహించాలి.

విద్యా సంవత్సరంలోని పనిదినములను దృష్టియందుంచుకొని వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళికలను రూపొందించుకోవాలి.

### పాఠ్యప్రణాళిక స్థూల విభజన

| | | |
|---|---|---|
| మొదటి కాలాంశం | : | ఉన్ముఖీకరణ, ఉద్దేశం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయం. |
| రెండవ కాలాంశం | : | అర్థసంగ్రహణం (పఠన కృత్యాలు : మౌన, ఆదర్శ, ప్రకాశ), ప్రవేశిక. |
| మూడవ కాలాంశం | : | పాఠ్యభాగబోధన - చర్చ స్వీయరచన చిన్నప్రశ్నలు. |
| నాల్గవ కాలాంశం | : | పాఠ్యభాగబోధన - చర్చ స్వీయరచన చిన్నప్రశ్నలు. |
| ఐదవ కాలాంశం | : | పాఠ్యభాగబోధన - చర్చ స్వీయరచన చిన్నప్రశ్నలు. |
| ఆరవ కాలాంశం | : | ఇవిచేయండి - అభ్యాసాలు - వినడం మాట్లాడటం. |
| ఏడవ కాలాంశం | : | చదువడం, రాయడం. |
| ఎనిమిదవ కాలాంశం | : | స్వీయరచన (వ్యాసరూప సమాధానం) |
| తొమ్మిదవ కాలాంశం | : | సృజనాత్మకత / ప్రశంస |
| పదవ కాలాంశం | : | భాషాంశాలు (పదజాలం) |
| పదకొండవ కాలాంశం | : | వ్యాకరణాంశాలు |
| పన్నెండవ కాలాంశం | : | నేనివి చేయగలనా? |

పై కాలాంశ విభజననుసరించి తరగతి గదిలో బోధన నిర్వహించాలి - విద్యార్థుల స్థాయి, పాఠం కాఠిన్యతను బట్టి కాలాంశాలకేటాయింపులో హెచ్చుతగ్గులు చేసుకోవచ్చు.

### పాఠం - విభాగాలు

బోధనా ప్రక్రియను అనుసరించి ఒక పాఠం స్థూలంగా నాలుగు భాగాలుగా విభజించడమైనది.

### I. మొదటిభాగం :

ఉన్ముఖీకరణ, నేపథ్యం / ఉద్దేశం, కవిపరిచయం మరియు ప్రవేశికలను మొదటి భాగంగా చెప్పుకోవాలి.

ఉన్ముఖీకరణ కేవలం పాఠ్యభాగశీర్షిక రాబట్టడం కొరకే అని భావించవద్దు. ఈ అంశం విద్యార్థులను పాఠంవైపు మళ్లించడానికి దోహదపడుతుంది.

కవిపరిచయం కేవలం నామమాత్రంగా పరిచయం చేయడం కాదు. కవి జీవిత విశేషాలతోపాటు కృషి, శైలిని తెలపడం ద్వారా, సాహిత్యాభిలాష పెంపొందించే విధంగా ఉండాలి.

పై అంశాలు విద్యార్థులచే చదివించి, వారితో చర్చించి తగిన ప్రశ్నలను అడగడం ద్వారా కీలకఅంశాలపై అవగాహనను కల్గించాలి.

## II. పఠనకృత్యం - (అర్థసంగ్రహణ) :

తరగతి మొత్తంగా పిల్లలందరిచేత పాఠం మొత్తం చదివించాలి (మౌన పఠనం). అర్థంగాని పదాలను గుర్తించి వాటి అర్థాలు పదపట్టిక, నిఘంటువు, మిత్రులు, ఉపాధ్యాయులను వనరులుగా చేసుకొని తెలుసుకొనేట్టుచేయాలి. అవసరమైతే ఉపాధ్యాయుడు పాఠం చదివి పదాలను గుర్తించేటట్లు చేయాలి.

## III. పాఠం బోధించడం :

బోధన అంటే కేవలం విషయపరిజ్ఞానాన్ని ఉన్నది ఉన్నట్టుగా అందించడం కాదు. ఇందులో నాలుగు ప్రధానాంశాలున్నాయి.

i) పాఠ్యాంశం చర్చద్వారా వివరించడం ద్వారా సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ద్వారా విద్యార్థులకు పూర్తిగా అవగాహన కల్గించడం.

ii) అవగాహన చేసుకొన్న అంశాన్ని గురించి విద్యార్థులను ఆలోచింపచేయడం (ప్రశ్నల ద్వారా)

iii) విద్యార్థుల భావవ్యక్తీకరణకు అవకాశం కల్పించడం.

iv) విద్యార్థులకు ప్రశ్నించే స్వేచ్ఛను కల్పించడం. బాక్స్‌ల్లో ఉండే ప్రశ్నలను, అడగాలి. వీటికి జవాబులు చెప్పించాలేకానీ రాయించకూడదు.

తద్వారా పాఠ్యాంశంపై పట్టుసాధించి నిత్యజీవితంలో వినియోగించుకోగలిగేటట్లు చేయడం.

## IV. ఇవిచేయండి (అభ్యాసాలు) :

సామర్థ్యాల సాధనకోసం ఉద్దేశించిన అభ్యాసాలు అర్థవంతంగా నిర్వహింపబడాలి. 6, 7, 8 తరగతులలో పేర్కొన్న సామర్థ్యాలు. (1) వినడం మాట్లాడటం (2) చదువడం రాయడం (3) స్వీయరచన (4) సృజనాత్మకత / ప్రశంస (5) పదజాలం (6) వ్యాకరణాంశాలు. 9, 10 తరగతులలో పై ఆరు అంశాలు మూడు విభాగాలుగా చేయడం జరిగింది. I. అవగాహన ప్రతిస్పందన (వినడం - మాట్లాడటం - చదువడం - రాయడం), II. వ్యక్తీకరణ, సృజనాత్మకత (స్వీయరచన, సృజనాత్మకత / ప్రశంస), III. భాషాంశాలు (పదజాలం, వ్యాకరణాంశాలు)

## V. సామర్థ్యాల సాధన - నిర్వహణ విధానము :

1. **వినడం - మాట్లాడటం :** విద్యార్థులు విన్న విషయాన్ని, పాఠ్యాంశాన్ని అవగాహనచేసుకొని, సొంత అభిప్రాయాలను జోడిస్తూ, సూచించిన అంశంపైన స్వేచ్ఛగా, ధారాళంగా మాట్లాడగలగాలి.

   ఇది తరగతి కృత్యంగా నిర్వహించాలి. విద్యార్థులందరూ పాల్గొనేటట్టు చూడాలి.

   ఉపాధ్యాయుడు వాచిక దోషాలను సవరించాలి.

2. **చదువడం - వ్యక్తీకరించడం (రాయడం) :** పాఠ్యాంశ భాగాలు, అపరిచిత గద్యపద్యభాగాలు సొంతంగా చదివి అర్థం చేసుకొని ప్రశ్నలకనుగుణమైన సమాధానాలు రాయగల్గాలి (వ్యక్తీకరించగల్గాలి)

   ఇది తరగతిగదిలో వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి.

3. **స్వీయరచన :** ప్రశ్నల స్వభావాన్ని అర్థం చేయించాలి. కీలకాంశాలను చర్చించాలి. విద్యార్థుల అభిప్రాయాలకు అవకాశాలను కల్పించాలి.

లఘు సమాధాన ప్రశ్నలను, సంబంధిత పాఠ్యభాగం బోధిస్తున్నప్పుడే అవగాహన కల్పించి ఇంటిపనిగా ఇవ్వాలి. దోషాలు సరిదిద్దాలి.

వ్యాసరూప సమాధాన ప్రశ్నలను నల్లబల్లపై రాసి కీలక భావనల గురించి చర్చించాలి.

అప్పుడే విద్యార్థులు ప్రశ్నస్వభావాన్ని అర్థంచేసుకొని, అవగాహనతో ఆలోచించి తమ అభిప్రాయాలు జోడిస్తూ విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా జవాబులు రాయగలుగుతారు.

కీలకాంశాలు నల్లబల్లపై రాసి, వాటి ఆధారంగా విద్యార్థులు సొంతంగా జవాబులు రాసేటట్లు ప్రోత్సహించాలి.

4. **సృజనాత్మకత :** భాషలోని వివిధ వ్యవహార రూపాలను అర్థం చేసుకొని విద్యార్థులు తమ భావాలను, ఆయా ప్రక్రియలలో వ్యక్తీకరించగలగాలి.

నిర్దేశిత ప్రక్రియల స్వరూప స్వభావాలను విద్యార్థులకు అవగాహన కల్గించాలి.

ఇచ్చిన అంశాన్ని సంబంధించిన కీలక భావాలను పిల్లలు గ్రహించేటట్లు చేయాలి.

ఇది తరగతి కృత్యంగా నిర్వహించాలి.

5. **భాషాంశాలు – పదజాలం :** అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి – వికృతులు, జాతీయాలు, సామెతలు, సొంతవాక్యాలు ఈ విభాగంలో చర్చిస్తాము.

పై అంశాలను నిఘంటువు, వ్యాకరణ గ్రంథం, విద్యార్థి కల్పతరువు, పూర్వగాథాలహరి మొ॥ గ్రంథాల సహాయంతో విద్యార్థులకు అవగాహనను కల్పిస్తూ తరగతి గదిలో, పూర్తి తరగతి మరియు వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి.

**వ్యాకరణాంశాలు :** విభక్తులు, సంధులు, సమాసాలు, క్రియలు, వాక్యాలు, ఛందస్సు, అలంకారాలు ఈ విభాగంలో తెలుసుకుంటారు.

పై అంశాలను ఉదాహరణల ఆధారంగా చర్చిస్తూ, సూత్రీకరణచేసి వివరించాలి.

ఇది పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించి వ్యక్తిగతంగా రాయించాలి.

- ఈ విధంగా ఇవి చేయండి అభ్యాసాలు చేయించాలి. ఒక్కొక్క సామర్థ్యం సాధించడానికి ఒక్కొక్క కాలాంశం తప్పనిసరిగా కేటాయించాలి.
- ప్రశ్నలను తరగతి గదిలో చర్చించి వాటిపట్ల పూర్తి అవగాహన కల్గించాలి.
- జవాబులకు సంబంధించిన కీలకాంశాలు గుర్తింపచేయాలి.
- ప్రశ్నల స్వభావాన్ని, జవాబు రాయవలసిన పద్ధతిని పిల్లలు అర్థంచేసుకునేటట్టు చేయాలి.
- అవసరమైన వనరులను కల్పించాలి / సూచించాలి.
- సామర్థ్యాల సాధన తరగతి కృత్యంగానే నిర్వహించాలి. (కేవలం ఇంటిపనిగా ఇవ్వగూడదు)

- పిల్లల సందేహాలు నివృత్తి చేయాలి.
- దోషాలను సవరించాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా, స్వశక్తితో అభ్యాసాలన్నీ పూర్తిచేసేటట్లు చూడాలి.
- వ్యాకరణాది అంశాలను ఉదాహరణ పద్ధతి, అనుమానోపపత్తి పద్ధతిని అనుసరించి వివరించాలి.
- తరగతిలోని విద్యార్థులు కనీసం 80% మంది సామర్థ్యాలు సాధించే స్థాయినందుకున్నట్టు సంతృప్తిపడిన తరువాతనే తదుపరి పాఠాన్ని ప్రారంభించాలి.

ఈ విధంగా పాఠ్యపుస్తకంలో చోటుచేసుకున్న మార్పులను, తదనుగుణమైన బోధనాభ్యసన ప్రక్రియలను కూలంకషంగా అధ్యయనం చేయడం ద్వారా బోధన అర్థవంతం, ఫలవంతం అవుతుంది. తరగతి గది ఆహ్లాదకరంగా మారుతుంది. పిల్లలు ఉత్సాహంగా, ఆసక్తిగా అభ్యసన కృత్యాల్లో పాల్గొంటారు. విద్యార్థుల జ్ఞానార్జనలో గణనీయమైన (ఆశించిన) మార్పులు చూడగల్గుతాం.

# Chapter-V

## ఉపాధ్యాయుల తయారీ ప్రణాళికలు

ఏ పని అయినా ఫలవంతం కావడానికి, లక్ష్యం నెరవేరడానికి ఒక ప్రణాళిక అవసరం. ఉపాధ్యాయుడు భాషాబోధన లక్ష్యాలు సాధించడానికి, పిల్లల్లో సామర్థ్యాలను పెంపొందించడానికి, అనుసరించవలసిన వ్యూహాలతో, కార్యక్రమాలతో రెండు రకాల ప్రణాళికలు రాయాలి.

అవి : 1. వార్షిక ప్రణాళిక, 2. పాఠ్య ప్రణాళిక

### వార్షిక ప్రణాళిక

సంవత్సరం మొత్తానికి రాసేది వార్షిక ప్రణాళిక. వార్షిక ప్రణాళికలో ఒక తరగతికి సంబంధించి, ఆయా సబ్జక్టులలో సంవత్సరాంతానికి విద్యార్థులు ఏయే సామర్థ్యాలు సాధించాలి? ఒక్కొక్క పాఠానికి ఎన్ని పీరియళ్ళు అవసరమవుతాయి? అభ్యసన ప్రక్రియ వేగవంతంగా జరగడానికి అవసరమైన అదనపు సామాగ్రి ఏమి ఉపయోగించాలి? ప్రతి నెలలో సామర్థ్యాలను పెంపొందించడానికి అదనముగా నిర్వహించే కార్యక్రమాలు ఏమిటి? CCE కి సంబంధించి ఏమి నమోదు చేయాలి? మొదలైనవాటిని పొందుపరచాలి. ఈ కింది సోపానాల ద్వారా వార్షిక ప్రణాళిక రాయాలి. అవి I. తరగతి, II. విషయం, III.అవసరమైన పీరియళ్ళ సంఖ్య, IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు, V. మాసవారీగా పాఠాల విభజన, VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు, VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు.

# అ) వార్షిక ప్రణాళిక - సోపానాలు

**I.** **తరగతి** :

**II.** **సబ్జెక్టు** :

**III.** **అవసరమైన పీరియళ్ళ సంఖ్య** :

అ) మొత్తం పీరియళ్ళు :

ఆ) బోధనాభ్యసనకు అవసరమైన పీరియళ్ళు :

**IV.** **సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I.** **అవగాహన - ప్రతిస్పందన**

(a) వినడం - ఆలోచించి మాట్లాడటం

(b) ధారాళంగా చదవుట - వ్యక్తీకరించుట

**II.** **వ్యక్తీకరణ - సృజనాత్మకత**

(a) స్వీయరచన

(b) సృజనాత్మకత / ప్రశంస

**III.** **భాషాంశాలు**

(a) పదజాలం

(b) వ్యాకరణాంశాలు

**V.** **మాసవారీగా పాఠాల విభజన :**

| మాసం | బోధించాల్సిన పాఠం పేరు | అవసరమైన పీరియళ్ళ సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు మరియు CCE |
|---|---|---|---|---|
| | | | | |

**VI.** **ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

**VII.** **ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :**

## ఆ) వార్షిక ప్రణాళిక సోపానాల వివరణ

**I. తరగతి** : తరగతి పేరు రాయాలి

**II. విషయం** : సబ్జక్టు 'తెలుగు' రాయాలి

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : అ) బోధనకు అవసరమైన పీరియళ్ళు : పాఠ్యపుస్తకం పూర్తిచేయడానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య రాయాలి.

**IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు :**
విద్యాసంవత్సరం పూర్తికాగానే పిల్లలు ఆ తరగతికి సంబంధించిన ఆయా సామర్థ్యాలలో ఏమేమి సాధించాలో రాయాలి. ఇవి మొత్తం పాఠ్యపుస్తకాన్ని దృష్టిలో పెట్టుకొని రాయాలి.

**(అ) అవగాహన – ప్రతిస్పందన :**

- ♦ వినడం – మాట్లాడడం : (పిల్లలు వేటి గూర్చి ఎలా మాట్లాడాలి అనేది రాయాలి)
- ♦ చదవడం – అవగాహన చేసుకోవడం : (వేటిని చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించాలో రాయాలి)

**(ఆ) వ్యక్తీకరణ – సృజనాత్మకత**

- ♦ స్వీయరచన : (వేటిని గూర్చి సొంతమాటల్లో రాయాలో రాయాలి)
- ♦ సృజనాత్మకత : (సృజనాత్మకంగా ఏ వ్యవహారరూపాల్లో వ్యక్తీకరించాలో రాయాలి)
- ♦ ప్రశంస : (వేటిని ప్రశంసించగలగాలో రాయాలి)

**(ఇ)** భాషాంశాలు : పదజాలం, వ్యాకరణాంశాల గురించి రాయాలి.

**(ఈ)** ప్రాజెక్టుపని : పాఠాల ఆధారంగా ఏ విధమైన ప్రాజెక్టు పనులు పిల్లలు చేయాలో రాయాలి.

ఇలా ప్రతి సామర్థ్యంలో సంవత్సరాంతానికి పిల్లలు ఏమేమి చేయగలగాలి అనే విషయాలు ఆయా సామర్థ్యాల కింద రాయాలి. పాఠ్యపుస్తకంలో దీనికి సంబంధించిన ఒక పేజీ ఉంది.

**V. మాస వారీగా పాఠాల విభజన – ప్రణాళిక:**

ఏ నెలలో, ఏ పాఠం బోధించాలి? ఆ పాఠం పూర్తికావడానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య ఎంత? ఇక్కడ పాఠ్యబోధన అంటే ఉన్ముఖీకరణ చిత్రం నుండి సూక్తి వరకు పాఠమే. ఇది ఉపాధ్యాయులు గ్రహించి ప్రతిదానికీ పీరియడు కేటాయించుకోవాలి. అలాగే పాఠ్యబోధనకు అవసరమైన అదనపు సామగ్రి ఏమి ఉపయోగించాలో రాయాలి. ఆయా సామర్థ్యాల అభివృద్ధికై ఏ నెలలో ఏ అదనపు కార్యక్రమాలు నిర్వహించాలో రాయాలి. ఉదా: వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠనం, నాటకం మొ॥నవి అట్లే ఆ మాసంలో సి.సి.ఇ. / పరీక్షల గురించి చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు రాయాలి. ఈ కార్యక్రమాలవల్ల పిల్లల్లో భాషాభివృద్ధి జరగాలి.

పట్టికను కింది విధంగా రాయాలి.

| మాసం | పాఠంపేరు | అవసరమైన పీరియళ్ళ సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించే కార్యక్రమాలు మరియు CCE |
|---|---|---|---|---|
| జూన్ | దానశీలము | 12 | • పోతన భాగవతం<br>• దాతలకు సంబంధించిన (శిబి, రంతిదేవుడు, కర్ణుడు మొ॥వారు) కథలు<br>• బలి చక్రవర్తి వామనునికి దానమిస్తున్న చిత్రం.<br>• నినాదాలు - సూక్తులు చార్టు. | మరణానంతరం అవయవదానం గురించి ప్రజలను చైతన్యపరుస్తూ “కరపత్రం” తయారీ. |

పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య : ఒక పాఠానికి సగటున 12 పీరియళ్ళు అవసరమైతాయి. ఇలా మొత్తం అన్ని పాఠాలకు రాయాలి. తప్పనిసరిగా ఒక్కొక్క సామర్థ్యపు అభ్యాసానికి ఒక్కొక్క పీరియడు కేటాయించుకోవాలి. ఉన్ముఖీకరణకు ఒక పీరియడ్, విద్యార్థులకు సూచనలు, ప్రవేశికకు ఒక పీరియడ్ పాఠ్యాంశం గురించి చర్చ అవగాహనకు 3 పీరియళ్ళు అవసరమైతాయి. అభ్యాసాలకు 7 పీరియళ్ళు అవసరమైతాయి.

**బోధనా వనరులు మరియు సామగ్రి :**

ప్రతి ఉపాధ్యాయుడు ఆ సంవత్సరంలో బోధించాల్సిన పాఠాలకు అనుగుణంగా వనరులను ముందే సిద్ధం చేసుకోవాలి. వనరులు అనగా ఉపయుక్త గ్రంథావళి, ఉపాధ్యాయుల కరదీపికలు, బోధనలో ఉపయోగించే సామాగ్రి, నిఘంటువులు, సి.డి.లు / వీడియోలు, మ్యాగజైన్స్, దినపత్రికల క్లిప్పింగ్స్, టీచింగ్ నోట్స్ మొదలగునవి. ఉపాధ్యాయులు ఇంకనూ ఆలోచించి బోధించే విషయాన్ని అనుసరించి తగిన బోధనా వనరులను సొంతంగా తయారుచేసుకోవాలి. బోధన ఆసక్తికరంగా ఉండాలంటే పిల్లలు అభ్యసనంలో పాల్గొనాలంటే ఉపాధ్యాయుడు ముందే ఆలోచించి తగిన వనరులు ఉపయోగించి ఆసక్తికరంగా బోధించుటకు ప్రయత్నించాలి.

**నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. :**

ఆశించే సామర్థ్యాల సాధన కోసం ఆయా సబ్జక్టుల వారీగా పలు కార్యక్రమాలు కేవలం తరగతి గదుల్లో కాకుండా బయట, నిర్వహణ చేయాలి. వీటిలో క్షేత్ర సందర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు, సామాజిక సంస్థల సందర్శన, సమాజసేవ, క్విజ్, సెమినార్లు, వివిధ రకాలైన కవితలు, కథలు, కరపత్రాలు పోస్టర్లు మొదలగు వాటిని తయారుచేయుటకు కార్యశాలలు, దినపత్రికలకు వ్యాసాలు రాయటం, కవి సమ్మేళనం, విషయ నిపుణులచే ఉపన్యాసాలు, పద్య పఠనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, చిత్రలేఖనం, కవితలు రాయటం, కథలు రాయటం మొదలగు సృజనాత్మక అంశాలలో కార్యక్రమాలను నిర్వహించాలి. వీటిని కూడా వార్షిక ప్రణాళికలో చూపాలి మరియు అమలు చేయాలి. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో వివిధ సామర్థ్యాలు, అభిరుచులు పెంపొందుతాయి మరియు పాఠశాల ఒక ఆహ్లాదకరమైన ప్రదేశంగా మారుతుంది. దీనికి ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు వృత్తి పరంగా ఆలోచించి వృత్తికి న్యాయం చేయాలి. అలాగే సి.సి.ఇ.కి సంబంధించి ఏ నెలలో నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు చేయాలో, ఏ నెలలో సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహిస్తారో ప్రణాళికలో పొందుపరచాలి.

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

సంవత్సరం పూర్తయ్యేసరికి సామర్థ్యాల సాధనకై ఉపాధ్యాయుడు అదనంగా ఏమేమి నిర్వహించాడు? విద్యార్థుల భాగస్వామ్యం ఎలా ఉంది? ఏయే సామర్థ్యాలలో పిల్లలు ప్రగతిని సాధించారు? వేటిలో వెనుకబడి ఉన్నారు? సృజనాత్మకత, ప్రశంసా పూర్వక పనులు, ప్రాజెక్టుపనులు ఎలా చేసారు? సామర్థ్యాల సాధనకై ఉపాధ్యాయుడు ఇంకా తానేమి చేయగలడో అనే వాటిపై ఉపాధ్యాయుడు తన ప్రతిస్పందనలు రాయాలి. దీనికి కొన్ని పేజీలు వదిలి పెట్టాలి. ఎందుకంటే వార్షిక ప్రణాళిక సోపానాలలో I నుండి V వరకు పెద్దగా మార్పు ఉండదు. కాని ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు ప్రతి పాఠానికి మారుతుంటాయి. అందుకని నెలవారిగా ప్రతిస్పందనలు రాయాలి. ప్రధానోపాధ్యాయుని సలహాలు సూచనలు కూడా నెలవారీగా VIIవ సోపానంలో ఉంటాయి. ఇలా సంవత్సరం మొత్తానికి ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు, ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు రాయడంకాగానే మరొక సంవత్సరానికి సంబంధించి ఇంకొక పేజిలో రాయాలి. అందువల్ల వార్షిక ప్రణాళిక ఈ రెండు సోపానాలకు పేజీలు వదిలి పెట్టాలి.

**VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :**

మాసవారీగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమీక్ష, సమావేశం నిర్వహించాలి. ఉపాధ్యాయుల బోధన, పిల్లల ప్రగతి గురించి ప్రధానోపాధ్యాయుడు లక్ష్యాలు నిర్వహించాలి. ప్రధానోపాధ్యాయుడు మాస వారీగా తన సలహాలు, సూచనలు తెలియజేయాలి. వీటిని మాసవారీగా వార్షిక ప్రణాళికలో రాయాలి.

వార్షిక ప్రణాళిక సోపానాల ప్రకారం ఒక తరగతికి వార్షిక ప్రణాళిక ఎట్లా రాయాలో చూద్దాం.

## మాదిరి వార్షిక ప్రణాళిక

**I. తరగతి** : 10వ

**II. విషయం** : తెలుగు (ప్రథమభాష)

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : అ) మొత్తం పీరియళ్ళు : 220

ఆ) బోధనకు అవసరమైన పీరియళ్ళు : 180

(పాఠాలకి 168, ఉపవాచకానికి 12 పీరియళ్ళు)

**IV. విద్యా సంవత్సరం పూర్తయే సరికి సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

*(దీనిలో వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించడం అనే రెండు సామర్థ్యాలుంటాయి.)*

**1) వినడం - మాట్లాడడం :**

♦ పాఠాల ద్వారా కలిగిన అనుభూతులను, అంశాలపై అభిప్రాయాలను చెప్పగలగాలి.

♦ ఏదైనా విషయాన్ని తగిన కారణాలతో సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి.

- వివిధ అంశాలపై చర్చించగలగాలి. తనకు నచ్చిన / నచ్చని విషయాల గురించి తెలుపగలగాలి.
- వివిధ విషయాల, అంశాల మధ్య పోలికలను తెలుపుతూ మాట్లాడగలగాలి.
- ఆయా పాఠాలకు ఆ శీర్షికలు తగినవో, కావో విశ్లేషిస్తూ మాట్లాడగలగాలి.
- పద్యాలను, గేయాలను రాగ, భావస్ఫోరకంగా చదువగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా ఉపన్యాసం ఇవ్వగలగాలి.

**2) ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని ప్రతిస్పందించడం :**

- పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలగాలి.
- విషయం ఆధారంగా పట్టికలను పూరించగలగాలి.
- కవితా పంక్తులు, పద్యాలను చదివి వాటిలోని అంతరార్థాన్ని రాయగలగాలి.
- పాఠాల్లోని కీలక పదాలు, కీలక వాక్యాలు గుర్తించి వాటి గురించి రాయగలగాలి.
- పరిచిత, అపరిచిత పద్యాలను, గద్యాలను చదివి ప్రశ్నలకు జవాబులు, ప్రశ్నల తయారీ, కీలకాంశాలను గుర్తించడం లాంటివి చేయగలగాలి.

## ఆ) వ్యక్తీకరణ - సృజనాత్మకత

*(దీనిలో స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస అనే సామర్థ్యాలుంటాయి.)*

**3) స్వీయరచన :**

- ఇచ్చిన అంశాన్ని సరైన కారణాలతో సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.
- కవి, రచయితల ఉద్దేశాన్ని, భావాలను, శైలిని, వివరిస్తూ రాయగలగాలి. అభినందిస్తూ రాయగలగాలి.
- పాఠ్యాంశాలలోని పాత్రల అంతర్యాలను, స్వభావాలను వివరిస్తూ రాయగలగాలి.
- విషయాన్ని విశ్లేషిస్తూ, విమర్శిస్తూ రాయగలగాలి.
- ఇచ్చిన అంశంపై తన అభిప్రాయాలను రాయగలగాలి.

**4) సృజనాత్మకత / ప్రశంస :**

- ఇచ్చిన అంశాలను, ఆత్మకథ, వ్యాసం, లేఖ, నినాదాలు, సూక్తులు, వచనకవిత, కరపత్రం, సంభాషణలు, అభినందనవ్యాసం, కథ, సంపాదకీయవ్యాసం, పీఠిక మొదలైన ప్రక్రియల్లో రాయగలగాలి.

## ఇ) భాషాంశాలు

*(దీనిలో పదజాలం, వ్యాకరణం అనే సామర్థ్యాలుంటాయి.)*

**5) పదజాలం :**

- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.

- పదాలకు అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్త్యర్థాలు రాయగలగాలి.
- ప్రకృతులకు వికృతులు, వికృతులకు ప్రకృతులు రాయగలగాలి.
- పదాల గురించి వివరించి రాయగలగాలి.

**5) వ్యాకరణం :**

- వృద్ధి, త్రిక, రుగాగమ సంధులను గుర్తించి రాయగలగాలి.
- కర్మధారయ, బహుప్రీహి సమాసాలను గుర్తించి రాయగలగాలి.
- సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను, కర్తరి, కర్మని వాక్యాలను, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలను రాయగలగాలి. మార్పులు చేయగలగాలి.
- సీసం, ఆటవెలది ఛందోరీతులను గుర్తించి తెలుపగలగాలి.
- అతిశయోక్తి, స్వభావోక్తి అలంకారాలను గుర్తించగలగాలి.

**ఈ) ప్రాజెక్టుపనులు**

ప్రాజెక్టుపని ప్రతిపాఠంలో ఉన్నది. మొత్తం 12 ప్రాజెక్టుపనులు ఉన్నాయి. అయితే విద్యార్థి ఒక ఫార్మేటివ్ కాలంలో ఒక ప్రాజెక్టు చొప్పున సంవత్సరం మొత్తంలో నాలుగు ప్రాజెక్టులు చేస్తే చాలు.

## V. మాసవారీగా పాఠాల విభజన

| నెల | బోధించే పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| జూన్ | 1. దానశీలము | 12 | • పోతన డాక్యుమెంటరీ.<br>• పోతన భాగవతం.<br>• దాతలకు (శిబి, రంతిదేవుడు, కర్ణుడు) సంబంధించిన కథలు.<br>• బలి చక్రవర్తి వామనునికి దానమిస్తున్న చిత్రం.<br>• నినాదాలు - సూక్తులు చార్టు.<br>• నిఘంటువు. | • మరణానంతరం అవయవదానం గురించి ప్రజలను చైతన్యపరుస్తూ కరపత్రం తయారీ. |
| జూలై | 2. ఎవరి భాష వాళ్ళకు వినసొంపు<br><br>3. వీర తెలంగాణ<br><br>* బాలకాండం (ఉపవాచకం) | 12<br><br>12<br><br>2 | • సామల సదాశివ ''యాది'' పుస్తకం.<br>• దాశరథి 'రుద్రవీణ' కవితా సంపుటి.<br>• తెలంగాణ వీరుల చిత్రాలు.<br>• నిఘంటువు. | • తెలంగాణ భాష ప్రత్యేకత గురించి లేఖ. (లేఖారచన పోటీ.)<br>• తెలంగాణపై కవితారచన (దాశరథి జయంతి సందర్భంగా)<br>• మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం (F.A.I.) నిర్వహణ-నమోదు. |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| ఆగస్టు | 4. కొత్తబాట | 12 | • యశోదారెడ్డి కథలు.<br>• తెలంగాణ భాష. యాసతో వచ్చిన ఇతర కథల పుస్తకాలు. | |
| | 5. నగరగీతం | 12 | • అలిశెట్టి ప్రభాకర్ "సిటీలైఫ్" కవితలు.<br>• నగర జీవనానికి సంబంధించిన చిత్రాలు.<br>• నిఘంటువు. | • నగరంలోని అనుకూల, ప్రతి అంశాలను గురించి (మాట్లాడడం) ఉపన్యాసం.<br>• రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనం (F.A.II) నిర్వహణ - నమోదు. |
| సెప్టెంబరు | 6. భాగ్యోదయం | 12 | • భాగ్యరెడ్డివర్మ జీవిత చరిత్ర.<br>• హైదరాబాదులోని ఆది హిందూభవన్ భాగ్య మెమోరియల్ పాఠశాల చిత్రాలు.<br>• నిఘంటువు. | • సామాజిక సమస్యలపై (అంటరానితనం, మతం, నిరక్షరాస్యత, స్త్రీ వివక్షత మొ॥నవి) పోరాడిన వారి కృషిని ప్రశంసిస్తూ ప్రశంసా పత్రం తయారీ.<br>• ఉపాధ్యాయుల దినోత్సవం. వ్యాసరచన పోటీ. |
| | * అయోధ్యకాండం (ఉపవాచకం) | 2 | | |
| అక్టోబరు | 7. శతకమధురిమ | 12 | • ఆయా కవులు రచించిన శతకాలు.<br>• నిఘంటువు. | • శతక పద్యపఠన పోటీ.<br>• సంగ్రహణాత్మక మూల్యాంకనం (S.A.I) నిర్వహణ - నమోదు. |
| నవంబరు | 8. లక్ష్యసిద్ధి | 12 | • వివిధ దినపత్రికలలో వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంపాదకీయ వ్యాసాలు.<br>• తెలంగాణోద్యమ పోరాట చిత్రాలు.<br>• రాష్ట్ర ఆవిర్భావ సంబరాల చిత్రాలు. | • "తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు పాత్ర" - ఉపన్యాస పోటీ. |
| | 9. జీవనభాష్యం | 12 | • డా॥ సి.నా.రె. తెలుగు గజళ్ళు.<br>• ఇతర కవుల గజళ్ళు.<br>• నిఘంటువు. | • బాలల దినోత్సవం సందర్భంగా సృజనాత్మక పోటీలు - నిర్వహణ.<br>• మూడవ నిర్మాణాత్మక మూల్యాంకనం (F.A.III) నిర్వహణ - నమోదు. |
| | * అరణ్యకాండం (ఉపవాచకం) | 2 | | |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| డిశెంబరు | 10. గోలకొండ పట్టణం<br><br><br><br>* కిష్కింధాకాండం (ఉపవాచకం) | 12<br><br><br><br>2 | • ఆదిరాజు వీరభద్రరావు "మన తెలంగాణము" వ్యాస సంపుటి.<br>• గోల్కొండ కోట చిత్రాలు.<br>• నిఘంటువు. | • హైదరాబాదు నగరం – సంస్కృతి – వైభవం గురించి వ్యాసరచన పోటీ. |
| జనవరి | 11. భిక్ష<br><br><br><br>* సుందరకాండం | 12<br><br><br><br>2 | • శ్రీనాథుని కాశీఖండం.<br>• కాశీనగర చిత్రాలు.<br>• కోపం వలన కలిగే అనర్థాలను గురించి తెలిపే కథలు / సంఘటనలు.<br>• నిఘంటువు. | • "కోపం వద్దు – శాంతం ముద్దు" అని ప్రజలను చైతన్యపరుస్తూ కొన్ని నినాదాలు, సూక్తులు తయారీ పోటీ.<br>• నాల్గవ నిర్మాణాత్మక మూల్యాంకనం (F.A.IV) నిర్వహణ – నమోదు. |
| ఫిబ్రవరి | 12. భూమిక<br><br>* యుద్ధకాండ (ఉపవాచకం) | 12<br><br>2 | • నెల్లూరి కేశవస్వామి కథలు.<br>• వివిధ పుస్తకాల పీఠికలు.<br>• నిఘంటువు. | • ఏదైనా ఒక పుస్తకాన్ని చదివి ముందుమాట రాయడం.<br>• సంగ్రహణాత్మక మూల్యాంకనం మాదిరి పరీక్ష నిర్వహణ. |
| మార్చి | పునశ్చరణ | | • నమూనా ప్రశ్నలు. | • నమూనా ప్రశ్నల ద్వారా పిల్లలకు అభ్యాసాలు నిర్వహించడం.<br>• సంగ్రహణాత్మక మూల్యాంకనం (S.A.II), నిర్వహణ, (పబ్లిక్ పరీక్ష). |

## VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు

(ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు నెలవారీగా రాసుకోవాలి. జూన్ నెలకు సంబంధించి ఇక్కడ రాయడం జరిగింది.) ఈ పాఠాన్ని పిల్లలు చక్కగా ఆస్వాదించారు. అయితే పోతన భాగవతం అందుబాటులో లేదు. టి.టి.డి. వాళ్ళు వ్యాఖ్యానంతో ముద్రించిన పోతన భాగవతం ఉంటే బాగుండు అనిపించింది. బడి తెరిచిన నెల కాబట్టి బోధనకు కొంత అంతరాయం ఏర్పడింది. అందువల్ల అనుకొన్న విధంగా సకాలంలో పాఠాన్ని పూర్తిచేయలేదు. పిల్లలు పాఠంలోని పద్యాలను విని, భాగవతం సి.డి.ని చూసి బాగా ఆనందించారు. గ్రంథాలయంలో పాఠాలకు సంబంధించిన మూలగ్రంథాలు ఉంటే బాగుంటుందనిపించింది. నిఘంటువులు ఎక్కువ లేకపోవడం అర్థసంగ్రహణానికి ఇబ్బంది కలిగించింది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయునితో మాట్లాడుతాను. ఈ నెలలో నిర్వహించాల్సిన కార్యక్రమాల్లో భాగంగా పిల్లలచే కరపత్రం తయారుచేయించాను. కొంతమంది పిల్లలు బాగానే చేశారు. కొంతమంది పిల్లలు చదువడం, రాయడంలో ఇబ్బంది పడ్డారు.

## VII. ప్రధానోపాధ్యాయుడి సలహాలు, సూచనలు

(ప్రధానోపాధ్యాయుడి సలహాలు, సూచనలు నెలవారీగా రాయాలి. జూన్ నెలకు సంబంధించి ఇక్కడ రాయడం జరిగింది.) పాఠాన్ని చక్కగా బోధించినందుకు అభినందనలు. పాఠ్యాంశాలకు సంబంధించిన మూల గ్రంథాలు, పరామర్శ గ్రంథాలు, నిఘంటువులు మొ॥వి ఏమి కావాలో జాబితా తయారుచేయండి. గ్రంథాలయ పుస్తకాల కొనుగోలుకు సంబంధించిన డబ్బుతో పుస్తకాలను కొందాం. పిల్లలకు చదువడం, రాయడం రావడంలేదనే మీ ఆవేదనను అర్థం చేసుకున్నాను. ప్రతిరోజు చదువడం - రాయడం కోసం అదనపు పీరియడు కేటాయిస్తాను. ఇతర ఉపాధ్యాయుల సహకారంతో పిల్లలకు చదువడం, రాయడం నేర్పగలరు. నెల వారీ నిర్వహించాల్సిన కార్యక్రమాలను తప్పక నిర్వహించండి. పిల్లల్లో భాషాసామర్థ్యాలను పెంచండి. మీరు నిర్వహించిన తీరుకు సంతోషించాను.

**సూచన :** అన్ని తరగతులకు పై విధంగా వార్షిక ప్రణాళికను పాఠశాల విద్యా సంవత్సరానికి ముందే సిద్ధం చేసుకోవాలి.

# పాఠ్య ప్రణాళిక

ఒక పాఠాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఎన్ని పీరియళ్ళు అవసరమో విభజించుకొని మొత్తం పాఠం కోసం రూపొందించుకొనే ప్రణాళికను పాఠ్యప్రణాళిక అంటారు. సగటున ఒక పాఠం పూర్తి చేయడానికి అంటే ఉన్ముఖీకరణ నుండి నేనివి చేయగలనా? వరకు పూర్తిచేయడానికి సగటున 12 పీరియళ్ళు అవసరమని తెలుసుకొన్నాము కదా! ఒక పాఠం ద్వారా ఏమి సాధించాలి? ఏ ఏ వ్యూహాలు అమలుచేయాలి? ఏ సామగ్రి వినియోగించాలి? మొదలగు వివరాలు పాఠ్య ప్రణాళికలో ఉంటాయి. వీటితోపాటు ఉపాధ్యాయుడు పాఠ్యబోధనకు అవసరమైన రీతిలో సిద్ధం కావాల్సి ఉంటుంది. దీనికోసం పాఠ్యపుస్తకంతోపాటు అదనపు గ్రంథాలు, పుస్తకాల నుండి సమాచారాన్ని విశేషాంశాలను, కృత్యాలు మొదలగు వాటిని సేకరించాల్సి ఉంటుంది. వీటిని కూడా పాఠ్య ప్రణాళికలో పొందుపరచాల్సి ఉంటుంది. అంటే ఒక పాఠానికి సంబంధించిన బోధనా వ్యూహాలు సమయ విభజన, వనరులు, సంసిద్ధత, ప్రతిస్పందనలు ఇలాంటి వివరాలతో పాఠ్యప్రణాళిక రాయాల్సి ఉంటుంది. దీనికొక నమూనాను తెలుసుకొందాం.

## అ) పాఠ్య ప్రణాళిక - సోపానాలు

**I. పాఠం పేరు** :

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య** :

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు** :

- **I. అవగాహన - ప్రతిస్పందన**
  - (a) వినటం - ఆలోచించి మాట్లాడటం
  - (b) ధారాళంగా చదువుట - వ్యక్తీకరించుట
- **II. వ్యక్తీకరణ - సృజనాత్మకత**
  - (a) స్వీయరచన
  - (b) సృజనాత్మకత / ప్రశంస
- **III. భాషాంశాలు**
  - (a) పదజాలం
  - (b) వ్యాకరణాంశాలు

**IV. పీరియడ్ వారిగా విభజన – ప్రణాళిక :**

| పీరియడు సంఖ్య | బోధనాంశం | బోధనా వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :**

**VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :**

## ఆ) పాఠ్య ప్రణాళిక – సోపానాల వివరణ

**I. పాఠం పేరు** : ఏ పాఠానికి సంబంధించి పాఠ్య ప్రణాళిక తయారు చేస్తున్నామో ఆ పాఠం పేరు రాయాలి.

**II. పీరియళ్ళ సంఖ్య** : వార్షిక ప్రణాళికలో ఆ పాఠానికి ఎన్ని పీరియళ్ళు అవసరమని రాసుకున్నామో ఆ సంఖ్య ఇక్కడ రాయాలి.

**III. సాధించాల్సిన సామర్థ్యాలు** : ఆయా సామర్థ్యాలలో పాఠం పూర్తయ్యే సరికి పిల్లలు ఏమేమి సాధించాలో ఇక్కడ రాయాలి. ప్రతి పాఠంలో కూడా "ఇవి చేయండి" పేరుతో సామర్థ్యాల ఆధారంగా అభ్యాసాలు ఉన్నాయి. వాటిని పరిశీలించాలి. వాటి ఆధారంగా ఏ సామర్థ్యంలో పిల్లలు ఏమేమి సాధించాలో రాయాలి.

**అ) అవగాహన – ప్రతిస్పందన**

దీనిలో **"వినడం – మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థం చేసుకొని, వ్యక్తీకరించడం"** అనే సామర్థ్యాలుంటాయి. ఈ పాఠం ద్వారా ఈ సామర్థ్యంలో పిల్లలు వేటిని గురించి ఆలోచించి మాట్లాడగలగాలి, వేటిని చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలగాలి అనేది రాయాలి. ఇందుకోసం అవగాహన–ప్రతిస్పందనలోని ప్రశ్నలు చూడాలి.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

దీనిలో **"స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస"** అనే సామర్థ్యాలు ఉంటాయి.

- ఈ పాఠం ద్వారా విద్యార్థులు తమ సొంత మాటల్లో వేటిని గురించి రాయాలో ఇక్కడ రాయాలి. స్వీయరచనలోని ప్రశ్నలు చదివి రాయాలి.
- సృజనాత్మక వ్యక్తీకరణను కరపత్రం గేయం, కవిత, సంభాషణలు మొదలైన వ్యవహారరూపంలో పిల్లలు చేయగలగాలి. ఈ పాఠాన్ని అనుసరించి దేనిని చేయాలో, వేటిని ప్రశంసించాలో ఇక్కడ రాయాలి. ఇందుకోసం వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని సృజనాత్మకత ప్రశ్నలను చదివి పిల్లలు ఏం చేయాలో రాయాలి.

**ఇ) భాషాంశాలు**

దీనిలో **"పదజాలం, వ్యాకరణాంశాలు"** అనే సామర్థ్యాలు ఉంటాయి.

- ఈ పాఠంలోని అభ్యాసాలలోని పదజాలంలో పిల్లలు ఏమేమి చేయాలనేది, వ్యారణాంశాలలో వేటిని సాధించాలనేది ఇక్కడ రాయాలి.

(అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, సొంత వాక్యాలు, సంధి, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు)

పైన పేర్కొన్న సామర్థ్యాలన్నీ ఆ పాఠం ద్వారా పిల్లలు సాధించగలగాలి.

## IV. పీరియడ్ వారీగా విభజన ప్రణాళిక :

మొత్తం పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్యను బట్టి ఏ బోధనాంశానికి ఎన్ని పీరియళ్ళు ఇచ్చారు? ఆ పీరియడ్ సంఖ్యను రాసి, బోధనాంశం, బోధనా వ్యూహాలు, సామాగ్రి మూల్యాంకనం వివరాలను రాయాలి.

| పీరియడు సంఖ్య | బోధనాంశం | బోధనా వ్యూహం / అభ్యసన కృత్యాలు | వనరులు / సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1 | ఉన్ముఖీకరణ | ఒక్కొక్కరినీ ప్రశ్నిస్తూ పూర్తి తరగతి కృత్యం నిర్వహించటం | అదనపు సామాగ్రి | ఆ పీరియడ్‌లో జరిగిన బోధనాంశం మూల్యాంకనం |

ఇప్పుడు పట్టికలో రాసిన వాటిని గూర్చి తెలుసుకుందాం.

**పీరియడు సంఖ్య :**

ఏ పీరియడు నిర్వహిస్తున్నామో దాని సంఖ్య వేయాలి.

**బోధనాంశం :**

పాఠంలో ఉన్ముఖీకరణ నుండి నేనివి చేయగలనా? చివరి అభ్యాసం, సూక్తి వరకు అన్ని అంశాలు బోధనాంశాలే. ఏ పీరియడులో దేన్ని గురించి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తామో ఆ అంశాన్ని ఇక్కడ రాయాలి.

(ఉదా : ఉన్ముఖీకరణ, పఠన కృత్యాలు - అర్థ సంగ్రహణ, పాఠ్యాంశం గురించి చర్చ అవగాహన, ఇవిచేయండి మొదలగునవి)

**బోధనా వ్యూహాలు :**

గతంలో విద్యాబోధన ఉపాధ్యాయ కేంద్రితమై ఉండేది. ప్రస్తుత బోధన విద్యార్థి కేంద్రితంగా మారింది. అందువల్ల విద్యార్థుల భాగస్వామ్యం, స్వయం అధ్యయనానికి అవకాశం కలిగింది. దానికి అనుగుణంగా బోధన వ్యూహాలు ఉండాలి. అంటే బోధనాంశం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల కోసం ఎటువంటి వ్యూహాన్ని అనుసరించాలో రాయాలి.

ఉదా : వ్యక్తిగత కృత్యం, జట్టు కృత్యం, పూర్తి తరగతి కృత్యం, వ్యక్తిగత పఠనం, అభిప్రాయాలు చెప్పటం, సంభాషించటం, చిత్రాల గురించి మాట్లాడటం మొదలగు కృత్యాలు / వ్యూహాలు రాయాలి.

- **సామాగ్రి :** బోధనాంశంపై పూర్తి అవగాహనను కల్పించడానికి, బలోపేతం చేయడానికి పాఠానికి సంబంధించి, అభ్యాసాలకు సంబంధించి ఎటువంటి అదనపు సామగ్రిని ఉపయోగిస్తామో రాయాలి.

  (ఉదా : కవి చిత్రం, నిఘంటువు, ఇంటర్నెట్, పరామర్శ గ్రంథాలు, నమూనాలు మొదలగునవి)

- **మూల్యాంకనం :** బోధనాంశం ఆధారంగా పిల్లల్లో ఆయా సామర్థ్యాలపై పట్టు సాధించుటకై, వారు ఆలోచించి సొంతంగా రాసేటట్లుగా, ఉపాధ్యాయుల తయారీ మాట్లాడేటట్లుగా ఉండే ప్రశ్నలు ఇవ్వాలి. అభ్యాసాలలోని ప్రశ్నలు కూడా ఇవ్వవచ్చు.

## V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ :

పాఠ్య బోధనకు అవసరమైన అదనపు సమాచారం, విశేషాంశాల వివరాలు, కృత్యాల సేకరణ గురించి ఉపాధ్యాయులు పరామర్శ గ్రంథాలు, గ్రంథాలయ పుస్తకాలు చదివి అదనపు సమాచారం సేకరించి రాసుకోవాలి. ప్రధానంగా పాఠంలోని విషయం గురించి చర్చించడానికి అవసరమైన, ఆలోచింపచేసే ప్రశ్నలను పాఠం చదివి రాసుకోవాలి. పాఠంలోని విశేషాంశాల గురించి విద్యార్థి కల్పతరువు, పురాతన నామ కోశం వంటి గ్రంథాల ఆధారంగా వివరాలు రాసుకోవాలి. కవి / రచయిత భాషాశైలిని పిల్లలకు అవగాహన కల్పించడానికి తగినన్ని ఉదాహరణలు సేకరించాలి. వాటిని వివరించాలి. కవి / రచయితకు సంబంధించిన అదనపు వివరాలు, వారు చేసిన భాషా సేవ గురించి వివరాలు సేకరించాలి. పాఠంలోని ప్రాజెక్టుపనులు, ప్రశంస వంటి కృత్యాల నిర్వహణకు అవసరమైన మూల గ్రంథాలు, అదనపు వనరులను కూడా సేకరించవచ్చు. ఉపాధ్యాయుల తయారీ అనేది వారికి వృత్తిపట్ల ఉండే గౌరవాన్ని అభిమానాన్ని తెలియజేస్తుంది.

## VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :

పాఠం పూర్తయ్యాక తన అనుభవాలు, అనుభూతులు, ప్రతిస్పందనలు రాయాలి. పిల్లల అభ్యసనం గురించి రాయాలి. అంటే ఏ ఏ కృత్యాలు బాగా నిర్వహించారు? పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు ఎలా ఉన్నాయి? పిల్లల ప్రగతి ఎలా ఉంది? ఏ ఏ అంశాలు సంతృప్తి కలిగించాయి? ఏ ఏ అంశాలపై మరింత శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది? వంటి వివరాలను పాఠం పూర్తయ్యాక రాసుకోవాలి.

ప్రతి పాఠంలో నాలుగు విభాగాలు ఉంటాయి. అవి 1) ఉన్ముఖీకరణ, ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగ వివరాలు, కవిపరిచయం, 2) విద్యార్థులకు సూచనలు, ప్రవేశిక, 3) పాఠ్యాంశం, 4) 'ఇవిచేయండి' అభ్యాసాలు. వీటిని బోధించడానికి అనగా ఒక్కొక్క విభాగానికి పీరియళ్ళు కేటాయించుకోవాలి.

ఆయా పీరియళ్ళలో కింది సోపానాల ప్రకారం బోధన జరగాలి. అవి

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 1 | పలకరింపు | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | పిల్లలను పలకరించడం |
| 2 | ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం చిత్రంలోని చిత్రం గురించి మాట్లాడించడం |
| 3 | పునశ్చరణ | 2 నుంచి 10 పీరియళ్ళలో ఉంటుంది. | ముందురోజు జరిగిన అంశం గురించి చర్చించడం |

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 4 | శీర్షికా ప్రకటన | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం పేరు / శీర్షికను ప్రకటించి నల్లబల్లపై రాయడం |
| 5 | కవిపరిచయం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం రాసిన కవి గురించి పరిచయం చేయడం |
| 6 | నేపథ్యం / ఉద్దేశం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం ఉద్దేశం/నేపథ్యం గ్రహించేలా చేయడం |
| 7 | పాఠం చిత్రం గురించి మాట్లాడించడం | 2వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠంలోని చిత్రాల గురించి చర్చ నిర్వహణ |
| 8 | గేయం/పద్యం/పాట ఉపాధ్యాయుడు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలకు / గేయాలకు ప్రాధాన్యత, రాగంతో పాడడం, ఎలా పాడాలో తెల్పడం అభ్యాసం చేసి చూపడం |
| 9 | గేయం/పద్యం/పాట పిల్లలు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలు/గేయాలు/పాటలను పిల్లలతో పాడించడం, అభినయం చేయించడం |
| 10 | పిల్లలచే బాహ్యాపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | తరగతిలోని నలుగురైదుగురు పిల్లలతో ప్రకాశపఠనం చేయించాలి. దోషాలను గుర్తించాలి. |
| 11 | ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | స్పష్టోచ్చారణతో చదవాలి. పిల్లలను గమనించమనాలి. |
| 12 | పిల్లల మౌనపఠనం – అర్థ సంగ్రహణ | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పిల్లలు మౌనంగా చదవాలి. తెలియని పదాలనుగుర్తించి, గీతగీయాలి. చర్చలో పాల్గొనాలి. తెల్సుకోవాలి. |
| 13 | పాఠం చిత్రం గురించి చర్చ | 2వ పీరియడ్‌లో ఉంటుంది. | పాఠంలోని చిత్రాన్ని పరిశీలింపజేయాలి. చర్చ నిర్వహించి, భావాన్ని ఊహింపచేయాలి. |
| 14 | పాఠ్యాంశంపై చర్చ, అవగాహన | 3 నుండి 5 పీరియళ్ళు | ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా కీలక పదాలు / వాక్యాలు / సంఘటనలపై చర్చ |
| 15 | సామర్థ్యాల వారీగా అభ్యాసాల నిర్వహణ | 6 నుండి 10 పీరియళ్ళ వరకు ఉంటుంది. | వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం ఒక పీరియడ్‌లో, స్వీయరచన ఒక పీరియడ్, పదజాలకృత్యాలు, ప్రాజెక్టు, ప్రశంస పనులు ఒక పీరియడ్, సృజనాత్మకతకు ఒక పీరియడ్, భాషను గురించి తెలుసుకోవడం, 'నేనివి చేయగలనా?' చివరి పీరియడ్‌లో నిర్వహించాలి. |
| 16 | సరిదిద్దడం (భావం / వాక్యం / పదాలు / అక్షర దోషాలు) | స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస నిర్వహించే పీరియళ్ళలో అలాగే పిల్లలు రాసిన అంశాలు ఏవైనా ప్రదర్శించినప్పుడు. ఉదా॥ ప్రాజెక్టు పనులు నివేదికలు సమర్పించినప్పుడు. | భావం సరిగా ఉందా? వాక్య నిర్మాణం, పదజాలం, అక్షరదోషాలపై చర్చ నిర్వహించి సరిదిద్దాలి. |

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| | | | |
| 17 | స్వీయ మూల్యాంకనం | 10వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | చివరి పీరియడ్‌లో 'నేనివిచేయగలనా?'లోని అంశాలకు ఏమేమి చేయగలరో గుర్తింపచేయాలి. పునరభ్యాసం కల్పించాలి. |
| 18 | రాసిన అంశాలను ప్రదర్శించడం, సంకలనం చేయడం | స్వీయరచన, సృజనాత్మకతను నిర్వహించే పీరియళ్ళలో ఉంటుంది. | ప్రశంస, సృజనాత్మకత, ప్రాజెక్టు పనుల నివేదికలను సంకలనాలుగా తయారుచేసి భద్రపరచడం |
| 19 | పిల్లల అవగాహన – పరిశీలన | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | ప్రతీ పీరియడ్‌లో ఆ రోజు బోధించిన, నిర్వహించిన అంశాల ఆధారంగా సామర్థ్యాల వారీగా పిల్లల అవగాహనను పరిశీలించాలి. |
| 20 | పునరభ్యాసం | చివరి పీరియడ్‌లో ఉంటుంది. అవసరమైతే అదనపు పీరియడ్‌లో ఉంటుంది. | స్వీయ మూల్యాంకనం ద్వారా పిల్లలు ఏఏ సామర్థ్యాలలో వెనుకబడ్డారో గుర్తించి, ఆయా సామర్థ్యాల కోసం అదనపు పీరియళ్ళలో పునరభ్యాసం కల్పించాలి. |

## ప్రేరణాగీతం

*– పల్లెర్ల రామమోహనరావు*

కర్మదీక్షతో కదలుమా తెలుగు తేజమా
అక్షర మధుఫలములొసగు జ్ఞాన భుజమా

1. అపార కరుణ గల్గిన ఆదర్శమూర్తివి
అభ్యుదయమునందించగ నిత్యస్ఫూర్తివి
నీ నిష్క్రియ దేశానికి గొడ్డలిపెట్టు
నీ బోధనె జాతి ప్రగతికాయువుపట్టు

2. అధ్యయనం, ఆలోచన, అభివ్యక్తిలో
మార్పుగోరె వాచకాలు ఛాత్రశక్తిలో
ఇక మారడం మనవంతని మరచిపోకుమా
కర్తవ్యనిష్ఠనణుమాత్రం సడలనీకుమా

3. మాతృభాషలో మధురిమ నందజేయుచు
అభిమానం, అధికారం పొందజేయుచు
అధ్యయనం, అధ్యాపన తోడునీడలా
ప్రసరించుము జ్ఞానకాంతి వాడవాడలా

# పదవ తరగతి

**I. పాఠం పేరు** : దానశీలము (పద్యభాగం)

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : 12

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

**1) విని అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం** : ♦ రక్తదానం, అవయవదానం ప్రాధాన్యతను గురించి మాట్లాడగలగాలి.

**2) ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని ప్రతిస్పందించడం** : ♦ ఇచ్చిన పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలగాలి.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

**1) స్వీయరచన** : ♦ నేటి సమాజానికి దాతృత్వం గల వ్యక్తుల ఆవశ్యకతను గురించి, పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.

**2) సృజనాత్మకత / ప్రశంస** : ♦ ఆడిన మాట తప్పకపోవడం, దానగుణం కలిగి ఉండడం వంటి విశిష్టలక్షణాల ఆవశ్యకతను ప్రశంసిస్తూ నినాదాలు - సూక్తులు రాయగలగాలి.

**ఇ) భాషాంశాలు**

**అ) పదజాలం** : ♦ ఇచ్చిన పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు, పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులను గుర్తించి రాయగలగాలి.

**ఆ) వ్యాకరణాంశాలు** : ♦ సంధి పదాలను విడదీసి సంధిపేర్లు, సమాసపదాలకు విగ్రహవాక్యాలు, సమాసాల పేర్లు, ఇచ్చిన పద్యపాదాలకు గణవిభజచేసి ఆ పద్య లక్షణాలను రాయగలగాలి. త్రికసంధిని గురించి అవగాహన పొంది ఆ సంధి పదాలను పాఠంలో గుర్తించగలగాలి.

## IV. పీరియళ్ళ వారీగా విభజన – ప్రణాళిక :

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ | • ఉన్ముఖీకరణ | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ!<br>**(బి) చదువండి – ఆలోచించి చెప్పండి :**<br>• పిల్లలూ! పేజీనెం.2లో చదువండి–ఆలోచించి చెప్పండిలో ఉన్న సూర్య, కర్ణుల సంభాషణ చదువండి.<br>(విద్యార్థులందరి చేత మౌనపఠనం చేయించి, దాని కింద ఇచ్చిన ప్రశ్నల ద్వారా కార్యోన్ముఖులను చేస్తాను.)<br>(1) ప్రాణానికి ముప్పు అని తెలిసినా కర్ణుడు ఎందుకు దానం చేశాడు?<br>(2) ఇటువంటి దానవీరులు ఇంకెవరైనా ఉన్నారా? ఎవరు? చెప్పండి.<br>**(సి) శీర్షికా ప్రకటన :**<br>• పిల్లలూ! ఈ రోజు మనం బలిచక్రవర్తి యొక్క "దానశీలము" గురించి తెలుసుకుందాం. (పాఠం పేరు నల్లబల్లపై రాస్తాను.) | | |
| | • నేపథ్యం / ఉద్దేశం | **II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లలూ! ఇప్పుడు ఈ పాఠం నేపథ్యం, ఉద్దేశం చదువండి.<br>(1) ఈ పాఠం నేపథ్యం ఏమిటి?<br>(2) ఈ పాఠం యొక్క ఉద్దేశం తెల్పండి. | | |
| | • పాఠ్యభాగ వివరాలు | • పాఠ్యభాగ వివరాలు చదువండి.<br>(1) ఈ పాఠం ఏ ప్రక్రియకు సంబంధించింది?<br>(2) ఈ పాఠం దేని నుండి గ్రహించబడింది. | పోతన భాగవతం | <u>స్వీయరచన</u><br>1) పోతన రచన ఎలా ఉంటుంది?<br>2) దానశీలము లాంటి పాఠాలు ఎందుకు చదవాలి? |
| | • కవి పరిచయం | • పిల్లలూ! ఈ పాఠం రాసిన కవిని గురించి చదువండి.<br>(1) పోతన రచనలోని ప్రత్యేకతలు తెల్పండి. | పోతన గురించి డి.వి.డి, ఇంటర్నెట్ | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 2వ | విద్యార్థులకు సూచనలు<br><br>• ప్రవేశిక<br><br>• పఠన కృత్యాలు<br><br><br><br><br><br><br><br><br><br><br>• పఠన కృత్యాలు | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా?<br>**(బి) పునశ్చరణ :**<br>• పోతన రచనలోని ప్రత్యేకత గురించి ఏమి రాశారో చదువండి.<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లలూ! పేజీ నెం.4లోని ప్రవేశికను చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించి చెప్పండి.<br>**(ఎ) విద్యార్థుల బాహ్యపఠనము**<br>• పిల్లలూ! పేజీ నెం.4, 5లో I కి సంబంధించిన<br>(1) కులమున్ ................. వదాన్యోత్తమా!<br>(2) నిజమానతిచ్చితి .............. మతియు గలదె<br>(3) ధాత్రిని ............... భాగ్యము గలదె.<br>పద్యాలను చదువండి. (3, 4 విద్యార్థులతో బాహ్య పఠనం చేయిస్తాను.)<br>**(బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>• పిల్లలూ! మీరు చదివారు కదా! ఇప్పుడు నేను చదువుతాను. ఎట్లా చదువుతున్నానో గమనించండి.<br>(స్పష్టమైన ఉచ్చారణతో, భావ / రాగయుక్తంగా పద్యాలు చదువుతాను.)<br>**(సి) విద్యార్థుల మౌనపఠనం**<br>(ముగ్గురు విద్యార్థుల చొప్పున జట్లు చేస్తాను. జట్టుకొక పద్యం ఇస్తాను.)<br>• పిల్లలూ! మీరు పద్యం చదివి అర్థంకాని పదాల కింద గీతలు గీయండి. | పోతన భాగవతం | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • ఆ పదాలకు అర్థాలను పుస్తకంలోని పదపట్టిక ద్వారా రాయండి.<br>• అర్థాలు దొరకని వాటికి జట్టులో చర్చించి, నిఘంటువును ఉపయోగించి రాయండి.<br>(జట్టుకు ఒక నిఘంటువు ఇస్తాను)<br>• పిల్లలూ! అర్థాలు రాశారు కదా! నేనడిగిన పదాలకు అర్థాలు చెప్పండి. (కొన్ని పదాలు అడుగుతాను.)<br>1. ఆకర్ణింపు, 2. సమరము, 3. హాలికుడు, 4. యశము<br>• ఇంకా అర్థం తెలియని పదాలుంటే చెప్పండి.<br>(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాస్తాను. వాక్య ప్రయోగం ద్వారా ఆ పదాలకు అర్థాలు తెలుసుకునేలా చేస్తాను.)<br>ఉదా : దనుజులు<br>పూర్వకాలంలో దనుజులకు, దేవతలకు తరచుగా యుద్ధాలు జరిగేది.<br>దనుజులు = రాక్షసులు<br>(ఈ విధంగా పిల్లలతో అర్థసంగ్రహణం చేయించి, నోటు బుక్కులో రాసుకునేటట్లు చేస్తాను.) | నిఘంటువు | <u>పదజాలం</u><br>1) కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు చెప్పండి.<br>అ) పలికి లేదనుట<br>ఆ) కుఱచగుట<br>ఇ) చేతులొగ్గు<br>2) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు చెప్పండి.<br>అ) నీరజభవుడు<br>ఆ) త్రివిక్రముడు<br>ఇ) నలినాక్షుడు |
| 3వ | 4, 5 పేజీలలోగల I లోని పద్యాలు | I. **ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం.<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! నిన్న ఇచ్చిన పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాశారు కదా! చెప్పండి. | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | 1. కులమున్ .... వదాన్యోత్తమా<br>2. నిజమానతిచ్చితి ... మతియుగలదే<br>3. ధాత్రిని ... గలదే. | **II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లలూ! ఇప్పుడు మనం 1, 2, 3 పద్యాలను చదువుకుందాం.<br>**(ఎ) విద్యార్థుల బాహ్యపఠనము**<br>(ముగ్గురు విద్యార్థులతో ప్రకాశ పఠనం చేయిస్తాను.)<br>**(బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>(1) కులమున్ రాజ్యము ................ వదాన్యోత్తమా!<br>(2) నిజమానతిచ్చితి ............. మతియు గలదె<br>(3) ధాత్రిని .............. భాగ్యము గలదె.<br>(పై పద్యాలను స్పష్టమైన ఉచ్చారణతో, భావ / రాగయుక్తంగా, తగిన విరుపులతో చదువుతాను.)<br>**(సి) విద్యార్థుల మౌనపఠనం**<br>(విద్యార్థులు మూడు పద్యాలను మౌనంగా చదువుతారు.)<br>(కింది ప్రశ్నల ద్వారా పిల్లలతో చర్చిస్తూ విషయావగాహన కలిగిస్తాను. ఆలోచించండి - చెప్పండి బాక్స్‌లో ప్రశ్నలను తప్పకుండా అడుగుతాను.) ఉదా:-<br>(1) శుక్రుడు బలి చక్రవర్తితో వలదీ దానము గీనమున్ అని ఎందుకు హెచ్చరించాడో ఊహించండి.<br>(2) గృహస్థ ధర్మాలు ఏవి? ఈ రోజుల్లో గృహస్థులందరూ ఆ ధర్మాలు పాటిస్తున్నారా? చర్చించండి.<br>(3) ఆడినమాట ఎందుకు తప్పరాదు?<br>(4) మానధనులు ఎట్లా ఉంటారని మీరు భావిస్తున్నారు?<br>(పై విధంగా మరికొన్ని విషయాలను గత ప్రశ్నలతో చర్చ నిర్వహిస్తాను.) | | <u>ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం</u><br>1) ధాత్రిని ...... భాగ్యము గలదే! ఈ పద్యం పాదభంగం లేకుండా రాసి, భావం రాయండి.<br><u>స్వీయరచన</u><br>అ) ఈ కుబ్జుండు అలతింబోడు అని శుక్రాచార్యుడు చెప్పడంలో అతని ఉద్దేశం ఏమై ఉంటుంది? దానితో మీరు ఏకీభవిస్తారా?<br>ఆ) హాలికునికి కావలసిన వసతి సౌకర్యాలు ఏ విధంగా ఉంటే అతడు తృప్తిచెందుతాడు? |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 4వ | పేజీ నెం. 5లో ఉన్న II లో గల 4, 5, 6 పద్యాలు<br><br>4. కారే రాజులు ... ... భార్గవా!<br>5. ఉడుగని ... ...యిష్టార్థంబుల్<br>6. నిరయంబైన ... ... వేయేటికిన్ | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! కులాసాగ ఉన్నారా?<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పండి.<br>(1) మానధనులు ఎట్లా ఉంటారు?<br>(2) హాలికునికి కావలసిన వసతి సౌకర్యాలు ఎట్లా ఉండాలి?<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>**(ఎ) పిల్లల ప్రకాశపఠనం :**<br>• పిల్లలూ! 4, 5, 6 పద్యాలు చదువండి.<br>(ముగ్గురు పిల్లలతో ప్రకాశ పఠనం చేయిస్తాను.)<br>**(బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>• పిల్లలూ! మీరు చదివారు గదా! ఇప్పుడు నేను చదువుతాను. గమనించండి.<br>(4, 5, 6 పద్యాలను స్పష్టమైన ఉచ్చారణతో భావ / రాగయుక్తంగా, తగిన విరుపులతో చదువుతాను.)<br>**(సి) పిల్లల మౌనపఠనం**<br>• పిల్లలూ! మీరందరు మౌనంగా 4, 5, 6 పద్యాలను చదువండి.<br>(పిల్లల మౌనపఠనం తరువాత ఆలోచించండి - చెప్పండి. బాక్స్ ప్రశ్నలతోపాటు విషయానుగత ప్రశ్నల ద్వారా పిల్లలతో చర్చ నిర్వహిస్తాను.)<br>(1) ఏయే పనులు చేస్తే కీర్తి కలుగుతుంది?<br>(2) యశము అంటే అర్థమేమిటి?<br>(3) నీరజభుడు. వ్యుత్పత్త్యర్థం చెప్పండి.<br>(4) ఎదుటివారు అడిగిన దానిని ఇవ్వడంలో ఎటువంటి తృప్తి ఉంటుంది? మీ అనుభవాలు చెప్పండి.<br>(5) అభ్యాగతుడు అంటే ఎవరు? | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 5వ | పేజీ నెం. 6లో III లో గల 7, 8, 9, 10, 11, 12 పద్యాలు<br><br>7. బ్రదుక ... ...మానధనులు<br>8. దనుజలోక ... ...సన్నయెటిగె<br>9. రమ్మా! ,,, ,,,దడయన్<br>10. సురలోక ... ,,,వసురోత్తముదున్<br>11. విప్రాయ ... ...బొందగన్<br>12. బలిచేసిన ... ...పంచకమనఘా | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** బాగున్నారా పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>(1) జలము, యశము పర్యాయపదాలు చెప్పండి.<br>(2) సిరి మూట గట్టుకొని పోవంజాలిరే అనడంలో బలి చక్రవర్తి ఆంతర్యం ఏమిటి?<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లలూ! తన గురువు శుక్రాచార్యుని మాటకాదని బలిచక్రవర్తి వామనునికి దానం చేశాడా? లేదా? తెలుసుకుందాం.<br>**(ఎ) పిల్లల ప్రకాశపఠనం :**<br>• పిల్లలూ! 7, 8, 9, 10, 11, 12 పద్యాలను చదువండి. (5, 6 పిల్లలతో ప్రకాశపఠనం చేయిస్తాను.)<br>**(బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>• పిల్లలూ! మీరు చదివారు కదా! ఇప్పుడు నేను చదువుతాను. గమనించండి.<br>(స్పష్టమైన ఉచ్చారణతో భావ /రాగయుక్తంగా, తగిన విరుపులతో చదువుతాను.)<br>**(సి) పిల్లల మౌనపఠనం**<br>• పిల్లలూ! మౌనంగా చదువండి. (పిల్లల మౌనపఠనం తరువాత III లో ఆలోచించండి - చెప్పండి. బాక్స్ ప్రశ్నలతో, మరికొన్ని అనుబంధ ప్రశ్నలతో చర్చ నిర్వహిస్తాను.)<br>(1) "మాట దిరుగలేరు మానధనులు" అన్న మాటను మీరు సమర్థిస్తారా? ఎందుకు? | | స్వీయరచన - లఘు సమాధాన ప్రశ్నలు<br>ఈ) ఈ పాఠాన్ని బట్టి పోతన కవిత్వం ఎట్లా ఉందని భావిస్తున్నారు?<br>ఉ) "ఆడినమాట తప్పగూడదు" - ఎందుకు?<br><br>పదజాలం<br>4) కింది పదాలలో ప్రకృతికి వికృతి, వికృతి ప్రకృతి పదాలు రాయండి..<br>అ) సిరి, ఆ) విద్య,<br>ఇ) విష్ణువు, ఈ) కీరితి,<br>ఉ) ధర్మము, ఊ) బ్రహ్మ |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | (2) బలిదానాన్ని దిక్కులు పొగిడాయని కవి చెప్పిన దానిని బట్టి మీరేమి గ్రహించారు?<br>(3) విష్ణువు యొక్క పాద ప్రశస్తిని గురించి మీరేం అర్థం చేసుకున్నారో చెప్పండి.<br>(4) బలి చక్రవర్తి వామనుడికి దానమివ్వగానే లోకం ఎందుకు ఆశ్చర్యపోయింది? | | |
| 6వ | **ఇవి చేయండి**<br>I. అవగాహన – ప్రతిస్పందన<br><br>(విని, అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ! పాఠంలోని పద్యాలు ఎలా ఉన్నాయి? ఏ పద్యం మీకు బాగా నచ్చింది? ఎందుకు?<br>**(బి) పునశ్చరణ :**<br>(1) ఆడిన మాట ఎందుకు తప్పకూడదు?<br>(2) ఈ పాఠాన్ని బట్టి పోతన కవిత్వం ఎట్లా ఉందని భావిస్తున్నారు?<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! పాఠం పూర్తి అయింది కదా! ఈ రోజు మనం పేజి నెం. 8లో ఉన్న అవగాహన – ప్రతిస్పందనలో 1వ ప్రశ్నను గురించి చర్చిద్దాం. (ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>"రక్తదానం, మరణానంతర అవయవదానం వాటి ప్రాధాన్యత."<br>1) రక్తం ఎందుకు అవసరం?<br>2) రక్తదానం చేయడం అంటే ఏమిటి?<br>3) రక్తదానం ఎవరెవరు చేయవచ్చు? రక్తదానంవల్ల నష్టం కలుగుతుందా?<br>4) అవయవదానం అంటే ఏమిటి? | • రక్తదానం – రక్తదాన శిబిరాల చిత్రాలు | <u>అవగాహన – ప్రతిస్పందన</u><br>చుక్కగుర్తుగల పద్యాలను కంఠస్థం చేయండి.<br>1) కులమున్ ..... వదాన్యోత్తమా!<br>2) కారే రాజులు ..... భార్గవా!<br>3) నిరయంబైన ..... వేయేటికిన్ |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
| --- | --- | --- | --- | --- |
| | | 5) చనిపోయిన వ్యక్తి అవయవాలు పనిచేస్తాయా? ఏ అవయవాలను దానం చేయవచ్చు?<br>6) ఈ రెండు దానాల ప్రాధాన్యత ఏమిటి?<br>(పై ప్రశ్నల వంటి అనుబంధ ప్రశ్నలు వేస్తూ ఒక్కొక్క విద్యార్థిని ప్రశ్నిస్తూ ఒక్కొక్క వాక్యాన్ని చెప్పిస్తాను. చివరిగా ఒక విద్యార్థితో ఆ జవాబులన్నీ క్రోఢీకరింపచేసి చెప్పిస్తాను. ఈ విధంగా పూర్తి తరగతి చర్చ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కలిగిస్తాను.) | • కండ్లు, లివరు, కిడ్నీ మొ॥ చిత్రాలు | |
| 7వ | I. అవగాహన - ప్రతిస్పందన<br><br>(ధారాళంగా చదువండం - అర్థం చేసుకొని, ప్రతిస్పందించడం) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• కంఠస్థం చేసిన పద్యాలు చెప్పండి పిల్లలూ!<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• పిల్లలూ! 8వ పేజీలోని 3వ ప్రశ్న చూడండి. దానికి సంబంధించిన పద్యాన్ని చదువండి.<br>(పిల్లలు కులమున్ రాజ్యము ..... వదాన్యోత్తమా! పద్యాన్ని చదువుతారు.)<br>• పిల్లలూ! ఆ పద్యంలోని పదాలు రాయండి.<br>• ఆ పదాలకు 8, 9 పేజీల్లో ఇచ్చిన ప్రతిపదార్థం చదువండి.<br>• దానిని బట్టి ప్రతిపదార్థం ఎట్లా రాయాలో చెప్పండి.<br>(ఇట్లా చర్చ ద్వారా ప్రతిపదార్థం రాసే విధానాన్ని గురించి అవగాహన కలిగిస్తాను.)<br>• పిల్లలూ! ఇప్పుడు మీరు జట్లలో కూర్చొని (ముగ్గురు చొప్పున) 4వ పద్యానికి (కారే రాజులు ...) పదవిభాగం చేయండి. | | <u>ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం</u><br>3. పాఠంలోని 6వ పద్యం "నిరయంబైన ... వేయేటికిన్" ప్రతిపదార్థం రాయండి.<br><br><u>భాషాంశాలు - వ్యాకరణం</u><br>1) కింది వాక్యాల్లో సంధి పదాలను గుర్తించి విడదీసి రాయండి.<br>అ) గర్వోన్నతి వల్ల ఆత్మీయులు దూరం అవుతారు.<br>ఆ) అభ్యాగతులకు దానం చేయడం మంచిది.<br>ఇ) రంతిదేవుడు వదాన్యోత్తముడు.<br>ఈ) అణ్వాయుధాలు మానవులకు హానికలిగిస్తాయి |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
| --- | --- | --- | --- | --- |
| | | • మీరు రాసిన పదాలు చెప్పండి. (పిల్లలను అడుగుతూ ఆ పదాలను నల్లబల్లపై రాస్తాను.)<br>• నిఘంటువు ద్వారా ఆ పదాలకు అర్థాలు రాయండి.<br>• ఇప్పుడు ఏ పదం తరువాత ఏది ఉంటే అర్థవంతమైన భావం వస్తుందో చెప్పండి.<br>(పిల్లలతో అన్వయక్రమంలో అర్థాలు చెప్పించి అవగాహన కలిగిస్తాను.) | నిఘంటువు | |
| 8వ | II. వ్యక్తీకరణ – సృజనాత్మకత<br><br>(స్వీయరచన) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** బాగున్నారా! పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! మీరు రాసిన "నిరయంబైన" పద్యంలోగల పదాలు చెప్పండి. వాటి అర్థాలు చెప్పండి.<br>(పిల్లలతో పదాలు – అర్థాలు చెప్పిస్తాను.)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! పేజీ నెం.10లో వ్యక్తీకరణ – సృజనాత్మకతలో స్వీయరచన వ్యాసరూప ప్రశ్నలు (2వ అభ్యాసం) చదువండి. (ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>"నేటి సమాజానికి దాతృత్వంగల వ్యక్తుల ఆవశ్యకతను తెలుపండి."<br>(1) దాతృత్వం అంటే ఏమిటి? దాతృత్వంగల వ్యక్తులు అంటే ఎటువంటివారు?<br>(2) నేటి సమాజం ఎట్లా ఉన్నదని మీరు భావిస్తున్నారు?<br>(3) ఈనాటి సమాజానికి దాతృత్వంగల వ్యక్తుల అవసరమేమిటి? | | <u>స్వీయరచన</u><br>అ) నేటి సమాజానికి దాతృత్వంగల వ్యక్తుల ఆవశ్యకతను తెలుపండి.<br>ఆ) పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.<br><br><u>వ్యాకరణం</u><br>2) కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి సామసాల పేర్లు రాయండి.<br>అ) జీవధనములు<br>ఆ) యువతీయువకులు<br>ఇ) దశదిక్కులు<br>ఈ) భూతప్రేతములు |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | (4) వాళ్ళు లేకుంటే ఏమవుతుంది?<br>(5) వ్యక్తులలో దానగుణం పెరగాలంటే ఏం చేయాలి?<br>పైన తెలిపిన విధంగా ప్రధాన ప్రశ్నకు అనుబంధ ప్రశ్నలువేస్తూ ఒక్కొక్క విద్యార్థిచేత ఒక్కొక్క వాక్యం చెప్పిస్తారు. కీలక పదాలను, వాక్యాలను నల్లబల్లపై రాసి చర్చింపచేస్తాను.<br>• పిల్లలూ! ఇప్పుడు మీరందరూ ప్రశ్నకు జవాబు రాయండి. (పిల్లలు రాసిన జవాబుల్లో ఒక దానిని నల్లబల్లపైరాసి<br>• విషయం బాగుందా! • వాక్య నిర్మాణం ఎట్లా ఉంది?<br>• సరైన పదజాలం వాడారా! అక్షర దోషాలున్నాయా! అని నాలుగు అంశాల ద్వారా చర్చ చేస్తూ సరిదిద్దుతాను. | | |
| 9వ | II. వ్యక్తీకరణ సృజనాత్మకత | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• నేటి సమాజానికి దాతృత్వంగల వ్యక్తుల ఆవశ్యకతను గురించి చెప్పండి. పిల్లలూ!<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! 8టవ పేజీలోని 10లో గల సృజనాత్మకత ప్రశ్నను చదువండి. (ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>"ఆడినమాట తప్పకపోవడం, దానగుణం కలిగి ఉండడం మొదలైన విశిష్ట లక్షణాల ఆవశ్యకతను తెలుపుతూ నినాదాలు – సూక్తులు రాయండి."<br>• పిల్లలూ! ఈ చార్టును చూడండి. (నినాదాలు – సూక్తులు రాసిన చార్టు చూపిస్తాను.) చదువండి. | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | – చెట్లను పెంచుదాం – పర్యావరణాన్ని కాపాడుదాం.<br>– మన ప్రవర్తనే మనకు మిత్రుల్ని, శత్రువుల్ని సమకూరుస్తుంది.<br>– వినయం కంటే గొప్ప భూషణం లేదు.<br>– ఇల్లాలి చదువు – ఇంటికి వెలుగు.<br>• పిల్లలూ! చార్టు చదివారు కదా! వీటిలో ఏవి నినాదాలు, ఏవి సూక్తులు చెప్పండి.<br>• నినాదాలకు, సూక్తులకు తేడాలు ఏమిటి? చెప్పండి. (పై విధంగా చర్చిస్తూ పిల్లలకు నినాదాలు, సూక్తులుపట్ల అవగాహన కలిగిస్తాను.)<br>• పిల్లలూ! ఇప్పుడు మీకు నినాదాలు, సూక్తులు మధ్యగల తేడా తెలిసింది కదా!<br>• మీరు జట్లుగా కూర్చొని నల్లబల్లపై రాసిన ప్రశ్నకు సంబంధించి నినాదాలు, సూక్తులు రాయండి.<br>• పిల్లలూ! ఇప్పుడు మీరు రాసిన నినాదాలను చదువండి. (పిల్లలు చెప్పిన నినాదాలు బోర్డుపై రాస్తాను.)<br>– మీరు రాసినది నినాదమువలె ఉన్నదా? లేదా? ఎందుకు?<br>– రాసిన నినాదము ప్రశ్నకు సంబంధించిన విషయానికి అనుగుణంగా ఉన్నదా? లేదా?<br>– నినాదం వల్ల ఏం కలుగుతుంది?<br>• పిల్లలూ! ఇప్పుడు మీరు రాసిన సూక్తులు చదువండి. (పిల్లలు చెప్పిన సూక్తులు బోర్డుపై రాస్తాను.)<br>– మీరు రాసిందిసూక్తివలె ఉన్నదా? లేదా? ఎందుకు?<br>– సూక్తులు విషయానుగుణంగా ఉన్నాయా? లేవా? ఎందుకు? | | <u>సృజనాత్మకత / ప్రశంస</u><br>1) ఆడినమాట తప్పకపోవడం, దానగుణం కలిగి ఉండడం ఆవశ్యకతపై నినాదాలు – సూక్తులు రాయడం.<br><u>వ్యాకరణం</u><br>3) క్రింది పద్యపాదాలను గణవిభజన చేసి పద్యలక్షణాలను రాయండి.<br>అ) తెలగాణమ్మున గడ్డిపోచయును<br>ఆ) అనయము దోషమే.... |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | – సూక్తులు చదువడం వల్ల ఎటువంటి అనుభూతి కలుగుతుంది.<br>(పై విధమైన ప్రశ్నలతో పిల్లలతో చర్చిస్తూ, విషయం బాగుందా! వాక్య నిర్మాణం ఎట్లా ఉంది? పదజాలం బాగుందా! ప్రాసపదాలు వాడారా? అక్షర దోషాలు ఉన్నాయా? అనే వాటిని చర్చిస్తూ సరిదిద్దుతాను. పిల్లలకు నినాదాలు, సూక్తులు ఎట్లా రాయాలో అవగాహన కలిగిస్తాను.)<br>• పిల్లలూ! ఇప్పటిదాకా మీరు జట్లలో నినాదాలు, సూక్తులు రాశారు కదా! ఇప్పుడు ఎవరికివారే విడిగా రాయండి. | | |
| 10వ | III. భాషాంశాలు<br><br>(పదజాలం)<br>వ్యుత్పత్త్యర్థాలు<br>1. నీరజభవుడు<br>2. త్రివిక్రముడు<br>పర్యాయపదాలు<br>ప్రకృతి వికృతులు<br>నానార్థాలు<br>సొంతవాక్యాలు | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం.<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! మీరు రాసిన నినాదాలు, సూక్తులు చదువండి.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! ఇంతకు ముందు మనం పదజానికి సంబంధించిన అభ్యాసాలు చేశాం కదా! ఒక్కసారి వాటిని మళ్ళీ గుర్తుచేసుకుదాం.<br>(1) విష్ణువు నాభికమలము నుండి పుట్టినవాడు – దీని వ్యుత్పత్తి పదం చెప్పండి.<br>(2) త్రివిక్రముడు – వ్యుత్పత్త్యర్థం చెప్పండి.<br>(3) కీర్తి అనే పదానికి పర్యాయపదాలు చెప్పండి.<br>(4) బ్రహ్మకు వికృతి ఏమిటి?<br>(5) సిరికి ప్రకృతి ఏమిటి? | నిఘంటువు | వ్యాకరణం<br>క్రింది పదాలను విడదీసి రాయండి. సంధి పేరు చెప్పండి.<br>1) వదాన్యోత్తమా<br>2) కులాంతం<br>3) వలినాక్షుడు<br>4) అసురోత్తముడు<br>అవగాహన – ప్రతిస్పందన<br>బలిచేసిన దానమునకు<br>........................<br>............. పంచకమనఘా<br>ఈ పద్యాన్ని రాసి భావాన్ని రాయండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | (6) వంశం, జాతి, ఇల్లు, శరీరం – ఇవి దేనికి నానార్థాలు.<br>(7) తిరుపతి పుణ్యక్షేత్రం చేరేసరికి నా క్షేత్రం నీరసించిపోయింది. క్షేత్రానికి గల వేర్వేరు అర్థాలు చెప్పండి.<br>(8) కుఱుచగుట – సొంతవాక్యం చెప్పండి.<br>(9) పలికి లేదనుట వాక్యప్రయోగం చేయండి.<br>(ఇట్లా అభ్యాసాల్లోని పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతులను, సొంతవాక్యాలను ప్రశ్నలను ద్వారా చర్చింపజేస్తూ పిల్లలచే వ్యక్తిగతంగా రాయిస్తాను.) | | |
| 11వ | III. భాషాంశాలు<br><br>(వ్యాకరణం)<br><u>సంధులు</u><br>గుణ, యణాదేశ<br><br><u>సమాసాలు</u><br>ద్వంద్వ, ద్విగు | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం. బాగున్నారా!<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! నిన్న ఇచ్చిన పదాలను విడదీసి చెప్పండి. అట్లాగే సంధి పేర్లు చెప్పండి.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! పేజీ నెం.11లో 1వ అభ్యాసంలోని వాక్యాల్లో సంధి పదాలు చెప్పండి. (పిల్లలు చెప్పిన పదాలను బోర్డుపై రాస్తాను.)<br>• వీటిని విడదీసి సంధిపేర్లు చెప్పండి. (నల్లబల్లపై రాస్తాను.) గర్వ + ఉన్నతి, వదాన్య + ఉత్తముడు ఇవి గుణసంధులు.<br>• ఎందువల్ల ఇవి గుణసంధులు.<br>• అభ్యాగతులు – అభి + ఆగతులు, అణు + ఆయుధాలు ఇవి ఎందుకు యణాదేశ సంధులు.<br>• దశ సంఖ్యగల దిక్కులు ఏ సమాసం? ఎందువల్ల? | వ్యాకరణ గ్రంథం | <u>వ్యాకరణం</u><br>క్రింది పద్యపాదానికి గురులఘువులు గుర్తించి, గణవిభజన చేసి, ఏ పద్యమో రాసి ఆ పద్య లక్షణాలు చెప్పండి.<br>1) కులమున్ రాజ్యము ... వదాన్యోత్తమా!<br><u>అవగాహన – ప్రతిస్పందన</u><br>"బ్రదుకవచ్చు ... మానధనులు" ఈ పద్యం చదివి, అర్థం చేసుకొని దానికొక శీర్షిక పెట్టండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • భూతమును, ప్రేతమును ఏ సమాసం? ఎందువల్ల?<br>• 3వ అభ్యాసంలోని మొదటి పద్యపాదం ఏ పద్యం?<br>• మత్తేభం లక్షణాలు చెప్పండి.<br>• రెండవ పద్యపాదం ఏ పద్యం?<br>• చంపకమాల లక్షణాలు చెప్పండి.<br>(పై ప్రశ్నలతో తరగతిలో చర్చ చేస్తూ పిల్లలకు అవగాహన కలిగిస్తాను. అందరూ వ్యక్తిగతం రాసేటట్లుగా చేస్తాను.) | | |
| 12వ | III. భాషాంశాలు<br><br>ఎ<u>వ్యాకరణం</u><br>త్రికసంధి పరిచయం | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా!<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! నిన్న ఇచ్చిన పద్యపాదం దేనికి సంబంధించింది. దాని లక్షణాలు చెప్పండి.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! పేజీ నెం.11లో త్రికసంధి గురించి చదువండి.<br>• పూర్వపదాల్లో ఏ అక్షరాలు ఉన్నాయి.<br>• ఆ, ఈ, ఏ లను ఏమంటారు?<br>• ఆ, ఈ ఏ ల తర్వాత ఉన్న పదాలు చెప్పండి.<br>• సంధి జరిగినప్పుడు పరపదాలలో ఏ మార్పు జరిగింది?<br>• ద్విత్వం రావడమంటే ఏమిటి?<br>• ద్విత్వం వచ్చిన తరువాత ఏ మార్పు జరిగింది?<br>• ద్విత్వం దీర్ఘం లేని అక్షరంగా (హ్రస్వంగా) మారినప్పుడు సంధి ఎట్లా ఏర్పడింది? పిల్లలు చెప్పిన అచ్చోటు, ఇవ్విధము, ఎక్కాలము పదాలను బోర్డుపై రాస్తాను.) | త్రికసంధి పదాల చార్టు :<br>అచ్చోటు<br>ఇవ్విధము<br>ఎక్కాలము | <u>వ్యాకరణం</u><br>1) మీ పాఠంలో గల త్రికసంధి పదాలను గుర్తించి, రాయండి.<br><u>స్వీయరచన</u><br>1) పాఠం ఆధారంగా బలిచక్రవర్తి స్వభావం రాయండి.<br><u>సృజనాత్మకత</u><br>1) బలి చక్రవర్తి ఏకపాత్రాభినయం చేయండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • త్రికము అనగా ఏవి? (ఆ, ఈ, ఏ)<br>• వాటికి అసంయుక్త హల్లు పరమైతే ఏమవుతుంది? (ద్విత్వం వస్తుంది.)<br>• ద్విత్వం వచ్చినప్పుడు త్రికములోని దీర్ఘాచ్చు ఎలా మారుతుంది? (హ్రస్వంగా మారుతుంది.)<br>• పై మార్పులను బట్టి త్రికసంధి సూత్రం చెప్పండి.<br>• పిల్లలూ! అర్థమయింది కదా! మీ పాఠంలో వెదికి మరికొన్ని త్రికసంధి పదాలు రాయండి. | | |

## IV. ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచార సేకరణ :

ఆంధ్రమహాభాగవతంలో 1, 2, 3, 4, 7, 8, 9, 10 స్కంధాలను పోతన రచించాడు. 5వ స్కంధాన్ని బొప్పరాజు గంగయ, 6వ స్కంధాన్ని ఏర్చూరి సింగన, 11, 12 స్కంధాలను వెలిగందల నారయ రాశారు. పోతన రాసిన భోగినీ దండకం తెలుగులో తొలి దండకం. ఇది సర్వజ్ఞ సింగమ భూపాలునికి అంకితం చేయబడింది. దండకం లయాత్మకమైన గద్యం. వీరభద్ర విజయం వీరభద్రస్వామికి చెందిన విషయం. (ద్వానాశాస్త్రి, ఆంధ్రసాహిత్య చరిత్ర).

నారాయణ శతకం పోతన రాశాడు.అయితే దానిలోని "ధర్మపురి లంక్ష్మీనాథనారాయణా" అన్న మకుటం బట్టి ధర్మపురి నివాసులెవరో అజ్ఞాతకవి రాశాడని వాదన కూడా కలదు.

"కారేరాజులు? రాజ్యముల్" అనే పద్యం ఎత్తుగడలో వాక్యఏకత కనిపిస్తుంది. కారే, వారేరి, పేరైనన్ అనే పదాలు ప్రాస స్థానంలో పెట్టి రాసిన ఈ పద్యం మూడు ముక్తాయింపుల వల్ల మరింత హృద్యంగా ఉన్నది. "సిరిమూట గట్టుకొనిపోవడం" అనేది తరతరాలుగా మిగిలిపోయిన నుడికారం. వాడుకలో ఉన్న పలుకుబడి.

బలిచక్రవర్తి విరోచమని పుత్రుడు. ఇతనికి రత్నముఆల అను కూతురు, బాణుడు, ధృతరాష్ట్రుడు, నికుంభనాభుడు విభీషణుడు అనే కుమారులు ఉన్నారు. (పూర్విగాధలహరి).

శిబిచక్రవర్తి ఉశీనరుని కుమారుడు. శరణాగత రక్షకుడు. ఇతనిని పరీక్షించదానికి ఇంద్రుడు, అగ్ని, డేగ, పావురం రూపాలు ధరించి డేగ తరుముచుండగా పావురం భయంతోవచ్చి శిబిని ఆశ్రయించింది. తనను శరణుకోరిన పావురాన్ని వదిలిపెట్టమని శిబికోరగా అందుకు డేగ అడిగింది. ఎంత మాంసమిచ్చినా పావురం బరువుతో సరితూగడంలేదు. చివరకు శిబి తానే తక్కెడలో కూర్చున్నాడు. ఇంద్రుడు, అగ్ని నిజరూపాలు ధరించి అతనిని మెచ్చుకొని అతని శరీరం యథాప్రకారంగా ఇచ్చి వెళ్ళిపోతారు. శిబికి వృషదర్ప, సువీర, మద్రకేకయు. అనే నలుగురు కుమారులున్నఆరు.

రమ్మా, లెమ్మా, దెమ్మా, రానిమ్మా! వంటి ప్రాసపదాలతో రాసిన పద్యం శబ్దాలంకారానికి చక్కని నిదర్శనం. "ధాత్రిని హాలికునకు" పద్యంలో "రైతుకు మంచి విత్తనాలు దొరికినట్లు, దాతకు ధనము, ఉత్తముడైన ప్రతి గ్రహీత దొరకడం అదృష్టం" అని ఉన్నది. ఇందులో ఉపమాలంకారం చెప్పబడింది.

మానవులు ఆచరించవలసిన ధర్మాలు నాలుగు. అవి 1. బ్రహ్మచర్యము, 2. గృహస్థము, 3. వానప్రస్థము, 4. సన్యాసత్వము. ఇందులో గృహస్థులు యజ్ఞయాగాది క్రతువులు, దానధర్మఆలు, అతిథి సత్కారం వంటి కార్యాలు నిర్వర్తించాలి.

తయారుచేసిన చార్టులు :

| నినాదాలు - సూక్తులు |
| --- |
| • చెట్లను పెంచుదాం - పర్యావరణాన్ని కాపాడుదాం. |
| • వినయం కంటె గొప్ప భూషణం లేదు. |
| • ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు. |

| త్రికసంధి |
| --- |
| • అచ్చోట - ఆ + చోట |
| • ఇవ్విధము - ఈ + విధము |
| • ఎవ్విధము - ఏ + విధము |

## V. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :

పోతన రచన సరళంగా ఉండడంవల్ల పిల్లలు తొందరగానే భావాన్ని గ్రహించారు. పద్యాలను త్వరగా కంఠస్థం చేయగలిగారు. ప్రతిపదార్థాలను రాసేటప్పుడు, నినాదాలు - సూక్తులు రాసేటప్పుడు పిల్లలు చాలా ఉత్సాహం చూపించారు. కొందరిలో దేని గురించి అయినా నినాదాలు రాయగల సామర్థ్యం కనిపించింది. పదజాలం, వ్యాకరణం అభ్యాసాలను వ్యక్తిగతంగానే రాయడానికి ఉత్సాహం కనబరచారు. అయితే ఛందస్సు విషయం వెనుకబడి ఉన్నారు. కొంతమేరకు చదువడం, సొంతంగా రాయడం ఇబ్బందులు కనిపించాయి. వాటికొరకు మరిన్ని అభ్యాసాలు ఇవ్వవలసి ఉంది. భాగవతం సి.డి. పిల్లలను బాగా ఆకర్షించింది, విషయావగాహన కలిగించడంలో తోడ్పడింది. మొత్తం మీద ఈ పాఠాన్ని అనుకున్న కాలాంశాల్లో పూర్తి చేయగలిగాననే తృప్తికలిగింది.

# 6వ తరగతి

**I. పాఠం పేరు** : స్నేహబంధం (కథ)

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య :** 11

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

1) **విని అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం** :
- ♦ విద్యార్థులు తాము స్నేహితులకు చేసిన సాయం గురించి చెప్పగలగాలి.
- ♦ కథను సొంతమాటల్లో చెప్పగలగాలి.

2) **ధారాళంగా చదువడం, అర్థం చేసుకొని ప్రతిస్పందించడం** : ♦ ఇచ్చిన పదాలు పాఠంలో గుర్తించగలగాలి. అపరిచిత పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.

3) **స్వీయరచన** : ♦ పిల్లలు ఎదుర్కొనే ఆపదలు – తీసుకోవలసిన జాగ్రత్తలు, కథవల్ల తెలుసుకున్న మంచి విషయాలు, కథను గురించి సొంతమాటల్లో రాయగలగాలి.

4) **సృజనాత్మకత / ప్రశంస** : ♦ జంతువులు మనుష్యుల గురించి ఏం మాట్లాడుకుంటాయో ఊహించి రాయగలగాలి. జంతువులను పక్షులను పాత్రలుగా ఉపయోగిస్తూ సొంతంగా కథ రాయగలగాలి.

5) **పదజాల వినియోగం** : ♦ ఇచ్చిన పదాలకు సమానార్థ పదాలను, ప్రకృతి వికృతులు, సొంతవాక్యాలు రాయగలగాలి.

6) **భాషను గురించి తెలుసుకుందాం** : ♦ వర్ణమాల విభాగాలను గురించి తెలుసుకొని, వాక్యాల్లో వాటిని గుర్తించగలగాలి.

**IV. పీరియళ్ళ వారీగా విభజన – ప్రణాళిక :**

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ | • ఉన్ముఖీకరణ | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం. బాగున్నారా!<br>**(బి) చదువండి – ఆలోచించి చెప్పండి :**<br>• పిల్లలూ! పేజీ నెం.10లో ఆలోచించండి – మాట్లాడండిలో ఉన్న బొమ్మను చూడండి. | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | • నేపథ్యం / ఉద్దేశం<br><br>• పాఠ్యభాగ వివరాలు | (ఇచ్చిన ప్రశ్నల ద్వారా పిల్లలను కార్యోన్ముఖులను చేస్తాను.)<br>(1) బొమ్మలో పిల్లలు ఏం చేస్తున్నారు? వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో చెప్పండి.<br>(2) పై బొమ్మను చూస్తే మీకు ఏ భావన కలిగింది?<br>**(సి) శీర్షికా ప్రకటన :**<br>• పిల్లలూ! ఈ రోజు మనం "స్నేహబంధం" ఎంత గొప్పదో తెలుసుకుందాం. (పాఠం పేరు నల్లబల్లపై రాస్తాను.)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పిల్లలూ! ఈ పాఠం నేపథ్యం ఏమిటో చదువండి. (2, 3 పిల్లలతో బాహ్యపఠనం చేయిస్తాను.)<br>• పిల్లలూ! 1. ఈ పాఠం నేపథ్యం ఏమిటి?<br>2. ఈ పాఠం ఏ ఉద్దేశంతో రాయబడింది?<br>• పిల్లలూ! పాఠ్యభాగ వివరాలను గురించి చదువండి. (2, 3 పిల్లలతో బాహ్యపఠనం చేయిస్తాను.)<br>• 1. ఈ పాఠం ఏ ప్రక్రియకు చెందినది?<br>2. ఈ పాఠ్యభాగం దేని ఆధారంగా రాయబడింది? | స్నేహానికి సంబంధించిన ఆడియో సాంగ్<br><br>పంచతంత్రం కథల సి.డి.<br><br>చిన్నయసూరి మిత్రలాభం (నీతిచంద్రిక) | <u>స్వీయరచన</u><br>• స్నేహబంధం పాఠం ఎందుకు చదవాలో రాయండి.<br><u>వినడం – మాట్లాడడం</u><br>• మీ స్నేహితులను గురించి చెప్పండి. |
| 2వ | <u>విద్యార్థులకు సూచనలు</u> | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ! చాలా సంతోషంగా ఉన్నారు.<br>**(బి) పునశ్చరణ :**<br>• "1. స్నేహబంధం" పాఠం ఎందుకు చదవాలో చెప్పండి. (పై విధంగా మూల్యాంకానికి ఇచ్చిన ప్రశ్నలతో పునశ్చరణ చేస్తాను.) | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | • ప్రవేశిక<br><br>• పఠనకృత్యం – అర్థసంగ్రహణం | **II. పాఠ్యాంశబోధన – చర్చ – అవగాహన**<br>• పిల్లలూ! పేజీ నెం.11లోని విద్యార్థులకు సూచనలు చదువండి. (ఇద్దరు విద్యార్థులతో బాహ్య పఠనం చేయిస్తాను.)<br>• ఇప్పుడు పేజీ నెం.11లోని ప్రవేశికను చదువండి. పాఠంలోని విషయాన్ని ఊహించండి.<br>**ఎ) విద్యార్థుల బాహ్య పఠనం :**<br>• పిల్లలూ! పేజీ నెం.11, 12, 13, 14లోని పేరాలు చదువండి. (3, 4 విద్యార్థులతో ప్రకాశ పఠనం చేయిస్తాను.)<br>**బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>• పిల్లలూ! మీరు చదివిన పేరాలను ఇప్పుడు నేను చదువుతాను. గమనించండి.<br>(స్పష్టమైన ఉచ్చారణతో అర్థవంతంగా రెండు పేరాలు చదువుతాను.)<br>**సి) విద్యార్థుల మౌనపఠనం :**<br>• పిల్లలూ! ఇప్పుడు మీరు జట్లుగా కూర్చోండి. (ముగ్గురు, నలుగురు పిల్లలతో జట్టు చేస్తాను. జట్టుకు ఒక పేరాను చదువమని చెప్తాను.)<br>• పిల్లలూ! అర్థంకాని పదాల కింద గీతలు గీయండి. (పిల్లలు గీత గీసిన పదాలకు అర్థాలను, పుస్తకంలోని పదపట్టిక ద్వారా, నిఘంటువు ద్వారా రాయిస్తాను.)<br>• పిల్లలూ! అర్థాలు రాశారు కదా! నేనడిగే కొన్ని పదాలకు అర్థాలు చెప్పండి.<br>1. కలుగు; 2. మడుగు; 3. ముసురు; 4. రివ్వున<br>(ఈ విధంగా కొన్ని పదాలకు అర్థాలు అడిగి జవాబు చెప్పిస్తాను.) | నిఘంటువు | <u>పదజాలం</u><br>పేజీ నెం.16లో ఉన్న పదజాలంలోని 1, 4 అభ్యాసాలు.<br>1) గీతగీసిన పదాలకు సమానార్థ పదాలను పాఠం ఆధారంగా రాయండి.<br>అ) చెలిమి; ఆ) కొలను;<br>ఇ) కన్నం; ఈ) కూర్మం;<br>ఉ) అపాయకరం |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • ఇంకా అర్థం తెలియని పదాలుంటే చెప్పండి.<br>(పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై రాసి వాక్య ప్రయోగం ద్వారా అర్థం గ్రహించేటట్లు చేస్తాను.)<br>ఉదా : ఉపద్రవం<br>సంతోషంగా జీవితం గడుపుతున్న ఆ కుటుంబానికి ఒక <u>ఉపద్రవం</u> ముంచుకొచ్చింది. | | 2) కింది పదాలను చదువండి. వీటిని ఉపయోగించి సొంతవాక్యాలు చెప్పండి. రాయండి.<br>అ) గబుక్కున; ఆ) తళుక్కున<br>ఇ) చటుక్కున;<br>ఈ) మిరుమిట్లు గొలుపు |
| 3వ | పేజీ నెం. 11, 12లో ఉన్న I పాఠ్యాంశం. (ఒక అడవిలో ... ...స్నేహంగా ఉన్నాయి) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! నిన్న ఇచ్చిన పదాలకు సొంతవాక్యాలు, సమానార్థక పదాలు రాశారు కదా! చెప్పండి.<br>(పిల్లలతో జవాబులు చెప్పిస్తాను.)<br>**II. పాఠ్యాంశబోధన – చర్చ – అవగాహన**<br>**ఎ) పిల్లల ప్రకాశ పఠనం :**<br>(2, 3 విద్యార్థులతో ప్రకాశ పఠనం చేయిస్తాను.)<br>**బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>(ఉపాధ్యాయుడు స్పష్టమైన ఉచ్చారణతో, భావయుక్తంగా, అర్థవంతంగా చదువుతాడు.)<br>**సి) పిల్లల మౌనపఠనం :**<br>• పిల్లలూ! అందరూ I వ పాఠ్యాంశాన్ని మౌనంగా చదువండి. (పిల్లలు “ఒక అడవిలో ...... స్నేహంగా ఉన్నాయి.” వరకు ఉన్న పేరాలను చదువుతారు. | | <u>పదజాలం</u><br>అ) కింది పదాలతో వాక్యాలు రాయండి.<br>1) కావలసినంత –<br>2) రొప్పుతూ – |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • పాఠం చదివారు కదా! పిల్లలూ!<br>(1) మీకు కొత్తగా కలిసిన స్నేహితులతో ఎట్లా మాట్లాడుతారు? చెప్పండి.<br>(2) కలిసి మెలిసి ఉండడం వలన కలిగే లాభం ఏమిటి?<br>(3) జింక తక్కిన వాటితో మీరు దేవుడిలా కనిపించారు, అన్నది కదా! అలా ఎందుకన్నది?<br>(ఆలోచించండి – చెప్పండి. బాక్స్‌లో ఉన్న ప్రశ్నలతోబాటు, విషయసంబంధ ప్రశ్నల ద్వారా విద్యార్థులతో చర్చిస్తూ వారికి విషయావగాహన కలిగిస్తాను.) | | స్వీయరచన<br>మంచి మిత్రుల లక్షణాలను చెప్పండి. రాయండి. |
| 4వ | పేజీ నెం. 12, 13, 14 లో ఉన్న II వ పాఠ్యాంశం.<br>(ఒక పొద్దు ... ...మీకు తెలిసిందే.) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా!<br>**(బి) పునశ్చరణ :**<br>• ఎట్లా ఉంటే మంచి మిత్రులని చెప్పవచ్చు?<br>**II. పాఠ్యాంశబోధన – చర్చ – అవగాహన**<br>**ఎ) పిల్లల ప్రకాశ పఠనం :**<br>(2, 3 విద్యార్థులతో ప్రకాశ పఠనం చేయిస్తాను.)<br>**బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>(నేను స్పష్టమైన ఉచ్చారణతో, అర్థవంతంగా చదువుతాను.)<br>**సి) పిల్లల మౌనపఠనం :**<br>(పిల్లలందరు మౌనపఠనం చేస్తారు.)<br>(ఆలోచించండి – చెప్పండి లోని ప్రశ్నలతోపాటు విషయ సంబంధ ప్రశ్నల ద్వారా చర్చ నిర్వహిస్తాను.)<br>(1) కన్నవాళ్ళకు, స్నేహితులకు దూరంగా ఉంటే కలిగే బాధ ఎట్లాంటిదో చెప్పండి. | 1) అడవిలో జంతువులు<br>2) బోనులో జంతువులు<br>(చిత్రాలు) | స్వీయరచన<br>లఘు సమాధాన ప్రశ్నలు<br>ఇ) సాధారణంగా పిల్లలు ఎట్లాంటి అపాయాలు / ఆపదలు ఎదుర్కొంటారు. ఇందుకోసం ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?<br>ఈ) రాజకుమారుని స్వభావం గురించి రాయండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | (2) రాజకుమారుడు చేసిన పని మంచిదా? కాదా?<br>(3) జింక నేను పుట్టిన అడవికి వచ్చాను. స్వేచ్ఛగా బతికానన్నది కదా! దాని ద్వారా మీరేం తెలుసుకున్నారు?<br>(పై విధంగా ప్రశ్నల ద్వారా విద్యార్థులతో చర్చ నిర్వహించి విషయావగాహన కలిగిస్తాను.) | | <u>ధారాళంగా చదువడం – అర్థం చేసుకొని ప్రతిస్పందించడం</u><br>II వ పాఠ్యాంశాన్ని చదువండి. వలలో చిక్కుకున్న జింకను స్నేహితులు ఎట్లా కాపాడారో చెప్పండి. |
| 5వ | పేజీ నెం. 14 లోని III వ పాఠ్యాంశం. (చిత్రాంగుడు … …ఉరికింది) | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం.<br>**(బి) పునశ్చరణ :**<br>• వలలో చిక్కుకున్న జింకను స్నేహితులు ఎట్లా కాపాడారు?<br>**II. పాఠ్యాంశబోధన – చర్చ – అవగాహన**<br>**ఎ) విద్యార్థుల ప్రకాశ పఠనం :**<br>• (ఇద్దరు విద్యార్థులచే చదివిస్తాను.)<br>**బి) ఉపాధ్యాయుని ఆదర్శపఠనం :**<br>• (స్పష్టోచ్చారణతో, అర్థవంతంగా చదువుతాను.)<br>**సి) పిల్లల మౌనపఠనం :**<br>• పిల్లలూ! మీరందరూ III వ పాఠ్యాంశం చదువండి. (ఆలోచించి చెప్పండి. ప్రశ్నలతో చర్చ నిర్వహిస్తాను.)<br>(1) ఎలుక తాబేలును ఎందుకు కోప్పడి ఉండవచ్చు?<br>(2) ఉపాయంలో అపాయాన్ని తప్పించుకోవచ్చు. ఎట్లాగో చెప్పండి.<br>(3) ఈ కథ ద్వారా మీరేమి గ్రహించారు? | | <u>స్వీయరచన</u><br>1) లఘు సమాధాన ప్రశ్నలు.<br>అ) ఎలుక, తాబేలు, కాకి మంచి మిత్రులని ఎట్లా చెప్పగలరు. వివరించండి.<br>ఆ) ఈ కథకు ఇంకే పేరు పెట్టవచ్చు. ఎందుకు?<br><u>పదజాలం</u><br>3) క్రింది వాక్యాల్లో ఒకే అర్థం వచ్చే పదాలను గుర్తించి గీత గీయండి.<br>అ) ఎలుక కన్నం నుంచి బయటకు వచ్చి తొంగి చూసి బిలంలో దూరించి.<br>ఆ) కొలనులో కమలం వికసించింది. తాబేలు సరస్సు నుంచి పైకి వచ్చింది.<br>ఇ) కాకి ……… చెప్పింది.<br>ఈ) కాకి, తాబేలు ……… నెయ్యం కుదిరింది. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 6వ | <u>ఇవిచేయండి</u><br>I విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా! స్నేహబంధం కథ ఎట్లా ఉంది?<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! స్నేహబంధం కథకు ఇంకా ఏ పేరు పెట్టవచ్చు. ఎందుకు? చెప్పండి.<br>**II. సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>పిల్లలూ! పాఠం పూర్తి అయింది కదా! ఈ రోజు మనం ఇవి చేయండిలో "విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం" సామర్థ్యంలలోని ప్రశ్నను గురించి చర్చిద్దాం.<br>(ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>(కింది విషయాను గత అనుబంధ ప్రశ్నల ద్వారా పిల్లలతో చర్చింపజేస్తూ, ఒక్కొక్క విద్యార్థిచేత ఒక్కొక్క వాక్యం చెప్పిస్తాను. చివరిగా ఒక విద్యార్థితో ఆ జవాబులన్నీ క్రోఢీకరింపచేస్తాను. ఈ విధంగా పూర్తి తరగతి కృత్యాన్ని నిర్వహిస్తాను.)<br>**అనుబంధ ప్రశ్నలు :-**<br>1) స్నేహితులకు ఎటువంటి సందర్భాలలో సహాయం చేయవచ్చు?<br>2) అట్లా సహాయం చేసినప్పుడు మీకు ఏమనిపించింది?<br>3) మీరు ఎప్పుడైనా సాయం చేశారా?<br>4) ఎటువంటి సాయం చేశారు?<br>5) మీకు మీ స్నేహితులు ఎప్పుడైనా సాయం చేశారా?<br>6) ఇట్లా ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడం ఏం కలుగుతుంది? | స్నేహితులకు సాయం చేస్తున్నట్లుగా ఉండే వివిధ సందర్భాలకు చెందిన చిత్రాలు | <u>విని, అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం</u><br>1) స్నేహబంధం కథను సొంతమాటల్లో చెప్పండి.<br><u>సృజనాత్మకత</u><br>2) స్నేహం గొప్పతనాన్ని తెలిపే కొన్ని నినాదాలు (స్లోగన్సు) రాయండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 7వ | II. ధారాళంగా చదువండం – అర్థం చేసుకొని, ప్రతిస్పందించడం | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• స్నేహం గొప్పతనాన్ని తెలిపే నినాదాలు రాశారా? చదువండి. (కొంతమంది పిల్లలతో వారు రాసిన నినాదాలు చదివిస్తాను.)<br>**II. సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>• పిల్లలూ! ఈ రోజు మనం "ధారాళంగా చదువడం – అర్థం చేసుకొని, ప్రతిస్పందించడం" సామర్థ్యంలో అభ్యాసాలు చేద్దాం. (అభ్యాసంలో ఇవ్వబడిన మడుగు, రొప్పుతూనె, ఉరుక్కుంటూ మొదలైన పదాలు చదివి అవి పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించి గీతలు గీయమని చెప్తాను. పిల్లలు గుర్తించిన తరువాత వారిని అడుగుతాను.)<br>• "మడుగు" అనే పదం పాఠంలో ఎక్కడుంది?<br>• "కుండపోత" పదం ఏ పేజీలో, ఏ పేరాలో ఉన్నది. (ఇట్లా పిల్లలతో వ్యక్తిగతంగా గుర్తింపచేసి చెప్పిస్తాను.)<br>• పిల్లలూ! ఇప్పుడు 2వ అభ్యాసంలోని అపరిచిత పేరాను చదువండి.<br>పేరా : హెలెన్ హృదయం ................................ ........... అందరికీ ఆదర్శప్రాయమైనాయి.<br>• పేరా చదివారు కదా! ఇప్పుడు ప్రశ్నలకు జవాబులు రాయండి.<br>అ) హెలెన్ ఎటువంటింది?<br>ఆ) హెలన్‌ను పరవశింపచేసేది ఏది?<br>(మొ॥ ప్రశ్నలకు పిల్లలు జవాబు రాసిన తరువాత వారితో చెప్పించి సరిదిద్దుతాను.) | | <u>ధారాళంగా చదువండం – అర్థం చేసుకొని ప్రతిస్పందించడం</u><br>క్రింది వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో, వాటిని ఎవరన్నారో చెప్పండి.<br>1) ఎంత ప్రమాదం జరిగింది చిత్రంగా!<br>2) ఏం కొంపమునిగిందని వచ్చావు.<br>3) నన్నందరూ ముద్దు చేసేవారు.<br><u>పదజాలం</u><br>పాఠ్యపుస్తకంలోని ప్రకృతి – వికృతి పట్టిక ఆధారంగా కింది పదాలకు ప్రకృతి – వికృతిని గుర్తించి పట్టిక రాయండి.<br>"అటవి, ఆకాశం, స్నేహం, సాయం, సహాయం, రాత్రి, రాతిరి, నెయ్యం, ఆకసం, అడవి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 8వ | | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా! చాలా హుషారుగా కనిపిస్తున్నారు.<br>**(బి) పునశ్చరణ :**<br>• పిల్లలూ! న్ని ఇచ్చిన వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో చెప్పండి.<br>1) "ఏం కొంపమునిగిందని వచ్చావు."<br>2) "నన్ను అందరూ ముద్దు చేసేవారు."<br>• బాగా చెప్పారు. అట్లాగే ప్రకృతి వికృతులు చెప్పండి.<br>1) ఆకాశం – వికృతి; 2. రాతిరి – ప్రకృతి<br>పై విధంగా పునశ్చరణ చేస్తాను.)<br>**II. సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>• పిల్లలూ! ఈ రోజు మనం "స్వీయరచన"లోని వ్యాసరూప సమాధాన ప్రశ్నకు జవాబు ఎట్లా రాయాలో చర్చిద్దాం.<br>(స్వీయరచన – వ్యాసరూప ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>ప్రశ్న : స్నేహబంధం కథను క్లుప్తంగా సొంతమాటల్లో రాయండి.<br>• పిల్లలూ! కథను పుస్తకంలో ఉన్నంత పెద్దదిగా కాకుండా పది వాక్యాలను సరిపోయే విధంగా ప్రధానమై,న అంశాలు మాత్రమే చెప్పాలి. రాయాలి.<br>(ప్రశ్నకు సంబంధించి జవాబును ఒక్కొక్క విద్యార్థితో చెప్పిస్తాను. చివరిగా ఒక విద్యార్థితో అన్ని జవాబులను క్రోడీకరించి చెప్పిస్తాను. ప్లిలలచే వ్యక్తిగతంగా జవాబులు రాయించి, ఒక జవాబును నల్లబల్లపై రాస్తాను.) | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • పిల్లలూ! జవాబు చూశారు కదా! కథను క్లుప్తంగా రాశారా? విషయం ఉన్నదా? వాక్య నిర్మాణం బాగుందా? సందర్భోచిత పదజాలం ఉందా? అక్షరదోషాలు ఉన్నాయా?<br>(మొదలైన వాటిని అడుగుతూ పిల్లలతో చర్చిస్తూ సరిచేస్తాను.)<br>• పిల్లలూ! ఇప్పుడు జవాబు ఎట్లా రాయాలో తెలిసింది కదా! ఎవరికి వాళ్ళే విడివిడిగా కథను క్లుప్తంగా రాయండి. | | <u>స్వీయరచన</u><br>1) స్నేహబంధం కథను సొంతమాటల్లో రాయండి.<br><u>భాషను గురించి తెలుసుకుందాం</u><br>2) తెలుగు వర్ణమాల రాయండి. |
| 9వ | సృజనాత్మకత / ప్రశంస | I. **ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! శుభోదయం.<br>**(బి) పునశ్చరణ :**<br>• స్నేహబంధం కథను క్లుప్తంగా చెప్పండి.<br>II. **సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>• పిల్లలూ! ఈ రోజు మనం అడవి జంతువులు మనవలెనే మాట్లాడితే, మన గురించి అవి ఏం మాట్లాడతాయో ఊహిద్దాం. (ప్రశ్నను నల్లబల్లపై రాస్తాను.)<br>1) అడవి జంతువులు మనవలెనే మాట్లాడితే మన గురించి అవి ఏం మాట్లాడతాయి?<br>(ఒక్కొక్క విద్యార్థితో మాట్లాడిస్తాను. పిల్లలందరూ ఒక్కొక్క వాక్యం చెప్పిన తరువాత, జట్లుగా విభజించి జవాబు రాయిస్తాను.)<br>• పిల్లలు ఇప్పుడు మీరు జట్లలో రాసిన జవాబు చదువండి. (పిల్లలూ! జవాబులు చెప్పేటప్పుడు, ఏ జంతువు ఎట్లా అనుకుంటుందో చెప్పించి చర్చ నిర్వహిస్తాను. పిల్లలు రాసిన జవాబులో ఒక దానిని నల్లబల్లపై రాసి, స్వీయరచనలోవలె విషయం, వాక్యనిర్మాణం, సరైన పదజాలం, అక్షరదోషాలను గురించి చర్చిస్తూ సరిదిద్దుతాను. సరిదిద్దిన తరువాత విద్యార్థులచే వ్యక్తిగతంగా రాయిస్తాను.) | స్నేహితులకు సాయం చేస్తున్నట్లుగా ఉండే వివిధ సందర్భాలకు చెందిన చిత్రాలు | <u>సృజనాత్మకత / ప్రశంస</u><br>1) అడవిలోని జంతువులు మన గురించి ఏం మాట్లాడతాయో రాయండి.<br>ఉదా :<br>పులి : ____________<br>సింహం : ____________<br>ఏనుగు : ____________<br><u>భాషను గురించి తెలుసుకుందాం</u><br>2) వర్ణమాలలో అచ్చులు, హల్లులు ఉభయాక్షరాలు రాయండి. |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 10వ | VI భాషను గురించి తెలుసుకుందాం | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** శుభోదయం! పిల్లలూ!<br>**(బి) పునశ్చరణ :**<br>• 1) అచ్చులంటే ఏవి? 2) హల్లులు అంటే ఏవి?<br>3) వేటిని ఉభయాక్షరాలు అంటారు?<br>**II. సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>• పిల్లలూ! పేజీ నెం. 18లోని భాషను గురించి తెలుసుకుందాం సామర్థ్యంలలోని ఇచ్చిన విషయాన్ని చదువండి. (అచ్చులు, హల్లులు, విభాగాలు)<br>(2, 3 పిల్లలచే బాహ్యపఠనం చేయిస్తాను.)<br>1) అచ్చులలో దీర్ఘం లేని అక్షరాలు ఏవి?<br>2) దీర్ఘాచ్చులు ఏవి?<br>3) హల్లులను ఎన్ని విభాగాలు చేశారు?<br>4) పరుషములు, సరళములు ఏవి? వీటికి గల మరొక పేరేమిటి?<br>5) మహాప్రాణాలు లేక వర్గయుక్కులు అని వేటిని అంటారు?<br>(పై విధముగా ప్రశ్నిస్తూ పిల్లలకు వ్యాకరణాంశాలపై అవగాహన కలిగిస్తాను.) | | <u>భాషను గురించి తెలుసుకుందాం</u><br>హల్లులు, వాటి విభాగాలను రాయండి. |
| 11వ | | **I. ఉపోద్ఘాతం**<br>**(ఎ) పలకరింపు :** పిల్లలూ! బాగున్నారా!<br>**(బి) పునశ్చరణ :**<br>• 1) అనునాసికాలు ఏవి?<br>2) య, ర, ల, వ లను ఏమంటారు? | | |

| పీరియడ్ | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | **II. సామర్థ్యాల సాధన అభ్యాసం**<br>• పిల్లలూ! ఈ రోజు మనం భాషను గురించి తెలుసుకుందాం. సామర్థ్యానికి సంబంధించి పేజీ నెం.19లో ఉన్న విషయం చదువుకుందాం. (ఉభయాక్షరాలు, అభ్యాసాలు)<br>1) ఉభయాక్షరాలు ఏవి? ఎందుకని వాటిని ఉభయాక్షరాలు అన్నారు?<br>2) అరసున్న వాడుక మీకు ఎప్పుడైనా పాఠాలలో కనిపించిందా?<br>3) విసర్గ (ః) ను పాఠ్యపుస్తకంలో పాఠాలలో చూశారా?<br>4) ఎందుకని విసర్గ తెలుగు పాఠాలలో కనిపించలేదు?<br>• పిల్లలూ! ఇప్పుడు అభ్యాసాలు చేద్దాం.<br>1) పరుషములు అంటే ఏవి? కింది వాక్యంలో వాటిని గుర్తించండి.<br>♦ కష్టపడి చదివితే ఫలితం తప్పక ఉంటుంది.<br>2) సరళములు అంటే ఏవి? సరళాలతో మొదలయ్యే మాటలను గుర్తించండి.<br>♦ బలం, కలం, గాలి, జలం, దళం, తళుకు, కాలు.<br>(ఇట్లా అభ్యాసాల్లో ఇచ్చిన వాటి గురించి పిల్లలను ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా అవగాహనతో రాసేటట్లుగా చేస్తాను. రాసిన తరువాత జవాబులు అడిగి తప్పులుంటే చర్చ ద్వారా సరిదిద్దుతాను.) | | <u>ధారాళంగా చదువడం – అర్థం చేసుకొని ప్రతిస్పందించడం</u><br>పేజీ నెం. 13లో ఉన్న చివరి పేరాను చదువండి. దానికి ఒక పేరు పెట్టండి.<br>"ఒకనాడు నేను రాజభవనం ... ... తన సేవకులకు చెప్పాడు."<br><u>సృజనాత్మకత / ప్రశంస</u><br>పిల్లలూ! వివిధ జంతువుల మాస్కులు తయారు చేసుకొని, మనుష్యుల గురించి అవి ఏం మాట్లాడుకుంటాయో సంభాషణలు రాసి ప్రదర్శించండి. |

## IV. ఉపాధ్యాయుడి తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :

సంస్కృత పంచతంత్రంలో మిత్రలాభం, మిత్రభేదం, కాక ఉలూకీయం, లబ్ధ ప్రణాశం, అపరీక్షిత కారిత్వము అనే భాగాలు ఉన్నాయి. తెలుగులో పరవస్తు చిన్నయసూరి మిత్రలాభం, మిత్రభేదం అనే రెండు తంత్రములు మాత్రమే తీసికొని నీతిచంద్రిక అనే పేరుతో రాశాడు. ఒక్కొక్క వాక్యము ఒక్కలోకోత్తిగా ఉంటుంది. నీతిచంద్రిక అందలి భాగాలు పిల్లలకు పాఠ్యగ్రంథాలుగా నిర్ణయించబడుతున్నాయి. చిన్నయసూరి విడిచిపెట్టిన విగ్రహము, సంధి అనే తంత్రములను కందుకూరి వీరేశలింగం పంతులుగారు రాశారు.

## V. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :

స్నేహానికి సంబంధించిన ఆడియో సాంగ్స్ వినడంలో పిల్లలు బాగా ఆసక్తి కనపరచారు. పంచతంత్రం కథల సి.డి. చూసినప్పుడు చిత్రాంగుడి కథను బాగా అర్థం చేసుకున్నారు. సృజనాత్మకంగా అడవి జంతువులు మనుష్యుల గురించి తాము ఆకలివేసినప్పుడు మాత్రమే వేటాడి తింటామని, ఈ మనుష్యులు తమ కడుపునిండినా ఇంకా ఇంకా ఆహారాన్ని కూడబెట్టుకొనే స్వార్థపరులని రాయడంలో పిల్లల ఆలోచనాశక్తి, పరిశీనలనా శక్తి ఆనందం కలిగించింది. పిల్లలు తమ స్నేహితులకు చేసిన సాయం గురించి బాగా చెప్పారు. తరగతి గదిలో ప్రతి ఒక్కరు చెప్పే ప్రయత్నం చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా ఈ పాఠంవల్ల పిల్లల్లో స్నేహభావం పెరిగింది. తరగతిలో ఒకరికి ఒకరు చదువడంలో, తినడంలో, పనులు చేయడంలో సాయం చేసుకోవడం కనిపించింది. అయితే పిల్లలు చదివేటప్పుడు, తడబడడం, సొంతంగా రాసేటప్పుడు అక్షరదోషాలు ఎక్కువగా రాయడం కనిపించింది. ఆ సామర్థ్యాలపై నేను పిల్లలకు ఎక్కువ అభ్యాసం కలిగించాలని నిర్ణయించుకున్నాను.

# Chapter-VI

## సి.సి.ఇ. / పరీక్షల సంస్కరణలు - అమలు

**మౌలిక ప్రశ్నలు - ఆలోచించండి - ప్రతిస్పందించండి**

**(Basic Questions - Think and Reflect)**

1. మదింపు అంటే ఏమిటి? (What is assessment?)
2. నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఏమిటి?

   (What is Continuous and What is Comprehensive Evaluation?)
3. మూల్యాంకనం ఎందుకు? దాని ఉద్దేశ్యం ఏమిటి? (Why evaluation? What is its purpose?)
4. వేటిని మదింపు చేయాలి? (What to assess?)
5. ఎలా మదింపు చేయాలి? (How to assess?)
6. మదింపు ద్వారా పిల్లలకు ఇచ్చే సమాచారం స్వభావం ఏమిటి? ఎందుకు?

   (What is the nature of the feed back? why and to whom?)
7. ఏ విధంగ మదింపు సమాచారాన్ని రిపోర్టు చేస్తాం? రిపోర్టింగ్ పద్ధతులు ఏమిటి?

   (How to report -reporing process?)
8. సి.సి.ఇ లో ఎవరు, ఏ ఏ బాధ్యతలు ఏఏ స్థాయిలలో స్వీకరించాలి?

   (What are the roles and responsibilties for effective implementation of CCE at various levels?)

**నేపథ్యం (Context)**

మూల్యాంకనం అనగానే పిల్లలకు పరీక్షలు నిర్వహించడం అనే భావన మనలోఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం మొత్తం కూడా మూల్యాంకనాన్ని పరీక్షల కోణంలో మాత్రమే చూడడానికి అలవాటు పడినారు. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన సమాచారాన్ని నిరంతరం బట్టీ పట్టించి పరీక్షలలో రాయడమే బోధనా లక్ష్యంగా మారిపోయింది. మూల్యాంకనం పేరిట నిర్వహించే పరీక్షలు పిల్లలలో పాఠశాలపట్ల, నేర్చుకోవడంపట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించడానికి బదులుగా భయాందోళనలకు గురిచేస్తున్నాయి.

పిల్లల ప్రగతిని మాపనం చేయడానికి ఉపయోగించే మార్కులు, ర్యాంకులు పిల్లలపై నిరంతరం ఒత్తిడి కలిగిస్తున్నాయి. అందువల్ల వారి శారీరక, మానసిక వికాసాలకు ఆటంకం కల్గుతుంది. మార్కుల సాధనే ధ్యేయంగా బోధనాభ్యసన ప్రక్రియలు కూడా మార్పు చెందాయి. మూల్యాంకనం పిల్లల అభిరుచులు, సామర్థ్యాలతో సంబంధం లేకుండా ఏక మొత్తంగా సాగే పరీక్షా కార్యక్రమంగా అమలవుతుంది. పరీక్షా ఫలితాల సాధనలో అవాంఛనీయ అంశాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అసంబద్ధమైన పోటీ తత్వం పిల్లల ఉద్వేగ వికాసానికి, జీవన నైపుణ్యాల సాధనకు తావులేకుండా పోయింది. యూనిట్, టర్మినల్ పరీక్షల పేరుతో నిర్వహిస్తున్న మూల్యాంకనం, పిల్లలు ఉత్తీర్ణులయ్యారు, కాలేదు అని ముద్ర వేయడానికి మాత్రమే తోడ్పడుతోందే తప్ప లోపాలను గుర్తించి సామర్థ్యాల సాధనను మెరుగుపరచేందుకు ఉపయోగపడడం లేదు.

ప్రస్తుత మూల్యాంకనం ఉపాధ్యాయ కేంద్రీకృతంగా అమలవుతోంది. ప్రగతి పత్రాల పేరిట పిల్లలకు అందించే సమాచారంలో పాఠ్య విషయాలపై మూల్యాంకనం మాత్రమే చోటుచేసుకుంటుంది. చాలా సందర్భాలలో మనం నిరంతర, సమగ్ర మూల్యాంకనం నిర్వహిస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ పాఠ్యవిషయాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తున్నాం.

సహపాఠ్యాంశాలకు అనగా ఆరోగ్య-వ్యాయామ విద్య, కళలు-సాంస్కృతిక విద్య, పని-కంప్యూటర్ విద్య, విలువల విద్య-జీవన నైపుణ్యాలు మొదలగు వాటికి తగినంత ప్రాధాన్యత నివ్వడంలేదు. పైగా నిరంతర సమగ్ర మూల్యాంకనం అంటే ఎక్కువగా పరీక్షలు పెట్టడమనే అపోహ పడుతున్నాం. విధాననిర్ణయ కర్తలు, విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయులు నిరంతర, సమగ్ర మూల్యాంకనం యొక్క నిజమైన స్వభావాన్ని అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది.

## మూల్యాంకనం - ప్రస్తుత పరిస్థితి (Assessment - Existing Situation)

- విద్యా లక్ష్యాలకు మరియు మూల్యాంకనం చేసే విధానం మరియు అడిగే ప్రశ్నలకు సంబంధం లేకపోవడం.
- విద్యార్థుల అభ్యసనాన్ని కేవలం రాతపరీక్షల ద్వారానే మాపనంచేయడం జరుగుతుంది. మౌఖికం మరియు ప్రదర్శనలకు అవకాశం తక్కువ ఉండడం.
- పరీక్షలలో పిల్లల ప్రగతి ఆధారంగా, బోధనలో మార్పులు లేక సవరణనాత్మక బోధన జరగడం లేదు. పిల్లల ప్రగతి బాగా లేకున్నా కూడా, తరవాత సిలబస్ చెప్పడం చేస్తున్నారు. పిల్లలకు వచ్చినా రాకున్నా సిలబస్‌కు పూర్తి ప్రాముఖ్యత ఇచ్చి మా పని అయిపోయింది అనిపిస్తున్నారు.
- పిల్లలలో ఆలోచనశక్తి, విశ్లేషణ సామర్థ్యాలను పరీక్షించే ప్రశ్నలు కాకుండా, కేవలం బట్టీపట్టి జవాబులు రాసే ప్రశ్నలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరుగుతుంది.
- అభ్యసనం అనేది పుస్తకాధారితం అయింది. సమాచారం ఇవ్వడం మరియు ఇచ్చిన దానిని యథాతథంగా పరీక్షించడం అనేది విద్యలో పరమార్థం అయినది.
- విద్యా ప్రణాళిక, విద్య యొక్క ముఖ్య ఉద్దేశ్యం- విద్యార్థిని సర్వతోముఖాభివృద్ధి కలిగిన ఒక పరిపూర్ణ మానవునిగా తయారు చేయడం. కాని కేవలం, భాషలు, గణితం, సైన్సు, సాంఘికశాస్త్రాలకే ప్రాధాన్యత ఇస్తూ, కళలు, ఆటలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, విలువలు ఏవైతే వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి, సమాజంలో కలిసి జీవించడానికి తోడ్పడతాయో, వాటిని విస్మరించడం జరిగింది.
- బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడు పిల్లలు ఏ విధంగా, ఎంత వరకు నేర్చుకుంటున్నారు అనేది అప్పటికప్పుడు తెలుసుకోకుండా పరీక్షల వరకు ఆగి, అప్పుడు తెలుసుకొని, ఎంత మంది ఎంత వరకు నేర్చుకొన్నారు అనే దాన్ని చూస్తున్నారు.

- పరీక్షల ఆధారంగా ఉపాధ్యాయులు తమ బోధనా విధానాన్ని మార్చుకోవడం కానీ అభివృద్ధి పరచుకోవడం గానీ, లేక ఎలా? ఏ పద్ధతిలో చెబితే ఫలితం బాగా వస్తుందో ఆలోచించడం లేదు. పిల్లల ప్రగతి కేవలం వారి ప్రతిభా పాటవాల మీదనే ఆధారపడి ఉన్నది అనేది ఎక్కువ మంది ఉపాధ్యాయుల నమ్మకం.
- బోధన అనేది పరీక్షలకు అనుగుణంగా పరీక్షలకు తయారు చేయడం లేక పరీక్షలను దృష్టిలో పెట్టుకొని చేయడం జరుగుతుంది. అందువలనే గైడ్లకు, నోట్సుకు, ప్రశ్న జవాబుల సామాగ్రికి, టెస్ట్ పేపర్‌కి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారు.
- మూల్యాంకన విధానాలను బట్టి చదువు ఉంటుంది. అంటే ఉపాధ్యాయుల పనితీరు మరియు పిల్లల తయారీ కూడా పరీక్షలకు లోబడే ఉంటుంది.

పిల్లలకు పాఠశాలలో అందజేయవలసిన అభ్యసనానుభవాల నేపథ్యంలో వ్యక్తిపరంగానూ, సమాజ పరంగానూ విద్యాలక్ష్యాలను రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధిపత్రం వివరిస్తుంది. ఇది పాఠశాల విద్యా కార్యక్రమాలకు, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది. విద్యాలక్ష్యాలను సాధించడానికి ప్రణాళికాబద్ధమైన కృత్యాల రూపకల్పన, బోధనాంశాల, బోధనావిధానాల ఎంపిక, సామగ్రి, మూల్యాంకన విధానాలు మొదలైనవాటిపై ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం సూచించింది. తద్వారా పిల్లల్లో గుణాత్మకమైన విద్యను సాధించడానికి వీలు కలుగుతుందని పేర్కొంది.

## CCE - పరీక్షల సంస్కరణలు (CCE - Examinations Reforms)

CCE ద్వారా, పరీక్ష విధానాలలో ఈ కింది సంస్కరణలు ప్రతిపాదించడం జరిగింది.

- పిల్లల ప్రగతిని అంచనా వేయడం ఎప్పుడో ఒకసారి అని కాకుండా, నిర్మాణాత్మక మదింపు ద్వారా తరగతి గదిలో బోధనాభ్యసనం జరుగుతున్నప్పుడే అంచనా వేయడం జరుగుతుంది.
- నేర్చుకోవడం అనేది జ్ఞాపకం చేయడం నుండి వేరుపరచి, విద్యార్థులు ఆలోచించి స్వంతంగా వ్యక్తీకరణం చేయడంపై దృష్టి పెట్టాలి. మరియు దీన్ని ప్రోత్సహించాలి.
- మూల్యాంకనం అనేది విద్యా ప్రమాణాలు ఏ మేరకు విద్యార్థులు పొందారో అని తెలుసుకొనే విధంగా ఉంటుంది. అంటే విద్యార్థులు ఏ మేరకు అభ్యసనా లక్ష్యాలు, విద్యా లక్ష్యాలు పొందారు? అని తెలుసుకోవడం మీద శ్రద్ధ పెట్టాలి.
- ఉపాధ్యాయులు స్వయంగా తయారుచేసుకున్న ప్రశ్నపత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఎటువంటి పరిస్థితుల్లో కూడా పరీక్షల కోసం ప్రశ్నపత్రాలను కొనడం, మండల స్థాయిలో లేక పాఠశాల సముదాయం స్థాయిలో గాని తయారుచేసినవి ఉపయోగించకూడదు. ఉపాధ్యాయుడు తాను ఏమి బోధించాడు? ఎలా బోధించాడు? ఏ ఏ విద్యా ప్రమాణాలను సాధించడానికి బోధించాడు? అనే అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాన్ని తయారు చేసుకోవాలి. ప్రశ్నలు ఆలోచించి, విశ్లేషించి, పిల్లలు తమ సొంతంగా వివరించే విధానానికి అనుకూలంగా ఉండాలి. పిల్లలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ప్రశ్నలు దోహదపడాలి. పరీక్షలు పిల్లలు సొంతంగా తమ ప్రతిభా పాటవాలను వ్యక్తపరచేవిధంగా ఉండాలి. జవాబులు వారి ప్రతిభకు వెలికితీసే విధంగా ఉండాలి.
- ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థివారీగా, విషయవారీగా, పిల్లల ప్రగతి రిజిస్టర్ అనగా CCE register ను నిర్వహించాలి.

- మదింపు అనేది కేవలం రాత పరీక్షల ద్వారానే కాకుండా, మౌఖికం, ప్రదర్శన, కృత్యాలు చేయడం, ప్రాజెక్టులు, పరిశీలనలు, తరగతి గది పని, వారు రాసిన రిపోర్ట్ల ద్వారా కూడా జరగాలి.
- కళలు, ఆటలు, ఆరోగ్యవిద్య, విలువలు, పని అనుభవం మొదలగు వాటిని మూల్యాంకనంలో భాగంగా చేయడం ద్వారా మూల్యాంకనాన్ని సమగ్రంగా చేయడం జరిగింది. (Comprehensive Assessment).
- మూల్యాంకనం సమగ్రమే కాకుండా విద్యార్థులు నేర్చుకొనేటప్పుడు వారు చదివేటప్పుడూ, రాసేటప్పుడూ, లెక్కలు చేసేటప్పుడు, జట్టు పనిలో పాల్గొనేటప్పుడు - చర్చలు జరిగేటప్పుడు వారు మాట్లాడే విధానాన్ని, వివిధ అంశాలపై వారు వ్యక్తపరిచే భావనల పై ఆధారపడి వారి ప్రగతిని ఉపాధ్యాయులు అంచనా వేయాలి. ఈ విధంగా తరగతి గదిలో బోధనా అభ్యాసనం జరిగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకుంటున్నాడు అనేది ఉపాధ్యాయుడు అవగాహన చేసుకొని మదింపు చేస్తే దానిని నిర్మాణాత్మక మదింపు అంటాం. ఈ విధంగా మనం ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసనాన్ని అవగాహన చేసుకొని మదింపు చేయడాన్ని నిరంతర మూల్యాకనం అంటారు.
- పిల్లల ప్రగతి పత్రం, అన్ని అంశాలపై అనగా కరికులం, కో కరికులం, విద్యార్థి ఆరోగ్యం, హాజరు మొదలగు అన్ని అంశాలపై ప్రగతిని సూచిస్తుంది.
- మాస వారీగా పాఠశాల యాజమాన్య కమిటీ మరియు తల్లిదండ్రుల సమావేశాలల్లో పిల్లల ప్రగతిని చర్చించాలి. పిల్లలు చదువడం, రాయడం, లెక్కలు చేయడం, ఇచ్చిన అంశం పై ధారాళంగా మాట్లాడించడం మొదలగునవి తల్లిదండ్రుల ముందు ప్రదర్శించాలి.
- పాఠశాలలు జూన్‌లో మొదలవగానే ప్రతి సబ్జెక్టులో ఒక ప్రారంభ పరీక్ష నిర్వహించి ప్రతి విద్యార్థి స్థాయిని తెలుసుకొని దానిపై ఆయా విద్యార్థులను ఏ స్థాయికి తీసుకురావాలి అని ప్రతి ఉపాధ్యాయుడు ఒక టార్గెట్ పెట్టుకోవాలి. ఆ విధంగా పెట్టుకున్న టార్గెట్‌పై ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకొని ప్రణాళిక వేసుకొని నిరంతరం ప్రయత్నించాలి. అప్పుడే మనం మన వృత్తికి న్యాయం చేసినవారమవుతాం.

## నిరంతర సమగ్ర మూల్యాంకనం-భావనలు-అవగాహన (CCE- Conceptual understanding)

పిల్లలు సమగ్ర అభివృద్ధిని సాధించాలని ఇందుకోసం పాఠశాలలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్.టి.ఇ-2009 ద్వారా మనకు తెలుస్తుంది. పిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, భావోద్వేగపరంగా అభివృద్ధి చెందాలి. ఇందుకోసం పాఠ్య విషయాలతో పాటు పిల్లల ఆసక్తులు, విలువలు, వైఖరులు మొదలగు వాటిలో కూడా పిల్లలు అభివృద్ధి చెందాలి.

### 'నిరంతరం' అనగా (What is continuous)

పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనాన్ని, విస్తృత అర్థంలో పరిశీలించినపుడు పిల్లల పెరుగుదల వికాసాలకు ఖచ్చితమైన ప్రాధాన్యతనివ్వవలసి ఉంటుంది.

**'నిరంతరం'** అంటే పిల్లల ప్రగతిని ఒక సంఘటనకో, సందర్భానికో ఎప్పుడో ఒక మూడు (3) గంటల పరీక్షకు పరిమితం చేయకుండా ఎల్లప్పుడూ పరిశీలించడం. అనగా నిరంతరం పాఠశాలలోపల, వెలుపల పిల్లల శారీరక, మానసిక వికాసాలను తరచుగా ఒక క్రమపద్ధతిలో పరిశీలిస్తున్నామని పిల్లలకు తెలియకుండానే పరిశీలించాలి. అభ్యసన లోపాలను గుర్తించి సవరణాత్మక చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ స్వీయ మూల్యాంకనం చేసుకోగలగాలి.

**'సమగ్రం' అనగా (What is comprehensive)**

**పిల్లల సర్వతోముఖాభివృద్ధి. అంటే పిల్లల శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాలలో అభివృద్ధి అని అర్థం.** ఇందుకోసం విద్యాప్రణాళికలో నిర్వచించిన పాఠ్య, పాఠ్యేతర అంశాలను విడివిడిగా చూడకుండా రెండింటికీ సమాన ప్రాధాన్యతను ఇవ్వడమే. అనగా భాష, గణితం, సైన్సు, సాంఘికం వంటి విషయాలతోపాటు కళలు, పని, విలువలు, ఆరోగ్యం, జీవన నైపుణ్యాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం. ఇది పిల్లల పెరుగుదల, వికాసాలను పాఠ్యాంశాల దృష్టితోనే కాకుండా వారి అభిరుచులు, వైఖరులు, సామర్థ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటుంది. **సమగ్ర విద్యలో కళలు, సాహిత్యం, సౌందర్య వివేచన, తాత్విక చర్చ, శిల్పం, సంగీతం వంటి విషయాల్లో అత్యున్నత అంశాల బోధన ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.**

వీటితోపాటు సృజనాత్మక, విశ్లేషణాత్మక, తార్కిక అంశాలకు కూడా మూల్యాంకనం సమాన ప్రాధాన్యతనిస్తుంది.

## పిల్లల సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటి?

## (What is Comprehensive Development of the child?)

విద్య ద్వారా పిల్లలలో సంపూర్ణ వికాసం సాధించాలన్నది విద్యా లక్ష్యం అయినపుడు సమగ్ర అభివృద్ధి అంటే ఏమిటో అర్థం చేసుకోవడం అవసరం. పాఠశాల విద్య పిల్లలు శారీరకంగా ఎదిగే వయసుతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి విద్య శారీరక వికాసానికి అంటే పిల్లలు వయసుతో తగిన, ఆరోగ్యం, ఎత్తు, బరువు వుండేలా చూసేందుకు అవసరమైన ఆరోగ్యవ్యాయామ అంశాలు, కీలకం కావాలి. అలాగే స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించడం, సమస్యలకు కుంగిపోకుండా ఎదురు నిలిచి సమస్యలను పరిష్కరించే నేర్పురావాలి. మంచి వైఖరులతో ఉత్తమ అభిరుచి కలిగిన వ్యక్తిగా సామాజిక బాధ్యత నిర్వర్తించగలగాలి. వీటన్నింటి ద్వారా విషయ పరిజ్ఞానం పొందగలగాలి. కాబట్టి సమగ్ర అభివృద్ధి అంటే పిల్లలు పాఠ్యపుస్తకాల ఆధారంగా జ్ఞానాన్ని నిర్మించుకోవడం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఉద్వేగ, సాంఘిక, సాంస్కృతిక వికాసాలను పొందడం. ఇందుకోసం పిల్లల్లో జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలు, విలువలు పెంపొందించాలి. కాబట్టి పాఠశాల విద్యలో ఈ అంశాలన్నీ అభ్యసనాంశాలుగా కనిపించాలి. పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే అంశాలన్నీ పాఠ్యాంశాలే. వీటిలో పాఠ్య, సహపాఠ్య అన్న విభేదనం అవసరం లేదు. పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలన్నీ పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడేవిగా ఉండాలి. కాబట్టి ఈ విషయాలన్నింటిని మూల్యాంకనం చేయాలి.

## CCE ఎందుకు? (Why CCE?)

మూల్యాంకనమంటే కేవలం పరీక్షలు పెట్టడం మాత్రమే కాదు. యూనిట్, టెర్మినల్ పరీక్షల పేరుతో ఎప్పుడో ఒకసారి పిల్లల సామర్థ్యాలను పరిశీలించడం వల్ల వారి అభ్యసనకు అది ఏవిధంగానూ సహాయపడదు. పైగా ఈ విధమైన పరీక్షా పద్ధతి పిల్లలు ఏ సమాచారాన్ని ఎంత వరకు గుర్తుపెట్టుకోగలిగారో పరీక్షిస్తుందో తప్ప వారి విభిన్న సామర్థ్యాలను తెలుసుకోవడానికి ఉపయోగపడదు. మూల్యాంకనం పేరుతో అనేక రకాల పరీక్షలు నిర్వహించడం వలన పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. బట్టీపట్టడానికి అవకాశం కల్పించే పరీక్షా పద్ధతులు, పిల్లల ఉద్వేగ, సాంఘిక వికాసాలను మదింపుచేయడానికి ఉపయోగపడవు. కాబట్టి పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయవలసిన అవసరం

ఉంది. పిల్లలు తాము పరిశీలింపబడుతున్నామని వారికి తెలియకుండా మూల్యాంకనం చేయడం వల్ల వచ్చే ఫలితాలు వారికి పునరభ్యాసం కలిగించడానికి ఎంతగానో తోడ్పడతాయి. భయరహిత వాతావరణంలో స్వేచ్ఛగా మూల్యాంకనం చేయడం వల్ల ఎప్పటికప్పుడు లోపాలు గుర్తించి సవరణాత్మక కృత్యాలు నిర్వహించడానికి వీలుకలుగుతుంది. పాఠ్య విషయాలతోపాటు పిల్లల సర్వతోముఖాభివృద్ధికి సంబంధించిన ఆసక్తులు, అభిరుచులు, శారీరక ఎదుగుదల, విలువలు, వైఖరులు, కళాభిరుచి ఇలా అన్ని అంశాలపై ఒక అవగాహన కలిగివుండి, వాటిని వాటిలో పిల్లల అభిరుచిని, ప్రగతిని తెలుసుకోవాలి. అప్పుడే మూల్యాంకనాన్ని సమగ్రమైనదిగా భావిస్తారు.

## మూల్యాంకనం చేయాల్సిన అంశాలు (6–10 తరగతులు)

## (Areas of Assessment (1-5 and 6-10 classes)

***ఉన్నత పాఠశాల స్థాయి (1–10 తరగతులు)***

- ప్రథమ భాష
- ద్వితీయ భాష
- తృతీయ భాష
- గణితం
- సామాన్యశాస్త్రం
- సాంఘికశాస్త్రం
- కళలు, సాంస్కృతిక విద్య
- ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగా, ధ్యానం
- పని, కంప్యూటర్ విద్య
- విలువల విద్య, జీవన నైపుణ్యాలు, వైఖరులు

## వేటిని మూల్యాంకనం చేయాలి? (What to assess?)

***భాషలు:***

1. వినడం, ఆలోచించి మాట్లాడడం
2. చదువడం,అర్థంచేసుకుని ప్రతిస్పందించడం
3. సొంతంగా రాయడం (స్వీయరచన)
4. పదజాలాభివృద్ధి
5. సృజనాత్మక వ్యక్తీకరణ, ప్రశంస
6. భాషను గురించి తెలుసుకోవడం

## సహపాఠ్య కార్యక్రమాలు

**కళలు, సాంస్కృతిక విద్య**

1. రంగులు వేయడం, చిత్రాలు గీయడం, అలంకరించడం, నమూనాలు బొమ్మలు తయారు చేయడం
2. ట్యాన్‌గ్రామ్, ఓరిగామి, కుట్లు, అల్లికలు
3. నాటికలు, ఏకాంకికలలో నటించడం, కొరియోగ్రఫీ,
4. పాటలు పాడడం, వాద్యపరికరాల వినియోగం, నృత్యం - స్థానిక కళారూపాలు ప్రదర్శించడం, మైమ్
5. మన సంస్కృతి, కళలు, సాహిత్యం

**ఆరోగ్య, వ్యాయామవిద్య**

1. ఆసక్తిగా పాల్గొనడం నియమ నిబంధనలు పాటించడం, క్రీడాస్ఫూర్తి, ప్రత్యేక నైపుణ్యాలు
2. యోగ, ధ్యానం, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి.
3. కుటుంబ సంబంధాలు, భద్రత, ప్రథమ చికిత్స
4. ఆరోగ్యం, పౌష్ఠికాహారం, మంచి ఆహారపు అలవాట్లు.
5. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మంచి అలవాట్లు

**పని, కంప్యూటర్ విద్య**

1. నమూనాలు వస్తువుల తయారీ, పనిముట్లు, సామగ్రి వినియోగం.
2. వ్యక్తుల సేవల వినియోగం, ఉత్సవాలలో పాల్గొనడం (అంతర కరికులమ్ కార్యక్రమాలు, బాధ్యతలు నిర్వర్తించడం)
3. కంప్యూటర్ ఆధారంగా నేర్చుకోవడం
4. కంప్యూటర్‌ను వినియోగించడం
5. సామాజిక కార్యక్రమాలు, శ్రమదానం

**విలువల విద్య, జీవన నైపుణ్యాలు**

1. మంచి, చెడు విచక్షణాజ్ఞానం, సత్ప్రవర్తన
2. రాజ్యాంగ విలువలు
3. సహనం, దయ, తధానుభూతి మొదలగు వ్యక్తిగత విలువలు
4. జీవననైపుణ్యాలు, ఆలోచనా నైపుణ్యాలు
5. ఉపాధ్యాయులు, సహాధ్యాయులు పాఠశాల, ప్రభుత్వ ఆస్తుల పట్ల సరైన వైఖరులు కలిగి ఉండడం.

## CCE - ఎలా మూల్యాంకనం చేయాలి? - విధానాలు

## (CCE – How to assess? – Procedures)

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పాఠశాలలో నిర్వహించే మూల్యాంకన విధానాలు పిల్లలను సంపూర్ణంగా పరిశీలించి నమోదుచేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయులు తరగతిగది లోపల బయట పిల్లలను పరిశీలిస్తూ చేసే అంశాలతోపాటు క్రమానుగతంగా నిర్ణీత కాలవ్యవధులలో నిర్వహించే మూల్యాంకనం కూడా అవసరమే. ఇవి వారాంత, పక్ష, మాస, టర్మినల్ రూపాలలో కూడా ఉండడం అవసరం. అయితే ఏ మూల్యాంకన విధానం అయినప్పటికి

వచ్చే ఫలితాలను బట్టి ఏ ఇద్దరినీ ఒకరితో ఒకరిని పోల్చకూడదు. అంటే మూల్యాంకనం పిల్లలు ఎలా నేర్చుకున్నారు? ఏమి నేర్చుకున్నారు? అనే అంశాలు పరిశీలించడంతోపాటు నేర్చుకున్న అంశం స్థిరంగా ఉండేందుకు కూడా మూల్యాంకనం తోడ్పడాలి. జ్ఞానము, అవగాహన వినియోగం, విశ్లేషణ, నూతన సందర్భాలలో సర్దుబాటుచేసుకోవడమనే అంశాలతోబాటు అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ప్రత్యేక ఆసక్తులు, శారీరక ఎదుగుదల ఆరోగ్యకరమైన విషయాలుకూడా నిశితంగా మూల్యాంకనం చేయాలి. ఈ విధమైన మూల్యాంకనం రెండు రకాలు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మాటివ్ అసెస్‌మెంట్)
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం (సమ్మేటివ్ అసెస్‌మెంట్)

## నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Assessment)

తరగతి గదిలో కల్పించిన అభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొంటున్నప్పుడు, బోధన జరుగుతున్నప్పుడు విద్యార్థి ఏ విధంగా నేర్చుకుంటున్నాడో పరిశీలించి నమోదు చేయడం ద్వారా పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరచడానికి కృషిచేయడాన్ని **నిర్మాణాత్మక మూల్యాంకనం** అంటారు. నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది భయరహిత వాతావరణంలో, పిల్లలకు ఆసరాగా నిలిచి అభ్యసనను వేగవంతం చేసుకోవడానికి ఉపకరించేది. ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన సందర్భాలలో ఉపాధ్యాయుడు పిల్లలకు సహాయకారిగా నిలిచి సరిదిద్ది ముందుకు నడిపించాలి. కేవలం మార్కులు, గ్రేడుల రూపంలో కాకుండా పిల్లలకు వారి సామర్థ్యాల సాధనా స్థితిగతులను వివరణాత్మకంగా తెలిపి వారికి సరైన సూచనలు సలహాలు ఇచ్చి ప్రోత్సహించి అభ్యసనాన్ని మెరుగుపరచడానికి నిర్మాణాత్మక మూల్యాంకనం సహాయపడుతుంది.

తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల సమాధానాలు, పాఠం మధ్యలో మరియు చివర ఉన్న ప్రశ్నలు, అభ్యాసాల గురించి చర్చిస్తున్నప్పుడు పిల్లలు చర్చల్లో పాల్గొని ఇచ్చే సమాధానాలు, పిల్లలు రాసిన నోటుపుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్టుపనులు, జట్టు పనులు మొదలైన వాటి ఆధారంగా పిల్లలు ఏమి నేర్చుకున్నారో, ఎలా నేర్చుకుంటున్నారనేది ఉపాధ్యాయుడు అంచనా వేయవచ్చు. దీన్నే **నిర్మాణాత్మక మూల్యాంకనం** అంటాం.

బోధనాభ్యసన జరుగుతున్న సమయంలో నిరంతరం ఫీడ్‌బ్యాక్ ఇస్తూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమను తాము సరిచేసుకునే వీలుకల్పిస్తుంది. అవసరమైన మార్పులు చేసుకోవడానికి తోడ్పడుతుంది.

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రధానంగా నాలుగు రకాల సాధనాలను ఉపయోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు
2. రాత అంశాలు (నోటుపుస్తకాలు, ఇంటిపని మొ॥వి)
3. ప్రాజెక్టు పనులు
4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్)

### 1. పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు

రోజువారీ నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియల్లో పిల్లలు పాల్గొనాలి. తమ అభిప్రాయాలను, స్పందనలను స్వేచ్ఛగా వ్యక్తపరచాలి. అనుమానాల గురించి ప్రశ్నించగలగాలి. ఉపాధ్యాయులు అడిగే ప్రశ్నలకు సందర్భోచితంగా సమాధానాలు ఇవ్వగలగాలి. ప్రయోగాలు, ప్రాజెక్టు పనులు, పాఠంలోని విషయం గురించే చర్చించే సందర్భాల్లో, పాఠంలోని విషయం గురించి ఆలోచింపజేసే ప్రశ్నలు అడుగుతున్న సందర్భాలలో పిల్లలు ప్రతిస్పందించగలగాలి. వీటి ఆధారంగా పిల్లల భాగస్వామ్యాన్ని అంచనా వేయవచ్చు. ఇవి పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరుస్తుంది. దీని వల్ల తరగతి

గది చురుకైన వాతావరణంతో కూడి ఉంటుంది. ఇది పరీక్ష కాదు. ఒక మంచి తరగతి గదిలో పిల్లలు-ఉపాధ్యాయులు కలిసి బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొంటున్నారనడానికి నిదర్శనం. ఇది అభ్యసనను వేగవంతం చేయడంతోపాటు అర్థవంతంగా కూడా మారుస్తుంది. కాబట్టి నిర్మాణాత్మక మూల్యాంకనంలో దీనికి ప్రత్యేక స్థానాన్ని కేటాయించారు. ఆర్.టి.ఇ. చట్టంలో కూడా సెక్షన్ 29లో పిల్లలు స్వేచ్ఛగా పాల్గొనాలి. తమ భావాలను వ్యక్తపరచగలగాలి. ప్రశ్నించగలగాలి అనే అంశానికి 'పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు' న్యాయం చేకూరుస్తుంది. ఆయా సబ్జక్టుల వారీగా వీటికి సంబంధించిన వివరాలను మరింత వివరంగా తెలుసుకుంటారు.

పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనల్లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. ఉపాధ్యాయుడు పిల్లలను పరిశీలించాల్సి ఉంటుంది. తరగతిగది బయట పిల్లల క్రమశిక్షణ, ప్రవర్తన, వివిధ అంశాలకు ప్రతిస్పందన, చిత్రాలు గీయటం, పాటలు పాడటం, ఆటలు ఆడటం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యపు అలవాట్లు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, విచక్షణా పరిజ్ఞానం మొదలైన విషయాలలో పిల్లలను పరిశీలించడం ద్వారా మదింపు చేయవచ్చు. మరియు పరిశీలనల ఆధారంగా వివిధ సామర్థ్యాలలో ఎలా ఉన్నాడో అంచనా వేయవచ్చు. వీరికి సలహాలు ఇచ్చి ఇంకా మెరుగుపరుచుకునేటట్లు తప్పులు సరిదిద్దుకునేటట్లు చేయవచ్చు. దీనికోసం తరగతిగది లోపల, తరగతిగది బయట ఎల్లప్పుడూ ఉపాధ్యాయుడు, విద్యార్థిని పరిశీలిస్తూ ఉండాలి.

అయితే ప్రాథమిక స్థాయికి, ఉన్నత స్థాయికి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉంటుంది. ప్రాథమిక స్థాయిలో మౌఖిక ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, చర్చల్లో పాల్గొనడం, చిత్రాల ఆధారంగా మాట్లాడడం, ధారాళంగా చదువడం, చదివిన దాని గురించి చెప్పగలగడం, సమాచారపట్టికలు, పటాల గురించి మాట్లాడగలగడం, నోటి లెక్కలకు జవాబులు చెప్పగలగడం వంటివి పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలుగా ఉంటాయి. 6వ తరగతి నుండి సబ్జక్టు వారీగా వేర్వేరుగా ఉంటుంది. **భాషల్లో** గ్రంథాలయ పుస్తకాలు చదువడం, బాల సాహిత్యం, వార్తాపత్రికలు మొదలగునవి చదివి నివేదికలు రాయడం; **గణితంలో** లెక్కలు తయారు చేయగలగడం; **విజ్ఞానశాస్త్రంలో** ప్రయోగాలు చేసి రికార్డు రాయడం; **సాంఘికశాస్త్రంలో** సమకాలీన అంశాల గురించి ప్రతిస్పందన నివేదిక రాయడం వంటివి పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలుగా ఉంటాయి.

**2. పిల్లలు రాసిన అంశాలు**

**పిల్లలు నోట్ పుస్తకాలలో సొంతంగా రాసిన అంశాలు (పాఠంలోని అభ్యాసాలకు స్వయంగా రాయడం).**

పిల్లలు పాఠశాలలోనూ, ఇంటివద్ద తమ నోటు పుస్తకాలో రాసిన జవాబులు, చేసిన లెక్కలు మొదలైన వాటిని పరిశీలించి విద్యార్థి ప్రగతిని తెలుసుకోవాలి. ఏ విషయంలో ఎంత వెనుకబడి ఉన్నాడనేది తెలుసుకోవడం ద్వారా విద్యార్థికి అనువైన బోధనాభ్యసనను అందించడానికి వీలుకలుగుతుంది. పిల్లలందరినీ నోట్‌పుస్తకములు తెచ్చుకోవడానికి ప్రోత్సహించాలి. పిల్లల నోట్ పుస్తకంలో పాఠ్యాంశాలకు సంబంధించిన అంశములు, ప్రశ్నలు, జవాబులు, వివిధ అంశములలో వారికి నచ్చిన అంశములు, ప్రయోగ విధానములు, బొమ్మలు గీయటం, వివిధ సమస్యలు, ప్రాజెక్టు పనులు, పరికల్పనలు మొదలైన అంశములను రాయడానికి ప్రోత్సహించాలి.

**పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలు, అభ్యాసాలు:**

నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాలలో పాల్గొంటూ సామర్థ్యాలను సాధించడానికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలు రూపొందాయి. కాబట్టి పిల్లలు పాఠ్యపుస్తకాలలో కూడా చాలా అంశాలను చర్చించడం మరియు రాయవలసి ఉంటుంది. పాఠం మధ్యలో, పాఠం చివర ఉండే ప్రశ్నలకు సమాధానాలు, కృత్యాలులోని పట్టికలు నింపడం, సమాచార సేకరణ

పట్టికలు నింపడం, అవసరమైన నివేదిక రాయడం మొదలైనవన్నీ పాఠ్యపుస్తకాలలో రాయవలసి ఉంటుంది. పాఠ్య బోధన, చర్చల సందర్భంలోను మరియు పాఠ్యపుస్తకాలలో పిల్లలు రాసిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకొని వారి ప్రగతిని అంచనా వేయాలి. పాఠం చివర ఇచ్చిన అభ్యాసాలకు పిల్లలు ఆలోచించి, సొంతంగా తమదైన జవాబులు రాయాలి. గైడ్లలో, పుస్తకాలలో చూసి రాయకూడదు.

**3. ప్రాజెక్టు పనులు**

తరగతి గదిలో కేవలం వినడం ద్వారా లేదా చదువడం ద్వారా నేర్చుకోవడం అని కాకుండా చేయడం ద్వారా, అనుభవం ద్వారా నేర్చుకోవడానికి అవకాశం కల్పించే కార్యక్రమమే ప్రాజెక్టుపనులు. దీనిద్వారా పిల్లల్లో పరిశీలన, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధిచెందుతాయి. ఉత్సాహంగా బోధనాభ్యసన ప్రక్రియలలో పాల్గొనగలుగుతారు. భాషలు, భాషేతర అంశాలలో పిల్లలు సొంతంగా జ్ఞానాన్ని పొందడానికి ప్రాజెక్టు పనులు ఎంతగానో ఉపయోగపడతాయి. పిల్లలు ప్రాజెక్టులో పాల్గొన్న విధానాన్ని, రూపొందించిన నివేదికలను ఆధారంగా చేసుకొని మూల్యాంకనం చేయాలి.

"ఇచ్చిన ఒక అంశం మీద విద్యార్థి/ విద్యార్థులు కూలంకషంగా చర్చించి ఆ సమస్యను వివిధ కోణాలలో విశ్లేషించి, పరిశీలించి ఒక నివేదికను సమర్పించడం".

ఇది కొంతమంది విద్యార్థులకు జట్టు కృత్యంగా కూడా నిర్వహించవచ్చును. ఈ విధానం వలన విద్యార్థిలో స్వయం అభ్యసనం, తాను తెలుసుకున్న అంశాల మీద నిజనిర్ధారణ, కొత్త విషయాలను సేకరించడం, నమూనాలను తయారుచేయడం, సమస్యను విశ్లేషించడం, ఇతరులతో మాట్లాడడం మొదలైన గుణాలు అలవడతాయి.

**నివేదిక రూపకల్పన (Documentation):**

పిల్లలు తాము సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నివేదికను తయారుచేస్తారు. పిల్లలు నిర్వహించే కార్యక్రమాలను క్రమపద్ధతిలో రాసి ఇవ్వగలిగితే అది నివేదిక అవుతుంది. ప్రాజెక్టు పనులు, సమాచార సేకరణ మొదలగు వాటిని ఒక రిపోర్ట్ రూపంలో రాయడాన్ని డాక్యుమెంటేషన్ లేదా నివేదిక రూపకల్పన అంటారు. ఈ పనులలో వారు నిర్వహించిన తీరు, సేకరించిన సమాచారం రాయాలి.

**4. లఘు పరీక్ష (Slip Test)**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల సామర్థ్యాల సాధనను ఒక చిన్న పరీక్ష రూపంలో కూడా పరిశీలించవలసి ఉంటుంది. అయితే, ఇది సాధారణ యూనిట్ పరీక్ష కాదు. దీని గురించి ముందుగానే ప్రశ్నాపత్రం రూపొందించుకోవడం, పరీక్షల టైమ్ టేబుల్ ప్రకటించడం, నిర్ణీత సమయంలోనే పరీక్షను నిర్వహించడం వంటివి ఉండవు. ఉపాధ్యాయుడు తాను చెప్పిన పాఠ్యాంశాలలో ఎంపిక చేసుకున్న విద్యా ప్రమాణాలను పరిశీలించడానికి అప్పటికప్పుడే నిర్వహించే ఒక రాత పరీక్ష. దీని ద్వారా పిల్లల సామర్థ్యాల సాధనను ఉపాధ్యాయుడు నిర్ధారించడానికి వీలు కలుగుతుంది. దీనిపై ఎలాంటి ముందస్తు సమాచారం విద్యార్థులకు ఇవ్వనవసరం లేదు. ప్రశ్నలను నల్లబల్లపై గాని, చార్టుపై గాని రాయాలి. పుస్తకంలో ఉన్న ప్రశ్నలను, అభ్యాసాలను అలాగే ఇవ్వకూడదు. పిల్లలు ఆలోచించి సొంతంగా సమాధానాలు రాసేందుకు వీలుగా ప్రశ్నలు తయారుచేసి ఇవ్వాలి. దీని వల్ల పిల్లలకు ఆలోచించి జవాబులు రాసే అభ్యాసం లభిస్తుంది. పిల్లలు రాసిన జవాబులను విశ్లేషించడం ద్వారా ఎక్కడ వెనుకబడ్డారో గుర్తించి తగిన విధంగా అభ్యాసం కల్పించవచ్చు. ఇది ఒక రకంగా పబ్లిక్ పరీక్షలకు పిల్లలను ముందస్తుగా సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుంది. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో పుస్తకంలోని ప్రశ్నలను ఉన్నది ఉన్నట్లుగా ఇవ్వకుండా బహుళ సమాధానాలు వచ్చేలా ఆలోచింపజేసే ప్రశ్నలతో లఘు పరీక్ష నిర్వహించాలి.

**6 నుండి 10 తరగతులకు నిర్మాణాత్మక మూల్యాంకన అంశాలు**

| వ. సం. | నిర్మాణాత్మక మూల్యాంకన అంశం | మార్కులు |
|---|---|---|
| 1 | భాషా విషయాలలో గ్రంథాలయ మరియు ఇతర పుస్తకాలు అంటే - కథా సాహిత్యం, బాలసాహిత్యం, వార్తా పత్రికలు - మ్యాగజైన్లు ఇతర పుస్తకాలు చదివి నివేదికలు, సమీక్షలు రాసి ప్రదర్శించడం. విజ్ఞానశాస్త్రంలో ప్రయోగాలు చేయగలగడం; సాంఘికశాస్త్రంలో చదువడం, విశ్లేషించడం మరియు ప్రస్తుత సామాజిక సమస్యలపై ప్రతిస్పందించడం; గణితంలో వివిధ భావనలకు సంబంధించిన గణిత సమస్యల తయారీ. | 5 |
| 2 | పిల్లలు నోట్ పుస్తకాలలో సొంతంగా రాసిన అంశాలు (పాఠంలోని అభ్యాసాలకు స్వయంగా రాయడం). | 5 |
| 3 | ప్రాజెక్టు పనులు | 5 |
| 4 | లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్) | 5 |
| | **మొత్తం** | **20** |

**1 నుండి 5 తరగతులకు నిర్మాణాత్మక మూల్యాంకన అంశాలు**

| వ. సం. | నిర్మాణాత్మక మూల్యాంకన అంశం | మార్కులు |
|---|---|---|
| 1 | **పిల్లల భాగస్వామ్యం-ప్రతిస్పందనలు:** తెలుగు, ఇంగ్లీష్ సబ్జక్టులలో- పిల్లలు వినడం, మాట్లాడడం, ధారాళంగా చదువడం, చిత్రాల ఆధారంగా మాట్లాడడం, పాఠం బోధించే సమయంలో ఆలోచించే ప్రశ్నలకు జవాబులు చెప్పగలగడం మొ॥వి చేయగలగాలి. గణితంలో- మౌఖిక సమస్యలకు జవాబులు చెప్పగలగాలి. తప్పొప్పులను గుర్తించి వివరించగలగాలి. రాత లెక్కలను అర్థం చేసుకొని మాట్లాడగలగాలి. పరిసరాల విజ్ఞానంలో- కృత్యాలు, చిన్న చిన్న ప్రయోగాలలో పాల్గొని వాటి గురించి చెప్పగలగాలి. సమాచార పట్టికలను, పటాలను వివరించగలగాలి. తరగతిగదిలో పాఠం చెప్పే సందర్భంలో అడిగే ప్రశ్నలకు సందర్భోచితంగా జవాబులు చెప్పాలి. అట్లాగే చర్చల్లో పాల్గొనగలగాలి. | 10 |
| 2 | పిల్లలు నోట్ పుస్తకాలలో సొంతంగా రాసిన అంశాలు (పాఠంలోని అభ్యాసాలకు స్వయంగా రాయడం). | 10 |
| 3 | ప్రాజెక్టు పనులు | 10 |
| 4 | లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్) | 20 |
| | **మొత్తం** | **50** |

**ఫార్మాటివ్ అసెస్‌మెంట్ ఎప్పుడెప్పుడు నిర్వహించాలి?**

- నిర్మాణాత్మక మూల్యాంకనం రోజు వారీ తరగతి గది బోధనలో భాగం.
- విద్యా సంవత్సరంలో నాలుగు సార్లు రికార్డులో నమోదు చేయాలి. ఉపాధ్యాయుడు వాస్తవంగా పరిశీలించి, నమోదు చేస్తేనే పిల్లలకు, సమాజానికి న్యాయం చేసినవాళ్ళమవుతాం.
- నిర్మాణాత్మక మూల్యాంకనం
  1. జూలై
  2. సెప్టెంబర్
  3. నవంబర్
  4. ఫిబ్రవరి నెలలలో నమోదు చేయాలి.
- ఉపాధ్యాయుడు పిల్లల సామర్థ్యాల సాధనను పరిశీలిస్తూ ప్రగతిని నిర్ధారించాలి.
- ప్రతి రోజు పిల్లల ప్రగతిని నమోదు చేయాల్సిన అవసరం లేదు.
- ఉపాధ్యాయుడు తన పరిశీలనల ఆధారంగా ఒక నిర్ధారణకు వచ్చి మార్కులు ఇవ్వాలి.
- టీచర్ డైరీ, నోటుపుస్తకాలు సరిచేసి ఉండడం, ప్రాజెక్టు నివేదికలు, దిద్దిన సమాధాన పత్రాలు ఆధారాలుగా ఉంచుకోవాలి.
- గ్రేడు నిర్ణయించడంలో విద్యార్థి సాధించిన మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి.
- పిల్లల ప్రగతిని పాయింట్ల స్కేలుతో సూచించాలి.
- సహ పాఠ్యాంశాలలో గ్రేడులతోపాటు వివరణాత్మక సూచికలు కూడా రాయాలి.

| గ్రేడు | మార్కులు (100) | గ్రేడ్ పాయింట్లు |
|---|---|---|
| A1 | 91 నుండి 100 | 10 |
| A2 | 81 నుండి 90 మార్కులు | 9 |
| B1 | 71 నుండి 80 మార్కులు | 8 |
| B2 | 61 నుండి 70 మార్కులు | 7 |
| C1 | 51 నుండి 60 మార్కులు | 6 |
| C2 | 41 నుండి 50 మార్కులు | 5 |
| D | 35 నుండి 40 మార్కులు | 4 |
| E | 0 నుండి 34 | 3 |

| విషయం | నిర్మాణాత్మక మూల్యాంకనం | | | | పొందిన మార్కులు | గ్రేడు |
|---|---|---|---|---|---|---|
| | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు (5 మా) | రాత అంశాలు (5 మా) | ప్రాజెక్టు పనులు (5 మా) | *లఘు పరీక్ష (5 మా) | | |
| తెలుగు | 4 | 4 | 5 | 4 | 17 | |
| గ్రేడులు | B1 | B1 | A1 | B1 | A2 | A2 |

*లఘు పరీక్షను 20 మార్కులకు నిర్వహించుకోవాలి. మార్కులను మాత్రం 5 మార్కులకు కుదించి రికార్డులో నమోదు చేయాలి.

**నిర్మాణాత్మక మూల్యాంకనం- లక్షణాలు:**

- బోధనాభ్యసన జరుగుతున్నప్పుడే పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో పరిశీలించడం.
- అభ్యసనను మెరుగుపరచుకోవడానికి నిరంతరం జరిగేది (on going assessment)
- అభ్యసనాన్ని మెరుగుపరుస్తుంది.
- అభ్యసనం ఎలా జరుగుతుంది అనే విధానంపై దృష్టిపెడుతుంది.
- అంతర్గతంగా నిర్ణయించుకున్న పద్ధతులు, లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది.
- అభివృద్ధి పరచవలసిన అంశాలను గుర్తించడానికి పనికివస్తుంది.
- బోధనా పద్ధతులు, విధానాలు మొదలైనవన్నీ నిరంతరం మార్చుకోవడానికి వీలైన సరళీకృతం కలిగివుంటుంది.
- ప్రగతి కోసం ప్రయత్నిస్తుంది.
- పరస్పరం నేర్చుకోవడానికి వీలుకల్పిస్తుంది.
- సూక్ష్మస్థాయి పరిశీలన.
- పిల్లల డైరీలు, నోటుపుస్తకాలు మొదలైన సాధనాల ద్వారా మూల్యాంకనం జరుగుతుంది.

## సంగ్రహణాత్మక మూల్యాంకనం (Summative Assessment)

విద్యార్థి బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకొన్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడాన్ని సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటారు. ఇవి కోర్సు మొత్తం పూర్తిఅయిన తర్వాత లేదా నిర్ధారిత పాఠ్యాప్రణాళిక పూర్తయిన తరువాత పిల్లల సాధనను పరీక్షించే పద్ధతి. ఈ పద్ధతిలో విద్యార్థి తాను చదివిన కోర్సుద్వారా ఏమి నేర్చుకున్నాడు?, ఎంత వరకు నేర్చుకున్నాడు? అనే అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సాధారణంగా రాత (పేపర్ - పెన్సిల్) పరీక్షల రూపంలో మాత్రమే నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పాఠ్యవిషయాలను మాత్రమే పరీక్షించడం జరుగుతుంది. పిల్లలు ఎంత నేర్చుకున్నారు అని పరీక్షించడం. టర్మినల్, వార్షిక పేరిట నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనం విద్యార్థులకు వారి సాధనను, మార్కులు, ర్యాంకుల రూపంలో అందజేస్తుంది. ఉత్తీర్ణత సాధించారో లేదో మాత్రమే తెలియజేస్తుంది. విద్యార్థులు చదివిన అంశాలన్నీ అవగాహన చేసుకొని స్వంతంగా పరీక్షలలో రాయవలసి రావడం వల్ల పిల్లల్లో పరీక్షలపట్ల భయం, వ్యాకులత ఉండదు. ఈ తరహా అంతర్గత మూల్యాంకన విధానం పరీక్షల పేరిట పిల్లల మధ్య కలిగే అవాంఛనీయ పోటీని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. దీని స్వభావాన్ని మరింతగా నిశితంగా అర్థంచేసుకుందాం.

- ఇది అభ్యసనను మూల్యాంకనం చేసే పద్ధతి.
- సాధారణంగా టర్మ్, వార్షిక పరీక్షల రూపంలో నేర్చుకున్న మొత్తాన్ని పరీక్షిస్తుంది. అనగా గతంలో త్రైమాసిక (Quarterly), అర్ధ వార్షిక (Half Yearly) మరియు వార్షిక (Annual) పరీక్షలుగా నిర్వహించేవారు. ప్రస్తుతం ఒక సంవత్సరంలో దీన్ని రెండుమార్లు నిర్వహిస్తారు. మొదటిది అక్టోబర్ మాసంలో, రెండవది మార్చి/ ఏప్రిల్ మాసంలో నిర్వహిస్తారు.
- విద్యాప్రమాణాల ఆధారంగా పిల్లల ప్రగతిని ఉపాధ్యాయుడు స్వయంగా తయారుచేసిన పరీక్షా పేపర్‌తో పరిశీలించే పరీక్ష పద్ధతి.
- పరీక్ష నిర్వహణ కోసం ఉపాధ్యాయులు సబ్జెక్టువారీగా నిర్ధారించిన విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి (విషయవారీ భారత్వ పట్టికలను పరిశీలించండి.)

- మౌఖిక పరీక్షను ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరం లేదు. మౌఖిక పరీక్షకు సంబంధించిన విద్యా ప్రమాణాలకు కేటాయించిన మార్కులను ఉపాధ్యాయుడు తమ పరిశీలనల ఆధారంగా లేదా అంతకుముందు నమోదుచేసిన ఫార్మేటివ్ మూల్యాంకనం ఆధారంగా కేటాయించి పిల్లల ప్రగతిని నమోదుచేయాలి.
- రాత పరీక్ష కోసం ఆయా సబ్జక్టులవారీగా నిర్ధారించిన భారత్వాల ప్రకారం విద్యాప్రమాణాల ఆధారంగా ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం ఒక విద్యా సంవత్సర కాలంలో రెండుసార్లు నిర్వహించాలి. కాబట్టి మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం. అక్టోబర్ మాసంలో, రెండవ సంగ్రహణాత్మక మూల్యాకనం మార్చి లేదా ఏప్రిల్ మాసంలో నిర్వహించాలి. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నపత్రం రూపొందించుకొనేటప్పుడు సెప్టెంబర్ నెలవరకు పూర్తయిన సిలబస్‌ను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం కోసం ప్రశ్నాపత్రం రూపొందించు కొనేటప్పుడు పూర్తి పాఠ్యపుస్తకాన్ని అనగా అన్ని అధ్యాయాలను పరిగణలోకి తీసుకోవాలి.
- సమ్మేటివ్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించినపుడు అన్నిరకాల ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అనగా వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు, లక్ష్యాత్మక ప్రశ్నలు మొదలగునవి.
- ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నపత్రంలో ఒకే విభాగంగా ఇవ్వాలి. ప్రాజక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.
- ఈ ప్రశ్నలు పిల్లలు నేర్చుకున్న భావనల ఆధారంగా విశ్లేషించడానికి తార్కికంగా ఆలోచించడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి తన సొంత అభిప్రాయాలను జోడించి రాయడానికి అనుకూలంగా ఉండాలి.
- పై రెండు మూల్యాంకనాలలో నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల ప్రగతి పరిశీలన మౌఖిక, రాతరూపాలలో అంచనావేస్తే, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో రాతరూపంలో మాత్రమే అంచనా వేయాల్సి ఉంటుంది. అయితే ప్రాథమిక తరగతులలో అనగా 1, 2 తరగతులకు మౌఖిక పరీక్షను కూడా నిర్వహించాలి.
- నిర్ధారిత సిలబస్ ఆధారంగా ఉపాధ్యాయుడు స్వయంగా ప్రశ్నపత్రం రూపొందించుకొని మూల్యాంకనం చేయాలి.
- ఇతర సంస్థలు, వ్యక్తులు రూపొందించిన ప్రశ్నాపత్రాలు ఉపయోగించకూడదు.ఐతే ఉపాధ్యాయులు ప్రశ్నపత్రం రూపకల్పన గురించి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో చర్చించి సహాయం పొందవచ్చు.
- పిల్లలు సొంతంగా సమాధానాలు రాయడానికి ప్రశ్న పత్రం తోడ్పాడాలి. పాఠ్యపుస్తకంలో సూచించుకున్న దానికన్నా భిన్నమైన సమాధానం పిల్లలు తమ సొంత ఆలోచనలు, అనుభవాలతో రాసి వుండవచ్చు. అది సరైనది అయినపుడు దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ఎందుకంటే సమ్మేటివ్ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు స్వభావరీత్యా సొంతంగా రాయడానికి, విశ్లేషణాత్మకంగా రాయడానికి వీలుగా వుంటాయి. కాబట్టి తరగతిలో పిల్లలందరూ ఒకేరకమైన సమాధానం రాస్తారని భావించకూడదు.

- ఒక విద్యాప్రమాణంలో ప్రశ్నలన్నీ ఒక విభాగంలోనే ఉంటాయి. కాబట్టి ఆ విద్యాప్రమాణానికి ఎన్ని మార్కులు ఇచ్చారు? పిల్లలు ఎన్ని మార్కులు సాధించారు అనేది సులభంగా తెలుసుకోవచ్చు.
- సాధారణంగా ఉపాధ్యాయులు ఇంతకుముందు సమాధానపత్రాలు దిద్దినట్లే ప్రస్తుతం కూడా సమాధాన పత్రాన్ని దిద్ది మార్కులు వేయవచ్చు. ఐతే సమాధానాలు విద్యార్థికి విద్యార్థికి మారుతూ ఉంటాయి కాబట్టి జాగ్రత్తగా చదివి మార్కులు కేటాయించాలి.
- సమాధాన పత్రం దిద్దిన తరువాత పైన కేటాయించిన గడులలో ఏ విద్యాప్రమాణానికి ఎన్ని మార్కులు వచ్చాయి? మొత్తం మార్కులు, గ్రేడు రాయాలి.
- గ్రేడు నిర్ణయించడంలో విద్యార్థి సాధించిన మార్కులను దృష్టిలో ఉంచుకోవాలి. కింది పట్టిక ఆధారంగా మార్కుల శాతాన్నిబట్టి గ్రేడునివ్వాలి.

**సబ్జెక్టు వారీగా విద్యాప్రమాణాలు, భారత్వ పట్టికలు, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో విషయ నిపుణులు రూపొందించిన నిరంతర సమగ్ర మూల్యాంకనం మాడ్యూల్‌లో వివరంగా ఇవ్వడం జరిగింది. వాటి ఆధారంగా ప్రశ్నపత్రాలను రూపొందించుకొని ఉపాధ్యాయులు సంగ్రహణాత్మక మూల్యంకనాన్ని నిర్వహించాలి. దీన్ని సంవత్సరంలో మూడుసార్లు నిర్వహించాలి. (సెప్టెంబర్, డిసెంబర్/ జనవరి, ఏప్రిల్ మాసాలలో).**

## సహపాఠ్యాంశాల మూల్యాంకనం (Assessment of other curricular areas)

- సహపాఠ్య అంశాలను మూల్యాంకనం చేయడంలో ఇతర పాఠ్య విషయాల మాదిరిగా కాకుండా కేవలం సంగ్రహణాత్మకంగా సంవత్సరంలో 3 సార్లు మాత్రమే మూల్యాంకనం చేయాలి.
- వీటికి నిర్ధారిత రాత పరీక్ష ఉండదు. ఉపాధ్యాయులు పరిశీలన ఆధారంగా గ్రేడులు ఇవ్వాలి.
- సహ పాఠ్యాంశాలలో విద్యా ప్రమాణాల వారీగా పిల్లల ప్రగతిని పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- పిల్లలు పాల్గొంటున్న తీరును, ప్రదర్శిస్తున్న నైపుణ్యాలను, ఆచరిస్తున్న విధానాలను పరిశీలించి మార్కులు, గ్రేడులు ఇవ్వాలి. వీటితోపాటు వివరణాత్మక సూచికలు కూడా రాయాలి.
- సహపాఠ్యాంశాలు నాలుగు. ఒక్కో అంశం కింద ఐదు సామర్థ్యాలు ఇవ్వబడ్డాయి. ఒక్క సామర్థ్యానికి 10 మార్కులు. అంటే ఒక్కొక్క అంశానికి 50 మార్కులు ఉంటాయి. మొత్తం నాలుగు అంశాలకు 200 మార్కులు ఉంటాయి. ఉదాహరణకు ఒక అంశం ఇవ్వబడింది.

| క్ర.సం. | పేరు | సాధించాల్సిన సామర్థ్యాలు | | | | | గ్రేడు (50 మా.) |
|---|---|---|---|---|---|---|---|
| | | ఆటలలో పాల్గొనడం, క్రీడాస్ఫూర్తి (10 మా.) | యోగా, మెడిటేషన్, స్కౌట్స్, గైడ్స్, ఎన్.సి.సి. (10 మా.) | వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత - ఆరోగ్య అలవాట్లు (10 మా.) | భద్రత - ప్రథమ చికిత్స (10 మా.) | ఆరోగ్యం, పోషకాహారం, మంచి ఆహార అలవాట్లు (10 మా.) | |
| | | | | | | | |

A1 – Outstanding performance

A2 – Excellent participation and oragnisation of activities

B1 – Have good leadership qualities

B2 – Shows interest only in participation

C1 – Have required content knowledge

C2 – Little knowledge about materials and procedures

D- Poor performance and interest

E – Not Participated in any activity

**CCE – రిజిష్టరు, రికార్డులు (CCE - Registers and Records)**

ఆయా మాసాలలో పూర్తిచేసిన పాఠ్యాంశాలను మదింపు చేయవలెను. FA నిరంతరంగా బోధనాభ్యసనలో అంతర్భాగం చేస్తూ పిల్లలకు గ్రేడులు ఇస్తాం. SAలో రాత పరీక్ష నిర్వహించి అందులో కూడా గ్రేడులు ఇస్తాం. విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా 8 అంశాల గ్రేడింగ్ స్కేల్- A1, A2, B1, B2, C1, C2, D, E పై విద్యార్థి ప్రగతిని నిర్ధారిస్తాం. మార్కుల ఆధారిత గ్రేడులు విద్యార్థి ప్రగతిని అంచనావేయటానికి సులభమయిన మార్గం.

భాషా, భాషేతర అంశాలతోపాటు సహపాఠ్యాంశములయిన ఆరోగ్యం మరియు వ్యాయామ విద్య, సాంస్కృతిక విద్య, విలువలు మరియు వైఖరులు కూడ మదింపు చేయబడుతాయి.

- $SA_1$, $SA_2$ (Summative Assessment) నిర్వహించే రెండు సందర్భాలలో సహపాఠ్య అంశాలు అంచనా వేయబడుతాయి. మార్కుల ఆధారిత గ్రేడింగ్ సహపాఠ్యఅంశాలలో విద్యార్థులకు ఇవ్వబడుతుంది.

- ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతిగది/ విషయంనకు సంబంధించిన ఒక సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహిస్తాడు. ఇందులో ప్రతి విద్యార్థి ప్రగతిని నమోదు చేస్తాడు. ఈ ప్రగతిని ప్రగతిపత్రం/క్యుములేటివ్ రికార్డులో పొందుపరచి తల్లిదండ్రులకు పరిశీలనార్థం పంపిస్తారు.

- క్యుములేటివ్ రికార్డ్ ప్రతి విద్యార్థికి 1-5, 6-10 తరగతుల వరకు నిర్వహించబడుతుంది. దీన్ని 8వ తరగతి పూర్తి అయిన పిదప ఎలిమెంటరీ విద్యను పూర్తిచేసినట్లుగా సర్టిఫికెట్ ప్రదానం చేయబడుతుంది. ఈ క్యుములేటివ్ రికార్డులో గడిచిన 8 సంవత్సరాలలో పిల్లవాని అన్ని అంశాలు అనగా హాజరు, పాఠ్య, పాఠ్యేతర అంశాలలో ప్రగతి మరియు తల్లిదండ్రుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు ప్రతిబింబిస్తాయి.

## CCE - నిర్వహణ-బాధ్యతలు (CCE - Implementation - Roles & Responsibilities)

నిరంతర సమగ్ర మూల్యాంకనంను ఎప్పటికప్పుడు అన్ని పాఠ్యాంశాలలోని అన్ని సామర్థ్యాలను పరిశీలించి అంచనా వేయాలి.

పాఠ్యాంశాల వారీగా పరిశీలించిన అంశాలను రిజిష్టర్‌లో నమోదు చేసే బాధ్యత ఉపాధ్యాయునిది.

- తరగతి గదిలోని పిల్లలందరికీ బాధ్యత వహించాల్సింది ఉపాధ్యాయుడు.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణ, బాధ్యత నిర్వహించాల్సింది ప్రధానోపాధ్యాయుడు, ఆయా ఉపాధ్యాయులు దీనికి బాధ్యత వహించాలి. పర్యవేక్షించాలి.
- కాంప్లెక్సు స్థాయిలో సిసిఇ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యత ప్రధానోపాధ్యాయునిది.
- పాఠశాలలో సిసిఇ నిర్వహణలో ఎస్ఎంసి, పిటిఏ కూడా పర్యవేక్షణ బాధ్యత నిర్వహించాలి.
- మండల స్థాయిలో సిసిఇ నిర్వహణ అమలు బాధ్యత నిర్వహించాల్సింది మండల విద్యా శాఖాధికారి (ఎం.ఇ.ఓ.) మరియు వారి సిబ్బంది.
- జిల్లా స్థాయిలో సిసిఇ నిర్వహణ, అమలు, పర్యవేక్షణ జిల్లా విద్యాశాఖాధికారి (డిఇఓ) బాధ్యత వహించాలి.

## CCE - అమలు - సూచికలు - ఆధారాలు
## (CCE - Indicators of implementation - Evidences)

సిసిఇ పాఠశాల ఆధారిత, ఉపాధ్యాయునికి సంబంధించిన మూల్యాంకనం. ఈ ప్రశ్నాపత్రంలను ఖచ్చితంగా ఉపాధ్యాయుడే తయారు చేయాలి. కాని ఇతర సంస్థల నుండి గాని వ్యక్తుల నుండి గాని పొందరాదు. పిల్లల ప్రగతిని పైన వివరించిన 5 అంశాల గ్రేడింగ్ స్కేల్‌పై మార్కుల ఆధారంగా నిర్ధారించి, నమోదు చేయాలి. విద్యా ప్రమాణాలలో విద్యార్థులు సాధించిన గ్రేడ్లను A1, A2, B1, B2, C1, C2, D, E గా గుర్తించాలి. ప్రతి పాఠశాల నిర్దేశించిన విద్యా ప్రమాణాల సాధనకు కృషి చేయాలి. ప్రతి విద్యార్థికి నిర్దేశించిన సామర్థ్యాల సాధనకు సంబంధించిన శక్తి, సామర్థ్యాలు ఉన్నాయని విశ్వసించాలి. విద్యార్థుల ప్రగతి ఆధారంగా తరగతి గది/ పాఠశాలకు గ్రేడు ఇవ్వబడుతుంది. ఇది ఎంతమంది విద్యార్థులు $A^+$ మరియు A సాధించారనే దానిపై నిర్ణయించబడుతుంది. సహపాఠ్యాంశాల మూల్యాంకనంనకు పలు రకాల మూల్యాంకన సాధనాలు ఉపయోగించబడి, గ్రేడింగ్ ఇవ్వబడుతుంది.

ప్రతి ఉపాధ్యాయుడు సిసిఇ రిజిష్టర్‌ను నిర్వహించాలి. ఇందులో ప్రతి విషయానికి చెందిన అభ్యసనా సూచికలు అనగా విద్యా ప్రమాణాలు ఒక బేస్‌లైన్‌పై ఎంత మేరకు ప్రగతిని సాధించారనే విషయాన్ని గ్రేడుల రూపంలో నమోదు చేయాలి. క్యుములేటివ్ రికార్డు కూడ నిర్వహించబడుతుంది. ఇది రెండు దశలలో ఉంటుంది. 1 నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక, 6 నుండి 10వ తరగతి వరకు ప్రాథమికోన్నత. 8వ తరగతి అనంతరం సర్టిఫికెట్ ప్రధానం చేయబడుతుంది. SCERT వారు సిసిఇ అమలుకు అవసరమయిన మార్గదర్శకత్వమును, శిక్షణలను, కరదీపికలను తయారుచేసి ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు, డిసిఇబికి అందిస్తుంది.

# తెలుగు - నిర్మాణాత్మక మూల్యాంకనం - నిర్వహణ

**పరిచయం :**

రాష్ట్రంలో విద్యాసంస్కరణల్లో భాగంగా 2012-13 విద్యా సంవత్సరం నుండి నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరుగుతున్న విషయం తెల్సిందే! ఈ విధానాలనే 6 నుండి 10 తరగతులకు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే అంచనావేయడం శాస్త్రీయమైందికాదని ప్రత్యామ్నాయ విధానాల ద్వారా కూడా మూల్యాంకనం చేయవచ్చని సి.సి.ఇ. అమలు ద్వారా గుర్తించాం. పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఎక్కడ ఇబ్బందిపడుతున్నారు? గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టడానికి ఉద్దేశించినదే నిర్మాణాత్మక మూల్యాకనం. వీటిని 10వ తరగతి వరకు కొనసాగించనున్న దృష్ట్యా ఈ సంగ్రహణాత్మక, నిర్మాణాత్మక మూల్యాంకనాలను కింది విధంగా నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని 80 మార్కులకు, మిగతా 20 మార్కులకు నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహిస్తారు. సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని రాతపరీక్ష ద్వారా నిర్వహిస్తారు. నిర్మాణాత్మక మూల్యాంకనానికి కేటాయించిన 20 మార్కులను కింది విధంగా కేటాయిస్తారు.

| | |
|---|---|
| 1. పుస్తకపఠనం, సమీక్షారచన (Book Reading and Review) | 5 మార్కులు |
| 2. విద్యార్థులు రాసిన అంశాలు (Written Work) | 5 మార్కులు |
| 3. ప్రాజెక్టు పని (Project Work) | 5 మార్కులు |
| 4. లఘుపరీక్ష (Slip Test) | 5 మార్కులు |

విద్యార్థుల వివిధ నైపుణ్యాలను పరిగణలోకి తీసుకునే పై నాలుగు అంశాల గురించి విడివిడిగా వివరంగా పరిశీలిద్దాం.

## 1. పుస్తకపఠనం - సమీక్షా రచన - అంటే ఏమిటి?

పుస్తకపఠనం అంటే విద్యార్థి తాను అభ్యసించే పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పాఠశాల గ్రంథాలయ పుస్తకాలు, బాలసాహిత్యం, ఇతర పుస్తకాలు చదవడం. అంతేకాకుండా దినపత్రికలకు చెందిన ఆదివారం అనుబంధాలు (మ్యాగ్జిన్స్), వార్తాపత్రికల్లోని ప్రత్యేక కథనాలు, అవసరంమేరకు ఉపాధ్యాయుడే సమకూర్చినా సరే. కథలు, సైన్స్, చరిత్ర, గేయసంపుటాలు ఏదైతేనేం. ఆయా విద్యార్థులస్థాయికి అనుగుణమైన పుస్తకాల్ని పిల్లలు చదవాలి.

నెలకో పుస్తకాన్ని విద్యార్థులతో చదివించినా ఒక FA నాటికి చదివిన వాటిలో బాగా సమీక్ష రాయగలననుకున్నదానికి సమీక్ష రాయించాలి. దానిని పరిశీలించి నిర్మాణాత్మక మూల్యాంకనం (FA)కు చెందిన మార్కులు నమోదు చేసుకోవాలి.

## 2. ఇతరపుస్తకాల పఠనం - సమీక్షారచన ఎందుకు ?

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలే చదవడంవల్ల తగినంత అదనపు జ్ఞానాన్ని పొందలేకపోతున్నారు. అదీగాక పాఠ్యపుస్తక అభ్యసనం ద్వారా పొందిన భాషా పరిజ్ఞానంతో బయటి పుస్తకాల్ని స్వయంగా అభ్యసించి అందులోని విషయాల్ని

గ్రహించే స్థాయికి విద్యార్థి ఎదగాల్సిన అవసరం ఉంది. ఆ దృష్టితోనే ఉపవాచక పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకాలలో చేర్చారు. అయినా విద్యార్థుల్లో స్వీయ అభ్యసన, విస్తార పఠనం పెంపొందడంలేదు. ఈ దృష్ట్యా విద్యార్థుల్లో అపరిమిత పుస్తక పఠనాభిలాషను పెంపొందించడం, స్వయంగా అదనపు సమాచారాన్ని గ్రహింపజేయడం విస్తారపఠనాన్ని పెంపొందించడం.. తదితర లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంది.

### 3. సమీక్షారచన - ప్రాధాన్యత :

కేవలం పాఠ్యపుస్తకాల పఠనం ఇప్పటివరకు అందరు విద్యార్థుల నుండి దాదాపు ఒకే రకమైన వ్యక్తీకరణకు అవకాశం కలిగిస్తూ వస్తున్నది. పాఠ్యపుస్తకాల్లోని సారాంశాలో, గైడ్‌లనుండి బట్టీపట్టినవో రాస్తున్న సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. విద్యార్థులకు ఇతర పుస్తకాలు అందించి, సమీక్షలు రాయించడం ద్వారా తప్పనిసరిగా వారి స్వంత వ్యక్తీకరణ బయట పడుతుంది. ఆయా విద్యార్థులకు వేర్వేరు పుస్తకాలు అందించడంవల్ల ఒకరిది మరొకరు చూసిరాసే అవకాశం కూడా లేదు. ఒకే పుస్తకాన్ని వేరు వేరు విద్యార్థులు చదివినప్పటికీ సమీక్షలు ఖచ్చితంగా వేరు వేరుగానే ఉంటాయి. కనుక పిల్లల్లోని స్వీయవ్యక్తీకరణ నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం గల్గిన సమీక్షా రచన ఈ నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఒక భాగమైంది.

### 4. తరగతిగదిలో ఎలా నిర్వహించాలి?

- ఎంచుకున్న తరగతికి సరిపడా పుస్తకాల్ని పాఠశాల గ్రంథాలయం నుండి వెలికితీసి ప్రదర్శనకు పెట్టాలి.
- బయటనుండి సమకూర్చిన పత్రికా కథనాలు, ఇతర మ్యాగ్జిన్లు అందుబాటులో ఉంచొచ్చు.
- పిల్లలకు తగిన పుస్తకాల్ని అవసరమైతే పిల్లల సంఖ్యకు మించికూడా ప్రదర్శనలో ఉంచొచ్చు.
- పాఠశాల వరండాలోనో, వీలైతే తరగతి గదిలోనో పుస్తకప్రదర్శన ఏర్పాటుచేసి ఆయా విద్యార్థుల్ని వరుసగా తమకు నచ్చిన పుస్తకాన్ని తీసుకొమ్మనవచ్చు.
- ఆయావిద్యార్థుల పేర్లు పుస్తకం పేరు నమోదుచేసుకొని, వారం పదిరోజుల వరకు వారికి సమయం ఇచ్చి సమీక్ష రాయమనాలి.
- సమీక్ష ఎలా రాయాలో తగిన సూచనలు సలహాలు ఇవ్వాలి.
- అవసరమైతే ఆయా మ్యాగ్జైన్లలో ప్రచురితమైన పుస్తక పరిచయాల్ని చదివి వినిపించవచ్చు.
- సాధ్యమైనంత వరకు విద్యార్థులు అందరూ వేర్వేరు పుస్తకాలు స్వీకరించేలా చూడాలి. వేర్వేరు పుస్తకాలు కాబట్టి ఎవరిసమీక్ష వారు స్వంతంగా రాసే అవకాశం ఉంటుంది.
- పుస్తకసమీక్షకు ప్రత్యేకంగా ఒక నోటుపుస్తకం ఏర్పాటు చేయించి, ఆయా సమీక్షల్ని అందరిచేతా తరగతిగదిలో చదివించాలి. దీనికి అదనంగా కేటాయించబడే 3 పీరియళ్లు వినియోగించుకోవాలి.
- వాటి సమీక్షాస్థాయినిబట్టి 5 మార్కుల వరకు FAలో నమోదుచేసుకోవాలి.

### 5. మాదిరి సమీక్షారచన :

విద్యార్థులకు కేటాయించిన పుస్తకాలకు ఆయా విద్యార్థులచే కింది విధంగా సమీక్ష రాయించవచ్చు.

### పిల్లలు రాసిన మాదిరి సమీక్షను పరిశీలిద్దాం.

## మాదిరి సమీక్షలు

### (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హిమాయత్ నగర్, సి.పి.ఎల్., అంబరుపేట, హైదరాబాదు.)

**I. ప్రాథమిక వివరాలు**

**అ) పుస్తకం పేరు :** దాశరథి ఆలోచనాలోచనాలు (కవితా సంపుటి)

**ఆ) రచయిత పేరు :** దాశరథి కృష్ణమాచార్యులు

**ఇ) ప్రక్రియ :** వచన కవిత

**ఈ) పబ్లిషర్స్:** మహేంద్ర ప్రచురణలు (సం॥ 1975)

**ఉ) పుస్తకం పేజీలు:** 112 పేజీలు

**ఊ) వెల :** 5 రూ.

**సమీక్షకుని పేరు :** సి. కార్తీక్

**II. చదివిన అంశం (సంక్షిప్త వివరణ)**

దాశరథి కృష్ణమాచార్యులు గారు రచించిన ఆలోచనాలోచనాలు పుస్తకం ఆయన తన మిత్రుడు అయిన అప్పటి ప్రియతమ ముఖ్యమంత్రి గారు శ్రీ జలగం వెంగళరావు గారికి అంకితం చేశారు. ఇందులో రచయిత తన కవితలను 49 విభాగాలుగా విభజించారు ఇందులో దాశరథిగారు ఫిరదౌసీ గారి కవితలను తెలుగులో అనువాదం చేశారు. ఇంకా 'మనౌషెహ్రీ' గారి కవితలు కూడా అనువాదం చేశారు అంతేకాదు ఉర్దూ కవి జోష్ మల్సియాని! రాసిన గజల్ కూడా అనువాదం చేశారు. దాశరథి గారు

"ఇది కథకాదు, కాలుతున్న సొద
ఇది యెదలో సాగుతున రొద;
దీన్ని కలకాలం భరించలేం కద?
అందుకే సమరం సాగిద్దాం, పద!॥

అంటూ చదువరులను తన స్ఫూర్తి వాక్యాలతో ప్రేరితులను చేశారు. దాశరథి చిన్న వయసులో నుండే కవిత రాయడం ప్రారంభించాడు దాశరథి నాటికీ, నేటికీ, ఏనాటికీ వర్తింపజేసే కవిత రాశారు.

"బండను కోయాలి కుసుమదళం
గుండెను కోయాలి నయనజలం
కదనరంగమున, నేనంటాను
కత్తిని మించాలి కవుల కలం"

అని ఎంతో మంది కవులకు ఆదర్శంగా నిలిచాడు. తన కవితలతో సమాజంపట్ల కవుల బాధ్యత ఎలా ఉండాలో చెప్పారు దాశరథి. ఈ కవితా సంపుటిలోని "నేనంటాను" కవితల నుండి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను ఆ రోజుల్లో ప్రజలలో దాశరథి భావ విప్లవం తెచ్చారు. అనడానికి ఈ ఒక్క కవిత చాలు.

"పడవ నడపలేనివవాడు నావికుడు

పదము పాడలేనివాడు గాయకుడు

అందుకనే వేదనతో నేనంటాను

ప్రజల నడపలేనివాడు నాయకుడు"

ఇందులో సమాజం పట్ల ఆయన అంకిత భావం రాజకీయ నాయకులపట్ల ఆయన అభిప్రాయం తెలుస్తున్నాయి.

కోటినదులు పోలలేవు ఒక్క సింధువుని

కోటితారలు పోలలేవు లోకబాంధవుని

అందుకనే గళంవిప్పి నేనంటాను

కోటినేతలు పోలలేరు ఒక్క గాంధీని

అని అప్పటి స్వాతంత్ర్యయోధుల పట్ల ఆయన భక్తీ గౌరవాలు వ్యక్తం చేస్తారు.

## III. అభిప్రాయం

**'ఆలోచనాలోచనాలు' పుస్తకంపై నా అభిప్రాయం :** దాశరథి గారి ఆలోచనాలోచనాలు పుస్తకం చదివిన తరువాత వారి దృక్పథంపట్ల చక్కని సానుకూల అభిప్రాయాలు కలిగాయి. ఈ తెలుగులో సాహిత్యం, కవిత్వం తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంది. ఈ పుస్తకం చదువుతుంటే నాలో ఎన్నో సందేహాలు మిగిలిపోయాయి. అంతేకాక కొత్త సందేహాలు ఎన్నో ఉద్భవించాయి. వీటికి సమాధానం తెలియాలంటే దాశరథీ గారి ఇతర పుస్తకాలన్నీ చదువాలనే కుతూహలం కలుగుతోంది. ఆయన రచనాశైలిని కూడా అర్థం చేసుకోవాలని ఉంది. నన్ను అంతగా ఆకర్షించింది ఈ పుస్తకం.

కొండంత బోధన కన్న
గోరంత సాధన మిన్న

దాశరథి అన్న ఈ మాటలు అక్షరాలా వాస్తవం అన్న అభిప్రాయం నా మనస్సులో చాలా దృఢంగా నాటుకుంది.

## మాదిరి పుస్తక సమీక్ష - 2

## I. <u>ప్రాథమిక సమాచారం :</u>

పుస్తకం పేరు : నవ్వుతున్న నేలతల్లి　　　　ప్రక్రియ : కథాసంపుటి

పుస్తక రచయిత : కటుకొజ్వల మనోహరాచారి

పుస్తక సమీక్షకురాలు : బి. మానస　　　　తరగతి : 6వ

## II. చదివిన అంశం:

నవ్వుతున్న నేలతల్లి అనే పుస్తకం చూడగానే ఆకర్షణీయంగా కనిపించింది. పైన ముఖచిత్రంతోపాటు పుస్తకంపేరు కూడా ఎంతో ఆసక్తికరంగా, చదవాలనిపించేలా ఉంది.

ఇది 12 కథలలో కూడుకున్న కథలసంపుటి. కథలన్నీ దాదాపు ప్రధాన పత్రికల్లో ప్రచురితమైనవే. ఒక్కో కథ ఒక్కో ప్రత్యేకతను సంతరించుకొన్నది. దాదాపు అన్ని కథలు ఏదో ఒక సందేశాన్ని ఇస్తున్నట్లుగా ఉన్నాయి. అన్ని కథలూ సమాజనేపథ్యంలో సాగినవే.

'దూరపుకొండలు' అనే కథ.... దుబాయ్‌లో ఉండే ఒక వ్యక్తి ఆర్థికంగా తాను ఉన్నత స్థితిలో ఉన్నానని పొంగిపోతుంటాడు. భారతదేశానికి వచ్చాక తోటి మిత్రులు సాధారణంగా బతికేస్తున్న విధానం చూసి జాలిపడతాడు. అయితే ఒక మిత్రుని ఇంటికి భోజనానికి వెళ్ళి అక్కడ అతను పేదరికంలోనే భార్యాపిల్లల్తో కలిసి జీవించే అన్యోన్యతను చూసి జీవితంలో తనేం కోల్పోతున్నాడో గ్రహించడం ఇందులోని అంశం.

'నవ్వుతున్న నానేలతల్లి' అనే కథ రోడ్లనానుకొని ఉన్న వ్యవసాయభూములన్నీ ప్లాట్లుగా చేసి విక్రయించడం.. తర్వాత తరానికి అసలు వ్యవసాయభూమి మిగులుతుందా? తిండిపెట్టే రైతుపరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించే కథ.

అట్లే కాకిగోల అనే కథలో రచయిత ప్రకృతిలో పశుపక్షాదులు, చెట్లు నశించిపోతున్నాయని, కాకులు కూడా కనుమరుగవుతున్నాయనీ, వీటంతటికీ మనీషే కారణమన్న ఆవేదనతో మిగిలిన ఒకే కాకి మనిషి చచ్చిపోతే పిండం ముట్టడానికి కూడా రాదు' అని చూపించారు. నశించిపోతున్న వనసంపద మీద రచయిత ఆవేదన ఇందులో కనిపిస్తుంది.

ఇలా 'కర్మసౌందర్యం' అనే కథ మనిషిగా పుట్టినవ్యక్తి ఏదో ఒక పని చేయాలని 'ముదురు'। అనేకథ సమాజంలో వ్యక్తులు పెళ్ళిచూపుల పేరుతో అమ్మాయిల్ని చూసే రకరకాలవంకలతో ఎలా తిరస్కరిస్తున్నారో చెబుతాయి. కన్నీటి కార్ఖానా అనే కథ గల్ఫ్ జీవితంలోని దుర్భలస్థితిని వ్యక్తం చేస్తుంది. అట్లే 'అరచేతిలో వైకుంఠం', ఓటరు నాడి వంటి కథలు సమాజంలోని ప్రస్తుత స్థితిని తెలుపుతాయి.

## III. అభిప్రాయం:

ఇట్లా ప్రతికథా ఏదో ఒక సందేశాన్ని ఇస్తూ మనల్ని మేల్కొలుపుతున్నట్లుగా తోస్తాయి. చదివినకొద్దీ చదవాలనిపించేలా ఆసక్తికరంగా సాగుతాయి. పుస్తకం వెల అందుబాటులో ఉండి ప్రచురణకూడా అందంగా ఉంది. ఈ పుస్తకాన్ని మిగతా మిత్రులు కూడా చదవాలని ఆశిస్తున్నాను.

## 6. మార్కుల కేటాయింపు :

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పుస్తకపఠనం, సమీక్షారచనకు 5 మార్కులు కేటాయించడం జరిగింది.

విద్యార్థి స్వీకరించిన పుస్తకం గురించి రెండు పేజీలకు మించకుండా ఒక పేజికి తగ్గకుండా రాసిన విధానాన్ని అనుసరించి తగువిధంగా మార్కులు కేటాయించాలి. పుస్తకం చదవడం, నివేదిక, సమీక్ష రాయడానికి సగం మార్కులు, దాన్ని తరగతిలో చదివి విన్పించినందుకు సగం మార్కులు కేటాయించాలి. పది మార్కులకు మార్కులు కేటాయించినా '5'కు లెక్కించి నమోదుచేయాలి. పుస్తకం పేరు, ప్రచురణకర్త లేదా రచయిత, సమీక్షకుడు వంటి వివరాలు, పుస్తక పరిచయ

వాక్యాలకు 2 మార్కులు, అంశ వివరణకు, ముగింపుకు 5 మార్కులు, ప్రదర్శనకు 3 మార్కులు చొప్పున మొత్తం 10 మార్కులకు కేటాయించాలి. ఈ మార్కులను 5కు తగ్గించి నమోదు చేయాలి.

ఒక నిర్మాణాత్మక మూల్యాంకనం కంటే ముందు పిల్లలు ఎన్ని పుస్తకాలు చదివినప్పటికీ సమీక్షను ఒక అంశానికి పరిమితమై రాస్తే సరిపోతుంది. అనగా నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాలకు నాలుగు సమీక్షలు రాయాలి. ఒకవేళ ఎంపిక చేసుకున్న పుస్తకం పెద్దదైతే ఆ పుస్తకంలోని మూడు నాలుగు పేజీల విషయాన్ని చదవాలి. దాన్ని గురించి సమీక్ష రాయాలి.

## 7. తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- పిల్లలు ఎన్ని పుస్తకాలు / అంశాలు చదివినా, ఒక ఫార్మేటివ్ మూల్యాంకనం కోసం ఒక అంశం గురించి సమీక్షరాస్తే సరిపోతుంది.
- పాఠశాల గ్రంథాలయ పుస్తకాల్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి.
- గ్రంథాలయ పుస్తకాలే కాకుండా వార్తాపత్రికల మాగ్జిన్లు, వార్తాకథనాలు, సంపాదకీయ వ్యాసాలు, ఉపాధ్యాయుడు సమకూర్చిన పుస్తకాలు ఇతరత్రా వినియోగించవచ్చు.
- పుస్తక సమీక్షలో అతిముఖ్యమైనది అభిప్రాయాలను రాయడం. 6, 7 తరగతులలో అభిప్రాయాన్ని ఒకటి, రెండు పేరాలు లేదా ఒక పేజీ వరకు రాసినా, 9, 10 తరగతులలో అభిప్రాయాన్ని కనీసం రెండు పేజీలు రాయాలి.
- చాలా మంది చదివిన విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా రాసి అభిప్రాయాన్ని పొడిపొడిగా ఒకపేరా రాస్తున్నారు. ఇలా చేయకూడదు.
- ప్రాథమిక వివరాలను రాసిన తర్వాత, చదివిన విషయాన్ని సంక్షిప్తంగా సొంత మాటల్లో రాయాలి. అభిప్రాయాన్ని రాయడానికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పాలి.
- ప్రాథమిక వివరాలను 6, 7 తరగతులలో బుల్లెటు పాయింట్లు రూపంలో రాసినా, 8 నుండి 10వ తరగతుల్లో పేరా రూపంలో రాయడాన్ని అభ్యాసం చేయించాలి.
- సమీక్ష అనేది స్వీయవ్యక్తీకరణకు సంబంధించినది కాబట్టి ఒకే పుస్తకం లేదా వ్యాసం ఇరువురికి కేటాయించకుండా జాగ్రత్త వహించాలి.
- పుస్తకప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు పుస్తకాల్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలి.
- పుస్తకాల కేటాయింపు జరిగాక విద్యార్థులకి వారం రోజులకు తక్కువ కాకుండా సమీక్షా రచనకు సమయం కేటాయించాలి.
- ముఖ్యంగా సమీక్షా రచన అనగానే స్థాయికి మించిందిగా భావించి భయపడాల్సిన అవసరం లేదు.
- పుస్తకం పెద్దదైనప్పుడు ప్రధానాంశాల్ని చదివి కూడా అందులోని మంచీచెడుల్ని పరిచయం చేసేలా రాసినా సరిపోతుందని ఉపాధ్యాయులు గ్రహించాలి.

## 2. రాత పనులు

### రాత పనులు అంటే ?

విద్యార్థి తన భావవ్యక్తీకరణకు ఉపయోగించే సాధనాల్లో వాగ్రూపం మొదటిదైతే లిఖితరూపం రెండవది. లిఖిత రూపంలో భావవ్యక్తీకరణ చేయడానికి ఉపయోగపడేది రాతపని. విద్యార్థి తన భావాలను సొంతమాటల్లో రాయడం, సృజనాత్మకతకంగా రాయడం, భాషాంశాలకు సంబంధించిన అంశాలు రాయడం అనేవి రాతపనిని ప్రత్యేకంగా సూచిస్తాయి.

### ఏమి రాయాలి?

రాత అంశాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం ఉంది. పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశం తర్వాత 'ఇవి చేయండి' శీర్షిక కింద ఇచ్చిన సామర్థ్యాల సాధనకు సంబంధించినవి రాత అంశాలు. ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేక నోట్ పుస్తకంలో వీటిని రాయాల్సి ఉంటుంది. పిల్లలు వారి నోట్‌పుస్తకాల్లో రాయాల్సిన అంశాలు సామర్థ్యాల వారిగా చూద్దాం!

**I. అవగాహన – ప్రతిస్పందన**లోని రెండవ సామర్థ్యం – ధారాళంగా చదవడం – అవగాహనతో రాయడంలోని అంశాలు (కొన్ని అంశాలు పాఠ్యపుస్తకానికే పరిమితమై ఉంటాయి)

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత**లోని ప్రతి సామర్థ్యానికి సంబంధించిన అన్నీ ప్రశ్నల జవాబులను నోట్‌పుస్తకంలోనే రాయాల్సి ఉంటుంది. సృజనాత్మకత / ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలు జవాబులను ప్రత్యేక పుటల్లో రాసేలా చూడాలి.

**III. భాషాంశాలు –** దీనిలో పదజాలం వ్యాకరణాంశాలకు సంబంధించిన అభ్యాసాలను పాఠ్యపుస్తకంలో కూడా రాయవచ్చు.

### ఎలా రాయాలి?

విద్యార్థి నోటుపుస్తకాలను పరిశీలించడం ద్వారా ఈ రాత అంశాలస్థాయిని గుర్తించవచ్చు. పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను విద్యార్థి నోటు పుస్తకంలో రాస్తాడు. ఇందులో స్వీయరచన, సృజనాత్మకతకు చెందిన ప్రశ్నలకు స్వయంగా రాస్తాడు. స్వయంగా రాసేలా ఉపాధ్యాయుడు తగిన తర్ఫీదు నిస్తాడు. అలా రాసిన అంశాల్లోని రచనాశైలి, స్వీయభావనలు, భాష, వాక్యనిర్మాణ రూపము తదితరాలన్నీ ప్రాధాన్యత వహిస్తాయి. ముఖ్యంగా విద్యార్థి స్వంత వ్యక్తీకరణకు ప్రాధాన్యతనిచ్చి రాసిన అంశాలన్నీ ఈ రాతాంశాల కింద పరిశీలించాలి.

విస్తృత పరిధి గలిగిన ఈ రాత అంశాల్ని విద్యార్థుల్లో పరిశీలించడమంటే కేవలం సంగ్రహణాత్మక మూల్యాంకనం (FA) ద్వారా నిర్వహించే రాత పరీక్షాంశాలు పరిశీలించి విద్యార్థి రాతస్థాయిని అంచనా వేయలేము.

గతంలోలా గైడ్‌లను ఆశ్రయించి పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలకు మక్కికి మక్కి సమాధానాలు నోటుపుస్తకంలో ఎక్కించడం వల్ల విద్యార్థిలో ఈ సామర్థ్యం ఏకోశానా పెంపొందదు అన్నది గ్రహించాలి. ఒక విద్యార్థి నోటుపుస్తకం మరొక విద్యార్థిచూసి రాయడం కూడా ప్రయోజనాన్ని చేకూర్చదు.

ఈ దృష్ట్యా విద్యార్థి స్వీయ అభిప్రాయాలు, భావనలకు ప్రాధాన్యతనిస్తూ వాటిని స్వయంగా వ్యక్తీకరించడం కోసం పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలు నూతన విధానంలో కూర్చడం జరిగింది.

ప్రధానంగా 'వ్యక్తీకరణ-సృజనాత్మకత' అనే అభ్యాసం విద్యార్థిలోని స్వంత భావనల వ్యక్తీకరణకు అనువైనది. సొంతమాటల్లో రాయించడం, అభిప్రాయాలు చెప్పించడం, సమర్థిస్తూ రాయడం, విశ్లేషిస్తూరాయడం, ఊహించడం తదితరాలన్నీ విద్యార్థి ఆలోచనకు పదునుపెట్టేవి. తప్పనిసరిగా తను స్వయంగా అనుభవంలోకి తెచ్చుకుని ఊహిస్తే తప్ప సమాధానాలు రాయలేనిస్థితి.

కనుక పిల్లల్లో గత విధానాలకు భిన్నంగా అవగాహనా, భావనాశక్తి, ఊహాశక్తి, విశ్లేషణాశక్తి, స్వీయానుభూతులు వగైరా వెలికివచ్చే అవకాశం ఈ రాత అంశాలద్వారా గుర్తించగలుగుతాం..

కనుక రాత అంశాలకు ఈ కోణంలో తగు ప్రాధాన్యత నిచ్చి నిర్మాణాత్మక మూల్యాంకనం (FA)లో ఒక భాగంగా చేర్చడం జరిగింది.

**- ఎట్లా నిర్వహించాలి ?**

రాత అంశాలు పరిశీలించి తగిన మార్కులు నమోదు చేసుకోవాలంటే ముందుగా విద్యార్థులకు నోటుపుస్తకాలు రాయడంలో తగిన మార్గనిర్దేశనం చేయాలి.

- బోధనా సోపానాల్లో అభ్యాసాల నిర్వహణకు తగిన కాలాంశాలు కేటాయించడం జరిగింది. వాటిని సరిగా వినియోగించుకుని నోట్స్‌రాయడానికి పురిగొల్పాలి.
- తరగతి గదిలో పాఠ్యపుస్తకాల్లో రాయాల్సిన అభ్యాసాల్ని తరగతిగదిలోనే పూరించేలా చొరవచూపాలి.
- మిగతా స్వీయరచన కృత్యాల్ని పాఠ్యపథకాన్ని అనుసరించి 'తరగతిగదిలో నిర్వహణ' విధానానికి అనుగుణంగా నిర్వహించి ఆయా రచనాకృత్యాలు విద్యార్థులు స్వయంగా చేసేలా ప్రోత్సహించాలి.
- తరగతి గదిలో వ్యక్తిగత, జట్టుకృత్యాల నుండి గ్రహించిన అంశాలద్వారా స్వయంగా ఇంటివద్ద నోటుపుస్తకాలలో రాసేలా సూచించాలి.

**- మార్కులు కేటాయింపు :**

విద్యార్థుల నోటు పుస్తకాలు పరిశీలించి మార్కులు కేటాయించేముందు విద్యార్థి స్వీయరచనా భావనావ్యక్తీకరణ ఉందో లేదో చూడాలి. విద్యార్థి స్వయంగా రాసిన అంశాలకే నిర్దేశించిన 5 మార్కులు కేటాయించాలి. ఇక్కడొక ప్రధానవిషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. విద్యార్థి తాను సొంతంగా రాయకుండా ఇతరుల నోటుపుస్తకాలు, గైడ్‌లు, టెస్ట్‌పేపర్‌లను ఆశ్రయించి రాసిన నోటుపుస్తకాలను ఈ అంశం క్రింద పరిగణలోకి తీసుకోకూడదు. అవసరమైతే మళ్ళీ రాసేలా చూడాలి తప్ప సంబంధిత రాత అంశాలకు మార్కులు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదు. సౌలభ్యం కోసం ఒక్కొక్క పాఠానికి 10 మార్కుల చొప్పున కేటాయించుకోవాలి. FA వరకు ఎన్ని పాఠాలు పూర్తయితే వాటి సగటు లెక్కించాలి. నమోదుచేసేటప్పుడు 5 మార్కులకు లెక్కించి నమోదుచేయాలి.

ఉదా॥ మొదటి FA వరకు 3 పాఠాలు పూర్తయినవి. ఒక్కొక్క పాఠానికి 8, 9, 7 మార్కులు వచ్చాయి. వీటి మొత్తం 24 వాటి సగటు 8 మార్కులు. 10 మార్కులకు 8 కాబట్టి నమోదుచేసేటప్పుడు 5కు 4 మార్కులను నమోదుచేయాలి.

ఐతే రాతాంశాలు పరిశీలించేటప్పుడు మార్కులు ఇవ్వడంలో ఈ అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి.

వ్యక్తపరచడం, భావం సరిగా స్పష్టంగా క్రమపద్ధతిలో రాయడం, దోషరహితంగా రాయడం, సొంతంగా రాయడం.

అయితే ఇవన్నీ విద్యార్థి స్వయంగా, తను స్వీయ వ్యక్తీకరణలో రాసిన అంశాలకు మాత్రమే వర్తిస్తాయన్నది ప్రధానంగా గుర్తుంచుకోవాలి. ఏ ఇద్దరు విద్యార్థులు ఒకరినొకరు చూసి రాశారనిపించినా ఆ ఇద్దరికీ మార్కులు ఇవ్వకుండా మళ్ళీరాయమని చెప్పాలి.

**– ఎట్లా నిర్వహించాలి ?**

- రాత అంశాలు పూర్తిచేయించే విషయంలో ఏ ఇద్దరినోటు పుస్తకాలు ఒకరికొకరు చూసి రాయకుండా జాగ్రత్తవహించాలి.
- తరగతి గదిలో పూరించాల్సినది తరగతి గదిలోనూ, ఇంటిపనిగా చేయాల్సినది ఇంటిపనిగానే రాసేలా చూడాలి.
- వ్యక్తీకరణలో ఆయా విద్యార్థుల స్థాయినిబట్టి మెరుగ్గా లేకున్నాసరే స్వంతంగానే రాసేలా చూడాలి. మరింత మెరుగుదలకు తగిన సూచనలూ, ప్రోత్సాహం ఇవ్వాలి.
- స్వీయరచన, సృజనాత్మక రచనాంశాల్లో ఆయా విద్యార్థుల్లో విభిన్నత కనిపిస్తుంది. ఆ విభిన్నతనే ప్రోత్సహించాలి.
- వేర్వేరు విద్యార్థుల సమాధానాలు వేర్వేరుగా, పలు తేడాలతో కనిపించడాన్ని స్వాగతించాలి.
- నోటుపుస్తకాల్ని ప్రతినెలవారిగా తప్పనిసరిగా పరిశీలించాలి.
- సాధ్యమైనంతమేర దోషపూరితంగా రాయకుండా తరగతిగదిలోనే ఆయా అభ్యాసాల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలి.
- నోటు పుస్తకాల పరిశీలనలో కూడా విద్యార్థుల మెరుగైన వ్యక్తీకరణ కోసం తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి.
- నోటుపుస్తకాలు పరిశీలించకుండా రాతాంశాలకు మార్కులు ఇవ్వరాదు.
- విద్యార్థుల నోటు పుస్తకాల్లో ప్రతిపాఠానికి మార్కులను వేయాలి.

## 3. ప్రాజెక్టు పని

విద్యార్థి చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం సొంతమాటల్లో రాయడం మొదలగు అన్నీ సామార్థ్యాలను పాఠ్యపుస్తకం ద్వారా అభ్యాసం చేస్తున్నప్పటికి వీటన్నింటినీ కలిపి ఉపయోగించగలిగిన విధానమే ప్రాజెక్టుపని. ప్రాజెక్టుపనిలో విద్యార్థి రకరకాల వ్యక్తులతో కలుసుకోవాల్సి వస్తుంది. రకరకాల వివరణలు / వివరాలు సేకరించేప్రయత్నం చేయవచ్చు. నివేదికలు/సమీక్షలు రాయవల్సిరావచ్చు. ఇంటర్వ్యూ చేయడానికి సిద్ధంకావాల్సి రావచ్చు మొదలగునవన్నీ ప్రాజెక్టుపనిలో భాగమౌతాయి.

**- ప్రాజెక్టు పని అంటే .....?**

వివిధ వనరుల ద్వారా సమాచారాన్ని సేకరించి నివేదికరాయడం ప్రదర్శించడాన్ని భాషా ప్రాజెక్టు పనులుగా పరిగణిస్తారు. దీనివల్ల అభ్యసించిన సామర్థ్యాలను వినియోగించగలుగుతారు. ప్రాజెక్టుపని విభిన్న సామర్థ్యాలు, కృత్యాల సమాహారం.

**- ప్రాజెక్టుపనుల ప్రాధాన్యత**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో భాగంగా విద్యార్థిలోని సమగ్ర అంతర్గత శక్తుల్ని వెలికితీయడం, వాటిని పెంపొందించడం, వినియోగింపచేయడమే ఈ ప్రాజెక్టుపనుల ప్రాధాన్యత.

నేర్చిన అంశాల్ని అనుభవంలోకి తెచ్చుకోవడం ద్వారా నిజజీవితంలో వివిధరూపాల్లో వినియోగించగల సమర్థతను ఈ ప్రాజెక్టు పనులు చేయించడం ద్వారా కలిగించవచ్చు.

నేర్చిన భాషాసామర్థ్యాలు, సాంఘిక జీవితంలో చైతన్యవంతంగా వినియోగించగలుగు నేర్పును కలిగిస్తాయి. కలిసిపనిచేయడం, ప్రశ్నించడం, సమాచారాన్ని సేకరించడం, క్రమపద్ధతిలో కూర్చడం, ప్రదర్శించడం... మొత్తంగా ఒక పని అనుభవం ఈ ప్రాజెక్టుపనులద్వారా సాధించవచ్చు.

విద్యార్థి మానసిక వికాసంతోపాటు ఒకరకమైన ఆత్మవిశ్వాసాన్ని, స్నేహభావాన్ని, సాంఘికపరమైన సర్దుబాటును పెంపొందించుకోగలుగుతాడు. కేవలం చదివింది కాగితమ్మీద వ్యక్తీకరించడంతోపాటు సామాజిక సర్దుబాటు సాధించడం అనేది ఈ ప్రాజెక్టు పనుల్లో దాగి ఉండడంవల్లే నిర్మాణాత్మక మూల్యాంకనంలో (FA) ఒక భాగమైంది. విద్యార్థి సర్వతోముఖాలభివృద్ధి సాధించడమే ఈ FA ఉద్దేశం కాబట్టి ప్రాజెక్టుపనికి 5 మార్కులు కేటాయించడం జరిగింది.

**- ఎలా నిర్వహించాలి ?**

- పాఠ్యపుస్తకంలో ప్రతిపాఠం చివర భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టుపని పేరుతో అన్ని పాఠాలకు ఈ అంశాన్ని చేర్చడం జరిగింది.
- ఒక FA నాటికి ఎన్ని పాఠాలు పూర్తయినా, వాటిలో ఏదైనా ఒక ప్రాజెక్టుపనిని విద్యార్థులను చేయమనాలి. నివేదిక రాయమనాలి.
- ఇందుకోసం ఒక పీరియడ్‌లో పూర్తయిన పాఠాల్లోని ప్రాజెక్టుపనులను నల్లబల్లపై రాయాలి. వాటిలో నుండి పిల్లలను ఏదైనా ఒక ప్రాజెక్టును ఎంపిక చేసుకోమనాలి.
- ప్రాజెక్టును ఎలా పూర్తిచేయాలో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలి.
- అభ్యాసాల నిర్వహణ అనంతరం...అంటే చివరి కాలాంశానికి ముందు కాలాంశంలో విద్యార్థులచేత వారివారి ప్రాజెక్టులను ప్రదర్శింపజేయాలి.
- ప్రాజెక్టుపనిని పూర్తిచేయడంలో విద్యార్థులు జట్లలో పనిచేసినా, నివేదికను మాత్రం వ్యక్తిగతంగానే రాయమనాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం ప్రత్యేకంగా పెట్టుకున్న నోటుబుక్కులో ఈ నివేదికలను రాయించాలి.

- ప్రాజెక్టుపూర్తి చేయించడంలో ఉపాధ్యాయుడు తగుసలహాలు, సూచనలతోపాటు గ్రంథాలయ పుస్తకాలు, ఇతరములైనవి అందుబాటులోకి తెచ్చేలా సహకరించాలి.

**- మార్కుల కేటాయింపు**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రాజెక్టు అంశాలకు 5 మార్కులు కేటాయించడం జరిగింది.

ఐతే దీన్ని 10 మార్కులకు నిర్వహించుకొని సగటున 5 మార్కులు నమోదు చేసుకోవచ్చు కూడా. ఒక FA కు పాఠాలలో ఇచ్చిన ఏదైనా ఒక ప్రాజెక్టు పనిని చేసి నివేదిక రాయాలి.

విద్యార్థి ప్రాజెక్టుకు చెందిన సమాచారసేకరణ నైపుణ్యానికి 2 మార్కులు, నమోదు చేసిన విధానానికి 5 మార్కులు, ప్రదర్శనా వివరణకు 3 మార్కుల చొప్పున ఇవ్వవచ్చు. ఇలా పది మార్కులకు ఒక ప్రాజెక్టుకు మార్కులు కేటాయించి 5 మార్కులను లెక్కించి మార్కులు ఇవ్వాలి.

**- ప్రాజెక్టుపని నివేదిక రాయడం :**

(అ) ప్రాథమిక సమాచారం

- ప్రాజెక్టు పని పేరు :
- సమాచారాన్ని సేకరించిన విధానం :

(ఆ) విషయ వివరణ (సేకరించిన సమాచారాన్ని సంక్షిప్తంగా రాయాలి లేదా పట్టికలో రూపంలో నమోదు చేయాలి.)

(ఇ) నేర్చుకున్న విషయాలు / ముగింపు

**- తీసుకోవాల్సిన జాగ్రత్తలు ?**

- ప్రతి ప్రాజెక్టునూ పాఠ్యాంశబోధన తర్వాత అభ్యాసాల నిర్వహణకు ముందుగానే ఇవ్వాల్సి ఉంటుంది.
- గ్రూపువారిగా నిర్వహించినా ప్రాజెక్టులకు వ్యక్తిగతంగా మార్కులు కేటాయించాలి, కాబట్టి ప్రాజెక్టు నివేదిక వ్యక్తిగతంగా నోటుపుస్తకంలో రాయాలి.
- పాఠశాల పరిధిలో అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా ఉపాధ్యాయులు చొరవచూపాలి.
- పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రాజెక్టుపనులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా లేకున్నా, ఒకవేళ వనరులు లభ్యం కాకున్నా దానికి బదులుగా వేరే ప్రాజెక్టు పని ఇవ్వవచ్చు.
- ఒక ఫార్మేటివ్ సమయంలో ఒక ప్రాజెక్టుపనికి నివేదిక రాయిస్తే సరిపోతుంది. ఒక్కొక్క పాఠంలో ఒక ప్రాజెక్టు ఉన్నప్పటికీ రెండు మూడు పాఠాలు పూర్తయిన పిదప వాటిని ఎలా చేయాలో వివరించి పిల్లలు వారికి నచ్చిన ప్రాజెక్టును ఎంపిక చేసుకోమని చెప్పాలి. దానికి నివేదిక రాసేలా చూడాలి.

- ప్రాజెక్టు పనిని పిల్లలకు కేటాయించిన తరవాత తప్పనిసరిగా వివరాలు ఎక్కడ సేకరించాలి? ఎలా నివేదిక రాయాలి? సూచనలు ఇవ్వాలి.
- ప్రాజెక్టు నివేదికల్లో ఒకరికొకరు కాపీ కొట్టకుండా గట్టిచర్యలు చేపట్టాలి.

## నమూనా ప్రాజెక్టు పని

**I. ప్రాథమిక వివరాలు**

(i) ప్రశ్న : పల్లెలు, పట్నాలలోని జీవన విధానానికి గల తేడాలను పట్టికగా రాయండి. నివేదిక రాసి ప్రదర్శించండి.

(ii) సమాచార సేకరణ : నగర జీవన విధానం గురించి మాకు తెలుసుకాని పల్లె జీవన విధానం గురించి మాకు అంతగా తెలియదు. అందుకని మేము మా అమ్మమ్మ తాతలను అడిగి తెలుసుకొన్నాము.

(iii) ప్రాజెక్టు పనిలో పాల్గొన్నవారు : జె. అపర్ణ; రమ్య

**II. సేకరించిన సమాచారం**

**సేకరించిన సమాచారం పట్టికరూపంలో రాస్తున్నాము.**

| పల్లె జీవన విధానం | పట్నం జీవన విధానం |
|---|---|
| 1. పల్లెల్లో అన్ని సరుకులు దొరకవు. | 1. పట్నాలలో అన్ని సరుకులు దొరుకుతాయి. |
| 2. ఉన్నట్టుండి ఎవరైనా అనారోగ్యం పాలైతే దగ్గరలో ఆసుపత్రులు ఉండవు. | 2. అనారోగ్యం పాలైతే ఎల్లవేళగా ఆసుపత్రులు. వైద్యులు అందుబాటులో ఉంటారు. |
| 3. మురుగుదొడ్లు లేక ఆరు బయటికి వెళతారు. | 3. అందరికీ మరుగుదొడ్లు ఉన్నాయి. |
| 4. ఇక్కడ అన్నీ గుంతలతో కూడిన మట్టిరోడ్లు ఉంటాయి. | 4. డాంబర్ రోడ్లు ఉంటాయి. |
| 5. పల్లెల్లో పంటపొలాలు, పచ్చదనం ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటాయి. | 5. పట్నాలలో ఎత్తైన భవనాలు కలుషిత వాతావరణం ఉంటాయి |
| 6. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఇరుగుపొరుగువారు ఆప్యాయంగా ఆదరిస్తారు. | 6. ఎన్ని కష్టాలొచ్చినా ఆదరించేవారు ఎవరూ ఉండరు. ఒంటరిగా బాధపడుతుంటారు. |
| 7. ఇక్కడ గుడిసెలు, పెంకుటిళ్లు, వాగులు, చెరువులు, బావులు, కుంటలు మొదలగునవి ఉంటాయి. | 7. ఇక్కడ అన్నీ పెద్ద పెద్ద భవనాలు మురికి నీటి కాలువలు ఉంటాయి. |

| పల్లె జీవన విధానం | పట్నం జీవన విధానం |
|---|---|
| 8. అప్పటికప్పుడు చెట్లనుండి తాజా కాయగూరలు తెంపుకుని కూరలు వండుకుంటారు. | 8. నిలువ ఉన్న కూరగాయలు, ఫ్రిడ్జ్‌లో ఉన్న కూరగాయలు వండుకుంటారు. |
| 9. ఉన్నత చదువులు చదవడానికి అవకాశాలు ఉండవు. | 9. అత్యున్నత విద్యకు కూడా అవకాశాలు ఉంటాయి. |
| 10. సంస్కృతీ సంప్రదాయాలను చక్కగా పాటిస్తారు. దానికి అనుకూలంగా వస్త్రాలను ధరిస్తారు. | 10. సంస్కృతీ సంప్రదాయాలను నామమాత్రంగా పాటిస్తారు. విదేశీ వస్త్రధారణకు అలవాటు పడ్డారు. |

**III. ప్రాజెక్టు ద్వారా తెలుసుకొన్న విషయం**

మేము ఈ ప్రాజెక్టు పనిద్వారా పల్లె జీవన విధానానికి పట్నం జీవన విధానాల్లో కష్టనష్టాలు, సుఖదుఃఖాల గురించి తెలుసుకొన్నాం. పల్లెల్లో ఏ సౌకర్యాలు లేకపోయినా వాళ్ళు సంతోషంగా జీవిస్తారు. పట్నాలలో అన్ని సౌకర్యాలు ఉన్నా మానసికంగా ఆందోళనతో ఉంటారు.

ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి చేయాలి. అంటే పల్లెల్లో బంగళాలు కట్టి పల్లెను కూడా పట్నంలా మార్చడం కాదు. పల్లె అభివృద్ధి కావడం అంటే పచ్చని పొలాలతో అందరికీ తగిన ఉపాధి దొరకడం. ఇది జరగాలంటే ప్రభుత్వం రైతులకు మంచి మేలురకం విత్తనాలు, తగినన్ని లోన్లు (ఋణాలు) ఇవ్వాలి. పల్లె అభివృద్ధి చెందడం అంటే ఒక రకంగా దేశం అభివృద్ధి చెందడమే. పల్లెలు సంస్కృతీ సంప్రదాయాలకు పట్టుగా నిలిచి ఉంటాయి. అదే నగరంలో అయితే సంస్కృతీ సంప్రదాయాలను నామమాత్రంగా పాటిస్తారు. న్యూట్రెండ్ పేరుతో కట్టుబొట్టు, ఆచార్య వ్యవహారాలను మార్చేస్తున్నారు.

పట్నాలలో కాలువల మీద పక్కన కూడా ఇండ్లు కడుతున్నారు. దానివల్ల వర్షాలు పడ్డపుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే పల్లెల్లో వర్షాలు కురిసినపుడు చెరువులు, వాగులు, కుంటలు, బావులు నిండి ఆ నీరు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది.

ఇంకా పల్లెలు అభివృద్ధి చెందాలంటే అక్కడ కనీస విద్యా సౌకర్యాలను కల్పించాలి. ప్రతి ఒక్కరు అక్షరాస్యులు అయ్యే విధంగా ప్రోత్సహించాలి. బాలికా విద్యను వయోజన విద్యను ఖచ్చితంగా అమలు చేయాలి. అందుకు తగిన చర్యలు ప్రభుత్వం చేపట్టాలి. అదే విధంగా సరియైన వైద్య సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయాలి. సరియైన రవాణా సౌకర్యాలు కల్పించాలి. నిరంతర విద్యుత్తు ఉండేలా సౌకర్యం కల్పించాలి.

పల్లె జీవనంలో స్వచ్ఛత కనిపిస్తుంది. నగర జీవనం యాంత్రికమైనది. పల్లెల్లోని ప్రజలు ఆప్యాయత, అనురాగం చుట్టరికంతో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉంటారు. నగరంలో ఎంతమంది ఉన్నా ఒకరిని ఒకరు పట్టించుకోరు. పక్కింట్లో ఎవరుంటారో తెలియదు. వారికి ఎంత పెద్ద ఆపద వచ్చినా ఏమీ పట్టనట్టు "ఎవరికి వారే యమునా తీరే" అన్నట్లుగా ఉంటారని ఈ ప్రాజెక్టు పని ద్వారా తెలుసుకొన్నాము.

# 4. లఘుపరీక్ష

విద్యార్థులను ఎప్పటికప్పుడు అంచనా వేయటానికి ఉపయోగించుకునే సాధనం. సంగ్రహణాత్మక మూల్యాంకనంలో జవాబులు బాగా రాయటానికి నోట్స్‌తోపాటు ఇది కూడా కీలకం.

దీనికి నిర్దేశిత సమయం, మార్పులు, ప్రశ్నలు అని ప్రత్యేకించి ఉండవు.

తరగతి గదిలో తాను విద్యార్థులతో చేయించిన బోధనాభ్యసన ప్రక్రియలు (ఇవి చేయండి) కి అనుగుణంగా ఒకటో, రెండో సామర్థ్యాలను అంచనా వేయడానికి తగిన ప్రశ్నలను కూర్చి విద్యార్థులచే సమాధానాలు రాయించాలి. (ఇది తన తరగతి గదిలోని విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాల బలాల / బలహీనతలను బట్టి ఉపాధ్యాయుడు నిర్దేశించుకోవాలి.)

ఒక్క F.A. లోపల 1 నుండి 3 లఘు పరీక్షలు నిర్వహించుకున్నను వాటిలో ఉత్తమంగా మార్కులు పొందిన లఘు పరీక్ష మార్కులకు F.A. లో నమోదు చేయడానికి స్వీకరించాలి. ఒక విద్యార్థికి లఘు పరీక్షల్లో 14, 13, 15 మార్కులు వచ్చినవి. వీటిలో 15 మార్కులనే పరిగణనలోకి తీసుకొని నమోదు చేయాలి.

ఒక్క లఘు పరీక్షను 20 మార్కుల చొప్పున నిర్వహించాలి. ఆ తర్వాత వచ్చిన మార్కులను 5'కు తగ్గించి నమోదు చేయాలి.

I, II F.A. లను సరాసరి S.A. I కు

FA - I, II, III, IV ల సరాసరిని S.A. II కు స్వీకరించాలి.

లఘు పరీక్ష ప్రశ్నలను నల్లబల్లపై కూడా రాయవచ్చు. పిల్లలు జవాబులను నోటు బుక్కులో రాయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలనే ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వరాదు. ఉపాధ్యాయుల ఆలోచించేసే ప్రశ్నలను లఘు పరీక్షలో ఇవ్వాలి. దీనివల్ల పిల్లలకు పబ్లిక్ పరీక్షలో వచ్చే ప్రశ్నల సరళి / స్వభావం అర్థమైపోతుంది. అట్లాగే ఉపాధ్యాయులకు కూడా స్థాయి తెలుస్తుంది. దీన్ని నిర్వహించేటప్పుడు ఒకసారి 10 మార్కులకు మరొకసారి 10 మార్కులకు... ఇలా విభజించి నిర్వహించకూడదు. ఒకేసారి 20 మార్కులకు నిర్వహించాలి. ఏవైనా రెండు, మూడు సామర్థ్యాల ఆధారంగా నిర్వహించాలి. ఐతే తప్పనిసరిగా స్వీయరచన, సృజనాత్మకత ప్రశ్నలను ఇవ్వాలి. వీటికి 6, 5 మార్కులు కేటాయించుకోవచ్చు. మిగతా 9 మార్కులను పదజాలం / వ్యాకరణాంశాలు / ధారాళంగా చదువడం ... వంటి ప్రశ్నలు ఇవ్వాలి.

## లఘు పరీక్ష - నమూనా ప్రశ్నాపత్రం

**లఘు పరీక్ష - 1**

1. బలి చక్రవర్తిలోని మంచి గుణమేమి? ఎందుకు? దానితో మీరు ఏకీభవిస్తారా? ఎట్లా? (స్వీయరచన) 6 మా॥
2. "మాట తప్పకుండా ఉండాలి" - అని చెప్తూ 5 నినాదాలు లేదా సూక్తులు రాయండి. (సృజనాత్మకత) 5 మా॥
3. కారే రాజులు ..... పద్యం రాసి దాని భావం రాయండి. (ధారాళంగా చదువడం, అవగాహన)
4. కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి. అభ్యాగతుడు, పరార్థులు (పదజాలం)

**లఘు పరీక్ష - 2**

1. నిరయంబైన ....... ధీరవ్య వేయేటికిన్.

   పద్యాన్ని పూరించి భావం రాయండి. (5 మార్కులు)

2. అవయవ దానం గొప్పదనే ఇతివృత్తం ఆధారంగా ఒక కథను రాయండి. (5 మార్కులు)

3. సొంతవాక్యాలు రాయండి.

   అ) యశము; ఆ) మానధనులు; ఇ) ధారవోయడం ఈ) దుర్భరం

4. "విద్య వల్ల మూఢనమ్మకాలు మటుమాయమైతవి" అని భాగ్యోదయం పాఠంలో తెలుసుకొన్నారు కదా! దీన్ని సమర్థిస్తూ రాయండి.

**లఘు పరీక్ష - 3**

1. ఎవరి భాష వాళ్ళకు గొప్ప అనే వాక్యం ద్వారా మీకేం అర్థమైంది? వివరించండి. (6 మార్కులు) స్వీయరచన.

2. నగర గీతం ఆధారంగా పట్టణాల్లోని జీవితాలు ఎలా ఉంటాయని భావిస్తున్నారు? 6 మార్కులు (స్వీయరచన)

3. భాష గొప్పతనాన్ని తెలిపేలా ఒక కరపత్రం తయారుచేయండి. మూడు పరీక్షలు ఒక F.A. కాలంలో నిర్వహించినట్లైతే ఎక్కువ మార్కులు పొందిన పరీక్ష మార్కులు నమోదు చేయాలి. (5 మార్కులు) సృజనాత్మకత.

4. సవర్ణదీర్ఘ సంధి, గుణసంధి సూత్రాలు రాసి ఒక్కొక్కదానికి ఒక ఉదాహరణ రాయండి. (3 మార్కులు)

## తెలుగు - సంగ్రహణాత్మక మూల్యాంకనం - నిర్వహణ

**సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటే?**

"రాత పరీక్ష ద్వారా సామర్థ్యాల సాధనను పరీక్షించడమే సంగ్రహణాత్మక మూల్యాంకనం". 2015-16 విద్యా సం॥ నుండి సంగ్రహణాత్మక మూల్యాంకనం ఒక విద్యా సం॥లో రెండుసార్లు నిర్వహించడం జరుగుతుంది. మొదటిది సెప్టెంబర్ / అక్టోబర్ మాసాల్లో, రెండోది మార్చి మాసంలో ఉంటుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మినహా మిగతా వాటికి డి.సి.ఇ.బి. ద్వారా సరఫరా చేసిన ప్రశ్నపత్రాలతో నిర్వహిస్తాం. 6, 7, 8 తరగతులకు సబ్జెక్టుకు ఒక పేపరు, 9, 10 తరగతులకు సబ్జెక్టుకు రెండు పేపర్ల చొప్పున (హిందీ మినహా) ప్రశ్న పత్రాలుంటాయి.

**(ఎ) ప్రశ్న పత్రాలు రూపొందించే వారికి మార్గదర్శకాలు :** [Paper Setter]

10వ తరగతి వార్షిక పరీక్షల సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఐజు2) కోసం మరియు 6 నుండి 9 తరగతులకు సంగ్రహణాత్మక మూల్యాంకనం ($SA_1$, $SA_2$) కోసం ప్రశ్నపత్రాలను రూపొందించే సందర్భాలలో వీటిని తయారుచేసేవారు కింది సూచనలను దృష్టిలో పెట్టుకొని ప్రశ్నపత్రాలను రూపొందించాలి. వీటిని తప్పని సరిగా పాటించాలి.

- ప్రశ్నాపత్రం రూపొందించడంలో నిర్దేశించిన భారత్వ పట్టికలను (Blue print) తప్పక పాటించాలి. అనగా విద్యా ప్రమాణాల వారీగా భారత్వం (Weightage of Academic Standareds) ప్రశ్నల రకాల వారీగా భారత్వం (Weightage of type, Questions)ను పాటించాలి. అట్లాగే కాఠిన్యత స్థాయి భారత్వ పట్టికను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.
- సబ్జెక్టువారీగా నిర్ధారించిన భారత్వపట్టికలను ప్రశ్నాపత్రాలు రూపొందించేవారు మొదట చదివి అవగాహన చేసుకోవాలి.
- ప్రశ్నపత్రం తయారీదారులకు తప్పనిసరిగా విద్యాప్రమాణాలపై అవగాహన ఉండాలి. విద్యా ప్రమాణాలకు తగిన ప్రశ్నలు రూపొందించగలిగిన వారై ఉండాలి.
- 6 నుండి 8వ తరగతివారు ఒకే పేపర్ చొప్పున, 9, 10 తరగతులకు రెండేసి పేపర్లు చొప్పున నిర్వహిస్తారు. కాబట్టి ఆయా పేపర్ల వారీగా నిర్దేశించిన సిలబస్, విద్యాప్రమాణాలను దృష్టిలో పెట్టుకోవాలి.
- గత ప్రశ్నాపత్రాలను అధ్యయనం చేయాలి. వాటిలో ఇచ్చిన ప్రశ్నలు పునరావృతం కారాదు.
- పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలు ఇవ్వరాదు. ఇవి పిల్లలకు అభ్యాసం కల్పించడానికి ఉద్దేశించినవి.
- ప్రశ్నలను గైడ్లు, స్టడీ మెటీరియల్, క్వశ్చన్ బ్యాంక్‌లు, ఇతర రెఫరెన్స్ పుస్తకాలలోనివి సేకరించి ఇవ్వరాదు. ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలు పాఠ్యపుస్తకంలోని విషయం ఆధారంగా ఉండాలి.
- ప్రశ్నలు ఆలోచింపజేసేవిగా, విశ్లేషణాత్మకంగా, అవగాహనను పరిశీలించేవిగా, ఉండాలి. దైనందిన జీవితానికి అన్వయించుకునేలా వీలైనంత మేరకు బహుళజవాబు/ప్రతిస్పందనలకు అవకాశముండేలా ప్రశ్నలు ఉండాలి. బట్టీ పట్టి / జ్ఞాపకం చేసి జవాబులు రాసేలా ప్రశ్నలు ఉండకూడదు.
- ప్రశ్నాపత్రాలలో ఇచ్చిన ప్రశ్నలలో 50% ప్రశ్నలు సగటు విద్యార్థుల అందరు రాసే విధంగా ఉండాలి. 30% ప్రశ్నలు సాధారణం కన్న కొద్దిగా ఎక్కువ కాఠిన్యతస్థాయిని కలిగి (Above average) ఉండాలి. మిగతా 20% ప్రశ్నల కాఠిన్యతా స్థాయి ఎక్కువగా (Critical) ఉండాలి. అయితే ఇవి ఒక ప్రశ్నాపత్రంలోని అన్ని రకాల ప్రశ్నలలో ప్రతిబింబించాలి.
- ప్రశ్నలలో స్పష్టత ఉండాలి. భిన్న అర్థాలు వచ్చేలా ఉండరాదు. చదువగానే ప్రశ్న ఉద్దేశ్యం అర్థం కావాలి.
- వ్యాసరూప సమాధాన ప్రశ్నలలో ఉప ప్రశ్నలు ఇవ్వరాదు. ఒకే ప్రశ్నగా ఉండాలి. 10 నుండి 12 వాక్యాలలో సమాధానాలు రాయడానికి వీలుగా ప్రశ్నలు ఉండాలి.
- అయితే వ్యాసరూప సమాధాన ప్రశ్నలను లఘు సమాధాన ప్రశ్నల విధానంలో లేదా లఘు సమాధాన ప్రశ్నలకు వ్యాసరూప సమాధాన ప్రశ్నల విభాగంలో ఇవ్వకూడదు.
- ప్రశ్నాపత్రాల రూపకల్పనలో విషయానికి ఇచ్చే ప్రాధాన్యత కంటే విద్యాప్రమాణాల సాధన కోసం ప్రశ్నలు రూపొందించాలి.

- భాషా సబ్జెక్టులలో అంటే తెలుగు, హిందీ, ఉర్దూ ... వంటివాటిలో కూడా పార్టు – A, పార్టు – B ఉంటుంది. పార్టు – B అంటే లక్ష్యాత్మక ప్రశ్నలు బహుళైచ్ఛిక సమాధాన ప్రశ్నలు ఉంటాయి. దీనిని చివరి 30 నిమిషాలలో ఇవ్వాలి.
- 9, 10వ తరగతులలో పేపర్ – Iలో పార్టు – A, వ్యక్తీకరణ సృజనాత్మకతలోని స్వీయరచన సామర్థ్యానికి చెందిన లఘు సమాధాన ప్రశ్నలు, తర్వాత వ్యాసరూప సమాధాన ప్రశ్నలు ఉంటాయి. అట్లాగే పార్టు – Bలో పదజాలానికి చెందిన 16 బహుళైచ్ఛిక ప్రశ్నలు రెండు సొంత వాక్యాలు ఉంటాయి. పేపర్– II లో కూడా పార్టు –Aలో అవగాహన ప్రతిస్పందన విభాగానికి చెందిన ప్రశ్నలు, తర్వాత సృజనాత్మక ప్రశ్నలు ఉంటాయి. పార్టు –B వ్యాకరణాంశాలతో కూడి ఉంటుంది. ఇవన్నీ కూడా లక్ష్యాత్మక ప్రశ్నలే.
- ద్వితీయభాషకు చెందిన సబ్జెక్టులలో ఒకే పేపరును నిర్వహిస్తారు. దీనికి పార్టు–A లో 60 మార్కులు, పార్టు –Bలో 20 మార్కులు ఉంటాయి. పార్టు –B లో లక్ష్యాత్మక ప్రశ్నలు ఉంటాయి. పార్టు–జు లో మొదట అవగాహన ప్రతిస్పందన ప్రశ్నలు తర్వాత స్వీయరచన ప్రశ్నలు ఆ తర్వాత సృజనాత్మకతకు చెందిన ప్రశ్నలు
- వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు అంతర్గత ఎంపిక అవకాశం (ఇంటర్నల్ ఛాయిస్) ఉండాలి.
- కాంపోజిట్ తెలుగు / ఉర్దూకు కూడా రెండు పేపర్లు ఉంటాయి. వీటిని ప్రథమ భాషలో రెండు పేపర్లుగా నిర్వహించాలి. మొదటి పేపరు రోజు కాంపోజిట్ తెలుగు / ఉర్దూ ఉంటుంది. రెండవ పేపరు రోజు సంస్కృతం/ అరబిక్ పేపరు ఉంటుంది. అయితే రెండవ పేపరును 20 మార్కులకే నిర్వహిస్తారు. కాబట్టి దీనికి 1 గంట సమయం సరిపోతుంది.
- ప్రశ్నలు విద్యార్థులకు సులభంగా, స్పష్టంగా, సూటిగా అర్థమయ్యేలా ఉండడం. ప్రశ్నపత్రంలోని సూచనలు కూడా స్పష్టంగా ఉండాలి.
- బహుళైచ్ఛిక ప్రశ్నలలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు నేరుగా గుర్తించి రాసేదిగా ఉండరాదు. ఇచ్చిన సమాధానాలను (options) పరిశీలించి, ఆలోచించి సమాధానం గుర్తించేవిగా ఉండాలి.
- అలాగే బహుళైచ్ఛిక ప్రశ్నలు అన్నీ ఒకే విధంగా ఉండకుండా సమాధానాలు (options) ఎన్నుకునే విధానం వేరువేరు పద్ధతులలో ఉండేలా ప్రశ్నలు రూపొందించాలి.
- విద్యార్థులు బట్టీపట్టి జవాబులు రాసేవిధంగా ఉండకుండా, వారిలోని ఆలోచనాశక్తి, సృజనాత్మకత, బహుకోణాల్లో విశ్లేషించే శక్తి, స్వీయ అనుభవాలు, అభిప్రాయాలు వ్యక్తం చేసే విధంగా ప్రశ్నలు ఉండాలి.
- ప్రశ్నలలో అర్థం కాని పదజాలం వాడరాదు. ఉదాహరణకు తెలుగు ప్రశ్నాపత్రంలో నిరూపించండి ప్రశ్నలు రూపొందించేటప్పుడు జవాబులు పిల్లల ఊహకు / అనుభవాలకు / ఆలోచనలకు లోబడి ఉండాలి.
- కొన్ని సామర్థ్యాలకు చెందిన ప్రశ్నలు మళ్ళీ మళ్ళీ పునరావృతమవుతున్నాయి. ఉదాహరణకు భాషలో సృజనాత్మకతలో లేఖను పలుమార్లు అడిగారు. ఇలా జరుగకూడదు. విభిన్న ప్రక్రియలు ఉన్నాయి. వాటి నుండి ఎంపిక చేయాలి, లేకుంటే లేఖ తప్పనిసరిగా వస్తుంది, కాబట్టి దీన్ని మాత్రమే అభ్యాసం చేస్తే సరిపోతుందనే భావన వ్యాపిస్తుంది.

- అట్లాగే అవగాహన – ప్రతిస్పందనలోని పఠనావగాహన ప్రశ్నలలో కొన్ని రకాల ప్రశ్నలకే పరిమితమౌతున్నారు. అంటే పేరా ఇచ్చి ప్రశ్న రాయమనడం లేదా ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయమనడం వంటివే పలుమార్లు పునరావృతమైనవి. ఇలా జరగకూడదు. పాఠ్యపుస్తకంలోనే విభిన్న రకాల నమూనాలు పొందుపరచారు. వీటిని వినియోగించుకోవచ్చు.
- అన్ని పాఠాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఏ పాఠం నుండైనా  ఏరకమైన ప్రశ్నలైనా రావచ్చు. అలా కాకుండా ఒకటి రెండు పాఠాల నుండే ఎక్కువ ప్రశ్నలు ఇస్తే మిగతా పాఠాలను వదిలివేసే అవకాశం ఉంటుంది.
- ప్రశ్నాపత్రం రూపొందించేవారికి వారు ప్రశ్నలు రాస్తున్నప్పుడు జవాబులపైన స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి.
- కొన్ని ప్రశ్నలు పిల్లల అభిప్రాయాలను తెలుసుకొనుటకు వీలుగా అభివ్యక్తిసామర్థ్యాన్ని పరీక్షించేవిగా, తార్కికతను, హేతుబద్ధతను పరీక్షించుటకు వీలుగా ఉంటాయి. అలాంటి సందర్భాలలో విషయం యొక్క ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ధనాత్మకత వైఖరులను పెంపొందించేలా ప్రశ్నలు ఉండాలి. ఉదా॥ మహిళలందరూ చదువుకోవడం అవసరమా? ఎందుకు? కారణాలు రాయండి అనే ప్రశ్నలు ఇవ్వకూడదు. ఎందుకంటే చదువుకోవడం అవసరమని లేదా అవసరం లేదని రెండు రకాలుగా జవాబులు రాయడానికి అవకాశం ఉంది. అలా కాకుండా “మహిళలందరూ చదువుకోవాలి! దీన్ని సమర్థిస్తూ రాయండి” అని అడగడం వల్ల వారిలోని ధనాత్మకవైఖరులు తార్కికంగా వృద్ధిచెందుతాయి.
- ప్రశ్నాపత్రాలు రూపొందించేవారు దీన్ని అతిగోప్యమైనదిగా భావించాలి. ఏరకంగానైన సమాచారం బయటికి పొక్కితే రూపొందించేవారిని కఠినంగా శిక్షించాలి.

## తెలుగు ప్రశ్నాపత్రం తయారీ – తీసుకోవలసిన జాగ్రత్తలు

### I. అవగాహన ప్రతిస్పందించడం (ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని ప్రతిస్పందించడం)

- ఈ సామర్థ్యంలో పరిచిత గద్యం, అపరిచిత గద్యం, పరిచిత పద్యం, అపరిచిత పద్యం అని నాలుగు రకాలుగా ప్రశ్నలు అడుగడం జరుగుతుంది. వీటిని అడిగేటప్పుడు పరిచిత గద్యం, అపరిచత గద్యం, అపరిచిత పద్యం – వీటికి సంబంధించి ప్రశ్నలకు జవాబులు / ప్రశ్నల తయారీ / కీలక పదాలను గుర్తించి పట్టిక రాయడం / ఖాళీలను పూరించడం మొదలైన  పాఠ్యపుస్తకాలలో ఇచ్చిన రూపాలున్నాయి
- అయితే ఎక్కువ సార్లు ప్రశ్నలు – జవాబులు / ప్రశ్నల తయారీ మాత్రమే అడుగుతున్నారు. అట్లా కాకుండా మిగతా  రూపాల్లో కూడా అడగాలి.
- పరిచిత పద్యం కింద పాఠ్యపుస్తకంలో ఇవ్వబడిన చుక్క గుర్తుగల పద్యాలను ఇవ్వాలి. వీటిని రెండు రకాలుగా అనగా ప్రతిపదార్థం  /  పద్యపూరణ, భావం అడగాలి.
- అపరిచిత పద్యం ప్రముఖ శతకాల నుండి ఇవ్వాలి.

## II. స్వీయరచన

- ఈ సామర్థ్యంలో పుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా అడుగరాదు.
- ఆలోచించండి. చెప్పండి బాక్స్ ప్రశ్నలు అడుగరాదు.
- ఏది లఘు సమాధానంలో అడుగవచ్చో, ఏది వ్యాసరూపంలో అడుగవచ్చో ముందుగా నిర్ధారించుకొని ప్రశ్నలు రూపొందించుకోవాలి.
- ప్రశ్నలలో వాడే  పదాలు పిల్లలకు అర్థమయ్యేటట్లుగా ఉండాలి.
- విశ్లేషించండి, వివరించండి, సమర్థించండి, అభిప్రాయం తెలుపండి మొదలైనవి ఎక్కడ ఉపయోగించాలో ఆలోచించి ప్రశ్నలకు ఆ పదాలు వాడాలి.
- ప్రశ్నలు పిల్లలకు అర్థమయ్యేటట్లు ఇవ్వాలి. వారిని అయోమయానికి గురిచేసేట్లుగా ఇవ్వకూడదు.
- అసంబద్ధమైన, క్లిష్టతరమైన పదాలను ప్రశ్నలలో ఉపయోగించరాదు. ఉదా: నిరూపించండి, చర్చించండి, చెప్పండి, సద్భావన, అంతర్గత మొదలగునవి.

## III. సృజనాత్మకత

- ఈ సామర్థ్యంతో పాఠ్యపుస్తకంలో ఇచ్చిన వ్యవహార రూపాలను అడుగవలెను.
- పాఠ్యపుస్తకంలో ఉన్న ప్రశ్నలు ఉన్నట్లుగానే  అడుగవద్దు.
- అంశాలను మార్చి వ్యవహార రూపాలను అడుగవలెను.
- ఎంత సృజనాత్మకత అయినా మాత్రం పిల్లలకు పరిచయంలేని అంశాలను ఇచ్చి రాయమని అడుగరాదు. ఉదా: ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన గురించి కరపత్రం రాయండి. ఇందులో ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన గురించి పిల్లలకు తెలిసే అవకాశం లేదు.  ఇట్లాంటివి ఇవ్వకుండా వారికి తెలిసిన అంశాలపై అడుగవచ్చు).
- పాఠ్యపుస్తకంలో అనేక వ్యవహార రూపాలు ఉండగా ఒకే రకమైన వాటికి పరిమితం కాకూడదు. (ఉదా: లేఖ, వ్యాసం) ఎక్కువసార్లు వీటిని అడుగడం వల్ల పిల్లలు మిగతా వాటిని నేర్చుకోరు.
- ప్రశ్న అర్థవంతంగా ఉండాలి. పిల్లలను అయోమయానికి గురిచేసేట్లుగా ఇవ్వరాదు.

## IV. భాషాంశాలు (పదజాలం / వ్యాకరణం)

- పదజాలంగాని, వ్యాకరణాంశాలు గాని పాఠ్యపుస్తకంలో అభ్యాసనంలో ఉన్న వాటిని యథాతథంగా అడుగరాదు.
- వ్యాకరణానికి సంబంధించిన అంశాలు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలలో ఉన్న ఉదాహరణలు కాకుండా అట్లాంటివే వేరేవి ఇవ్వాలి.

6, 7, 8, 9 తరగతులకు ప్రతీ జిల్లాలో డి.సి.ఇ.బి ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాలను రూపొందిస్తారు. అట్లాగే 10వ తరగతి మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనానికి కూడా! .... 10వ తరగతి రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని "పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు" పేపరుతో ఎస్.ఎస్.సి బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన ప్రశ్నాపత్రాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు. తెలుగులో ప్రథమ, ద్వితీయ భాషలకు ప్రశ్నాపత్రాల రూపకల్పన సంబంధించిన భారత్వ పట్టికలు, సామర్థ్యాల వారీగా సూచనలు, నమూనా ప్రశ్నాపత్రాల గురించి తెలుసుకుందాం.

**6, 7, 8 తరగతులు - తెలుగు ప్రథమ భాష - సామర్థాల వారీ భారత్వ పట్టిక**

| సామర్థ్యం | మార్కులు | రిమార్కులు |
|---|---|---|
| 1. ధారాళంగా చదువడం, అర్థం చేసుకోవడం | 20 మార్కులు | ♦ పరిచిత పద్యం,<br>♦ పరిచిత గద్యం,<br>♦ అపరిచిత పద్యం/గేయం/ కవిత మొదలైనవి. |
| 2. స్వీయరచన | 32 మార్కులు | లఘుసమాధాన ప్రశ్నలు, వ్యాసరూప సమాధానప్రశ్నలు |
| 3. సృజనాత్మకత | 8 మార్కులు | పాఠ్యపుస్తకంలో పరిచితమైన సృజనాత్మకత అంశాల ఆధారంగా ప్రశ్నలు. |
| 4. పదజాలం | 10 మార్కులు | అర్థాలు, వచనాలు, ప్రకృతి వికృతి, నానార్థలు, సొంత వాక్యాలు మొదలైనవి. |
| 5. వ్యాకరణాంశాలు | 10 మార్కులు | భాషాభాగాలు, విభక్తులు, కాలాలు, వాక్యాలు, సంధులు, సమాసాలు మొ॥నవి. |
| 6. మొత్తం | 80 మార్కులు. | |

సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని 80 మార్కులకే నిర్వహిస్తారు. మిగతా 20 మార్కులను పాఠశాలలోనే నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనం ద్వారా మార్కులు కేటాయిస్తారు.

## 9, 10 తరగతులు - ప్రథమ భాష - తెలుగు - సామర్థ్యాల వారీ భారత్వ పట్టిక

| సామర్థ్యం | మార్కులు | రిమార్కులు |
|---|---|---|
| (i) అవగాహన ప్రతిస్పందన<br>(ధారాళంగా చదువడం-అర్థం చేసుకోవడం) | 20 మార్కులు | పేపర్-II లో పరీక్షిస్తారు. |
| (ii) వ్యక్తీకరణ సృజనాత్మకత | | |
| ఎ) స్వీయరచన | 30 మార్కులు | పేపర్-I లో పరీక్షిస్తారు. |
| బి) సృజనాత్మకత | 10 మార్కులు | పేపర్-II లో పరీక్షిస్తారు. |
| (iii) భాషాంశాలు | | |
| ఎ) పదజాలం | 10 మార్కులు | పేపర్- I లో పరీక్షిస్తారు. |
| బి) వ్యాకరణాంశాలు | 10 మార్కులు | పేపర్ - II లో పరీక్షిస్తారు. |
| **మొత్తం** | **80 మార్కులు** | **పేపర్-I**<br>స్వీయరచన,<br>పదజాలం (40మార్కులు) |

## ప్రథమ భాష - తెలుగు పేపర్లవారీగా భారత్వ పట్టిక

| సామర్థ్యాలు | మొదటి పేపరు మార్కులు | రెండవ పేపరు మార్కులు |
|---|---|---|
| 1. ధారాళంగా చదువడం-<br>అర్థం చేసుకోవడం, స్పదించడం | - | 20 మార్కులు |
| 2. స్వీయరచన | 30 మార్కులు | - |
| 3. సృజనాత్మకత | - | 10 మార్కులు |
| 4. పదజాలం | 10 మార్కులు | - |
| 5. వ్యాకరణాంశాలు | - | 10 మార్కులు |
| **మొత్తం** | **40 మార్కులు** | **40మార్కులు** |

## ద్వితీయ భాష తెలుగు 6, 7 తరగతులు

### సామర్థాల వారీగా భారత్వ పట్టిక

| సామర్థ్యం | 6వతరగతి | 7వ తరగతి | | రిమార్కులు |
|---|---|---|---|---|
| | | SA-I | SA-II | |
| ధారాళంగా చదవడం, | 30 మా | 30మా | 20 మా | అక్షరాలు, పదాలు, వాక్యాలు వీటికి చెందిన పశ్నలు ఉండాలి. |
| స్వీయరచన | 40 మా | 40మా | 30 మా | 7వ తరగతి SA-II ప్రశ్నాపత్రంలో 5 ప్రశ్నలు ఇవ్వాలి. ఒక్కొక్క ప్రశ్నకు 6 మార్కులు ఉంటవి. 6వ తరగతి, 7వ తరగతి SA - I ప్రశ్నాపత్రంలో అక్షరాలు, పదాలు, వాక్యాలు రాసే అభ్యాసాల ఆధారంగా ప్రశ్నలు ఉండాలి. |
| సృజనాత్మకత | 10 మా | 10మా | 10 మా | పాఠ్యపుస్తకంలో పరిచయం చేసిన సృజనాత్మక అభ్యాసాలు ఉండాలి. |
| పదజాలం | - | - | 10 మా | అర్థాలు, ప్రకృతి వికృతి, వచనాలు మొదలైనవి. |
| వ్యాకరణాంశాలు | - | - | 10 మా | విరామ చిహ్నాలు, ద్విత్వ సంయుక్త, సంశ్లేషాక్షరాలు, నామవాచకం, సర్వనామాలు మొదలగునవి. వీటిని SA-II లోనే ఇవ్వాలి. |
| **మొత్తం** | **80 మా** | **80 మా** | **80 మా** | **-** |

## 8, 9, 10 తరగతులు – ద్వితీయ భాష – సామర్థ్యాల వారీ భారత్వ పట్టిక

| సామర్థ్యం | మార్కులు | రిమార్కులు |
|---|---|---|
| ధారాళంగా చదవడం, అర్థం చేసుకోవడం ప్రతిస్పందించడం | 20 మార్కులు | ♦ పరిచిత పద్యం (5 మా.)<br>♦ పరిచిత గద్యం (5 మా.)<br>♦ అపరిచిత పద్యం/గేయం/ కవిత మొదలైనవి. (10 మా.) |
| స్వీయరచన | 32 మార్కులు | ♦ లఘుసమాధాన ప్రశ్నలు(16 మా.)<br>♦ వ్యాసరూప సమాధానప్రశ్నలు (16 మా.) |
| సృజనాత్మకత | 8 మార్కులు | ♦ పాఠ్యపుస్తకంలో పరిచితమైన సృజనాత్మకత అంశాల ఆధారంగా ప్రశ్నలు (8 మా.) |
| పదజాలం | 10 మార్కులు | ♦ 8 మార్కులు అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు<br>♦ 2 మార్కులు – సొంతవాక్యాలు (10 మా.) |
| వ్యాకరణాంశాలు | 10 మార్కులు | ♦ సంధులు, సమాసాలు భాషాభాగాలు, విభక్తులు మొ॥నవి. (10 మా.) |
| **మొత్తం** | **80 మా** | **80 మా** |

## కాఠిన్యత స్థాయిని బట్టి భారత్వం – ప్రథమభాష

| కఠిన్యత స్థాయి | మార్కులు | రిమార్కులు |
|---|---|---|
| సులభం | 32 మార్కులు | అవగాహన ప్రతిస్పందన (ధారళంగా చదువడం, అర్థం చేసుకోవడం), లఘు సమాధాన ప్రశ్నలు. |
| మధ్యస్థం | 38 మార్కులు | పదజాలం, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు, వ్యాకరణాంశాలు. |
| కాఠిన్యం | 10 మార్కులు | సృజనాత్మకత ప్రశ్నలు |
| **మొత్తం** | **80 మార్కులు** | |

**కాఠిన్యత స్థాయిని బట్టి భారత్వం - ద్వితీయభాష**

| **కఠిన్యత స్థాయి** | **మార్కులు** | **రిమార్కులు** |
|---|---|---|
| సులభం | 20 మార్కులు | ధారళంగా చదువడం, అర్థం చేసుకోవడం పరిచితపద్యం, పరిచిత గద్యం, అపరిచిత పద్యం, గద్యం మొదలగునవి |
| మధ్యస్థం | 38 మార్కులు | లఘుసమాధాన ప్రశ్నలు, పదజాలం, వ్యాకరణాంశాలు |
| కాఠిన్యం | 24 మార్కులు | సృజనాత్మక, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు |
| **మొత్తం** | **80 మార్కులు** | |

6వ తరగతి నుండి 10 తరగతి వరకు ప్రథమ, ద్వితీయ భాషలుగా తెలుగును బోధిస్తుంటారు. ప్రథమ భాషలో 6, 7, 8 తరగతులతో పోల్చితే 9, 10 తరగతులలో మార్కుల కేటాయింపులో స్వల్ప తేడా ఉన్నది. భారత్వ పట్టికల ఆధారంగా ప్రశ్నలు రూపొందించుకోవాలి. అయితే ద్వితీయ భాషగా తెలుగు 6వ తరగతి నుండి ప్రారంభమౌతుంది. ఈ తరగతిలో పిల్లలు కేవలం వర్ణమాల, గుణింతాక్షర పదాల వరకు నేర్చుకుంటారు. అట్లాగే 7వ తరగతిలో వీటి పునఃశ్చరణతో మొదలు పెట్టి ద్విత్వాలు, సంయుక్తాలతో పాటు వాక్యాలు, పేరాలు చదువడం, రాయడం కూడా నేర్చుకొంటారు. కాబట్టి 6వ తరగతి, 7వ తరగతిలో ప్రశ్నాపత్రాలు 8, 9, 10 తరగతుల కంటే విభిన్నంగా ఉంటాయి. 6వ తరగతిలో మొదటి, రెండవ ఎస్.ఏ. పేపర్లు, 7వ తరగతి ఎస్.ఏ1 పేపరు ఒకే రకంగా ఉంటాయి. ఈ పేపర్లలో చదువడం, రాయడం, సృజనాత్మకత సామర్థ్యాలు మాత్రమే పరీక్షించాలి. 7వ తరగతి ఎస్.ఏ - II వచ్చేసరికి పిల్లలు చదువడం, రాయడం చేయగల్గుతారు కాబట్టి అన్ని భాషా సామర్థ్యాల ఆధారంగా ఎస్.ఏ - II ప్రశ్నాపత్రాన్ని రూపొందించాలి. వీటికి సంబంధించిన మరిన్ని వివరాలను తెల్సుకొందాం.

## ప్రథమ భాష – తెలుగు

## సామర్థ్యాల వారీగా 6, 7, 8 తరగతుల ప్రశ్నపత్రం – మార్గదర్శకాలు

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **I. ధారాళంగా చదువడం – అర్థంచేసుకొని ప్రతిస్పందించుట** | అవగాహనను పరీక్షించడం | 3 విభాగాలు 15 ప్రశ్నలు | 15 | 5 × 1 = 5<br>5 × 1 = 5<br>2 × 5 = 10 | 20 | 20 | 1. పరిచిత గద్యం (5 మా.)<br>(ఉపవాచక పాఠాల నుండి పేరా ఇవ్వడం.)<br>**సూచన :** ప్రశ్నలు ఇలా ఉండాలి.<br>◆ పేరా ఆధారంగా జవాబులు రాయడం.<br>◆ ప్రశ్నలు తయారు చేయడం.<br>◆ కీలక పదాల వివరణ.<br>◆ ఖాళీలు పూరించడం.... మొదలైన రూపాలు<br>2. అపరిచిత పద్యం లేదా గద్యం (10 మా.)<br>(అపరిచిత పద్యానికి ప్రసిద్ధమైన శతక పద్యం లేదా అస్థాయికి తగిన పద్యం ఇవావ్వలి. అట్లాగే అపరిచిత గద్యానికి ఏదైనా అపరిచితమైన పేరా ఇవ్వాలి)<br>**సూచన :** ప్రశ్నలు ఇలా ఉండాలి.<br>◆ ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>◆ తప్పొప్పులు గుర్తించడం.<br>◆ ఖాళీలు పూరించడం.<br>◆ కీలక పదాలు వివరించడం.<br>◆ బహుళైచ్ఛిక ప్రశ్నలు |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | 3. పరిచిత పద్యం (5 మా.)<br>(పాఠ్య పుస్తకంలో * గుర్తుగల పద్యాలు)<br>**సూచన :** ప్రశ్నలు ఇలా ఉంటాయి.<br>♦ పద్యం పూరించడం.<br>♦ భావం రాయడం.<br>♦ పద్యం ఆధారంగా ప్రశ్నలు / ఖాళీలు / తప్పొప్పులు రాయడం. |
| **II. స్వీయరచన** | లఘు ప్రశ్నలు | 4 | 4 | 4 × 4 = 16 | 16 | 32 | పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. పాఠ్య పుస్తకంలోని ప్రశ్నలు యథాతథంగా ఇవ్వరాదు. కవి / రచయితకు సంబంధించిన ప్రశ్న తప్పనిసరి. 5, 6 వాక్యాల్లో జవాబులు రాసేటట్లుగా ఉండాలి. |
| | వ్యాసరూప ప్రశ్నలు | 4 | 2 | 2 × 8 = 16 | 16 | | పద్య గద్య భాగాల నుండి ఒక్కో ప్రశ్నకు జవాబు రాయాల్సి ఉంటుంది. అందుకై ప్రతిభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వబడతాయి. ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి.<br>విశ్లేషణాత్మకంగా / అభిప్రాయం తెలిసేలా / సారాంశం తెల్పేలా / కారణాలతో సమర్థిస్తూ విభేదిస్తూ రాసేలా / ప్రత్యక్ష భాగస్వామి అయి స్పందించేలా మొదలగు రూపాల్లో ప్రశ్నల స్వభావం ఉంటుంది. 10 నుండి 12 వాక్యాల వరకు జవాబులు రాసేటట్లుగా ఉండాలి. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **III.** సృజనాత్మకత / ప్రశంస | భాషా వ్యవహార రూపాలు | 3 | 1 | 1 × 8 = 8 | 8 | 8 | పాఠ్య పుస్తకంలో పొందుపరచిన అంశాల ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలి. మూడు ప్రశ్నలు ఇస్తే ఒకదానికి జవాబు రాయాలి.<br>(చిన్నగేయం / కథ / సంభాషణ / వ్యాసం / కవిత / పోస్టరు / లేఖ / సూక్తులు / నినాదాలు / మొదలగునవి.) |
| **IV.** పదజాల వినియోగం | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 × 2 × 2<br>8 × 1 × 8 | 10 | 10 | 2 మార్కుల సొంత వాక్యాలు ఇవ్వాలి. మిగతా 8 మార్కులకు అర్థాలు / పర్యాయపదాలు / నానార్థాలు / ప్రకృతి – వికృతులు / వ్యుత్పత్త్యర్థాలు మొదలైనవి బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వాలి. ఏవైనా నాలుగు అంశాలకు చెందిన ప్రశ్నలు ఇవ్వాలి. |
| **V.** భాషను గూర్చి తెలుసుకుందాం | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 10 × 1 × 10 | 10 | 10 | విభక్తులు / సంధులు / సమాసాలు / భాషా భాగాలు / సమాపక – అసమాపక క్రియలు / వాక్యాలు / పదాల్లోని ధ్వనులు / లింగభేదాలు / మొదలగునవి. ఆయా తరగతుల వారీగా పరిచయమైన అంశాలను బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఇవ్వాలి. |

# ప్రథమ భాష - తెలుగు

## సామర్థ్యాల వారీగా 9, 10 తరగతుల ప్రశ్నపత్రం - భారత్వ పట్టిక

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **I. అవగాహన-ప్రతిస్పందన** | అవగాహనను పరీక్షించడం | 4 | 4 | 5 మా. | 4×5=20 | 20 | అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండాలి.<br>1. పరిచిత గద్యం<br>(తప్పనిసరిగా ఉపవాచకం నుండి ఏదైనా ఒక పేరా ఇవ్వాలి.)<br>2. అపరిచిత గద్యం<br>3. అపరిచిత పద్యం / గేయం / కవిత<br>సూచికలు : పై మూడింటిని ఈ కింది విధంగా ఉన్న రూపాల నుండి ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ ప్రశ్నలకు జవాబులు.<br>♦ తప్పొప్పులు గుర్తించుట.<br>♦ ఖాళీలు పూరించుట.<br>♦ ప్రశ్నల తయారీ. మొ॥నవి.<br>♦ గద్యభాగం / పద్య భాగం / (అపరిచితం)లోని కీలక పదాల వివరణ.<br>4. పరిచిత పద్యం (పాఠ్య పుస్తకంలో * గుర్తు గల పద్యాలు)<br>సూచిక : ఈ కింది రూపాలలో ఇవ్వాలి.<br>♦ ప్రతి పదార్థం (లేదా)<br>♦ పద్యం పూరించి భావం రాయడం. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **II. వ్యక్తీకరణ – సృజనాత్మకత**<br>**అ) స్వీయరచన** | 1) లఘు ప్రశ్నలు (5–6 వాక్యాలు) | 4 | 4 | 3 మా. | 4×3=12 | 30 | లఘు సమాధాన ప్రశ్నలలో పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. (వీటిలో 1 ప్రశ్న తప్పనిసరిగా కవి / రచయితల శైలి / ఉద్దేశ్యం / భావనలకు సంబంధించి ఇవ్వాలి.) |
| | 2) వ్యాసరూప ప్రశ్నలు (10 నుండి 12 వాక్యాలు) | 6 | 3 | 6 మా. | 6×3=18 | – | వ్యాసరూప ప్రశ్నలలో విద్యార్థి తప్పనిసరిగా పద్య, గద్య, ఉపవాచకాలనుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. అందుకొరకు ప్రతి భాగం నుండి 2 ప్రశ్నలు ఉంటాయి.<br>దీనిలోని ప్రశ్నల స్వభావం ఈ కింది విధంగా ఉండాలి. వీటికి ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి.<br>♦ విశ్లేషణాత్మకంగా.<br>♦ అభిప్రాయాన్ని తెలిపేదిగా.<br>♦ వ్యాఖ్యానించేలా.<br>♦ సారాంశాన్ని తెలిపేలా.<br>♦ తగిన కారణాలతో సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాసే విధంగా<br>♦ తాను ప్రత్యక్ష భాగస్వామి అయినపుడు స్పందించే విధంగా<br>(పాఠాలలోని అభ్యాసాలలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వరాదు. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **ఆ) సృజనాత్మకత** | భాషా వ్యవహార రూపాలు | 3 | 2 | 5 | 2×5=10 | 10 | పాఠ్యపుస్తకంలో పొందుపరచిన సృజనాత్మక అంశాల ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలి. మూడు ప్రశ్నలు ఇస్తే రెండింటికి జవాబులు రాయాలి.<br>(వర్ణన / కథ / నాటిక / ఏకాంకిక / లేఖ / వ్యాసం / సంభాషణ / గేయం / కవిత / సూక్తులు / నినాదాలు / సన్మానపత్రం / కరపత్రం / ఇంటర్వ్యూ ప్రశ్నావళి.) |
| **III. భాషాంశాలు**<br>**అ) పదజాలం** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 18 | 18 | $2 \times 1 = 2$<br>$16 \times 1/2 = 8$ | 10 | 10 | అర్థాలు / పర్యాయ పదాలు / నానార్థాలు / వ్యుత్పత్తి అర్థాలు / ప్రకృతి వికృతులు మొ॥ వాటిని వాక్య ప్రయోగాల ద్వారా కాని లేదా పదాలుగా గాని ఇవ్వాలి. పైవాటిలో ఏవైనా ఐదు అంశాలకు చెందిన ప్రశ్నలు ఇవ్వాలి. ఇవి బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఇవ్వాలి. సొంతవాక్యాలు రెండు ఇవ్వాలి ($2 \times 1 = 2$) |
| **ఆ)వ్యాకరణాంశాలు** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 20 | 20 | $1/2$ | $20 \times 1/2 =$ 10 | 10 | ♦ సంధులు, సమాసాలు, ఛందస్సు, వాక్యాలు (సంశ్లిష్ట / సంయుక్త , కర్తరీ / కర్మణీ, ప్రత్యక్ష / పరోక్ష,, ఆధునిక వాక్యాలు), అలంకారాలు మొదలగువాటికి సంబంధించిన ప్రశ్నలు ఇవ్వాలి.<br>♦ వీటిని బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఇవ్వాలి. |

## ద్వితీయ భాష – తెలుగు (8, 9, 10 తరగతులు)

## సామర్థ్యాల వారీగా ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య, మార్కులు, స్వభావాలు

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| I. అవగాహన–ప్రతిస్పందన | అవగాహనను పరీక్షించడం | 3 | 3 | 1 × 5 = 5<br>1 × 5 = 5<br>1 × 10 = 10 | 20 | 20 | అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండాలి.<br>1. పరిచిత గద్యం<br>10వ తరగతిలో తప్పనిసరిగా ఉపవాచకం నుండి ఏదైనా ఒక పేరా ఇవ్వాలి. 8, 9 తరగతులకు పాఠ్యపుస్తకంలోని పేరా ఇవ్వాలి)<br>2. అపరిచిత గద్యం<br>అపరిచిత పద్యం / గేయం / కవిత<br>పై రెండింటిలో ఈ కింది విధంగా ఉన్న రూపాల నుండి ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయమనడం.<br>♦ తప్పొప్పులు గుర్తించుట.<br>♦ ఖాళీల పూరణ.<br>♦ కీలక పదాలను గుర్తించడం. మొ॥నవి.<br>♦ బహుళైచ్ఛిక ప్రశ్నలు<br>4. పరిచిత పద్యం (* గుర్తుకలవి మాత్రమే)<br>ఈ కింది వాటిలో ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ పద్యపాదాలను తారుమారుగా ఇచ్చి, వరుసక్రమంలో రాయడం.<br>♦ పద్యానికి భావం రాయడం.<br>♦ ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయమనడం. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **II. వ్యక్తీకరణ – సృజనాత్మకత**<br>**అ) స్వీయరచన** | లఘు ప్రశ్నలు (4–5 వాక్యాలు) | 4 | 4 | 4మా. | 4×4=16 | 32 | లఘు సమాధాన ప్రశ్నలలో పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. (వీటి నుండి 1 ప్రశ్న తప్పనిసరిగా కవి / రచయితల శైలి / ఉద్దేశ్యం / భావనలకు సంబంధించి ఇవ్వాలి.) |
| | వ్యాసరూప ప్రశ్నలు (10–12 వాక్యాలు) | 4 | 2 | 8 మా. | 2×8=16 | | వ్యాసరూప ప్రశ్నలలో విద్యార్థి తప్పనిసరిగా పద్య భాగం, గద్య భాగం నుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. అందుకొరకు ప్రతి భాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వబడ్డాయి.<br>దీనిలో ప్రశ్నల స్వభావం కింది విధంగా ఉండాలి. అవి ఆలోచించి, సొంతంగా రాసేలా ఉంటాయి.<br>♦ విశ్లేషణాత్మకంగా.<br>♦ అభిప్రాయాన్ని తెలిపేదిగా.<br>♦ వ్యాఖ్యానించేలా.<br>♦ సారాంశాన్ని తెలిపేలా.<br>♦ తగిన కారణాలతో సమర్థిస్తూ / విభేదిస్తూ రాసే విధంగా<br>♦ తాను ప్రత్యక్ష భాగస్వామి అయినప్పుడు స్పందించే విధంగా<br>(పాఠ్య పుస్తకాలలోని అభ్యాసాలలోని ప్రశ్నలను ఇవ్వకూడదు.) |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **ఆ) సృజనాత్మకత** | భాషా వ్యవహార రూపాలు | 3 | 1 | 8 | 1×8=8 | 8 | పాఠ్యపుస్తకంలో పొందుపరచిన సృజనాత్మక అంశాల ఆధారంగా ప్రశ్నలుండాలి. మొత్తం 3 ప్రశ్నలివ్వాలి. ఒకటి రాయాలి.<br>♦ లేఖ తప్పనిసరిగా ఇవ్వాలి.<br>♦ మిగతా రెండు ప్రశ్నలలో కింది వాటిలో ఏవైనా ఇవ్వవచ్చు.. కథ / వ్యాసం / గేయం / కవిత / సంభాషణ / కరపత్రం / సూక్తులు |
| **III. భాషాంశాలు**<br>**అ) పదజాలం** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 8<br>2 | 8<br>2 | 1<br>1 | 8 × 1 = 8<br>2 × 1 = 2 | 10 | అర్థాలు / పర్యాయ పదాలు / ప్రకృతి వికృతులు / నానార్థాలు / వ్యుత్పత్త్యర్థాలు వాటిని వాక్య ప్రయోగాల ద్వారా కాని లేదా పదాలుగా గాని ఇవ్వాలి. వీటిలో ఏదైనా ఐదు అంశాల ప్రశ్నలు ఇవ్వవచ్చు. సొంత వాక్యాలు 2 ఇవ్వాలి (2 × 1 = 2). మిగతావన్ని బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఇవ్వాలి. |
| **ఆ)వ్యాకరణాంశాలు** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 | 10×1=10 | 10 | భాషాభాగాలు / విభక్తి ప్రత్యయాలు / కర్తరీ , కర్మణీ / సంధులు / సమాసాలు / పురుషలు / చంధస్సు / అలంకారాలు / సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త వాక్యాలు మొదలగువాటి నుండి ఇవ్వాలి.<br>ఈ ప్రశ్నలను బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వాలి. |

# ప్రశ్నల రకాలు - వాటి ప్రాముఖ్యత

నూతన పాఠ్య పుస్తకాలతోపాటు పరీక్షా విధానం కూడా నూతనంగా ఉంటున్న సందర్భంలో ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు ఏయే రకంగా ఉంటాయి? అవే ఎందుకుండాలి? వాటివల్ల ఏం ప్రయోజనం? అనే ప్రశ్నలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం. ప్రశ్నపత్రాన్ని పాఠాలలోని విషయాధారిత ప్రశ్నల మాదిరిగా కాకుండా సామర్థ్యాల వారీగా ప్రశ్నలుంటాయి. అనేది మనం ప్రధానంగా గుర్తు పెట్టుకోవాల్సిన అంశం. మరి సామర్థ్యాల వారిగా ఉండే ప్రశ్నలు ఏయే రకాలుగా ఉంటాయో వాటి ప్రాముఖ్యత ఏంటో పరిశీలిద్దాం!

సామర్థ్యాల వారీగా ప్రశ్నలు :

**I. పఠనావగాహన ప్రశ్నలు**

**II. స్వీయరచన ప్రశ్నలు**

**III. సృజనాత్మక వ్యక్తీకరణ ప్రశ్నలు**

**IV. భాషాంశాల ప్రశ్నలు**

## I. పఠనావగాహన ప్రశ్నలు

పిల్లలు ధారాళంగా చదువగలగాలి. చదివిన అంశాన్ని అర్థం చేసుకోవాలి. దానిని వ్యక్తీకరించగలగాలి. పాఠశాల విద్యా పూర్తియ్యే సరికి పిల్లలు స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి. పఠనం ఒక అలవాటుగా మారాలి. ఇందుకొరకు పఠనావగాహన అనే సామర్థ్యాన్ని పొందుపరచారు.

దీనిలో ఉండే రకాలు

(i) పరిచిత గద్యం, పద్యం

(ii) అపరిచిత గద్యం, పద్యం

ఇవి విద్యార్థి పఠనావగాహనను తెల్సుకునేలా ఉంటాయి. విద్యార్థి తనకిచ్చిన పద్యాన్ని / గద్యాన్ని చదివి జవాబులు రాయగలగాలి. దీనివల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. ప్రాముఖ్యత / ప్రయోజనాలు :

- ధారాళంగా చదువడం.
- చదివిన అంశాలను అర్థం చేసుకోగల్గడం.
- చదివిన అంశాలను విశ్లేషించగల్గడం.
- గద్యం / పద్యం సారాంశాన్ని / భావాన్ని గ్రహించగలగడం.
- గద్యం / పద్యంలోని కీలక వాక్యాలు / పదాలను గ్రహించడం.
- సందర్భాన్నిబట్టి పదాల అర్థాలను గ్రహించడం.
- అవగాహన చేసుకొన్న అంశాలను వ్యక్తీకరించగలగడం.

ఇవి తెలుసుకోవటానికి పఠనావగాహన అనే ప్రశ్నలు ఉపయోగపడతాయి. ప్రశ్నల ద్వారా విభిన్న వ్యవహార రూపాలు చదవడం – వాటిపై అవగాహన పొందడం సమాధానాలు చెప్పడం / రాయడానికి ఉపయోగపడతాయి. ఇందుకొరకు పాఠ్యపుస్తకంలోని పాఠాల అభ్యాసాలలో ప్రశ్నలకు జవాబులు, ప్రశ్నల తయారీ, బహుళైచ్ఛిక ప్రశ్నలు, కీలక పదాలు గుర్తించుట, పట్టిక తయారు చేయడం వంటి రూపాలు చేర్చారు.

## II. స్వీయరచన ప్రశ్నలు

స్వీయరచన అనగా సొంతంగా, తార్కికంగా ఆలోచించి, అభిప్రాయాలను జోడించి, తనకు తెలిసిన పదజాలంతో స్పష్టమైన భావ వ్యక్తీకరణను లిఖిత రూపంలో వ్యక్తం చేయడం. ఈ రకమైన ప్రశ్నలు విద్యార్థిలో భాషా వ్యవహారాలను స్పష్టంగా తెలుపడానికి తోడ్పడుతాయి.

దీనిలో ఉండే ప్రశ్నలు :

(i) లఘు సమాధాన ప్రశ్నలు

(ii) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

### (i) లఘు సమాధాన ప్రశ్నలు

ఈ ప్రశ్నలకు జవాబులను ఐదు, ఆరు వాక్యాల్లో రాయాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలు పూర్తిగా విద్యార్థిని ఆలోచింపజేసే రకంగా ఉంటాయి.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- ♦ విద్యార్థి అంశం గురించి వివరించగలగడం.
- ♦ విషయాన్ని అర్థం చేసుకొని ఉదాహరణలివ్వగలగడం.
- ♦ సంక్షిప్త వ్యాఖ్యలు చేయగలగడం.
- ♦ ఒక విషయాన్ని సందర్భానికి అనుగుణంగా అన్వయించగలగడం.
- ♦ వాక్యాల్లోని కీలక భావాలు / కీలక వ్యాక్యాల్లోని భావాలు రాయగలగడం.
- ♦ వాక్యాల్లోని సందేశాలను / విలువలను గ్రహించగలగడం.
- ♦ సంక్షిప్తంగా విషయ వ్యక్తీకరణ సామర్థ్యం మొ॥నవి చేయుటకు ఉపయోగపడుతాయి.

### (ii) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

వీటిని పది నుండి పన్నెండు వాక్యాలు సమాధానంలో రాయాల్సి ఉంటుంది. ఇవి విద్యార్థిలోని వ్యక్తీకరణశక్తిని పూర్తిగా అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

**వీటి ప్రాముఖ్యత / ప్రయోజనాలు :**

- ♦ ఆలోచనా విధానం, మనోవైఖరులను వ్యక్తపరచగలగడం.
- ♦ వర్ణనా శక్తి, వివరించే శక్తి వృద్ధిచెందడం.
- ♦ హేతుబద్ధతగా ఆలోచించి, కారణాలు వివరించగలగడం.
- ♦ ఇష్టాయిష్టాలను తగిన కారణాలతో వ్యక్తపరచడం.
- ♦ ప్రతిస్పందిచడం, బహుకోణాల్లో విశ్లేషించడం, హేతుబద్ధంగా ఆలోచించడం వంటివి వ్యక్తపరచగలగడం.
- ♦ ఒక విషయాన్ని వివరంగా, తార్కికంగా, క్రమపద్ధతిలో వివరించగలగడం.

పైన తెల్పిన వ్యక్తీకరణ సామర్థ్యాలను అంచనావేయడం ద్వారా పిల్లల మనోవైఖరులను, ఆలోచనాశక్తిని, వ్యక్తీకరణశక్తిని, భాషావినియోగశక్తిని, పదజాలంపై ఉన్న పట్టును, సందర్భోచిత వినియోగశక్తిని అంచనావేయవచ్చు.

ఈ ప్రశ్నలకు సంబంధించిన మూల్యాంకన విషయంలో పిల్లల అభిప్రాయాలే ముఖ్య పాత్ర పోషించాలి. వారి అభిప్రాయాలకే విలువనివ్వాలి.

## III. సృజనాత్మక వ్యక్తీకరణ ప్రశ్నలు

ఈ సామర్థ్యం పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికితీసి భావి జీవితంలో భాషా ప్రయోజనాలను చేకూర్చడానికి ఉపయోగపడుతుంది. రకరకాల వ్యవహారాల రూపాల రచన చేయగలగాలి. ఒక వ్యవహార రూపాన్ని మరో వ్యవహార రూపంలోకి మార్చే శక్తి కలుగుతుంది.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- పిల్లల్లో ఉండే వ్యక్తీకరణల విభిన్నతలను తెలుసుకోవడానికి.
- వాళ్ళలో ఉండే సృజనాత్మకతను గుర్తించడానికి.
- రచనా విధానాన్ని గుర్తించి ప్రోత్సహించడానికి.
- తన దైనందిన జీవితంలో ఉపయోగించుకునేలా చేయడానికి.

సృజనాత్మక వ్యక్తీకరణ సామర్థ్యం కలిగిన పిల్లలు భవిష్యత్తులో స్వయం ఉపాధిమార్గాలను ఎన్నుకోగలుగుతారు. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి అవకాశం లభిస్తుంది. కవులు, కళాకారులు, సాహితీ విమర్శకులుగా ఎదగడానికి అవకాశంగల పిల్లల్ని గుర్తించి ప్రోత్సహించవచ్చు.

ఈ సమాధానాలు చదువుతున్నప్పుడు విద్యార్థి స్థాయిని దృష్టిలో పెట్టుకోవాలి గాని, ఉపాధ్యాయుడు తన దృష్టి / స్థాయితో ఆలోచించి చూడకూడదు. తప్పనిసరిగా విద్యార్థుల ఊహ, భావనాశక్తులను శైలులను గౌరవించి మూల్యాంకనం చేయాలి.

## IV. భాషాంశాలు

దీనిలో రెండు రకాల సామర్థ్యాలను పరీక్షిస్తాం.

(i) పదజాలం

(ii) వ్యాకరణాంశాలు

### (i) పదజాలం

భాషా వ్యక్తీకరణకు పదజాలం చాలా కీలకమైంది. ఈ పదజాలం వివిధ రూపాల్లో ఉంటుంది. ఏ రూపంలోని పదజాలాన్నైనా విద్యార్థి పొందాల్సి ఉంటుంది. అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి – వికృతులు, జాతీయాలు, సామెతలు మొ॥నవి ఇందులో భాగాలు.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- వివిధ సందర్భాలను బట్టి పదజాలాన్ని వినియోగించగలగాలి.
- పదాల స్థూల / రూఢి అర్థాలను తెలుసుకొని వినియోగించగలగాలి.
- జాతీయాలను వినియోగించగలగాలి.

### (ii) వ్యాకరణాంశాలు

ఇవి భాషా నిర్మాణంలో ఉన్న మెళకువలు, శైలులు, రీతులు మొ॥నవి తెలుసుకొని ప్రయోగించడానికి ఉపయోగించబడే రకంగా ప్రశ్నలుంటాయి. దీనిలో వాక్య భేదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సుకు సంబంధించినవి ఉంటాయి.

ప్రాముఖ్యత / ప్రయోజనం :

- వాక్య నిర్మాణ రకాలు తెలుసుకోవడానికి.
- భాషా నిర్మాణాన్ని గ్రహించడానికి.
- అలంకారిక శైలిని గుర్తించడానికి.
- పద్య ప్రక్రియా రచనలో ఉండే ఛందో వైవిధ్యాన్ని తెలుసుకోవడానికి.
- పద్యాల్లోని సంధులను, సమాసాలను గుర్తించగలగడం.

ఈ రకంగా ప్రశ్నల రకాలను – వాటి ప్రాముఖ్యత / ప్రయోజనాలపై పూర్తిగా అవగాహన కలిగిఉంటేనే తరగతిలో విద్యార్థులచే సామర్థ్యాల సాధన చేయించడం, మూల్యాంకనం సరిగా చేయడం మొదలగు విషయాలు ఉపాధ్యాయుడికి కరతలామలకం అవుతాయి.

సంస్కృతి సమిష్టి ఉత్పాదన అయితే, అనుభవాలు ప్రాతిపదిక కాలక్రమంలో సంచితమైనదైతే దాన్ని అర్థం చేసుకోగలం. దాన్నొక సంపదగా కూడా గుర్తించగలం. తప్పుడు ధోరణులు అందులో పొటమరించినా సర్దుకోగలం. సరిచేసుకోగలం.

కానీ సంస్కృతిని పని గట్టుకొని కొందరు పుట్టించిందయితే, ప్రచారంలోకి తెచ్చిందయితే ఎలా ఉంటుంది? దానిని మింగడం సులభమా? అనే ప్రశ్నలు వస్తాయి. ఎలా ఉన్నా, సులభమైనా కష్టమైనా మనచేత మింగించడానికి సకల ఏర్పాట్లు దీన్ని పుట్టించినవారే చేస్తారు. అందుకోసం నానా హంగామా వారు సృష్టిస్తారు. ఆఖరికి మనం అందులోంచి బయట పడలేనంతగా ఇరుక్కుపోతాం. బయటపడితే చెడిపోతామని, నష్టపోతామని జంకిపోతాం. ఒళ్ళంతా దీన్ని పూసుకొని వీర తాండవానికి పూనుకొంటాం.

ఇలాంటి సంస్కృతే వినిమయ సంస్కృతి . ఇప్పుడీ వినిమయ సంస్కృతే రాజ్యమేలుతోంది. మన మెదళ్ళని శాసిస్తోంది. మన జీవితాల్ని నడిపిస్తోంది. ఒక్కక్షణం ఆలోచింప నివ్వకుండా, మనల్ని వస్తుమయ ప్రపంచపు ధగధగల్లోకి లాక్కుపోతోంది. కళ్ళు బైర్లు కమ్మిస్తోంది. కలల లోకంలో కాపురం చెయ్యమంటోంది.

దురదృష్టవశాత్తు మన విద్య చుట్టూ సైతం ఒక సంస్కృతి అల్లుకొనిపోయింది. విద్యారంగపు సకల పార్శ్వాలపైనా ఇది చూస్తుండగానే దాడికి పూనుకొంది. ఈ దాడిలో విద్యావిలువలు మారిపొయ్యాయి. విద్యా ప్రయోజనాలు తారుమారయ్యాయి. అసలు విద్యే తానేమిటో తెలియనంతగా వికృతరూపాన్ని సంతరించుకొనింది. తెలుసుకోడం అంటే గుర్తుంచుకోడంగా, ప్రావీణ్యం అంటే ర్యాంకుల సాధనగా, జ్ఞానార్జన అంటే మార్కుల సంపాదనగా మారిపొయ్యాయి. దీనికనుగుణంగా బోధనలోనూ, ఉపాధ్యాయుడిలోనూ మార్పులొచ్చేశాయి, మంచి టీచరంటే మంచి మార్కులు తెప్పించేవాడు మాత్రమేననే భాష్యం వచ్చేసింది.

ఈ సంస్కృతిపై యుద్ధం చిన్నదేమీ కాదు. పునాదుల్ని కదిలించకుండా ఒట్టి సంస్కృతిపై యుద్ధం చెయ్యడం సాధ్యమూ కాదు.

అయినా మనిషి ఆలోచనాశీలి, తార్కికవాది. స్వభావతః అతడు భౌతికవాది. అదొక్కటే అతన్ని ఎన్ని సవాళ్ళొచ్చినా కాపాడేది. సాంస్కృతిక సవాళ్ళ నుంచీ అతణ్ణదే రక్షించి తీరుతుంది.

కొంత ఆలస్యం కావచ్చు. ఈలోగా చాలా నష్టమూ జరగొచ్చు. అంతే తప్ప, అంతిమ విజయం మాత్రం మానవ చైతన్యానిదే.

*– చదువు విజ్ఞానం*

# సంగ్రహణాత్మక మూల్యాంకనం

## ప్రథమ భాష - తెలుగు - మాదిరి ప్రశ్న పత్రం

| | |
|---|---|
| **తరగతి : 6వ** | **మార్కులు : 80** |
| **ప్రథమ భాష : తెలుగు** | **సమయం : 2.45 గం॥** |

**గమనిక: 1. మొదటి 15 ని॥ ప్రశ్నపత్రం చదివి అర్థం చేసుకోండి. మిగతా 2.30 గం॥ సమయంలో జవాబులు రాయండి.**
**2. అన్ని ప్రశ్నలకు జవాబులు సమాధాన పత్రంలోనే రాయాలి.**

## పార్ట్ - 'ఎ'

### I. ధారాళంగా చదువడం - అర్థం చేసుకొని ప్రతిస్పందించడం.

**1) కింది గద్యాన్ని చదువండి. తర్వాత ఇచ్చిన వాక్యాలలో తప్పొప్పులను గుర్తించండి. (5×1=5)**

డబ్బు వ్యాప్తిలోకి వచ్చాక గ్రామాల్లో వస్తువులను కొనుక్కోవడం మొదలయింది. కానీ అంతకు ముందయితే వస్తుమార్పిడి ఉండేది. ఎవరికి వారు తమతమ కులాలకు సంబంధించిన వస్తువులు తయారుచేసి, వాటిని ఇచ్చిన తమకు అవసరమైన వాటిని తీసుకునేవారు. ఈ కుల వృత్తులన్నీ వ్యవసాయానికి అనుబంధంగా ఉండేవి. రైతులకు కావలసిన నాగండ్లను, గొర్రులను ఇతర కర్రపనిముట్లను వడ్రంగివాళ్ళు తయారుచేసి ఇచ్చేవారు. కర్రు, కొడవలి, గడ్డపార, బండికమ్ములు మొదలైన ఇనుప వస్తువులను కమ్మరి వాళ్ళు తయారుచేసి ఇచ్చేవాళ్ళు. కుండ గురిగి, పటువ, కాగు, గూన మొదలైన మట్టి వస్తువులను కుమ్మరి వాళ్ళు తయారుచేసి ఇచ్చేవాళ్ళు. బంగారు నగలను అవుసుల వాళ్ళు తయారుచేసేవారు. మంగలి వాళ్ళు సవరం పని చేస్తే; పద్మశాలి వాళ్ళు బట్టలు నేసేవారు. మేదరివాళ్ళు, ఎరుకలవాళ్ళు తట్ట బుట్టలను అల్లేవారు.

అ) వస్తువులను కొనుక్కోవడం అనేక యుగాల నుండి వాడుకలో ఉన్నది. ( )
ఆ) కర్రవస్తువుల్లో వడ్రంగి వాళ్ళు తయారుచేసి ఇచ్చే వాళ్ళు. ( )
ఇ) వ్యవసాయానికి కులవృత్తులకు అసలు సంబంధం లేదు. ( )
ఈ) కుండ, గురిగి, పటువ, కాగు కమ్మరివారు తయారుచేస్తారు. ( )
ఉ) అవుసుల వాళ్ళు బంగారం పని చేసే వాళ్ళు. ( )

**2) కింది పద్యం చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి. (5×2=10)**

ఆ.వె॥ అనగననగ రాగ మతిశయిల్లుచునుండు
తినగ తినగ వేము తీయనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినురవేమ!

అ) గానశక్తి ఎప్పుడు పెరుగుతుంది?
ఆ) పద్యంలో 'భూమి' అనే అర్థాన్నిచ్చే పదం ఏది?
ఇ) ఈ పద్యం ఏ శతకంలోనిది?
ఈ) 'ప్రయత్నం' అనే పదానికి సమానమైన మాటను గుర్తించండి.
ఉ) ఈ పద్యానికి మకుటమేది?

**3) కింది పద్యాలలో ఏవైనా ఒక పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించండి. (1×5=5)**

నిన్నటిదాక .......... పాలయి పోదె మేఘమా!

## II. స్వీయరచన

**1) లఘు సమాధాన ప్రశ్నలు. (4×4=16)**

*** కింది ప్రశ్నలకు ఐదారు వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) "మంచి గుణాలు అలవడాలంటే మంచి వారితో స్నేహం చెయ్యాలి" ఎట్లాగో వివరించండి.

ఆ) చెట్లను పెంచడంవల్ల ఏయే ప్రయోజనాలున్నాయి?

ఇ) పల్లాదుర్గయ్య గూర్చి మీకు తెలిసింది రాయండి.

ఈ) మంచి స్నేహితులుంటే ఆపదల నుండి బయటపడవచ్చని స్నేహబంధం పాఠంద్వారా ఎలా నిరూపించవచ్చా?

**2) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు. (2×8=16**

*** కింది వాటిలో ప్రతిభాగం నుండి ఒక ప్రశ్నకు పదివాక్యాల్లో జవాబులు రాయండి.**

అ) ఉడుత సాయం పాఠం సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

(లేదా)

"చీమలను చూసి మానవ సమాజం చాలా నేర్చుకోవాలి" దీనిని సమర్థించండి.

ఆ) 'ఊరు బాగుండాలంటే చెరువు బాగుండాలి' ఎలాగో విశ్లేషించండి.

(లేదా)

బాలవద్దిరాజు ధైర్యసాహసాలు గలవాడని నీవెలా చెప్పగలవు?

## III. సృజనాత్మకత

**కింది వాటిలో ఏదైనా ఒక ప్రశ్నకు జవాబు రాయండి. (1×8=8)**

1) మీరు చూసిన చారిత్రక ప్రదేశం / కట్టడం / గ్రామం / నగరం విశేషాలు వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

2) తల్లిదండ్రులు లేదా గురువు గొప్పదనాన్ని తెలిపేలా చిన్న గేయం రాయండి.

3) మీరు, మీ బాల్యమిత్రుడు అనుకోకుండా ఒక జాతరలో కలిశారు. మీమధ్య సంభాషణ ఎలా కొనసాగిందో రాయండి.

# పార్ట్ - 'బి'

## I. పదజాల వినియోగం

**కింది ప్రశ్నలకు సరైన సమాధానాన్ని గుర్తించి జవాబు పత్రంలో రాయండి. (10×1=10)**

1) పసిడి ధర రోజురోజుకూ పెరుగుతున్నది. (గీతగీసిన మాటకు అర్థాన్ని గుర్తించండి). ( )

అ) రాగి ఆ) వెండి ఇ) కంచు ఈ) బంగారం

2) కృషికులు లేకుంటే దేశాభివృద్ధి లేదు. (గీతగీసిన మాటకు అర్థాన్ని గుర్తించండి). ( )

అ) సైనికులు ఆ) రైతులు ఇ) వ్యాపారులు ఈ) నాయకులు

3) అమ్మవారికి బోనం తీసుకెళ్ళారు. (గీతగీసిన మాటకు ప్రకృతి పదాన్ని గుర్తించండి.) ( )

అ) తీర్థం ఆ) మాణిక్యం ఇ) భోజనం ఈ) పానకం

4) ఆకాశం చుక్కల్తో మెరుస్తున్నది. (గీతగీసిన మాటకు వికృతి పదాన్ని గుర్తించండి.) ( )

అ) ఆకసం ఆ) యకాశం ఇ) ఆకశం ఈ) ఆకాసం

5) చేసిన మేలు మరువరాదు. (గీతగీసిన పదానికి వ్యతిరేక పదం గుర్తించండి.) ( )

అ) కీడు ఆ) హాయి ఇ) కష్టం ఈ) కీర్తి

6) కారు, స్కూటరు, సైకిలు, లారీ (ఈ పదాల్లో భిన్నమైన దానిని గుర్తించండి.) ( )

అ) కారు ఆ) స్కూటరు ఇ) పడవ ఈ) లారీ

7) గెలిచిన వీరుడు విజయ బావుటా నెగురవేశాడు. (గీతగీసిన మాటకు పర్యాయపదాలను గుర్తించండి.) ( )

అ) జెండా, దీపం ఆ) జెండా, పతాకం ఇ) పతాకం, రథం ఈ) పతాకం, గద

8) వర్షాలుపడి వంతెన కొట్టుకుపోయింది. (గీతగీసిన పదానికి నానార్థాలు గుర్తించండి.) ( )

అ) సేతువు, వారధి ఆ) వారధి, ప్రవాహం ఇ) సేతువు, పడవ ఈ) అలుగు, సేతువు

9) హనుమంతుడు భక్తితో నమస్కరించాడు. (గీతగీసిన పదానికి వికృతిని గుర్తించండి.) ( )

అ) బక్కిత్తి ఆ) భక్తి ఇ) బత్తి ఈ) భత్తి

10) మంచి మార్కులు వచ్చినందుకు సంతసంగా ఉంది. (గీతగీసిన మాటకు ప్రకృతిని గుర్తించండి. ( )

అ) సంబరం ఆ) సంతోషం ఇ) సంతృప్తి ఈ) సంకటం

## II. భాషను గురించి తెలుసుకుందాం!

**కింది ప్రశ్నలకు సరైన జవాబును గుర్తించి సంకేత అక్షరాన్ని ( ) లో రాయండి. (10×1=10)**

1) "వలన, కంటె, పట్టి" అనేవి ________________ విభక్తీ ప్రత్యయాలు.

అ) ద్వితీయ ఆ) పంచమి ఇ) ప్రథమ ఈ) సప్తమి

2) త్ + య్ + అ ధ్వనులను కలిపి రాస్తే ఏర్పడే సంయుక్తాక్షరం ________________.

అ) త్యి ఆ) త్య ఇ) త్యు ఈ) త్యా

3) 'అమ్మ మరియు నాన్న' సమాసపదంగా మార్చి రాస్తే ________________.

అ) అమ్మన్న ఆ) నానమ్మ ఇ) అమ్మా నాన్నలు ఈ) అమ్మకు నాన్న

4) అయ్యో! అలా జరిగిందా! గీతగీసిన మాట ఏ భాషాభాగం? ________________.

అ) నామవాచకం ఆ) సర్వనామం ఇ) విశేషణం ఈ) వ్యయం

5) అతడు + ఎక్కడ కలిపిరాస్తే ________________.

అ) అతడిక్కడ ఆ) అతడు ఎక్కడ ఇ) అతడెక్కడ ఈ) అతడుక్కడ

6) అతడు గంగానది ________________ స్నానం చేశాడు. (సరైన విభక్తి ప్రత్యయంతో ఖాళీపూరించండి.)

అ) లో ఆ) పై ఇ) మీద ఈ) కింద

7) పేర్లకు బదులుగా ఉపయోగించేది ________________.

అ) క్రియ ఆ) నామవాచకం ఇ) విశేషణం ఈ) సర్వనామం

8) రమ్య <u>వీణ</u> వాయిస్తున్నది. (గీత గీసిన పదం ఏ లింగానికి చెందింది?) ________________.

అ) నపుంసక ఆ) పురుష ఇ) స్త్రీ ఈ) ఏదీకాదు

9) 'కృష్ణార్జునులు' సమాసపదానికి విగ్రహవాక్యం రాయండి. సమాసం పేరు గుర్తించండి. ________, ________

అ) కృష్ణుడు, అర్జునుడు ఆ) కృష్ణుడికి అర్జునుడు

ఇ) అర్జునుడికి కృష్ణుడు ఈ) ఏదీకాదు

10) ఆమె <u>ముఖారవిందం</u> వెలిగిపోతున్నది గీత గీసిన పదాన్ని విడదీసి రాయండి. ________________.

అ) ముఖ + అరవిందం ఆ) ముఖ + ఇరవిందం

ఇ) ముఖ అరవిందం ఈ) ఏదీకాదు

# నమూనా ప్రశ్నాపత్రాలు

## మాదిరి ప్రశ్నాపత్రం

## ప్రథమభాష - తెలుగు - 10వ తరగతి

## మొదటి పేపర్ - పార్ట్స్ - ఎ మరియు బి

**సమయం : 2.45 గం.లు** **మార్కులు : 40**

## పార్ట్ - ఎ

**సమయం : 2.15 గం.లు** **మార్కులు : 30**

**గమనిక : మొదటి 15 ని.లు ప్రశ్నపత్రం చదువండి. అర్థం చేసుకోండి. మిగతా 2 గం.ల సమయంలో జవాబులు రాయండి.**

**I. స్వీయరచన (30 మార్కులు)**

(అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి. 4 × 3 = 12

1. 'తెలంగాణ వీరులను కన్న భూమి' దీన్ని సమర్థించండి.
2. 'చదువు మానవాళికి జ్ఞానాన్నిస్తుంది' దీనిపై మీ అభిప్రాయాన్ని రాయండి.
3. 'ఏకలవ్య శిష్యుడు' అంటే మీకేమి అర్థమైందో వివరించండి.
4. అలిశెట్టి ప్రభాకర్ కవితా శైలి గురించి రాయండి.

(ఆ) కింది వాటిలో ప్రతిభాగం నుండి ఒక ప్రశ్నకు కనీసం పది వాక్యాల్లో జవాబులు రాయండి. 3 × 6 = 18

5. 'బలి చక్రవర్తి గొప్పదాత' ఎట్లాగో వివరించండి.

లేదా

'కోపం అనేక అనర్థాలకు మూలం' దీన్ని సమర్థిస్తూ రాయండి

6. కొత్తబాట పాఠం చదివారు కదా! నేటి పల్లె స్థితిగతులు ఎట్లా ఉన్నాయో మీ సొంతమాటల్లో రాయండి.

లేదా

గోలకొండపట్టణం సకలసంపదలతో తులతూగిందని నీవెలా చెప్పగలవు?

7. 'అన్నదమ్ముల అనుబంధానికి రామలక్ష్మణులు ప్రతీక' దీనిని సమర్థిస్తూ రాయండి.

లేదా

హనుమంతుడు కార్యసాధకుడని ఎట్లా చెప్పగలవు?

# పార్ట్ - బి

అ) కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి. $2 \times 1 = 2$

1. చిత్తశుద్ధి :
2. ధ్యాస :

ఆ) సరైన సమాధానం గుర్తును (A/B/C/D) బ్రాకెట్లలో రాయండి. $16 \times 1/2 = 8$

3. సౌదామిని అనగా ( )
   A) పిడుగు B) మెరుపు C) ప్రవాహం D) భవనం
4. పాడుబడిన కోటగోడల్లో బండజింకలు నివాసమేర్పరుచుకున్నాయి. గీతగీసిన పదానికి అర్థం ( )
   A) లేళ్ళు B) సాలీళ్ళు C) గబ్బిలాలు D) తేళ్ళు
5. 'పతి' అనే పదానికి పర్యాయపదాలు ( )
   A) ధవుడు, పతి, బ్రహ్మ B) శివుడు, భర్త, రాజు
   C) భర్త, ధవుడు, నాథుడు D) నాథుడు, చంద్రుడు, భర్త
6. బంగారం ధర అమాంతం పెరిగింది. గీతగీసిన పదానికి పర్యాయపదాలు ( )
   A) ఇత్తడి, పుత్తడి, పైడి B) పుత్తడి, మత్తడి, పసిడి
   C) స్వర్ణం, చిత్తడి, పైడి D) పుత్తడి, పసిడి, స్వర్ణం
7. పోతన కైతజనరంజకంగా ఉంటుంది. ఈ వాక్యంలో 'కైత' అనే పదానికి ప్రకృతిపదం ( )
   A) కత్తి B) కుత్తక C) కవిత D) పద్యం
8. హనుమతంతుని హృదయం నిండా శ్రీరాముడే. గీతగీసిన పదానికి వికృత పదం ( )
   A) ఎద B) హృది C) ఉదయం D) మది
9. 'వర్షం' అనే పదానికి నానార్థాలు ( )
   A) వాన, వరద, దేశం B) వాన, సంవత్సరం, వాగు
   C) సంవత్సరం, ప్రవాహం, వాన D) వాన, దేశం, సంవత్సరం
10. 'భాగీరథి' అనే పదానికి వ్యుత్పత్తి అర్థం ( )
    A) భాగ్యమును కల్గించునది B) రథమును నడిపించునది
    C) భగీరథునిచే తీసుకొని రాబడినది D) భగీరథుని యొక్క రథం

11. 'అజ్ఞానాంధకారాన్ని తొలగించేవాడు' అనే వ్యుత్పత్తికి సమానమైన పదం ( )

A) సూర్యుడు B) గురువు C) ఈశ్వరుడు D) చంద్రుడు

12. పాలకుడు, చంద్రుడు, ఇంద్రుడు అనే నానార్థాలనిచ్చే పదం ( )

A) బ్రహ్మ B) విష్ణువు C) రాజు D) దైవం

13. 'పోషాకులు' అనే పదానికి అర్థం ( )

A) తమలపాకులు B) మామిడి ఆకులు

C) పెళ్ళిబట్టలు D) తలంబ్రాలు

14. 'జలధి' పదానికి పర్యాయపదాలు ( )

A) వాగు, సముద్రం B) సముద్రం, వార్ధి

C) నీరు, పాలసముద్రం D) కెరటం, అల

15. 'విభావళి' అనగా ( )

A) వెన్నెలకాంతి B) కాంతులవరుస C) సూర్యకాంతి D) సన్నని కాంతిరేఖ

16. దేవాలయం వద్ద సంవత్సరానికోసారి ఉత్సవాలు జరుగుతాయి. గీతగీసిన పదానికి సమానార్థ పదాలు ( )

A) కోవెల, సదనం B) మందిరం, భవనం

C) గుడి, గోపురం D) కోవెల, మందిరం, గుడి

17. విద్య పంచితే పెరుగుతుంది. గీత గీసిన పదానికి వికృతి పదం ( )

A) వెజ్జు B) విద్యా ౖ) విద్దె D) మిద్దె

18. 'జోదులు' అనే పదానికి వికృతి పదం ( )

A) జోడులు B) యోధులు C) జవ్వాజి D) గోధుమలు

# మాదిరి ప్రశ్నపత్రము

## ప్రథమభాష - తెలుగు

### రెండవ పేపర్ - పార్ట్స్ - ఎ మరియు బి

సమయం : 2.45 గం.లు　　　　　　　　　　　　　　　　　　మార్కులు : 40

## పార్ట్ - ఎ

సమయం : 2.15 గం.లు　　　　　　　　　　　　　　　　　　మార్కులు : 30

గమనిక : మొదటి 15 ని.లు ప్రశ్నపత్రం చదువండి. అర్థం చేసుకోండి. మిగతా 2 గం.30 ని॥ల సమయంలో జవాబులు రాయండి.

I. అవగాహన - ప్రతిస్పందన (చదువడం - అవగాహన చేసుకోవడం)

(అ) కింది పేరాను చదివండి. ఖాళీల్లో సరైన వాక్యాలు రాయండి.　　　　　　　　5 × 1 = 5

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణ కథా ప్రసంగంలో ఉన్నాడు. అంతలో శూర్పణఖ అనే రాక్షసి వచ్చింది. ఈమె రావణాసురుని చెల్లెలు. శ్రీరాముని సౌందర్యానికి ముగ్ధురాలయ్యింది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపి తింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళన్నాడు. లక్ష్మణుడు తాను అన్నదాసుడనని, తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సి వస్తుందని అందుకే శ్రీరాముని చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరాముని వైపు తిరిగింది. సీత వల్లనే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడుకి పోయింది. సీతాదేవిని అడ్డుతొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

1. పై పేరాకు తగిన శీర్షిక : ....................................................................................
2. పురాణ కథా ప్రసంగం అంటే ..........................................................................
3. శూర్పణఖ సీతపై దాడిచేయడానికి కారణాలు ...................................................
4. లక్ష్మణుడు శూర్పణఖను నిరాకరిస్తూ చెప్పిన కారణం ........................................
5. 'దాస్యం చేయడం' అంటే ...................................................

(ఆ) కింది పేరాను చదవండి. పట్టికలో సరైన పదాలు రాయండి　　　　　5×1=5

ఏకశిలా నగరాన్ని రాజధానిగా చేసుకొని తెలుగు నేలను వైభవ స్థితిలో నిలిపిన కాకతీయ రాజుల్లో చివరివాడు రెండవ ప్రతాపరుద్రుడు. అతడు ఉత్తమ పరిపాలకుడే మాత్రమే కాదు. మానవధర్మాన్ని, కళామర్మాన్ని ఎరిగిన సాహితీమూర్తి. సంస్కృతాంధ్రభాషల్లో అనుపమానపాండిత్యాన్ని సొంతం చేసుకున్న

సత్కవీంద్రుడు. సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన, శిల్పకళలకు ఇతోధిక ప్రాధాన్యతనిచ్చి, వాటి విస్తృతికి విశేష సహకారమందించిన రసహృదయుడు, సహృదయుడు. ఎంతటి మహోన్నతులకైనా చంద్రునిలో మచ్చలా ఏవో బలహీనతలుంటాయి. వేట ప్రతాపరుద్రుని బలహీనత. క్రమం తప్పకుండా వేట వినోదాన్ని ఆస్వాదించేవాడు. ఆ వ్యసనం నుండి మహారాజును దూరం చేయాలని ఎంతగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాడు మంత్రి యుగంధరుడు.

**పై పేరా ఆధారంగా**

| | | |
|---|---|---|
| 1. | ఏకశిల రాజు | |
| 2. | ప్రతాపరుద్రుని గుణగణాలు | |
| 3. | ప్రాధాన్యత కలిగిన కళలు | |
| 4. | బలహీనతలు. | |
| 5. | పేరాకు తగిన శీర్షిక | |

(ఇ) కింది పద్యాల్లో ఒక పద్యానికి ప్రతిపదార్థం రాయండి. 1 × 5 = 5

11. మ. నిరయంబైన, నిబంధమైన, ధరణీనిర్మూలనంబైన, దు
ర్మరణంబైన గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్ము పో;
హరుడైనన్, హరియైన, నీరజభవుండభ్యాగతుండైన నౌ;
దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా ! ధీవర్య! వేయేటికిన్ ?

లేదా

ఉ. వేదపురాణశాస్త్ర పదవీ నదవీయసియైన పెద్దము
త్తైదువ కాశికానగర హాటకపీఠ శిఖాధిరూఢ య
య్యాదిమ శక్తి సంయమివరా! యిటు రమ్మని పిల్చె హస్తసం
జ్ఞాదరలీల రత్నఖచితాభరణంబులు ఘల్లు ఘల్లనన్.

ఈ) కింది పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి. 5×1=5

కం. ఇందుగలడందులేదని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే.

12. సర్వోపగతుడు ఎవరు?

13. చక్రి ఎక్కడెక్కడున్నాడు ?

14. దానవాగ్రణి అనే పదానికి అర్థం ఏమిటి?

15. ఈ పద్యానికి శీర్షికను సూచించండి.

16. ఎందెందు వెదకి చూచిన అందందే గలవాడు ఎవడు?

II. సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)

అ) కింది వానిలో ఏవైనా రెండింటికి జవాబులు రాయండి. 2×5=10

17. మీ ఊరి అందాన్ని గురించి లేదా ప్రత్యేకతను తెలిపేలా 10 పంక్తుల్లో కవిత రాయండి

18. దానగుణం యొక్క విశిష్టతను తెలియజెప్పే విధంగా బలిచక్రవర్తి ఏకాపాత్రాభినయానికి మాటలు రాయండి.

19. నదులను కాలుష్యం నుండి కాపాడాలని ప్రజలను చైతన్యపరిచేలా కరపత్రం తయారుచేయండి.

మాదిరి ప్రశ్నపత్రము

# ప్రథమభాష-తెలుగు

## పార్ట్ - బి

సమయం:30 ని.లు | మార్కులు : 10

**సూచన:** సరైన సమాధానం గుర్తును (A/B/C/D) బ్రాకెట్లలో రాయండి. $20 \times {}^{1}/_{2} = 10$

1. భావోద్వేగం - ఇది ఏ సంధి? ( )

   A) సవర్ణదీర్ఘసంధి B) ఉత్వసంధి C) గుణసంధి D) వృద్ధిసంధి

2. రుగాగమసంధికి ఉదాహరణ ( )

   A) గుణవంతురాలు B) చేవ్రాలు C) తలంబ్రాలు D) పావురాలు

3. 'మనుషులు + అంతా' పూర్వ పరస్వరాలు వరుసగా ( )

   A) లు+ఉ B) అ+ఉ C) అ+అం D) ఉ+అ

4. 'రమ్యోద్యానము' అనే పదాన్ని విడదీస్తే ( )

   A) రమ్య+ఉద్యానము B) రమ్యా+ఉద్యానము

   C) రమ్యో+ద్యానము D) రమ్మో+ఉద్యానము

5. 'ప్రధానద్వారాలు' అనేది ( )

   A) విశేషణపూర్వపదకర్మధారయసమాసం B) సంభావనాపూర్వపదకర్మధారయ సమాసం

   C) ఉపమానపూర్వపదకర్మధారయసమాసం D) విశేషణా ఉత్తరపదకర్మధారయసమాసం

6. కిందివాటిలో రూపకసమాసానికి ఉదాహరణ ( )

   A) యువతీయువకులు B) గరుడవాహనుడు

   C) ముక్కంటి D) మానధనులు

7. 'నాలుగురోడ్ల కూడలిలో ఏమది?' అ వాక్యంలో గీతగీసిన పదం ( )

   A) ద్వంద్వసమాసం B) ద్విగుసమాసం

   C) షష్ఠీ తత్పురుష సమాసం D) విశేషణ ఉత్తరపదకర్మధారయసమాసం

8. 'ఆనందోత్సాహాలు' అనే దానికి సరైన విగ్రహ వాక్యం ( )
   A) ఆనందమైన ఉత్సాహాలు B) ఆనందముచేత ఉత్సాహాలు
   C) ఆనందము కొరకు ఉత్సాహాలు D) ఆనందమూ, ఉత్సాహమూ

9. 'తారలు దిగి వచ్చి తారాడినట్లు' అనే వాక్యంలో ఉన్న అలంకారం ( )
   A) రూపకాలంకారం B) అతిశయోక్తి అలంకారం
   C) స్వభావోక్తి అలంకారం D) శ్లేషాలంకారం

10. వృత్త్యనుప్రాసాలంకారంలో ( )
   A) ఒకే వర్గం అక్షరాలు వస్తాయి
   B) ఒకే అక్షరం మాటి మాటికి వస్తుంది.
   C) అక్షరాల జంట మాటిమాటికి వస్తుంది
   D) వాక్యాల చివర్లో ఒకే రకమైన అక్షరం ఉంటుంది.

11. ఏదైనా విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించి చెప్తే .... అది ( )
   A) ఛేకానుప్రాసాలంకారం B) అతిశయోక్తి అలంకారం
   C) రూపకాలంకారం D) స్వభావోక్తి అలంకారం

12. కింది వాటిలో ఉపమాలంకారానికి ఉదాహరణ ( )
   A) మంచివాని గుణాలు పూలవాసనవలె తమంతట తామే వ్యాపిస్తాయి
   B) అంతటా జ్ఞానజ్యోతులు ప్రకాశించాలి
   C) ఆ శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి
   D) దిక్కులన్నీ ఇంద్రధనస్సుతో సయ్యాటలాడినట్లుగా ఉంది.

13. 'అనవుడు' నల్ల నవ్వి కమలాసన యిట్లను లెస్సగాక, యో'
   అనే పద్యపాదం ఏ వృత్తానికి చెందినది? ( )
   A) ఉత్పలమాల B) చంపకమాల C) శార్దూలం D) మత్తేభం

14. శార్దూలవృత్తములో వచ్చే గుణాలు వరుసగా ( )
   A) నజభజజజర B) భరనభభరవ C) మసజసతతగ D) సభరనమయవ

15. 'అనిదం పూర్వ యశస్వియాతడగు నన్నా విశ్వనాథేశ్వరా!'
   అనే పాదంలో గీత గీసిన పదం ఏ గణం? ( )
   A) భగణం B) రగణం C) మగణం D) యగణం

16. ఉత్పలమాల యొక్క యతి స్థానం ( )

A) 14వ అక్షరం B) 11వ అక్షరం C) 13వ అక్షరం D) 10వ అక్షరం

17. 'రాము అన్న తిన్నాడు' అనే వాక్యాన్ని కర్మణి వాక్యంగా రాస్తే ( )

A) రాము అన్నం చేత తిన్నాడు B) రాము అన్నంచేత తినబడ్డాడు

C) రాము చేత అన్నం తినబడింది D) రాము చేత అన్నం తిన్నాడు.

18. కింది వాటిలో ప్రత్యక్ష కథనంలో ఉన్న వాక్యం ( )

A) విద్యార్థులను తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యతని అబ్దుల్ కలాం అన్నాడు

B) సూర్యుడస్తమిస్తున్నాడు కనుక తను రాలేనని వ్యాసుడన్నాడు

C) "తాతా! ఇగవటు నీపాను, జర్దీడబ్బీ' అని లావణ్య అన్నది.

D) సంయమీంద్రుణ్ణి ఇటు రమ్మని పిలిచింది ముత్తైదువ.

19. 'స్వీయరాష్ట్రం సిద్ధించింది. జాతి సర్వతోముఖాభివృద్ధి కోసం పాటుపడవలసి ఉంది'
ఈవాక్యాలను సంయుక్త వాక్యాలుగా మారిస్తే ( )

A) స్వీయరాష్ట్రం సిద్ధించింది మరియు జాతి సర్వతోముఖాభివృద్ధి కోసం పాటుపడవలసి ఉంది.

B) స్వీయరాష్ట్రం సిద్ధించింది కాని జాతి సర్వతోముఖాభివృద్ధి కోసం పాటువలసి ఉంది.

C) స్వీయరాష్ట్రం సిద్ధించింది కనుక జాతి సర్వతోముఖాభివృద్ధికోసం పాటుపవలసి ఉంది.

D) జాతి సర్వతో ముఖాభివృద్ధి కోసం పాటుపడవలసి ఉంది కనుక స్వీయరాష్ట్రం సిద్ధించింది.

20. 'కప్పగంతులవారు కర్ణసుందరి నాటకాన్ని అనువదించారు. నాటకాన్ని ప్రచురించారు.'
ఈ వాక్యాలను సంశ్లిష్టవాక్యంగా మారిస్తే ....... ( )

A) కప్పగంతులవారు కర్ణసుందరి నాటకాన్ని అనువదించారు మరియు నాటకాన్ని ప్రచురించారు.

B) కప్పగంతుల వారు కర్ణసుందరి నాటకాన్ని అనువదించారు. ప్రచురించారు.

C) కప్పగంతుల వారు కర్ణసుందరి నాటకాన్ని అనువదించి ప్రచురించారు.

D) కప్పగంతులవారు కర్ణసుందరి నాటకాన్ని ప్రచురించారు. అనువదించారు.

## మాదిరి ప్రశ్నపత్రం

# ద్వితీయభాష - తెలుగు

## పార్ట్స్ - ఎ మరియు బి

10వ తరగతి మార్కులు : 80

సమయం : 3.15 గం.లు

## పార్ట్ - ఎ

**గమనిక :** మొదటి 15 ని.లు ప్రశ్నపత్రం చదువండి. అర్థం చేసుకోండి. మిగతా 3 గం.ల సమయంలో జవాబులు రాయండి.

I. అవగాహన - ప్రతిస్పందన (20 మార్కులు)

1. కింది పేరాను చదువండి. దీని ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి. 5×1=5

ఉస్మానియా యూనివర్సిటిలో చదువుతున్నప్పుడే కవిగా, నాటక రచయితగా, నటుడిగా పేరుపొందాడు. బెర్నార్డు షా నాటకానికి 'హోష్‌కెనా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ రాసి హైదరాబాదులో రవీంద్రనాథ్ ఠాగూర్ ఎదుట ప్రదర్శించాడు. ఠాగూరు ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక ప్రదర్శన అయిపోగానే స్టేజి పైకి వెళ్ళి మఖ్దూంను అభినందించాడు. తన శాంతినికేతన్‌కు వచ్చి చదువుకోవలసిందిగా ఆహ్వానించాడు. ఇట్లా విశ్వకవి రవీంద్రుడినే మెప్పించిన ఘనత మఖ్దూంది.

అ) పై పేరాలో నాటక ప్రదర్శన చేసిందెవరు ?

ఆ) నాటకం చూసిన రవీంద్రుడేమి చేశాడు ?

ఇ) ఉర్దూ అనుసరణ నాటకం పేరేమిటి?

ఈ)రవీంద్రుడు శాంతినికేతనానికి ఎవరిని ఆహ్వానించాడు?

ఉ) మఖ్దూం ఘనత ఏమిటి?

2. కింది పద్యాలలో ఏదైనా ఒక పద్యానికి భావం రాయండి. 1×5=5

ఎప్పుడు సంపద కలిగిన
అప్పుడె బంధువులు వత్తురది యెట్లన్నన్
తెప్పలుగ చెరువు నిండిన
కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!

(లేదా)

బ్రతుకవచ్చుగాక బహుబంధనములైన
వచ్చుగాక లేమి వచ్చుగాక
జీవధనములైన జెడుగాక పడుగాక
మాట దెరుగలేరు మానధనులు

3. కింది పేరాను చదువండి తప్పొప్పులు (5, 3) గుర్తించండి. 5 × 2 = 10

భారత జాతీయోద్యమ నాయకులలో బిపిన్ చంద్రపాల్ ఒకడు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న సైబెల్‌లో జన్మించాడు. సహాయనిరాకరణ ఉద్యమానికి పిలుపునిచ్చాడు. దేశ స్వాతంత్ర్యం కోసం, అభ్యుదయం కోసం పాటుపడ్డాడు. కవులు, పండితులు, తత్త్వవేత్తలు, ప్రవక్తలు, నాయకులు, సాధారణ ప్రజలను అందరినీ ఆహ్వానించాడు. ఈ విధంగా దేశానికి సేవ చేయడానికి ఒక్కొక్కరు ఒక్కొక్క రంగాన్ని ఎంచుకొని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

అ) బిపిన్ చంద్రపాల్ జాతీయోద్యమ నాయకుడు ( )

ఆ) బిపిన్ చంద్రపాల్ సహాయనిరాకరణోద్యమానికి వ్యతిరేకి ( )

ఇ) కవులను పండితులను స్వాతంత్ర్యోద్యంలోకి ఆహ్వానించాడు. ( )

ఈ) బిపిన్ చంద్రపాల్ ప్రజల గుండెల్లో నిలిచి పోయాడు. ( )

ఉ) బిపిన్‌కు స్వాతంత్ర్యోద్యమ కాంక్షలేదు. ( )

**II.** స్వీయరచన (32 మార్కులు)

లఘుసమాధాన ప్రశ్నలు (16 మార్కులు)

అ) కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి. 4×4=16

4. కార్యనిర్వహణ సామర్థ్యం అంటే ఏమిటో తెలుపండి.

5. 'ఇల్లు అలుకగానే పండుగ కాదు'అంటే మీరేమి అర్థం చేసుకున్నారు?

6. పోతన గురించి రాయండి.

7. "మూర్ఖుల మనసు రంజింపరాదు". ఎందుకు?

ఆ) కింది వానిలో ప్రతి విభాగం నుండి తప్పనిసరిగా ఒక ప్రశ్నకు జవాబు రాయండి. 2×8=16

8. 'ఇతరులకు మేలు చేయడమే పరమధర్మం" దీనిని సమర్థిస్తూ రాయండి.

(లేదా)

'తెలంగాణ అభివృద్ధి' చెందాలంటే ఏమేమి జరగాలి. వివరించండి.

9. బకాసురుడి విందు పాఠంలో 'లీల' చేసిన పనిని సమర్థిస్తారా? ఎందుకు? వివరించండి.

లేదా

మతం అనేది ఐకమత్యానికి కృషి చేయాలి. ఎట్లాగో తెలుపండి.

III. సృజనాత్మక (8 మార్కులు)

అ) కింది ప్రశ్నలలో ఒకదానికి జవాబు రాయండి. 1×8=8

10. పిల్లలందరూ బడిలో చేరి చదువుకోవాలని తెలుపుతూ కొన్ని నినాదాలు రాయండి.

11. వరకట్న దురాచారాన్ని రూపుమాపాలని తెలుపుతూ 'కరపత్రం' రాయండి.

12. మీ పాఠశాలలో జరిగే 'కళాప్రదర్శన'కు అందరినీ ఆహ్వానిస్తూ ఒక ఆహ్వానపత్రం రాయండి.

## పార్ట్ - బి (20 మార్కులు)

I. పదజాలం (10 మార్కులు)

అ) కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి. 2 × 1 = 2

1. కృతజ్ఞత :

2. సాదాసీద

ఆ) కింది వానికి సరైన జవాబు గల సంకేతాక్షరాన్ని (A/B/C/D) గుర్తించి బ్రాకెట్టులో రాయండి.

3. వర్షం వల్ల నాపనికి ఆటంకం కలిగింది.... ఆటంకం అంటే .... ( )

A) ఆట B) అడ్డు C) ఒడ్డు D) అందం

4. తక్రము అనగా ( )

A) చల్ల B) చక్రం C) వేడి D) వక్రం

5. నాకు అధికంగా మార్కులు రావడంతో ఎక్కువ సంతోషం కలిగింది.

................ ఈ వాక్యంలో గల పర్యాయపదాలు ( )

A) ఎక్కువ, సంతోషం B) అధికం, రావడం

C) ఎక్కువ, అధికం D) సంతోషం, అధికం

6. గగనం ..... పర్యాయపదాలు ( )

A) ఆకాశం, నింగి B) ఆకాశం, భూమి C) నింగి, నేల D) నేల, భూమి

7. కొమ్మ....... నానార్థలు ( )

A) స్త్రీ, వనిత B) చెట్టుకొమ్మ, స్త్రీ C) చెట్టుకొమ్మ, కోతి D) వనిత, కొమ్ము

8. తొమ్మిది, కొత్త అనే అర్థాలు వచ్చే నానార్థ పదం ( )

A) యువ B) భవ C) నవ D) చేవ

9. పయోనిధి ..... వ్యుత్పత్త్యర్థం ( )

A) నీటికి నిధి వంటిది B) నీటికి అడ్డు

C) నీరు లేనిది D) నీటికి చేటు

10. విద్య ..... వికృతి పదం ( )

A) గద్దె B) వీధి C) విద్దె D) అద్దె

**వ్యాకరణం (10 మార్కులు)**

11. కార్తికేయ మహారాజు ధర్మాత్ముడు ..... గీత గీసిన పదం ఏ భాషాభాగం ( )

A) సర్వనామం B) నామవాచకం C) విశేషణం D) అవ్యయం

12. 'కొరకు, కై' అనే ప్రత్యయాలు కలిగిన విభక్తి ( )

A) చతుర్థీవిభక్తి B) పంచమీవిభక్తి C) షష్ఠీవిభక్తి D) సప్తమీవిభక్తి

13. నాలుగు + ఏండ్లు కలిపి రాస్తే ( )

A) నాలుగాండ్లు B) నాలుగోండ్లు C) నాలుగేండ్లు D) నాలుగండ్లు

14. భూతకాలానికి ఉదాహరణ ( )

A) ఊరువెళ్ళాను B) ఊరువెళ్తాను

C) ఊరుకు వెళ్ళను D) ఊరుకు పోతూ ఉన్నాను

15. మూడు చేపలు ..... సమాసం ( )

A) ద్విగు సమాసం B) ద్వంద్వసమాసం C) షష్ఠతత్పురుష D) కర్మధారయం

16. నారాయణరావు అల్మారా తెరిచాడు. ఉత్తరం తీసుకొన్నాడు......

సంక్షిప్త వాక్యం ( )

A) నారాయణరావు అల్మారా తెరిచాడు, ఉత్తరం తీసుకొన్నాడు

B) నారాయణరావు అల్మారా తెరిచి ఉత్తరం తీసుకొన్నాడు

C) నారాయణరావు ఉత్తరం తెరిచాడు. అల్మారా తీసుకొన్నాడు

D) నారాయణరావు అల్మారా తెరిచాడు మరియు ఉత్తరం తీసుకొన్నాడు.

17. పి.వి. నరసింహారావు విద్యామంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేశాడు.

..... ఇది ఏ వాక్యం ? ( )

A) సంశ్లిష్ట వాక్యం B) సంయుక్త వాక్యం

C) ఆశ్చర్యార్థక వాక్యం D) ప్రశ్నార్థక వాక్యం

18. రామేశ్వరం పదాన్ని విడదీసి రాస్తే ( )

A) రామే+శ్వరం B) రామ+ఈశ్వరం C) రా+మేశ్వరం D) రామ+ఐశ్వరం

19. ద్వంద్వ సమాసానికి ఉదాహరణ ( )

A) సీతారాములు B) రెండునెలలు C) మాభూమి D) తెలంగాణ రాష్ట్రం

20. నామవాచకానికి బదులుగా వాడబడేది ( )

A) విశేషణం B) క్రియ C) అన్వయం D) సర్వనామం

# కాంపోజిట్ తెలుగు - మార్గదర్శకాలు

- పదవతరగతి సాధారణ తెలుగు (eneral Telugu)) పాఠ్యపుస్తకంలో 12 పాఠాలున్నాయి. ఉపవాచకంగా రామాయణం ఉన్నది. దీనిని 100 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఈ 100 మార్కులలో ఓజు కు 20 మార్కులు, సమ్మేటివ్ పరీక్షకు 80 మార్కులు ఉన్నాయి.
- కాంపోజిట్ తెలుగులో సమ్మేటివ్ పరీక్షకు తెలుగు 60 మార్కులు, సంస్కృతం 20 మార్కులకు ఉంటాయి. వీటిని పేపరు -1, పేపరు - 2గా నిర్వహించాలి.
- కాంపోజిట్ తెలుగుకు సాధారణ తెలుగు (eneral Telugu))లో గల 12 పాఠాలలో 9 పాఠాలే ఉంటాయి. సాధారణ తెలుగులో ఉన్న ఎవరి భాష వాళ్ళకు వినసొంపు, గోలకొండ పట్టణము (గద్యపాఠాలు), మరియు భిక్ష (పద్యపాఠం), పాఠాలను కాంపోజిట్ తెలుగు విద్యార్థులు చదువనవసరం లేదు.
- అట్లాగే సంస్కృతం 20 మార్కులకు కాబట్టి 4 నుండి 6 పాఠాల వరకు ఉండవచ్చు.
- F.A. ను ఒక సంవత్సరాలంలో 4 సార్లు నిర్వహిస్తాం. వీటి సగటు మార్కులను SSC బోర్డుకు పంపిస్తాం. కాబట్టి మూడు F.A. లను తెలుగులో, చివరి 4వ F.A. ను సంస్కృతంలో నిర్వహించాలి.
- సంస్కృతంలో F.A. ను నిర్వహించేటప్పుడు పుస్తక సమీక్షకు 5 మార్కులకు, రాతపనిని 5 మార్కులకు, ప్రాజెక్టు పనిని 5 మార్కులకు, లఘు పరీక్షను 5 మార్కులకు నిర్వహించాలి.
- పుస్తక సమీక్షను తెలుగులో నిర్వహించిన విధంగానే ఏవైన కథలు / పాటలు/గేయాలు/వ్యాసాలు మొదలగు వాటి ఆధారంగా సమీక్ష రాయాలి. దీనికి 10 మార్కులు కేటాయించి 5కు తగ్గించి నమోదు చేయాలి. ఈ సమీక్షలో ప్రాథమిక వివరాలు, చదివిన అంశం, దాని గురించి అభిప్రాయం అనే శీర్షికలు ఉండాలి. సమీక్ష మొత్తం సంస్కృతంలోనే రాయాలి.
- సంస్కృత పాఠ్యపుస్తకంలో ప్రతిపాఠంలోని అభ్యాసాలకు పిల్లలు సొంతంగా జవాబులు రాయాల్సి ఉంటుంది. ప్రతిపాఠానికి రాతపనులకు 10 మార్కులు కేటాయించాలి. జనవరి నెల వరకు పూర్తి అయిన పాఠాల ఆధారంగా మొత్తం పాఠాల మార్కులను సగటు తీసుకొని 5కు కుదించి నమోదు చేయాలి.
- అట్లాగే ప్రాజెక్టుపని విషయంలో ఒక్కొక్క పాఠంలో ఇచ్చిన ప్రాజెక్టు పనిని ఆ పాఠం పూర్తి కాగానే చేయించవలసిన పనిలేదు. మొత్తం ప్రాజెక్టు పనులలో ఏదైనా ఒక ప్రాజెక్టు పనిచేస్తే సరిపోతుతంది. ప్రాజెక్టు పనిలో ప్రాథమిక వివరాలు, తెలుసుకొన్న లేదా సేకరించిన సమాచారం, ప్రాజెక్టు పని వల్ల కలిగిన ప్రయోజనం మొదలైన వివరాలు ఆయా శీర్షికలతో రాయాల్సి ఉంటుంది. దీనికి 10 మార్కులు కేటాయించి 5 మార్కులకు నమోదు చేయాలి.

- లఘు పరీక్షను కూడా తెలుగులో వలె 20 మార్కులకు నిర్వహించాలి. దీనిలో స్వీయరచన, సృజనాత్మకతకు చెందిన ఒక్కొక్క ప్రశ్న ఇవ్వాలి. అట్లే అవగాహన ప్రతిస్పందన, పదజాలం, వ్యాకరణాంశాలు నుండి ఏదైనా ఒక అంశానికి చెందిన ప్రశ్నలు ఇవ్వాలి. వీటిని 20 మార్కులకు నిర్వహించిన తరువాత 5 మార్కులకు కుదించి నమోదు చేయాలి.

## ప్రశ్నపత్రం - సామర్థ్యాల వారీగా భారత్వం

| తెలుగు (60 మార్కులు) సంస్కృతం | (20 మార్కులు) |
|---|---|
| I. అవగాహన ప్రతిస్పందన(15 మార్కులు)<br>♦ పరిచిత గద్యం (రామాయణం) 5 మార్కులు<br>♦ పరిచిత పద్యం -5మార్కులు<br>♦ అపరిచిత గద్యం / పద్యం -5 మార్కులు | I. అవగాహన ప్రతిస్పందన (4 మార్కులు)<br>♦ పరిచిత శ్లోకం (చుక్కగుర్తు గల శ్లోకం) శ్లోక పూరణ మరియు భావం<br>లేదా<br>పరిచిత గద్యం / అపరిచిత గద్యం |
| II. స్వీయరచన(24 మార్కులు)<br>♦ లఘుసమాధాన ప్రశ్నలు 3×3మా=9మా<br>♦ వ్యాసరూప సమాధాన ప్రశ్నలు 3 × 5మా = 15 మార్కులు | II. స్వీయరచన (8 మార్కులు)<br>♦ లఘు సమాధాన ప్రశ్నలు 2×2మా = 4 మార్కులు<br>♦ వ్యాసరూప సమాధాన ప్రశ్నలు -1×4మా = 4 మార్కులు |
| III. సృజనాత్మకత (6 మార్కులు)<br>4×6మా = 6మార్కులు | III. సృజనాత్మకత (4 మార్కులు)<br>1×4=4మార్కులు |
| IV. పదజాలం (8 మార్కులు)<br>♦ సొంతవాక్యాలు -2×1మా=2మార్కులు<br>♦ లక్ష్యాత్మక ప్రశ్నలు(బహుళైచ్ఛికప్రశ్నలు) -12×1/2మా = 6మార్కులు | IV. పదజాలం (2 మార్కులు)<br>♦ లక్ష్యాత్మక ప్రశ్నలు -4×1/2మా = 2మార్కులు |
| V. వ్యాకరణం (7 మార్కులు)<br>♦ లక్ష్యాత్మక ప్రశ్నలు (బహుళైచ్ఛికప్రశ్నలు)<br>♦ లక్ష్యాత్మక ప్రశ్నలు -4×1/2మా = 2మార్కులు<br>-14×1/2మా = 7మార్కులు | V. వ్యాకరణం (2 మార్కులు) |

# కాంపోజిట్ తెలుగు - ప్రశ్నల గురించి వివరణ

**I. అవగాహన ప్రతిస్పందన :** దీనిలో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి 1. పరిచితగద్యం 2. పరిచిత పద్యం 3. అపరిచిత గద్యం లేదా పద్యం. పరిచిత గద్యం రామాయణం నుండి మాత్రమే ఇవ్వాలి. పరిచిత పద్యం పాఠ్యపుస్తకంలో చుక్క గుర్తుగల పద్యాలు మాత్రమే అడగాలి. రెండు పద్యాలు ఇచ్చి ఏదైనా ఒక పద్యానికి ప్రతిపదార్థం రాయమని అడుగవచ్చు. లేదా రెండు పద్యాలు ఇచ్చి ఏదైనా ఒక పద్యాన్ని పూరించి భావం రాయమని అడుగవచ్చు. అయితే రెండు పద్యాలు ఇచ్చి ఒకదానికి ప్రతిపదార్థం, మరొక దానిని పూరించి భావం రాయమని అడుగరాదు. అపరిచిత గద్యం లేదా అపరిచిత పద్యం ఈ రెండింటిలో ఏదైనా ఒకటే అంశం ఇవ్వాలి. అపరిచిత పద్యం ఇచ్చేటప్పుడు చిన్న పద్యం ఇవ్వాలి. పద్యమే కాకుండా చిన్నగేయం, వచన కవిత కూడా ఇవ్వవచ్చు.

**II. స్వీయరచన :** దీనిలో రెండు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి 1. లఘుసమాధాన ప్రశ్నలు 2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు. తెలుగులో లఘుసమాధాన ప్రశ్నలు మూడు ఇవ్వాలి. అందులో ఒకటి పద్యభాగం, ఒకటి గద్యభాగం, మరొకటి పద్య/గద్య, కవి/రచయితకు సంబంధించిన ప్రశ్న ఉండాలి. ఈ విధంగా మూడు ప్రశ్నలుండాలి. వీటికి ఐదేసి వాక్యాల్లో జవాబు రాయాలి.

వ్యాసరూప సమాధాన ప్రశ్నలు పద్యభాగం, గద్యభాగం, ఉపవాచకం నుండి రెండేసి ప్రశ్నలు ఇవ్వాలి. వీటిలో తప్పనిసరిగా ఒక్కొక్క విభాగం నుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. పదేసి వాక్యాల్లో జవాబు రాయాల్సి ఉంటుంది.

**సూచన :** స్వీయరచన ప్రశ్నలు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలలో ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వరాదు.

**III. సృజనాత్మకత :** దీనిలో మూడు ప్రశ్నలు ఇవ్వాలి. ఒకదానికి మాత్రమే జవాబు రాయాల్సి ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ఇవ్వబడిన సృజనాత్మక వ్యవహార రూపాలు ఇవ్వాలి. ఎప్పుడూ ఒకే రూపం ఇవ్వకుండా వేరువేరు వ్యవహారరూపాలు అడిగేటట్లుగా ప్రశ్నలు ఉండాలి.

**సూచన :** పాఠ్యపుస్తకంలో అభ్యాసంలోని ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా అడుగరాదు.

**IV. పదజాలం :** దీనిలో రెండు సొంతవాక్యాలు అడగాలి. మిగతా ప్రశ్నలు లక్ష్యాత్మక ప్రశ్నలు అనగా బహుళైచ్ఛిక ప్రశ్నలు (మల్టీపుల్ ఛాయిస్) అడగాలి. ఈ బహుళైచ్ఛిక ప్రశ్నలను అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతివికృతులు మొదలైన అంశాల ఆధారంగా ఇవ్వాలి.

**V. వ్యాకరణాంశాలు :** దీనిలో 14 ప్రశ్నలు ఇవ్వాలి. అవి లక్ష్యాత్మకమైన ప్రశ్నలుండాలి. అంటే తప్పనిసరిగా బహుళైచ్ఛిక ప్రశ్నలు (మల్టీపుల్ ఛాయిస్)ఉండాలి. సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యాలు (సంశ్లిష్ట / సంయుక్త వాక్యాలు, ప్రత్యక్ష / పరోక్ష కథనాలు) మొదలైన అంశాలపై ప్రశ్నలుండాలి.

**సూచనలు :**

1. పిల్లలకు అర్థమయ్యే విధంగా ప్రశ్నలు ఉండాలి.
2. పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వకూడదు.
3. లఘుసమాధాన ప్రశ్నలకు, వ్యాసరూప సమాధానప్రశ్నలకు ఎటువంటి ప్రశ్నలు అడగాలో నిర్ధారించుకొని ప్రశ్నలు ఇవ్వాలి.

   ఉదా: వ్యాసరూప సమాధాన ప్రశ్నను లఘుసమాధాన ప్రశ్నగా ఇవ్వకూడదు. అట్లే లఘుప్రశ్నను వ్యాసరూపంలో ఇవ్వకూడదు.
4. పదజాలం, వ్యాకరణం మొదలైనవి నేరుగా పాఠ్యపుస్తక అభ్యాసం నుండి ఇవ్వరాదు.

**ప్రశ్నల గురించి వివరణ – సంస్కృతం**

**I. అవగాహన ప్రతిస్పందన :** దీనిలో పరిచిత శ్లోకం లేదా పరిచితగద్యం లేదా అపరిచిత గద్యం అనే అంశాలలో ఏదైనా ఒకటే ఇవ్వాలి. పరిచిత శ్లోకం గురించి ఇస్తే పాఠ్యపుస్తకంలో చుక్క గుర్తుగల శ్లోకం ఇవ్వాలి. అయితే దానిని శ్లోకపూరణ, భావం రాయడం అనే విధంగా ఇవ్వాలి. ఇక పరిచిత గద్యం ఇస్తే అది పాఠ్యపుస్తకంలోని పేరా ఇవ్వాలి. అపరిచిత గద్యం ఇస్తే పాఠ్యపుస్తకేతర గద్యం ఇవ్వాలి. మొత్తం మీద మూడు రకాల ప్రశ్నలలో ఏదైనా ఒకటే రకం ఇవ్వాలి.

**II. స్వీయరచన :** దీనిలో రెండు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి 1. లఘుసమాధాన ప్రశ్నలు 2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు. లఘుసమాధాన ప్రశ్నలు పద్యభాగం నుండి ఒకటి, గద్యబాగం నుండి ఒకటి మొత్తం రెండు ప్రశ్నలు ఇవ్వాలి. వీటికి 4 లేక 5 వాక్యాల్లో జవాబు రాయాలి.

వ్యాసరూప సమాధాన ప్రశ్నలు రెండు ఇవ్వాలి. ఆ రెండు ప్రశ్నలు ఒకే విభాగం నుండి అనగా పద్యభాగం, (లేదా) గద్యభాగం నుండి అడగాలి. ఒకటి పద్యభాగం నుండి మరొకటి గద్యభాగం నుండి అడుగరాదు. అట్లా అడిగితే విద్యార్థులు ఒక విభాగాన్ని పూర్తిగా వదిలి వేసే అవకాశం ఉన్నది. కాబట్టి అడిగే రెండు ప్రశ్నలు ఒకే విభాగాన్ని నుండి ఇవ్వాలి. వాటిలో ఒకదానికి జవాబు రాయాల్సి ఉంటుంది.

**సూచన :** ఈ స్వీయరచన ప్రశ్నలన్నింటికి సంస్కృత భాషలోనే అనగా దేవనాగరిలిపిలోనే జవాబులు రాయాలి.

**III. సృజనాత్మకత :** దీనిలో మూడు ప్రశ్నలు ఇవ్వాలి. ఏదైనా ఒకదానికి జవాబు రాయాల్సి ఉంటుంది. పుస్తకంలో ఉన్న వ్యవహారరూపాలను అడగాలి. ప్రశ్న ఉన్నది ఉన్నట్లుగా నేరుగా ఇవ్వరాదు.

**IV. పదజాలం :** దీనిలో నాలుగు బహుళైచ్ఛిక ప్రశ్నలు (లక్ష్యాత్మక ప్రశ్నలు) ఇవ్వాలి.

**V. వ్యాకరణాంశాలు :** దీనిలో కూడా బహుళైచ్ఛిక ప్రశ్నలు (లక్ష్యాత్మక ప్రశ్నలు) ఇవ్వాలి.

**సూచనలు :**

1. పరీక్షలో సంస్కృతానికి సంబంధిచిన అన్ని జవాబులను దేవనాగరి లిపిలోనే రాయాలి.
2. పుస్తకంలో ఉన్న ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా అడుగరాదు.
3. పిల్లలు ఆలోచించి రాసేలా ప్రశ్నలు ఉండాలి.

## కాంపోజిట్ తెలుగు బోధనకు పీరియడ్ల కేటాయింపు

- కాంపోజిట్ తెలుగుకు వారానికి 4 పీరియళ్ళు, సంస్కృతానికి వారానికి 2 పీరియళ్ళు కేటాయించాలి.
- ఈ ప్రకారంగా తెలుగుకు 150 పీరియళ్ళు, సంస్కృతానికి 50 పీరియళ్ళు వస్తాయి.
- తెలుగులో ఒక పాఠాన్ని బోధించడానికి సగటున 12 నుండి 14 పీరియళ్ళు అవసరమౌతాయి.
- సంస్కృతంలో ఒక పాఠాన్ని బోధించడానికి సగటున 10 నుండి 12 పీరియళ్ళు అవసరమౌతాయి.
- సంస్కృతంలో పాఠ్యబోధనకు ముందు 2 పీరియళ్ళు, పాఠ్యాంశబోధనకు 3 పీరియళ్ళు, అభ్యాసాల నిర్వహణకు అనగా పిల్లలతో తరగతి గదిలో చర్చించి అభ్యాసాలు చేయించడానికి 5 పీరియళ్ళు తప్పనిసరిగా కేటాయించుకోవాలి.

# సంగ్రహణాత్మక మూల్యాంకం

## ప్రథమభాష – తెలుగు (కాంపోజిట్ కోర్సు) మాదిరి ప్రశ్నాపత్రం

తరగతి : 10వ మార్కులు : 60

ప్రథమభాష:తెలుగు(కాంపోజిట్‌కోర్సు) సమయం:2.45

**గమనిక:** మొదటి 15 ని.లు ప్రశ్నపత్రం చదువండి. అర్థం చేసుకోండి. మిగతా 2 గం.ల సమయంలో జవాబులు రాయండి.

**I.** అవగాహన – ప్రతిస్పందన (పఠనావగాహన) (20 మార్కులు)

(అ) కింది పేరాను చదువండి. ఖాళీల్లో సరైన వాక్యాలు రాయండి. 5 × 1 = 5

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గుడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణ కథా ప్రసంగంలో ఉన్నాడు. అంతలో శూర్పణఖ అనే రాక్షసి వచ్చింది. ఈమె రావణాసురుని చెల్లెలు. శ్రీరాముని సౌందర్యానికి ముద్దురాలయ్యింది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపి తింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళన్నాడు. లక్ష్మణుడు తాను అన్నదాసుడనని, తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సి వస్తుందని అందుకే శ్రీరాముడు చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరాముని వైపు తిరిగింది. సీత వల్లనే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడుకి పోయింది. సీతాదేవిని అడ్డుతొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

అ) పై పేరాకు తగిన శీర్షిక : ..........................................................................

ఆ) పురాణ కథ ప్రసంగం అంటే : ..................................................................

ఇ) శూర్పణఖ సీతపై దాడిచేయడానికి కారణం : ..........................................................

ఈ) లక్ష్మణుడు శూర్పణఖను నిరాకరిస్తూ చెప్పిన కారణం : ..............................................

ఉ) 'ద్యానం చేయడం' అంటే : ..........................................................................

2. కింది పద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి. 5 × 1 = 5

కం. ఇందుగలడందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే.

అ) సర్వోపగతుడు ఎవరు?

ఆ) చక్రి ఎక్కడెక్కడున్నాడు ?

ఇ) దానవాగ్రణి అనే పదానికి అర్థం ఏమిటి?

ఈ) ఈ పద్యానికి శీర్షికను సూచించండి.

ఉ) ఎందెందు వెదకి చూచిన అందందే గలవాడు ఎవడు?

(ఇ) కింది పద్యాల్లో ఒక పద్యానికి ప్రతిపదార్థం రాయండి. 1 × 5 = 5

భండన భీముడార్తజన బాంధవుడు జ్వల బాణతూణకో
దండ కళాప్రచండ భుజతాండవ కీర్తికి రామమూర్తికిన్
రెండవసాటి దైవమిక లేడనుచున్ గడకట్టి భేరికా
డాండ దడాండ దాండ నినదంబులజాండము నిండమత్తవే
దండమునెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ!

(లేదా)

నిరయంబైన, నిబంధమైన, ధరణీనిర్మూలనంబైన, దు
ర్మరణంబైన గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్ము పో;
హరుడైనన్, హరియైన, నీరజభవుండభ్యాగతుండైన నౌ;
దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా ! ధీవర్య! వేయేటికిన్ ?

II. స్వీయరచన (24 మార్కులు)

అ) కింది ప్రశ్నలకు 5 లేక 6 వాక్యాల్లో జవాబులు రాయండి. 3 × 3 = 9

1. 'చదువు మానవాళికి జ్ఞానాన్నిస్తుంది' దీనిపై మీ అభిప్రాయాన్ని రాయండి?

2. 'ఏకలవ్య శిష్యుడు' అంటే మీకేమర్థమైందో వివరించండి.

3. అలిశెట్టి ప్రభాకర్ కవితా శైలి గూర్చి రాయండి.

ఆ) కింది వాటిలో ప్రతిభాగం నుండి ఒక ప్రశ్నకు తప్పనిసరిగా 12 నుండి 15 వాక్యాల్లో జవాబులు రాయండి. (3 × 5 = 15)

4. దానశీలము పాఠం ఆధారంగా బలిచక్రవర్తి గుణగణాలను సొంతమాటల్లో రాయండి.

(లేదా)

నగర జీవనంలోని కష్ట, సుఖాలను వివరించండి.

5. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వల్ల మన సంస్కృతి, భాష మళ్ళీ ప్రాణం పోసుకున్నాయి. ఎలాగో సమర్థిస్తూ రాయండి.

(లేదా)

గోలకొండ పట్టణం సకలసంపదలతో తులతూగిందని నీవెలా చెప్పగలవు?

6. 'అన్నదమ్ముల అనుబంధానికి రామలక్ష్మణులు ప్రతీక' దీనిని సమర్థించండి.

(లేదా)

హనుమంతుడు కార్యసాధకుడని తగిన ఉదాహరణలతో వివరించండి.

**III.** సృజనాత్మక వ్యక్తీకరణ (6 మార్కులు) (1 × 6 = 6)

అ) కింది వానిలో ఒకదానికి జవాబు రాయండి.

7. మీ ఊరి అందాన్ని గురించి (లేదా) ప్రత్యేకతను తెలిపేలా 10 పంక్తుల్లో కవిత రాయండి

8. దానగుణము యొక్క విశిష్టతను తెలియజేస్తూ బలిచక్రవర్తి ఏకాపాత్రాభినయానికి మాటలు రాయండి.

9. నదులను కాలుష్యం నుండి కాపాడాలని ప్రజలను చైతన్యపరిచేలా కరపత్రం తయారుచేయండి.

## పార్ట్-బి (15 మార్కులు)

I. పదజాలం (8 మార్కులు)

అ) కింది బహుళైచ్ఛిక ప్రశ్నలకు సరైన సమాధానం గుర్తించండి. 12 × 1/2 = 6

1. సౌదామని అనగా ( )

   A) పిడుగు B) మెరుపు C) ప్రవాహం D) భవనం

2. పాడుబడిన కోటగోడల్లో బండజింకలు నివాసమేర్పరుచుకున్నాయి.
   (గీతగీసిన మాటకు అర్థం గుర్తించండి) ( )

   A) లేళ్ళు B) సాలీళ్ళు C) గబ్బిలాలు D) తేళ్ళు

3. 'పతి' అనే పదానికి పర్యాయపదాలు గుర్తించండి.

   A) ధవుడు, పతి, బ్రహ్మ B) శివుడు, భర్త, రాజు

   C) భర్త, ధవుడు, నాథుడు D) నాథుడు, చంద్రుడు, భర్త

4. బంగారం ధర అమాంతం పెరిగింది. (గీతగీసిన పదానికి పర్యాయపదాలు గుర్తించండి) ( )

   A) ఇత్తడి, పుత్తడి, పైడి B) పుత్తడి, మత్తడి, పసిడి

   C) స్వర్ణం, చిత్తడి, పైడి D) పుత్తడి, పసిడి, స్వర్ణం

5. పోతన 'కైత' జనరంజకంగా ఉంటుంది. ఈ వాక్యంలో 'కైత' అనే పదానికి ప్రకృతిపదం ( )

A) కత్తి B) కుత్తక C) కవిత D) పద్యం

6. హనుమతంతుని హృదయం నిండా శ్రీరాముడే.
(గీతగీసిన మాటకు వికృతి పదం గుర్తించండి) ( )

A) ఎద B) హృది C) ఉదయం D) మది

7. 'వర్షము' అనే పదానికి నానార్థాలు గుర్తించండి. ( )

A) వాన, వరద, దేశం B) వాన, సంవత్సరం, వాగు

ౖ) సంవత్సరం, ప్రవాహం, వాన D) వాన, దేశం, సంవత్సరం

8. 'భాగీరథి' అనే పదానికి వ్యుత్పత్తి అర్థం ( )

A) భాగ్యమును కల్గించునది B) రథమును నడిపించునది

C) భగీరథునిచే తీసుకొని రాబడినది D) భగీరథుని యొక్క రథం

9. 'అజ్ఞానాంధకారాన్ని తొలగించేవాడు' అనే వ్యుత్పత్తికి సమానమైన పదం ( )

A) సూర్యుడు B) గురువు C) ఈశ్వరుడు D) చంద్రుడు

10. పాలకుడు, చంద్రుడు, ఇంద్రుడు అనే నానార్థాలనిచ్చే పదాని గుర్తించండి. ( )

A) బ్రహ్మ B) విష్ణువు C) రాజు D) దైవం

11. 'విభావళి' అనగా ( )

A) వెన్నులకాంతి B) కాంతులవరుస C) సూర్యకాంతి D) సన్ననికాంతిరేఖ

12. మా ఊరి దేవాలయం వద్ద సంవత్సరానికోసారి ఉత్సవాలు జరుగుతాయి ( )

A) కోవెల, సదనం B) మందిరం, భవనం

C) గుడి, గోపురం D) కోవెల, మందిరం, గుడి

ఆ) కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

13. చిత్తశుద్ధి

14. పుట్టినిల్లు

**II.** వ్యాకరణం (7 మార్కులు)

అ) కింది వానికి సరైన జవాబును గుర్తించి బ్రాకెట్లలో రాయండి.

15. భావోద్వేగం – ఇది ఏ సంధి? ( )

    A) సవర్ణదీర్ఘసంధి B) ఉత్వసంధి C) గుణసంధి D) వృద్ధిసంధి

16. రుగాగమసంధికి ఉదాహరణ ( )

    A) గుణవంతురాలు B) చేవ్రాలు C) తలంబ్రాలు D) పావురాలు

17. 'మనుషులు+అంతా' పూర్వ పరస్వరాలు వరుసగా ( )

    A) లు+ఉ B) అ+ఉ C) అ+అం D) ఉ+అ

18. 'రమ్యోద్యానము' అనే పదాన్ని విడదీస్తే ( )

    A) రమ్య+ఉద్యానము B) రమ్యా+ఉద్యానము

    C) రమ్యో+ద్యానము D) రమ్మో+ఉద్యానము

19. కింది వాటిలో రూపక సమాసానికి ఉదాహరణ ( )

    A) యువతీయువకులు B) గరుడవాహనుడు

    C) ముక్కంటి D) మానవధనులు

20. 'నాలుగురోడ్ల కూడలిలో ఏమది?' అ వాక్యంలో గీతగీసిన పదం ( )

    A) ద్వంద్వసమాసం B) ద్విగుసమాసం

    C) షష్ఠీ తత్పురుష సమాసం D) విశేషణ ఉత్తరపదకర్మధారయసమాసం

21. 'ఆనందోత్సాహాలు' అనే దానికి సరైన విగ్రహ వాక్యం ( )

    A) ఆనందమైన ఉత్సాహాలు B) ఆనందముచేత ఉత్సాహాలు

    C) ఆనందము కొరకు ఉత్సాహాలు D) ఆనందమూ, ఉత్సాహమూ

22. 'తారలు దిగి వచ్చి తారాడినట్లు' అనే వాక్యంలో ఉన్న అలంకారం ( )

    A) రూపకాలంకారం B) అతిశయోక్తి అలంకారం

    C) సభావోక్తి అలంకారం D) శ్లేషాలంకారం

23. వృత్త్యనుప్రాసాలంకారంలో ( )

A) ఒకే వర్గం అక్షరాలు వస్తాయి

B) ఒకే అక్షరం మాటి మాటికి వస్తుంది.

C) అక్షరాల జంట మాటిమాటికి వస్తుంది

D) వాక్యాల చివర్లో ఒకే రకమైన అక్షరం ఉంటుంది.

24. ఏదైనా విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించి చెప్తే .... అది ( )

A) ఛేకానుప్రాసాలంకారం B) అతిశయోక్తి అలంకారం

C) రూపకాలంకారం D) స్వభావోక్తి అలంకారం

25. కింది వాటిలో ఉపమాలంకారానికి ఉదాహరణ ( )

A) మంచివాని గుణాలు పూలవాసనవలె తమంతట తామే వ్యాపిస్తాయి.

B) అంతటా జ్ఞానజ్యోతులు ప్రకాశించాలి.

C) ఆ శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

D) దిక్కులన్నీ ఇంద్రధనస్సుతో సయ్యాటలాడినట్లుగా ఉంది.

26. శార్దూలవృత్తములో వచ్చే గుణాలు వరుసగా ( )

A) 2నజభజజజర B) భరనభభరవ C) మసజసతతగ D) సభరనమయవ

27. ఉత్పలమాల యొక్క యతి స్థానం ( )

A) 14వ అక్షరం B) 11వ అక్షరం C) 13వ అక్షరం D) 10వ అక్షరం

28. 'ప్రధానద్వారాలు' అనేది ( )

A) విశేషణ పూర్వపద కర్మధారయం B) సంభావనా పూర్వపద కర్మధారయం

C) విశేషణ ఉత్తరపద కర్మధారయం D) ఉపమాన పూర్వపద కర్మధారయం

# తెలుగు - జవాబు పత్రాలు దిద్దడానికి సూచికలు

## మూల్యాంకన సూచికలు / మార్గదర్శకాలు

## మార్కుల కేటాయింపు - సూచికలు

నూతనంగా రూపొందించిన పదో తరగతి వాచకాల కనుగుణంగా ప్రశ్నాపత్రం నమూనా తయారుచేయబడింది. ఎలాంటి ప్రశ్నలుంటాయి? ఏయే సామర్థ్యానికి ఎన్ని మార్కులుంటాయి? జవాబులను ఏ సూచికల ఆధారంగా మూల్యాంకనం చేయాలి? తదితర విషయాల పట్ల ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన ఉండటం అవసరం. ప్రశ్నపత్ర నిర్మాణం ఆధారంగా వీటిని పరిశీలిద్దాం.

**I. చదువడం - అవగాహన చేసుకోవడం (20 మార్కులు)**

అ) పరిచిత గద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)
ఇందుకోసం ఉపవాచకంలోని అర్థవంతమైన పేరాను గ్రహించాలి.

ఆ) అపరిచిత గద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)
అర్థవంతమైన సాహిత్య అంశమో / సామాజిక అంశమో ఇవ్వబడాలి.

ఇ) అపరిచిత పద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)
సుప్రసిద్ధమైన పద్యం లేదా శతక పద్యం ఇవ్వడుతుంది.

* ఈ ప్రశ్నలన్నీ లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సరైన సమాధానానికి మార్కులు కేటాయించబడతాయి.

ఈ) పరిచిత పద్యం ఇచ్చి 5 ప్రతిపదార్థం అడగడం లేదా పద్యం మొదటి పాదం ఇచ్చి - చివరి పాదం - చివరి భాగం ఇచ్చి పూరించమనడం మరియు భావం అడగడం. (5 మార్కులు)

* ప్రతిపదార్థం అడిగినప్పుడు మార్కుల కేటాయింపు

| | | |
|---|---|---|
| అన్వయక్రమం | - | 1 మార్కు |
| పదాలు - అర్థాలు | - | 3 మార్కులు |
| అక్షరదోషాలు లేకుండా రాస్తే | - | 1 మార్కు |
| మొత్తం | - | 5 మార్కులు |

* పద్యం పూరించి భావం రాయమని అడిగినప్పుడు మార్కుల కేటాయింపు

| | | |
|---|---|---|
| పాదభంగం చెడకుండా పూరిస్తే | - | 2 మార్కులు |
| భావం సరిగ్గా రాస్తే | - | 2 మార్కులు |
| అక్షరదోషాలు లేకుండా రాస్తే | - | 1 మార్కు |
| మొత్తం | - | 5 మార్కులు |

** ద్వితీయ భాష ప్రశ్నపత్రంలో కంఠస్థ పద్యాన్ని ఇచ్చి భావం రాయమని అడగవచ్చు లేదా పద్యం పూరించమనవచ్చు లేదా పాదాలు తారుమారుగా ఇచ్చి పద్యాన్ని సక్రమంగా రాయమని అడగవచ్చు.

| పద్యం పూరించడం | పాదాలు తారుమారుగ ఇచ్చి సరిచేయడం | పద్యానికి భావం రాయడం |
|---|---|---|
| పాదభంగం లేకుండా పూరిస్తే | పాదాల్ని క్రమంగా పేర్చడం | భావం - 2 మార్కులు |
| 4 మార్కులు | 4 మార్కులు | పదజాలం, వాక్యనిర్మాణం - 2 మార్కులు |
| అక్షర దోషాలు లేకుండా పూరిస్తే | అక్షర దోషాలు లేకుండా రాస్తే | అక్షర దోషాలు లేకుండా రాస్తే |
| 1 మార్కు | 1 మార్కు | 1 మార్కు |

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

ఎ) స్వీయరచన (30 మార్కులు)

అ) లఘు సమాధాన ప్రశ్నలు (12 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలు నేరుగా ఇవ్వకుండా అదే స్వభావం కల ప్రశ్నలు 4 అడగబడతాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. ఇవి ఆలోచించి రాసేలా, వ్యక్తీకరణ ప్రాధాన్యంగా ఉంటాయి.

* లఘు సమాధాన ప్రశ్నలకు మార్కుల కేటాయింపు.

  సమాధానంలోనని విషయం, వాక్యనిర్మాణ క్రమం - 2 మార్కులు

  అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు

* **వ్యాసరూప సమాధాన ప్రశ్నలు (18 మార్కులు)**

పద్య పాఠ్యాంశాలు, గద్య పాఠ్యాంశాలు, ఉపవాచకం ఒక్కో విభాగం నుండి రెండు ప్రశ్నలివ్వబడతాయి. ఒక్కో విభాగం నుండి ఒక్కో ప్రశ్నకు సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 6 మార్కులు. ఈ ప్రశ్నలు ఆలోచించి సొంతంగా రాసేలా ఉంటాయి. ఇవన్నీ బహుళ సమాధానాలు రాయడానికి వీలున్న ప్రశ్నలు (రాజూవఅ జుఅఎవఎ), విశ్లేషించడం, వివరించడం, వ్యాఖ్యానించడం, కారణాలు రాయడం, సారాంశం భావం రాయడం, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయడం, రచయిత / కవి ఉద్దేశాలు రాయడం, సమకాలిన పరిస్థితులతో పోల్చడం, అన్వయించడం మొదలగు రూపాల్లో ప్రశ్నలు వస్తాయి. కాబట్టి మార్కుల కేటాయింపు కింది విధంగా జరగాలి.

జ వ్యాసరూప సమాధాన ప్రశ్నకు మార్కుల కేటాయింపు.

| | | |
|---|---|---|
| విషయానికి తగిన భావం రాస్తే | - | 3 మార్కులు |
| వాక్య నిర్మాణ క్రమం | - | 1 మార్కు |
| మంచి పదజాలాన్ని వినియోగించడం | - | 1 మార్కు |
| అక్షర దోషాలు లేకుండా రాస్తే | - | 1 మార్కు |

**బి) సృజనాత్మకత (10 మార్కులు)**

పాఠ్యపుస్తకంలోని సృజనాత్మకత సామర్థ్యం కింద ఇచ్చి ప్రశ్నలవంటి స్వభావం గల ప్రశ్నలే వస్తాయి తప్ప యధాతథంగా రావు. మూడు ప్రశ్నలు ఇస్తే రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు.

సృజనాత్మక ప్రశ్నలు వేర్వేరు వ్యవహార రూపాల్లో ఉంటాయి. అవి

**సృజనాత్మకత అంశాలు :**

వర్ణిచడం, కవిరచనాశైలిని వర్ణించడం / వివరించడం, సంభాషణలు రాయడం, లఘునాటికలు రూపొందించడం, నినాదాలు, సూక్తులు రాయడం, అవగాహనను / అనుభవాలను లేఖలుగా రాయడం, ఇంటర్వ్యూ ప్రశ్నావళి, కవిత గేయం రాయడం, సన్మానపత్రం రాయడం / అభినందన పత్రం, వ్యాసం, కథ, కథ పొడిగింపు, కరపత్రం రూపొందించడం, చిత్రం గీయడం, రంగులువేయడం, కథనం (గమనించిన అంశంపై) మొదలగు రూపాల్లో జవాబులు రాయాల్సి ఉంటుంది. మార్కుల కేటాయింపు కింది విధంగా ఉంటుంది.

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు |
|---|---|
| ఇచ్చిన అంశాన్ని వర్ణించడం | పోలికలు / ఉపమానాలు మంచిపదజాలం - 3 మార్కులు<br>వాక్య నిర్మాణ క్రమం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సంభాషణలు కనీసం 2 పాత్రలతో, ఒక్కో పాత్రకు 5 వాక్యాలు రాయాలి. | పాత్రోచిత సంభాషణలు - 3 మార్కులు<br>వాక్య నిర్మాణ క్రమం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| లేఖ | లేఖా రచనా నియమాలు<br>(స్థలం, తేదీ, సంబోధన, చిరునామా, సంతకం)- 2 మార్కులు<br>విషయానుగుణంగా రాస్తే - 2 మార్కులు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే- 1 మార్కు |

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు |
|---|---|
| గేయం / కవిత 5-8 పంక్తుల పరిమితిలో రాయాలి. | విషయానుగుణంగా రాస్తే - 2 మార్కులు<br>ప్రాసతో కూడిన / కవితాత్మక పదజాలం - 2 మార్కులు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| ఇంటర్వ్యూ ప్రశ్నావళి కనీసం 10 ప్రశ్నలు రాయాలి. | వ్యక్తిగత వివరాలు తెలుసుకొనే ప్రశ్నలు - 1 మార్కు<br>విషయగత ప్రశ్నలు - 2 మార్కులు<br>ప్రశ్నలక్రమం - అనుసంధానం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| నినాదాలు / సూక్తులు కనీసం 5 సూక్తులు రాయాలి. | విషయానికి అనుగుణంగా ఉంటే - 2 మార్కులు<br>ప్రాసతో కూడిన పదజాలం - 1 మార్కు<br>వాక్య నిర్మాణం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| కథ (మూడు పేరాలుండాలి) | ప్రారంభం / ఎత్తుగడ - 1 మార్కు<br>కథనం - సంఘటనాక్రమం - 2 మార్కులు<br>ముగింపు - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| వ్యాసం | ఉపోద్ఘాతం - 1 మార్కు<br>విషయ వివరణ - 2 మార్కులు<br>ముగింపు - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| కథ పొడిగింపు (6-8 వాక్యాలు) | అర్థవంతంగా పొడిగించడం - 2 మార్కులు<br>చక్కటి పదజాలంతో కూడిన వాక్యాలు - 1 మార్కు<br>ముగింపు - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు |
|---|---|
| కరపత్రం | శీర్షిక ప్రచురణకర్తలు - 1 మార్కు<br>సందేశం - 2 మార్కులు<br>విషయం - ఆవశ్యకత - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సన్మానపత్రం / అభినందనపత్రం | సన్మానగ్రహీత వివరాలు పొందుపర్చడం సందర్భం - 2 మార్కులు<br>ప్రశంసాత్మకంగా, సరైన పదజాలంతో రాస్తే - 1 మార్కు<br>చక్కని రచనా విధానం - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సంఘటన రచన / గమనించిన అంశాన్ని కథనం రాయడం | ఎత్తుగడ / ప్రారంభం - 1 మార్కు<br>కథనం - 2 మార్కులు<br>ముగింపు - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |

**III. భాషాంశాలు (20 మార్కులు)**

ఎ) పదజాలం (10 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని పదాలకు అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, జాతీయాలు, ప్రకృతి వికృతులు, సొంతవాక్యాలు మొదలగు వాటిలోంచి 10 ప్రశ్నలు అడగబడతాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కోమార్కు. ఇది లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సమాధానం సరిగ్గా ఉంటే మార్కులు కేటాయించవచ్చు.

బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యాలు మొదలగు అంశాల నుండి ప్రశ్నలు అడగబడతాయి. 10 ప్రశ్నలకు 10 మార్కులు. ఇవి లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సమాధానం సరిగ్గా ఉంటే మార్కులు కేటాయించవచ్చు.

# మాదిరి ప్రశ్నపత్రం-2

## 1వ సంగ్రహణాత్మక మూల్యాంకనం (ద్వితీయ భాష - తెలుగు)

**తరగతి : 6వ** **మార్కులు : 80**

**సమయం : 2.45 గం॥**

**సూచనలు :1.** మొదటి 15 ని॥లు ప్రశ్నపత్రాన్ని చదువటానికి విద్యార్థులు ఉపయోగించుకోవాలి.

**2.** తరువాత $2\frac{1}{2}$ గా॥లు సమాధానాలు రాయటానికి ఉపయోగించాలి.

**3.** సమాధానాలను వారు మాట్లాడే తెలుగు భాషలో రాయవచ్చు.

## I. చదువడం (30 మార్కులు)

**1) కింది అక్షరాలను చూడండి. పక్కన ఇచ్చిన పదాలలో వాటిని గుర్తించి '◯' చుట్టండి. (5×1=5)**

i) అ, క సకలం, అలక

ii) చ, మ కంచం మమత

iii) శ, త తరంగం శబరి

iv) డ, వ వరం తలగడ

v) ఈ, ఓ ఓసి ఈక

**2) కింది వాక్యాలను చూడండి. పక్కనున్న పట్టికను పూరించండి. (5×1=5)**

i) కాలం చాలా విలువైనది.

ii) అడవిలో సింహం నీటిని తాగుతున్నది.

iii) మేము మా దేశాన్ని పాలించెదము.

iv) మేలేదో ఆలోచించి చేసి చూపాలి.

v) వారో, వీరో మోదుగుపువ్వును పాడుచేసారు.

| 'ా' అక్షరాలు | 'ి' అక్షరాలు | 'ే' అక్షరాలు | 'ో' అక్షరాలు | 'ు' అక్షరాలు |
|---|---|---|---|---|
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |

**3) కింది పదాలలో సూచించిన ధ్వని ఉన్న అక్షరాలను గుర్తించి పక్క 'గడి'లో రాయండి. (5×1=5)**

i) తేనె → "ఎ" అనే ధ్వని ఉన్న అక్షరం ☐

ii) మాదే! → "ఆ" అనే ధ్వని ఉన్న అక్షరం ☐

iii) ఆపైన → "ఐ" అనే ధ్వని ఉన్న అక్షరం ☐

iv) సమీరం → "ఈ" అనే ధ్వని ఉన్న అక్షరం ☐

v) కాయికం → "ఇ" అనే ధ్వని ఉన్న అక్షరం ☐

4) కింది పదాలను చూడండి. అక్షర వరుస క్రమంలో రాయండి. (5×1=5)


i) ఈగ ii) కల iii) కాకి iv) దండం v) ఉడుత

5) కింది పదాలను చూడండి. "క" గుణింతం ఆధారంగా క్రమంలో పదాలను చూసి రాయండి. ($10\times\frac{1}{2}=5$)

i) కెరటం ii) కేసరం iii) కాకి iv) కుండ v) కీసర

vi) కలం vii) కేక viii) కైత ix) కిటికి x) కూడు

6) కింది వాటిని జతపరచండి. (5×1=5)

i)  గంట

ii)  తరగతి

iii)  బడి

iv)  పాట

v)  ఆట

## II. రాయడం (40 మార్కులు)

7) కింది అక్షరాలకు గుణింతాలు రాయండి. (2×5=10)

i) గ ii) మ

8) కింది అక్షరాలు ఉండే ఐదు (5) పదాలు రాయండి. వాటికింద గీత గీయండి. (5×1=5)

ప, క, ల, త, మ ఉదా : రాము

i) ____________________ ii) ____________________

iii) ____________________ iv) ____________________

v) ____________________

9) కింది పదం నుండి ఏవైనా 5 పదాలను రాయండి. (1×5=5)

10) ఇప్పటి వరకు మీరు నేర్చుకున్న ఏవైనా పది (10) అక్షరాలను రాయండి. $(10\times\frac{1}{2}=5)$

i) ________ ii) ________ iii) ________ iv) ________ v) ________

vi) ________ vii) ________ viii) ________ ix) ________ x) ________

11) కింది పదాలతో ఐదు (5) వాక్యాలు రాయండి. (5×1=5)

లత పలక జడ దండ ఊయల పాట

పాడింది ఊగింది ఆపింది తీసింది వేసింది

12) కింది అక్షరాలను చూడండి. పక్కన ఇచ్చిన పదాలలో వాటిని గుర్తించి '◯' చుట్టండి. (5×1=5)

i)  ____________________

ii)  ____________________

iii)  ____________________

iv)  ____________________

v)  ____________________

## III. సృజనాత్మకత (10 మార్కులు)

అ) కింది వానిలో ఒక ప్రశ్నకు జవాబివ్వండి. 1×10=10

13) మీకు నచ్చిన పండు / పువ్వు బొమ్మ గీసి, రంగులు వేయండి.

14) మీరు తెలిసిన, "ల" చివరలకు వచ్చే పదాలను (ప్రాసాక్షర పదాలను) రాయండి.

ఉదా : త ల

i) ________ ల vi) ________ ల

ii) ________ ల vii) ________ ల

iii) ________ ల viii) ________ ల

iv) ________ ల ix) ________ ల

v) ________ ల x) ________ ల

# Chapter-VII

## నూతన పాఠ్యపుస్తకాల వినియోగంలో అవసరమైన వనరులు / ఉపయుక్త గ్రంథాలు

**పాఠ్యపుస్తకాల్లోని కవుల / రచయిత మూల గ్రంథాలు** :

1) పోతన భాగవతం (టి.టి.డి. ప్రచురణ)
2) యాది – వ్యాససంపుటి – సామల సదాశివ
3) రుద్రవీణ – దాశరథి
4) 'యశోదారెడ్డి ఉత్తమ కథలు' – యశోదారెడ్డి (ఎన్.బి.టి. ప్రచురణ)
5) 'అలిశెట్టి ప్రభాకర్ కవిత' – అలిశెట్టి ప్రభాకర్
6) భాగ్యరెడ్డివర్మ జీవితచరిత్ర – ఎం.బి.గౌతమ్
7) డా॥ సి.నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం – 6వ సంపుటి – సి.నా.రె.
8) మన తెలంగాణం – వ్యాససంపుటి – ఆదిరాజు వీరభద్రరావు.
9) కాశీ ఖండం – శ్రీనాథుడు
10) నెల్లూరి కేశవస్వామి కథలు – సంపుటం – ఎన్.బి.టి.
11) వాల్మీకి రామాయణం – తెలుగువచనం
12) విజయవిలాసం – చేమకూర వేంకటకవి – (తాపీధర్మారావు వ్యాఖ్యానంతో)
13) హృదయశైలి – ముకురాల రామారెడ్డి
14) జీవనయానం – దాశరథి రంగాచార్య
15) ఉద్యమం – చారిత్రక పత్రాలు – తెలంగాణా హిస్టరీ సొసైటి
16) యయాతి చరిత్ర – పొన్నికంటి తెలగన
17) నాజైలు జ్ఞాపకాలు – అనుభవాలు – సంగలక్ష్మీబాయి
18) చావుగీతం – సలంద్ర లక్ష్మీనారాయణ

19) వాగ్భూషణం భూషణం - డా॥ ఇరివెంటి కృష్ణమూర్తి
20) రసతరంగిణి - మామిండ్ల రామాగౌడు
21) తులసిదళాలు - (కథానికల సంపుటి) - ఇల్లెందల సరస్వతీదేవి
22) శ్రీమదాంధ్ర మహాభారతం - అరణ్యపర్వం - టి.టి.డి. ప్రచురణ
23) నా ప్రథమ విదేశీయాత్ర - ముద్దురామకృష్ణయ్య
24) బసవపురాణం - పాల్కురికి సోమన
25) తెలుగు జానపద గేయ సాహిత్యం - ఆచార్య బిరుదురాజు రామరాజు
26) మంజీరనాదాలు - డా॥ వేములగంట నర్సింహాచార్యులు
27) జైలులోపల - వట్టికోట ఆళ్వారుస్వామి
28) విప్లవఢంకా - కె. రుక్నుద్దీన్
29) కాపుబిడ్డ - గంగుల సాయిరెడ్డి
30) భారతీయ సాహిత్యం - సమకాలీన కథానికలు - సాహిత్య అకాడమీ
31) చిత్రగ్రీవం - ఒక పావురం కథ - ధనగోపాల్ ముఖర్జీ - తెలుగు అనువాదం (ఎన్.బి.టి.)
32) సింహాసనద్వాత్రింశిక - కొఱవి గోపరాజు
33) 'శబ్నం' - కృష్ణమూర్తి యాదవ్
34) మా ఊరు - ఆచ్చి వేంకటాచార్యులు
35) ఒక విజేత ఆత్మకథ - అబ్దుల్‌కలాం. ఎ.పి.జె.
36) ఖండకావ్యం - గుఱ్ఱం జాషువా
37) ఏబది సంవత్సరాల జ్ఞాపకాలు - దేవులపల్లి రామానుజరావు
38) జన్మహక్కు - చెఱబండరాజు
39) మెదక్ జిల్లాంతర్గత ఆందవోలు శౌర్యవీర్యరెడ్డి త్రయం' - సంపన్ముదుంబై రంగకృష్ణమాచార్యులు
40) స్వరభారతి - కవితా సంకలనం - శేషం లక్ష్మీనారాయణాచార్య
41) నీతిచంద్రిక - చిన్నయసూరి
42) పాలవెల్లి - పలల్లాదుర్గయ్య
43) పోతన చరిత్రము - వానమామలై వరదాచార్యులు
44) రంగనాథరామాయణం - గోనబుద్ధారెడ్డి
45) ఆత్మవేదన - పొట్టపల్లి రామారావు
46) పల్లెటూరిపిల్లగాడా - సంకలనం - సుద్దాల హనుమంతు
47) హైందవ ధర్మవీరులు - సురవరం ప్రతాపరెడ్డి

**పాఠ్యపుస్తకాల్లోని కవుల / రచయిత మూల గ్రంథాలు** :

48) **వివిధ శతకాలు :** కృష్ణశతకం, సుమతిశతకం, కుమారశతకం, కుమారీశతకం, భాస్కరశతకం, దాశరథీశతకం, నారాయణశతకం, శ్రీకాళహస్తీశ్వరశతకం, సర్వేశ్వరశతకం, వేమనశతకం, భర్తృహరి నీతిశతకం (ఏనుగు లక్ష్మణకవి, ఎలకూచి బాలసరస్వతి) మల్లభూపాలీయ, విశ్వనాథేశ్వర, లొంకరామేశ్వర, వేణుగోపాల, ఉత్పలమాల, ఏకప్రాస శతపద్యమాలిక, నింబగిరి నరసింహాశతకం, నరసింహ, నరహరి, నృకేసరీ శతకాలు. చంద్రమౌళీశ్వరశతకం, చిత్తశతకం, విశ్వకర్మశతకం, శ్రీవేంకటేశ్వరశతకం, కూడల సంగమేశ్వరశతకం, నగ్నసత్యాలు శతకం, శ్రీశ్రీనివాస బొమ్మల శతకం, యాదగిరి లక్ష్మీనరసింహశతకం, సుభాషిత రత్నావళి, ప్రభుతనయశతకం, సుభాషితరత్నావళి, ప్రభుతనయశతకం, గాంధీతాతశతకం, భవ్యచరితశతకం, బాలనృసింహాశతకం.

**పుస్తక సమీక్షకు / ప్రాజెక్టు పనులకు ఉపయోగపడే కొన్ని గ్రంథాలు :**

1) బాలగేయాల / పాటల పుస్తకాలు
2) జానపదగేయాల పుస్తకాలు
3) దేశభక్తిగేయాల పుస్తకాలు
4) పంచతంత్ర కథల పుస్తకాలు
5) జానపదకథల పుస్తకాలు
6) చందమామ / బాలమిత్ర కథాపుస్తకాలు
7) చంపక్ (తెలుగు) కథ పుస్తకాలు
8) చారిత్రక ప్రదేశాలు. కట్టడాలను గూర్చి వివరించే పుస్తకాలు
9) పద్యసంకలనాలు
10) వివిధ రామాయణ కథా పుస్తకాలు (తెలుగులో)
11) జంతువుల, పక్షుల, కీటకాల వివరాలను తెలిపే పుస్తకాలు
12) వివిధ కళలను / వాటి ప్రాముఖ్యతను తెలిపే పుస్తకాలు
13) బతుకమ్మ పాటల పుస్తకాలు
14) యాత్రా రచనలు
15) వివిధ / ప్రసిద్ధిచెందిన భక్తుల కథ పుస్తకాలు
16) దేశభక్తుల చరిత్ర పుస్తకాలు
17) కర్షక / వృత్తిపనుల / శ్రామిక గేయాల పుస్తకాలు
18) నదులు / ప్రాజెక్టుల వివరాలతో కూడిన పుస్తకాలు
19) తెలంగాణ ఉద్యమగేయాల పుస్తకం
20) మహనీయుల / స్ఫూర్తిదాతల / సంఘసంస్కర్తల చరిత్ర పుస్తకాలు (అంబేద్కర్, వివేకానంద, జ్యోతిబాయిపూలె రాజారామమోహనరాయి. మొ॥ నవి.
21) తెలంగాణ వీరవనితల చరిత్ర పుస్తకాలు

22) తెలంగాణ సంస్కృతి - పండుగల పుస్తకాలు

23) గజళ్ళ పుస్తకాలు

24) అనువాదకథల పుస్తకాలు

25) పురాణ పురుషులు, భక్తులు, వీరులు, త్యాగధనులు, మహిళామూర్తులు మొదలైన వారికి సంబంధించిన పుస్తకాలు

26) విద్యావేత్తల / సాహితీవేత్తల వివరాలతో కూడిన పుస్తకాలు

27) విశిష్ట మహిళామణులు శాంతాభాస్కర్

## పరామర్శగ్రంథాలు


1) నిఘంటువులు

2) సమగ్ర ఆంధ్రసాహిత్యం - ఆరుద్ర

3) విద్యార్థి కల్పతరువు

4) పురాతన నామకోశం

5) పూర్వగాథాలహరి

6) పెద్దబాలశిక్ష

7) సులభ తెలుగు వ్యాకరణ గ్రంథాలు

8) ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి

9) సాహిత్య వ్యాస సంకలనాలు

10) ఆధునికాంధ్ర సాహిత్యం - సంప్రదాయాలు - ప్రయోగాలు. సి.నా.రె.

11) సజీవ శిల్పాలు - భారతపాత్రలు - డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

12) జీవన చిత్రాలు - రామాయణ పాత్రలు - డా॥ అప్పజోడు వేంకటసుబ్బయ్య

13) సత్యశోధన - గాంధీజీ

14) ఒక విజేత ఆత్మకథ - అబ్దుల్‌కలాం

15) ఇన్‌సైడర్ (లోపలి మనిషి - పి.వి.నర్సింహారావు)

16) పర్యావరణ వ్యాస సంకలనాలు

17) రామాయణం (వచనం) - పుల్లెల శ్రీరామచంద్రరావు, ఉషశ్రీ, మొ॥నవి.

18) కరదీపికలు (ఎస్.సి.ఇ.ఆర్.టి.)


## Web-sites

1) telangana.scert.gov.in

2) wikipedia.org

# Chapter-VIII

## ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, ఉపకరించే సంస్థలు కార్యక్రమాలు

**ఉపాధ్యాయునిది ఒక వృత్తా? ఉద్యోగమా?**

'ప్రాచీన కాలం నుండీ విద్యాబోధన అనేది ఒక వృత్తిగా, బాధ్యతతోకూడిన అంశంగా ఉండేది. జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతాలలో గురుకుల రూపాల్లో విద్యాలయాలు రాజపోషణలో నడిచేవి.' తల్లిదండ్రులు తమ పిల్లల్ని గురుకులాలలో చేర్చేవారు. రాజకుమారులు సైతం అందరితోపాటు ఈ గురుకులాల్లోనే విద్యాభ్యాసం చేసేవారు. ఇక్కడ గురువు ఒక తండ్రిగా గురుపత్ని ఒక తల్లిగా తమ పాత్రలను సమర్థంగా, అంకితభావంతో పోషించేవారు. విద్యార్థుల శరీర పోషణ, ఆరోగ్యం, విద్యాబోధన సమాజానికి ఉత్తమ పౌరులనందించే బాధ్యత ఈ నాలుగు అంశాలు అవినాభావంగా ఉండేవి.

గురుకులాల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై, సన్నిహితంగా ఉంటూనే వారిలో నిగూఢంగా ఉన్న అంతర్గత శక్తులను వెలికితీసి, పదునుపెట్టి ఆయా రంగాలలో వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేవారు. విలాసవంతమైన జీవితంపట్ల వ్యామోహంగాని ఉండేవికావు. బోధనను నాటి గురువులు ఒక దైవకార్యంగా, బాధ్యతగా, ఒక తపస్సుగా భావించేవారని మన ఇతిహాసాలు చెబుతున్నాయి.

కాలక్రమేణ ఆధునిక కాలంలో బ్రతుకుతెరువు కోసం బోధన ఒక వృత్తిగా మారిపోయింది. అయినప్పటికీ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే అంతిమలక్ష్యం! అయితే, కాలక్రమంలో ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగంగా మారింది. అన్ని రంగాలలోను డబ్బే ప్రధానమైన రీతిలోనే ఉపాధ్యాయ వృత్తి కూడా ఆ కోవలోకే చేరడం ఆందోళన కలిగించే అంశం! సమాజంలోని పరిణామాలు ఉపాధ్యాయుణ్ణి ఒక యంత్రంగా మార్చివేశాయి. ర్యాంకులు, సీట్లు, ఉద్యోగాలు – వీటి మధ్య బోధనావృత్తి నలిగిపోయింది.

ఇన్ని మార్పులు ఉపాధ్యాయ వృత్తిలో సంభవించినప్పటికీ సమాజం ఉపాధ్యాయునిలో ఆదర్శ స్థితినే కోరుకుంటోంది. ఉపాధ్యాయుని ఒక ఉద్యోగిగా చూడలేకపోతుంది. ఒక భవిష్యత్తు తరాన్ని నిర్మించే బాధ్యతను భుజస్కంధాల మీద వేసుకొని మోసే కర్మజీవిగానే గుర్తిస్తోంది. సర్టిఫికెట్లు, ర్యాంకులు, అనేవి నేటి కాలంలో ప్రధాన అంశాలుగా మారి ఉపాధ్యాయుని సేవాభావనకు దూరం చేస్తోంది.

నిజంగా ఉపాధ్యాయుడు నేటి కాలంలో బోధనను బాధ్యతగా నిర్వర్తిస్తే, ఈ రోజు సమాజంలో వికృతమైన, అమానవీయ సంఘటనలకు అవకాశముండేదికాదు. సినిమా, టి.వి., అంతర్జాలం, చరవాణి మొదలైన ఆధునిక సాంకేతిక

పరిజ్ఞానం. విద్యార్థులను ఎంతగా పెడత్రోవపట్టించాలని చూసినా ఉపాధ్యాయుడు మేరుపర్వతోన్నతుడై విద్యార్థుల నైతిక ప్రవర్తనను నేటికీ దిశానిర్దేశం చేసేవాడు. అంటే ఇప్పటికీ నిజాయితీ, అంకిత భావంగల ఉపాధ్యాయులు అవిశ్రాంతంగా పనిజేస్తూనే ఉన్నారు.

ఉపాధ్యాయవృత్తి ఆర్థిక సంబంధాలకు దూరంగా సమాజహితంగా, ఆదర్శప్రాయంగా ఉంటే, ఈ సమాజంలోనుండి ఎందరో రాధాకృష్ణులు, అబ్దుల్‌కలాంలు ఉద్భవిస్తూనే ఉంటారు. కాలమెంత మారినా, లోకం వెర్రిపోకడలు పోయినా ఉపాధ్యాయునిది తండ్రి తరువాత తండ్రి స్థానమే సమాజంలో ఎప్పటికీ మారదు. మారకూడదు కూడా!

### ఉపాధ్యాయునికి వృత్తినైపుణ్యం పెంపుదల అవసరమా?

మనిషి తనలోని లోటుపాట్లను ఎప్పటికప్పుడు సవరించుకుంటూ సాగితే అతను సమాజంలో గొప్పవాడుగా నిలుస్తాడనేది జగమెరిగిన సత్యం! ఉపాధ్యాయుడు కాలగమనంలో వచ్చిన మార్పులను నిశితంగా పరిశీలిస్తూ మారుతున్న, ఆవిష్కృతమౌతున్న కొత్త కొత్త విజ్ఞానాలను, అవకాశాలను అందిపుచ్చుకొని తన బోధనానైపుణ్యం పెంచుకుని ఉత్తమ ఉపాధ్యాయునిగా నిలవాలి. అప్పుడే విద్యార్థులకు, సమాజానికి మేలుచేసినవాడవుతాడు. అలాకాకుండా ఒకే విధమైన మూసపద్ధతిలో బోధిస్తుంటే వృత్తిపట్ల ఉపాధ్యాయునికి, ఉపాధ్యాయునిపట్ల విద్యార్థికి సాంకేతికతను - నూతన విధానాలను అందిపుచ్చుకొని తన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో అవసరం. నవనవోన్మేషశాలియైన ఉపాధ్యాయుడు ఎల్లప్పుడు ప్రాతఃస్మరణీయుడేకదా!

### వృత్తిపరమైన అభివృద్ధికి దోహదపడే అంశాలు :

1) **శిక్షణ :** ఆర్.టి.ఇ.-2009 రాష్ట్ర విద్యా ప్రణాళిక - 2011 ప్రకారం ప్రతి ఉపాధ్యాయునికి ఒక సంవత్సరంలో కనీసం రెండు / మూడు వృత్యంతర శిక్షణలు అవసరమని నిర్వచిస్తున్నది. ఈ శిక్షణలు ఉపాధ్యాయుని బోధనా పటిమకు మెరుగులు దిద్దుతాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచనలకనుగుణంగా విద్యార్థులకు అవసరమగు జ్ఞానాన్ని అందించడంలో ఉపాధ్యాయులకు ఈ శిక్షణలు ఎంతో దోహదపడుతాయి.

2) **సాహితీ సంస్థలతో అనుబంధాలు :** భాషోపాధ్యాయుడు తన ప్రాంతంలో చైతన్యవంతంగా పనిచేస్తున్న సాహితీ సంస్థలతో నిరంతర అనుబంధాన్ని కొనసాగించడం ఎంతైనా అవసరం. తద్వారా సాహిత్యంలో వస్తున్న మార్పులు, నూతన పోకడలు, క్రొత్త క్రొత్త ప్రక్రియల్ని అర్థం చేసుకొని, తన బోధనను మెరుగుపరుచుకోగలుగుతాడు.

3) **సబ్జెక్టు ఫోరం :** ఈనాడు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సబ్జెక్టుఫోరంలు చురుగ్గా తమ పాత్రను నిర్వహిస్తున్నాయి. ఈ ఫోరంలలోని ఉపాధ్యాయులు తమ తోటి ఉపాధ్యాయులతో విషయ సంబంధమైన క్రొత్త క్రొత్త బోధనా వ్యూహాలను పరస్పరం వినిమయం చేసుకోగలుగుతున్నారు. ఇది ఉపాధ్యాయులకు బోధనలో ఎంతగానో ఉపకరిస్తుంది.

4) **అధ్యయనాభిలాష :** జ్ఞానమనేది ఒక సముద్రం లాంటిది. ఎంత గ్రోలినా ఇంకా తెలుసుకోవలసినది చాలా ఉంటుంది. కనుక ఉపాధ్యాయుడు నిరంతరాధ్యయన పిపాసియై ఉండాలి.

5) **గ్రంథాలయ సభ్యత్వము - పఠనము :** ప్రతి భాషోపాధ్యాయుడు సమీప గ్రంథాలయాలలో సభ్యత్వం విధిగా కలిగి ఉండాలి. తద్వారా తన పఠనాభిలాషను నిరంతరం పెంపొందించుకొనే అవకాశముంటుంది.

6) **స్వీయగ్రంథాలయాలు :** పుస్తకం హస్తభూషణమన్నట్లుగా భాషోపాధ్యాయుడు తప్పనిసరిగా స్వీయగ్రంథాలయాన్ని కలిగి ఉండాలి. అందులో పురాణ, ఇతిహాస, కావ్య ప్రబంధాలతోపాటు, నిఘంటు, వ్యాకరణ, విమర్శ, జానపద, ఆధునిక సాహిత్యానికి సంబంధించిన వివిధ ప్రక్రియలకు చెందిన అన్ని రకాల గ్రంథాలను ప్రోగుచేసుకొని గ్రంథాలయాన్ని సుసంపన్నం చేసుకోవాలి. ఇది ఉపాధ్యాయుని స్వీయ అధ్యయనశీలతను పెంపొందిస్తుంది.

**7) ఉన్నత విద్యను పెంపొందించుకోవడం :** ఉపాధ్యాయులు తమ వృత్తికి అవసరమైన విద్యార్హతలకు పరిమితం కాకుండా పి.జి., ఎం.ఫిల్., పి.హెచ్.డి. వంటి స్నాతకోత్తరస్థాయి జ్ఞానాన్ని పెంపొందిచుకోవాలి.

**8) సెమినార్లు – వర్కుషాపులు :** కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో తరచూ నిర్వహింపబడే సెమినార్లు మరియు కార్యశాలల్లో ఉపాధ్యాయులు పాల్గొనడానికి ఉత్సాహం చూపాలి. బోధనాభ్యసన ప్రక్రియల్లో అదనపు సమాచారాన్ని అందించడానికి ఉపాధ్యాయునికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.

**9) సాహిత్య కార్యక్రమాలు :** పుస్తకావిష్కరణలు, కవి సమ్మేళనాలు మొదలైన సాహిత్యకార్యక్రమాల్లో ఉపాధ్యాయులు చురుగ్గా పాల్గొనడం ద్వారా తన సాహిత్యాభిరుచిని పెంచుకోవచ్చు.

**10) రచనా వ్యాసంగం :** ఉపాధ్యాయుడు కవితారచన, విమర్శ, ప్రసంగ వ్యాసపత్ర సమర్పణ, పత్రికావ్యాసాలు మొదలైన రచనా వ్యాసంగాలను నిరంతరం కొనసాగించాలి. తద్వారా తన భావనాశక్తికి పదును పెట్టుకున్న వాడవుతాడు.

**11) చర్చలు – ప్రసారమాధ్య వీక్షణం :** ఈనాడు ప్రసారమాధ్యమాలు సాహితీ చర్చలను విస్తృతంగా ప్రసారం చేస్తున్నాయి. ప్రముఖులైన సాహితీవేత్తలతో సమకాలీన సామాజిక స్పృహతో ముఖాముఖి చర్చలను, ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. అటువంటి చర్చలను భాషోపాధ్యాయులు వీక్షించడంద్వారా, ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా తన జ్ఞాన పరిధిని విస్తృతం చేసుకోవచ్చు.

## బోధనకు ఉపకరించే సంస్థలు

నేటి సమాజంలో అనేక స్వచ్ఛందసంస్థలు భాషాభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నాయి. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించడానికి, మానవతా దృక్పథాన్ని అలవరచడానికి అవసరమైన కార్యక్రమాలకు ఇలాంటి సంస్థలు అండగా నిలుస్తున్నాయి. పావని సేవాసమితి, సత్యసాయి సేవాసమితి, లయన్స్ మరియు రోటరీక్లబ్బులు, ఛారిటీ సంస్థలు ఉపాధ్యాయులను నిరంతరం ప్రోత్సహిస్తూ తమవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయి.

## ఉపాధ్యాయ కళాశాలలతో సంబంధాలు

ఉపాధ్యాయుడు తన ప్రాంతంలోని ఉపాధ్యాయ విద్య కళాశాలలతో విద్యా పరిశోధనా సంస్థలతో (డి.ఇ.డి., బి.ఇ.డి, ఎల్.పి.టి., ఎస్.సి.ఇ.ఆర్.టి., ఎన్.సి.ఇ.ఆర్.టి. మొ॥వి) నేరుగా సంబంధాలను కలిగి ఉండాలి. తద్వారా విద్యా బోధనలో వస్తున్న మార్పులను, నూతన పోకడలను ఎప్పటికప్పుడు సవరించుకోవచ్చును.

## స్కూల్ కాంప్లెక్స్‌లు

విద్యాశాఖ ఆదేశానుసారం ఈ రోజు సబ్జెక్టుల వారీగా ఒక విద్యా సంవత్సరంలో కనీసం 4 సమావేశాలు నిర్వహించాలి. అయితే సమావేశాలు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో నిర్వహింపబడుతాయి. మండలంలోని సీనియర్ ఉపాధ్యాయుడు గాని, ఆ పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడు గాని సహాయ కార్యదర్శిగా ఉంటారు. డివిజన్ స్థాయి రిసోర్స్ పర్సన్‌ల సేవలను ఈ సమావేశాల్లో విధిగా ఉపయోగించుకోవాలి. వీటిలో కొత్త పుస్తకాలపై అవగాహన చర్చలు, పాఠ్యప్రణాళికల తయారీ, ప్రశ్న పత్రాల తయారీ, మోడల్ లెసన్స్, రాబోయే నెలల్లో చెప్పబోయే పాఠాల ఇబ్బందులపై చర్చ ప్రధానాంశాలుగా ఉండాలి.

నిరంతర చైతన్యవంతుడైన భాషోపాధ్యాయుడు విద్యార్థులకు ఉపకరించే ఏ వాటిని విస్మరించకుండా నిజజీవన గమనంలో విద్యార్థులకు పనికివచ్చే అంశాల పట్ల చూపులు సారిస్తూ, సమాజంతో మమేకమై తననుతాను ఎల్లవేళలా సంస్కరించుకుంటూ ఉత్తమ భాషోపాధ్యాయుడుగా విద్యార్థుల హృదయాల్లో నిలవాలి.

# భాషోపాధ్యాయుల స్వీయ మూల్యాంకన పత్రం

## Self Appraised Paper - Format

ఉపాధ్యాయుని పేరు : ______________________ మాసం : ____________

పాఠశాల పేరు : ____________________ మండలం : ____________ జిల్లా : ____________

(సూచన : ఒక ఫార్మేటివ్ పూర్తికాగానే ఒకసారి దీన్ని పూరించాలి.)

### A. సాధారణ అంశాలు - ప్రణాళికలు

| | | |
|---|---|---|
| 1) | ఈ మాసాలకు చెందిన పాఠాలు పూర్తి అయినవి. | అవును / కాదు |
| 2) | వార్షిక ప్రణాళిక రూపొందించుకొని, ఆయా మాసాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను నిర్వహించాను. | అవును / కాదు |
| 3) | వార్షిక ప్రణాళికలోని అంశాలను ప్రధానోపాధ్యాయులు పరిశీలించి సమీక్షించారు. సలహాలు సూచనలు ఇచ్చారు. | అవును / కాదు |
| 4) | మాసవారీగా వార్షిక ప్రణాళికలో స్వీయ ప్రతిస్పందనలు రాసుకొన్నాను. | అవును / కాదు |
| 5) | ఈ మాసం / మాసాలకు చెందిన పాఠాలకు పాఠ్యప్రణాళికను రాసాను. దాన్ని అనుసరించి బోధించాను. | అవును / కాదు |
| 6) | పాఠాల వారీగా రాసిన పాఠ్యప్రణాళికల్లో అవసరమైన అరుదు సమాచారాన్ని సేకరించి రాసుకొన్నాను. | అవును / కాదు |
| 7) | పాఠం వారీగా స్వీయప్రతిస్పందనలను పాఠ్యప్రణాళికలో నమోదు చేసుకొన్నాను. | అవును / కాదు |
| 8) | తరగతి గదిలో పిల్లలు అర్థాలు తెల్సుకొనుటకువీలుగా నిఘంటువులు ఉన్నాయి. వీటిని పిల్లలు రెగ్యులర్‌గా వినియోగిస్తున్నారు. | అవును / కాదు |

### B. బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ

| | | |
|---|---|---|
| 9) | ప్రతి పాఠం ప్రారంభంలోని ఉన్ముఖీకరణ చిత్రం / సన్నివేశానికి సంబంధించిన ప్రశ్నల ద్వారా పిల్లలను కార్యోన్ముఖులను చేసాను. | అవును / కాదు |
| 10) | పాఠం యొక్క ఉద్దేశం / నేపథ్యం, కవిపరిచయం మొదలగునవి పిల్లలందరూ అవగాహన చేసుకొన్నారు. వాటి గురించి చెప్పగలుగుతాను. | అవును / కాదు |
| 11) | విద్యార్థులకు సూచనలగడిలో ఇచ్చిన అర్థసంగ్రహణ, పఠన కృత్యాలు నిర్వహించాను. పిల్లలు నిఘంటువును చూడడం లేదా చర్చించడం ద్వారా అర్థాలను సొంతంగా తెల్సుకోవడానికి అలవాటుపడ్డాను. | అవును / కాదు |
| 12) | పాఠంలోని విషయం గురించి పిల్లలకు అవగాహన కల్పించడానికి చర్చ నిర్వహిస్తున్నాను. దీంట్లో పిల్లలందరూ పాల్గొని స్వేచ్ఛగా మాట్లాడగల్గుతున్నాను. | అవును / కాదు |

| | | |
|---|---|---|
| 13) | పాఠంలోని విషయం ఆధారంగా పిల్లలను ఆలోచింపజేస్తున్నాను. ఇందుకోసం పాఠం మధ్యలో గడిలో ఇచ్చిన ప్రశ్నలను అడగటంతోపాటు అదనపు ప్రశ్నలను తయారుచేసుకొని ఆలోచింపజేస్తున్నాను. | అవును / కాదు |
| 14) | 'ఇవిచేయండి' అనే పేరుతో సామర్థ్యాల వారీగా ఇచ్చిన అభ్యాసాలను ఒక్కొక్క పీరియడ్‌చొప్పున కేటాయించుకొని నిర్వహిస్తున్నాను. | అవును / కాదు |
| 15) | 'వినయం మాట్లాడడం' కోసం ఇచ్చిన అంశాల గురించి పిల్లలందరూ మాట్లాడగలరు. | అవును / కాదు |
| 16) | పాఠాన్ని పిల్లలందరూ ధారాళంగా చదువగలరు. దానికి సంబంధించిన అభ్యాసాలను సాధించగలరు. | అవును / కాదు |
| 17) | "స్వీయరచన" అభ్యాసంలో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను పిల్లలందరూ సొంతంగా రాశారు. | అవును / కాదు |
| 18) | సృజనాత్మక వ్యక్తీకరణకోసం ఇచ్చిన అంశాలను పిల్లలందరూ రాయగలిగారు. | అవును / కాదు |
| 19) | స్వీయరచన, సృజనాత్మకత ప్రశ్నలకు పిల్లలు రాసిన జవాబులను తరగతిలో చర్చింపజేసి సరిదిద్దాను. | అవును / కాదు |
| 20) | 80 శాతం మంది పిల్లలు పాఠానికి నిర్దేశించిన సామర్థ్యాలను సాధించగలిగారు. | అవును / కాదు |

## C. నిరంతర సమగ్ర మూల్యాంకనం (మొదటి / రెండవ / మూడవ / నాల్గవ)

| | | |
|---|---|---|
| 21) | పిల్లలందరూ గ్రంథాలయ పుస్తకాలు / బాలసాహిత్యం / వార్తాపత్రికలోని అంశాలను చదివి సమీక్ష నివేదిక రాశారు. వాటిని పరిశీలించి సూచికల ఆధారంగా దిద్ది మార్కులు కేటాయించాను. | అవును / కాదు |
| 22) | రాతపనుల కోసం పిల్లలందరూ పాఠాలలోని ప్రశ్నలకు సొంతంగా జవాబులు రాశారు. పిల్లలు రాసిన జవాబులు ఏ ఇద్దరివి కూడా ఒకే విధంగా ఉండవు. | అవును / కాదు |
| 23) | పిల్లలచేత ప్రాజెక్టుపనులు చేయించాను. వారు సొంతంగా నివేదిక రాసి, దాని గురించి తరగతిలో వివరించారు. దీని ఆధారంగా వారికి సూచికల ప్రకారం మార్కులు కేటాయించాను. | అవును / కాదు |
| 24) | పిల్లలకు ఆలోచింపచేసే ప్రశ్నలతో (పాఠ్య పుస్తకంలో ఉన్నవి కాకుండా) లఘు పరీక్ష నిర్వహించాను. పిల్లలు చేసిన దోషాలను గుర్తించి వాటిని సరిదిద్దుకునేలా అవగాహన కల్పించాను. | అవును / కాదు |
| 25) | సంగ్రహణాత్మక మూల్యాంకనానికి చెందిన జవాబు పత్రాలను సూచికల ఆధారంగా దిద్ది, వాటిని పిల్లలకు ఇచ్చాను. | అవును / కాదు |
| 26) | FA, SA వివరాలను online ద్వారా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు సమర్పించాను. | అవును / కాదు |
| 27) | క్యుములేటివ్ రికార్డులో FA, SA వివరాలు నమోదుచేసి వారి తల్లిదండ్రులకు పంపాను. | అవును / కాదు |

## D. భాషాభివృద్ధి కార్యక్రమాలు

| | | |
|---|---|---|
| 28) | పాఠశాలలో భాషాభివృద్ధికి సంబంధించిన ____________ కార్యక్రమాన్ని నిర్వహించాను. దీంట్లో పిల్లలు పాల్గొన్నారు. | అవును / కాదు |
| 29) | 1వ / 2వ / 3వ / 4వ / 5వ స్కూల్ సమావేశానికి హాజరై అక్కడ నిర్వహించిన కృత్యాలు / కార్యక్రమంలో పాల్గొన్నాను. వివరాలను నోటుబుక్కులో నమోదుచేసుకొని అమలుపరుస్తున్నాను. | అవును / కాదు |
| 30) | భాషాబోధనను, ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యానికి సంబంధించిన రెండు పుస్తకాలను చదివాను. వాటి పేరు : 1) ____________, 2) ____________ | అవును / కాదు |

# Chapter-IX

## భాషాభివృద్ధి కార్యక్రమాలు

1) **కవిసమ్మేళనాలు / కళా ప్రదర్శనలు :** పాఠశాల స్థాయిలో స్థానికంగా ఉండే కవులను / కళాకారులను పిలిపించి వారిచే కవిత్వంపై / కళలపై అవగాహన కలిగేలా ముఖాముఖీలు నిర్వహించాలి. తద్వార విద్యార్థులకు కవిసమ్మేళనాలపై / కళాప్రదర్శనలపై ఒక అవగాహన కలుగుతుంది. తరువాతి కాలంలో విద్యార్థులచే కవితలను రాయించి వాటిని పాఠశాల విద్యార్థుల కవిసమ్మేళనాలుగా నిర్వహించాలి. కళారూపాల ప్రదర్శన చేయించాలి. కవితలపై అభిప్రాయాలు చెప్పించడం । ప్రశంసింపజేయించడం చేయాలి. ఇవి విద్యార్థులకు సామాజిక స్పృహను కలిగిస్తాయి. వారిలోని సృజనాత్మకత బహితర్గతమవుతుంది. వీటి నిర్వహణకు జాతీయ పండుగలను / ప్రసిద్ధుల జయంతి ఉత్సవ దినాలను ఉపయోగించుకోవడం సబబుగా ఉంటుంది.

2) **సాంస్కృతిక కార్యక్రమాలు :** జాతీయ పండగల సందర్భంగా, పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా, బాలల దినోత్సవ సందర్భంగా పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయవచ్చు. పాటలు – నృత్యాలు – అభియనయాలు ఏకపాత్రాభినయాలు – కదంబాలు – నాటికలు – నృత్యరూపకాలు వంటి ప్రదర్శనలలో పిల్లలచే చేయించాలి.

3) **వ్యాసరచన – వక్తృత్వపుపోటీలు :** వివిధ సందర్భాలలో వ్యాసరచన – వక్తృత్వపుపోటీలు నిర్వహించాలి. సమీపంలో ఎక్కడయినా ఈ పోటీలు జరిగినప్పుడు పాఠశాల విద్యార్థులను పాల్గొనేలా ప్రోత్సహించాలి.

4) **పద్యపఠనం :** పద్యపఠనం అనేది ఒక కళ. పిల్లల్లో పద్యపఠనంపట్ల ఆసక్తిని కలిగించడానికి పద్యపఠన పోటీలు తరచుగా నిర్వహించాలి. అందులో పాల్గొనాలనే ఆసక్తితో ఎక్కువ సంఖ్యలో పద్యాలను విద్యార్థులు ధారణ చేయగలుగుతారు. ఇది వారి భాషాజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు పద్యరసానుభూతిని కలిగిస్తుంది. అభిరుచిన పెంచుతుంది. కనీసం ప్రతి తరగతిలో నెలకొకసారైనా ఆయా సందర్భాలను బట్టి పద్యపఠనం నిర్వహించాలి.

5) **భాషామేళాలు :** ఆయా కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలోని విద్యార్థులు వివిధ వ్యవహార రూపాలలో చేసిన సృజనాత్మక రచనలను ఒకేచోట చేర్చి ప్రదర్శింపజేయాలి. వీటిని అన్ని పాఠశాలల విద్యార్థులు చదివి అర్థం చేసుకోవడం ద్వారా కొత్త రచనలు చేయగలిగిన నైపుణ్యాలను పెంపొందించుకోగలుగుతారు. ఇటువంటి భాషా మేళాలు విద్యార్థుల్లో కొత్త స్ఫూర్తిని కలిగిస్తాయి.

6) **పుస్తక ప్రదర్శన :** పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలతోపాటు భాషోపాధ్యాయులు తమకున్న పరిచయాలనుపయోగించుకొని పిల్లల కవసరమైన సాహితీ సంబంధమైన పుస్తకాలను సేకరించి కాంప్లెక్స్ పరిధిలో

ఒక పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేయాలి. ఇలా చేయడంవల్ల పిల్లల్లో పుస్తకాలను సేకరించాలనే ఆసక్తిని, అభిరుచిని కలుగజేస్తుంది.

7) **సంకలనాలు :** భాషోపాధ్యాయుడు ప్రతిభగల విద్యార్థులచేత కవితలు, పద్యాలు, గేయాలు, చిన్న చిన్న కథలు మొదలగు రచనలు చేయించి వాటిని ఒక పుస్తక రూపంలో సంకలనం చేయాలి. ఇది మిగతా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఆర్థిక వనరులు అందుబాటులో ఉంటే (దాతల సహాయం) ఆయా పుస్తకాలను ముద్రించాలి.

8) **స్కూల్ మేగజైన్ :** భాషోపాధ్యాయుడు విద్యార్థులను భాగస్వాములుగా చేసి, వారిచేత వ్యాసాలు, పాఠశాలకు సంబంధించిన విశేషాలు, అనుభూతులు, అనుభవాలు, పాఠశాల పండుగల నివేదికలు, పుస్తక సమీక్షలు, సంపాదకీయాలు, వర్తమాన సంఘటనలపై విమర్శ వ్యాసాలు, వివిధ విషయాలకు సంబంధించిన సేకరణలు మొదలైన వాటితో ఒక 'స్కూల్‌మేగజైన్'ను ప్రతి సంవత్సరం విడుదల చేయాలి. ఇది విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుంది.

9) **గోడపత్రిక నిర్వహణ :** పాఠశాల స్థాయిలో ప్రతి రోజు వివిధ దినపత్రికల్లో వచ్చే సాహితీ సాంస్కృతిక చారిత్రక సంబంధమైన విశేషాంశాలను సేకరింపజేసి గోడపత్రికలో విద్యార్థులచేత ప్రదర్శింపజేయాలి. ఈ గోడపత్రికలో ఒక సూక్తిని, నిన్నటి ప్రశ్న – నేటి జవాబు వంటి వాటిని కూడా చేర్చాలి. దీనివల్ల ప్రతి విద్యార్థి పత్రికల్లోని వర్తమాన విషయాలను తెలుసుకొనే అలవాటు, చదివేతత్త్వం అలవడుతుంది.

10) **పాఠశాల గ్రంథాలయ నిర్వహణ :** భాషోపాధ్యాయుడు గ్రంథాలయ నిర్వహణ బాధ్యతను తీసుకొని లైబ్రరి పీరియడులో విద్యార్థులచేత పుస్తకాలను, పత్రికలను, మేగజైన్లను చదివేటట్లు ప్రోత్సహించాలి. దీనివల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరిగి విషయ పరిజ్ఞానం విస్తృతమవుతుంది.

11) **వ్యాఖ్యానాలు :** వర్తమాన కాలంలో 'వ్యాఖ్యానం' ఒక కళగా సంతరించుకుంది. కొన్ని సందర్భాలలో వ్యాఖ్యానాన్ని ప్రత్యక్షంగా తిలకించడానికి సభలకు హాజరవడం కూడా కనిపిస్తుంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న వ్యాఖ్యానంలోని మెళకువలను విద్యార్థులకు పరిచయం చేస్తూ, తగు తర్ఫీదునిచ్చి పాఠశాలలోని వివిధ సందర్భాలలో వారిచేత వ్యాఖ్యానం (Anchoring) చేయించాలి.

12) **బాలసభలు :** భాషోపాధ్యాయుడు విద్యార్థులకు సభా నిర్వహణ విషయాలలో శిక్షణనిచ్చి, పాఠశాల విద్యార్థులను భాగస్వాములను చేస్తూ, బాలసభలను నిర్వహింపజేయాలి. ఆ సభలలో ఉపాధ్యాయులు ప్రేక్షక స్థానం వహించాలి. చక్కగా నిర్వహించిన విద్యార్థులకు బహుమతులనిచ్చి ప్రోత్సహించాలి.

13) **భాషా సంఘాలు (క్లబ్బులు) :** పైన తెల్సుకున్న అన్ని కార్యక్రమాలను విద్యార్థుల భాషాక్లబ్బుల ద్వారా నిర్వహించాలి. ఆయా తరగతుల్లో ఉండే విద్యార్థులందరిని భాషా సంఘం సభ్యులుగా భావించాలి. తరగతి భాషాసంఘానికి ఆసక్తి ఉన్న / విద్యార్థులందరికి ఆమోదయోగ్యుడైన విద్యార్థిని కార్యనిర్వాహకుడుగా నియమించి వారి ద్వారా పాఠశాల భాషా సంఘ కార్యనిర్వాహకుడిని ఎంపికచేయాలి. వీరందరిని భాషా సంఘ కార్యనిర్వాహక సభ్యులుగా భాషా సంఘ కార్యకలాపాలు (కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు / పుస్తక ఆవిష్కరణలు / పద్యపఠనం మొదలగునవి) నిర్వహించాలి. దీనికి మార్గదర్శిగా ఉండాల్సింది ఉపాధ్యాయుడే.

ఉపాధ్యాయుడి మార్గదర్శనం ⟶ విద్యార్థి ఉత్తమ జీవితం ⟶ దేశభవితవ్యం.

# Chapter-X

## సృజనాత్మకత - వ్యవహారరూపాలు

భాషానైపుణ్యాల సాధనలో వివిధ సాహిత్య ప్రక్రియల (వ్యవహార రూపాల) స్వరూప, స్వభావాలు అర్థం చేసుకొని, పిల్లలు తమ రచనా నైపుణ్యానికి, ఊహాశక్తికి, సృజన శక్తికి పదనుపెట్టుకోవడానికి ఉద్దేశించిన అభ్యసన ప్రక్రియ 'సృజనాత్మకత / ప్రశంస' అంశాలను రాయడం. ఈ అభ్యాసం సక్రమంగా నిర్వహింపబడాలంటే ఆయా ప్రక్రియలపట్ల ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన అవసరం.

6 నుండి 10 తరగతుల వరకు ఈ శీర్షిక కింద ఇచ్చిన ప్రశ్నల్లో ఈ కింది ప్రక్రియలు చేర్చడమైంది.

ప్రక్రియ : నిర్మాణాత్మక విధానాన్ని కలిగియున్న భాషావ్యవహారం

1) గేయం (7)
2) కథ (5)
3) సంభాషణ (9)
4) వ్యాసం (9)
5) లేఖ (11)
6) కవిత (13)
7) ఏకపాత్ర (7)
8) ఆత్మకథ (5)
9) పోస్టరు (2)
10) నినాదాలు (3)
11) సూక్తులు (2)
12) వర్ణన (2)
13) ప్రశ్నావళి (3)
14) ప్రకటన (1)
15) ఆహ్వానపత్రం (1)
16) అభినందన పత్రం (2)
17) అభినందన వ్యాసం (2)
18) ప్రసంగ వ్యాసం (1)
19) స్వగతం (1)
20) సంపాదకీయ వ్యాసం (1)
21) పుస్తక పరిచయం (పీఠిక) (1)
22) కరపత్రం

బ్రాకెట్లలో సూచించిన సంఖ్య 6 నుండి 10 త॥ వరకు ఆ వ్యవహార రూపం ఎన్నిసార్లు ఇవ్వబడిందో తెల్పుతుంది.

## తరగతి వారీగా నిర్దేశించిన ప్రక్రియలు (సృజనాత్మకత అంశాల ఆధారంగా)

| క్ర.సం. | 6వ తరగతి | 7వ తరగతి | 8వ తరగతి | 9వ తరగతి | 10వ తరగతి |
|---|---|---|---|---|---|
| 1 | చిన్న గేయం (10) | లేఖ (10) నినాదాలు (3) | పత్రికకు లేఖ | అభినందనవ్యాసం (2), ప్రశంస | నినాదాలు, సూక్తులు |
| 2 | కథ (6) సంభాషణ (9) | లేఖ | మిత్రునికి లేఖ, వ్యాసం | కటవవిత, సన్మానపత్రం | వ్యాసం, సంభాషణ |
| 3 | వ్యాసం (9) | సూక్తులు (పద్యాల ఆధారం) | సంభాషణ | కవిత / గేయం, పత్రికకులేఖ | ఏకపాత్రాభినయం, ఆత్మకథ |
| 4 | లేఖ (12) (యాత్రావిశేషం) | చిన్న కవిత | ప్రశ్నావళి (3) | ఇంటర్వ్యూ ప్రశ్నావళి, పత్రికకకకు ఖలలేఖ (12) | వర్ణన కవిత |
| 5 | పట్టిక | వర్ణన (2), చిన్న కవిత | ప్రకటన (1) | కథ, కరపత్రం | కవిత, కరపత్రం |
| 6 | వ్యాసం, సంభాషణ | చిన్న కవిత, ఏకపాత్ర | ఆహ్వానపత్రం (1) | కరపత్రం | అభినందన వ్యాసం |
| 7 | గేయం, సంభాషణ | ఆత్మకథ, ఏకపాత్ర (పదర్శన) | గేయం | ఏకపాత్రాభినయం | మిత్రునికి లేఖ, నీతికథ |
| 8 | కవిత (11) / పాట - ఏకపాత్ర (5) | బతుకమ్మపాట, లేఖ | చచిన్న కథ, అభినందన పత్రం (2)) | వ్యాసం | సస్త్రంపాదకీయ వ్యాసం (1) |
| 9 | కవిత / గేయం | గేయానికి అభినయం, కవిత / గేయం | కవిత / గేయం | పత్రికకు లేఖ | వచన కవిత, ఇంటర్వ్యూ ప్రశ్నలు |
| 10 | సంభాషణ | నినాదాలు | పోస్టరు | ప్రసంగ వ్యాసం (1) | చారిత్రక / సాంస్కృతిక విశేషాల వ్యాసం |
| 11 | ఆత్మకథ (5), సంభాషణ | ఆత్మకథ, గేయం | ఆత్మకథ, అభినందనపత్రం | స్వగటం, సంభాషణ | మిత్రునికి లేఖ, కవిత |
| 12 | పోస్టరు (3), సంభాషణ | ఏకపాత్ర | కథ | కథ పొడిగింపు / ముగింపు | పుస్తక పరిచయం (పీఠిక) |

వ్యవహార రూపాల సాధన భాషాభ్యసనంలో ఎంతో కీలకమైంది. తాము నేర్చుకుంటున్న భాషను వివిధ సందర్భాలకు తగిన విధంగా సమర్థంగా ఉపయోగించుకోవడానికి, చక్కని వాచకానికి, రచనాశక్తికి ఇది ఉపయోగపడుతుంది. ఈ అంశాల్లో ప్రతిభకనబరచే పిల్లలకు మానసికానందంతోపాటు ఉత్తమ ప్రవృత్తులు (వైఖరులు) అలవడటానికి, జీవనోపాధికి, ఎంచుకున్న రంగాల్లో రాణించడానికీ తోడ్పడుతుంది. కాబట్టి ఉపాధ్యాయులు శ్రద్ధాసక్తులతో ఈ అభ్యసన ప్రక్రియ నిర్వహించడం అవసరం.

1) **గేయం :** పాడుకోవడానికి అనువుగా ఉంటుంది. మాత్రాఛందస్సులో ఉండవచ్చు. (అంటే ప్రతిపాదంలోనూ నిర్దుష్ట సంఖ్యలో మాత్రలుంటాయి.)

- పిల్లల స్థాయి ననుసరించి చిన్న చిన్న మాటలతో పాటగా కూర్చడాన్ని ప్రోత్సహించాలి.
- పాటలో భావం స్పష్టంగా వ్యక్తం కావాలి.
- ప్రాసపదాలుంటే బాగుంటుంది.
- ఏదో ఒక లయ (తాళం)లో పాడుకోవడానికి అనువుగా ఉండాలి.

ఉదా॥ అందరు కలిసి ఉండాలి
ఆనందాలే పండాలి
చెరువులు కుంటలు నిండాలి
పంటలు బాగా పండాలి
సంతోషంగా ఉండాలి
సంబురాలు మది నిండాలి...

2) **కథ / కథానిక :** వాస్తవ సంఘటనలకు కల్పిత ఘటనలకు కల్పనలు జోడించి రసవత్తరంగా వివరిస్తుంది కథ. సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రించడం కథానిక ప్రత్యేకత. పాత్రోచిత సంభాషణలు, సన్నివేశాల కల్ప, సందర్భోచిత వర్ణన కథను సారవంతం చేస్తాయి. క్లుప్తత కథానిక కుండే మరో లక్షణం.

6, 7, 8 తరగతుల్లో కథనం (కథ చెప్పడం, కొనసాగించడం) ప్రధానం. ఇందులో పాత్రలు, వాటి మధ్య సంభాషణలు, సంఘటనల వివరణ ఉంటుంది. ఉదా॥ పంచతంత్ర కథలు, వినోదాత్మక కథలు.

9, 10 తరగతుల్లో సన్నివేశాల కల్పన, వర్ణనలు ఉండే కథలను ఎంపిక చేసుకోవాలి. ఇటువంటి కథల్లో ఎత్తుగడ, సంఘటనల మధ్య సంబంధం, మనస్తత్త్వాల చిత్రణ, పాత్రోచిత సంభాషనలు... కొసమెరుపు ఉంటాయి. ఆధునిక కథానికల నుండి ఏవైనా ఉదాహరణగా పేర్కొనవచ్చు.

విద్యార్థులకు కథ స్వరూప, స్వభావాలపట్ల అవగాహన కల్పించి, పాఠ్యపుస్తకంలోని కథనే ఆధారంగా తీసుకొని వివరించి, ఆ విధంగా రాయడాన్ని ప్రోత్సహించడం సత్ఫలితాన్నిస్తుంది.

**3, 4, 5) సంభాషణ, వ్యాసం, లేఖ :** పిల్లల స్థాయి ననుసరించి వివరించి, సూచించిన అంశాల కనుగుణంగా రాయడాన్ని ప్రోత్సహించాలి.

**6) కవిత :** కవిత అంటే వచన కవితనే. ప్రాథమికి స్థాయిలో ప్రాసపదాలను ఉపయోగిస్తూ చిన్న చిన్న మాటలతో అర్థవంతమైన పాదాలను రూపొందిస్తూ, కవితలు రాయడాన్ని ప్రోత్సహించాలి. కనీసం 8-10 పాదాలుండేటట్లుగా చూడాలి.

ఆనందానికి ప్రతిరూపం అమ్మ
త్యాగానికి మరోరూపం అమ్మ
నిస్వార్థానికి నిండుదనం అమ్మ
నిరంతరం బిడ్డలమేలుకోరేది అమ్మ.
తనకున్నా లేకున్నా
తిన్నా తినకున్నా
కష్టమైనా, సుఖమైనా
తన బిడ్డలు మాత్రం చల్లగా ఉండాలని
ప్రతిక్షణం పరితపించే అమృత హృదయం - అమ్మ.

ఉన్నత తరగతుల్లో లోతైన భావాల ప్రకటనకు ప్రాధాన్యాన్నిస్తూ రాయడాన్ని ప్రోత్సహించాలి.

ఈ లోకంలో
కష్టాలన్నీ
నాచుట్టే పరిభ్రమిస్తున్నాయనుకున్నా
కాని,
చెట్టుకు రాతి దెబ్బలు తగలడం
పూల గుండెల్లోంచి సూదులు గుచ్చుకోవడం
తేనెటీగల సంపాదన పరులపాలు గావడం
చూసింతర్వాత తెలిసింది
మనం మనకోసం
జీవించినంత కాలం అన్నీ కష్టాలే
ఇతరులకోసం జీవిస్తుంటే
ఆ కష్టంలోనే సుఖం కనిపిస్తుందని.

**7) ఏకపాత్ర :** రంగస్థలం (వేదిక) మీద ఒకే పాత్ర నటిస్తూండటం ఏకపాత్రాభినయం అంటారు. ఒకేపాత్ర ఉండటమే ఏకపాత్ర. ఇది స్వగతానికి, ఆత్మకథకు దగ్గరగా ఉంటుంది. కాని వాచకాది అభినయాల ద్వారా (వాచికం, ఆంగికం, ఆహార్యం, సాత్వికం చతుర్విధాభినయాలు) ఆ పాత్ర రసపోషణ చేస్తూ, ప్రేక్షకులను / శ్రోతలను మంత్రముగ్ధులను చేస్తుంది. పౌరాణిక, చారిత్రక, ఐతిహాసిక, సామాజిక ప్రాధాన్యం గలిగిన పాత్రలనేగాక వైవిధ్యభరితమైన సామాన్య వ్యక్తులను కూడా ఏకపాత్రకు ఎంపిక చేసుకోవచ్చు.

6, 7, 8 త॥ విద్యార్థులకు 5 ని॥ నిడివిగల ఏకపాత్రలను, వాళ్ళచేత రాయించడం చేయవచ్చు. 9, 10 తరగతులకు 5-10 ని॥ల మధ్య ప్రదర్శించడానికి యోగ్యమైన రచనలు చేయించడానికి యత్నించాలి.

ఏకపాత్ర రసభరితమై ప్రేక్షకులను ఆకట్టుకోవలసి ఉంటుంది కాబట్టి ఉద్విగ్నభరితమైన (ఎమోషనల్) సన్నివేశాన్ని ఎన్నుకోవడం, వీర, హాస్య, అద్భుత రసాల్లో ఏదో ఒక దాన్ని ఆధారంగా చేసుకొని మాటలు రాయడం మీద దృష్టినుంచాలి.

ఉదా॥ శివాజీ, కర్ణుడు, పిట్టలదొర, మాయలఫకీరు, ఎరుకలసాని, రుద్రమ...

8) **ఆత్మకథ / స్వగతం :** ఎవరి అనుభవాలను వాళ్ళు ఉత్తమ పురుషలో ప్రకటించడం ఆత్మకథ. ఇది మనుషులేగాక ఇతర ప్రాణులు ఒక్కొక్క సందర్భంలో జడపదార్థాలు కూడా తమ అనుభవాలను చెప్పుకుంటాయి. 'స్వగతం' కూడా ఇంచుమించుగా ఆత్మకథ వంటిదే. స్వగతంలోని మాటలు తనలోతాను మాట్లాడుకుంటున్నట్లుంటే, ఆత్మకథలో బయటికి ప్రకటిస్తున్నట్లుంటాయి.

6, 7, 8 తరగతుల్లో విషయం వివరిస్తే చాలు. 9, 10 తరగతుల్లో వర్ణనాత్మకంగా, రసానుభూతిని కల్గించే విధంగా రాయడాన్ని ప్రోత్సహించాలి.

ప్రసిద్ధుల ఆత్మకథలు (సంగెం లక్ష్మీబాయి, గాంధీజీ, అబ్దుల్ కలాం... మొ॥). త్రిపురనేని గోపీచంద్, 'మాకూ ఉన్నాయి స్వగతాలు' చూస్తే అవగాహన పెరుగుతుంది.

9) **పోస్టరు :** ఏదైనా ఒక ప్రత్యేక సమాచారాన్ని సంక్షిప్తంగా / క్లుప్తంగా ప్రకటించడానికి వినియోగించే పత్రం పోస్టర్. ఇది సాధారణంగా గోడలకు అతికించి, అందరికి – దూరం నుండి కూడా స్పష్టంగా కనిపించేటట్లు బొమ్మలతో, పెద్ద అక్షరాలతో అలంకరిస్తారు. ఆకట్టుకునేటట్లు తయారుచేస్తారు.

తరగతి స్థాయి ననుసరించి, పిల్లలు తమ సృజనశక్తిని వినియోగించి వైవిధ్యభరితమైన పోస్టర్లు తయారుచేయడాన్ని ప్రోత్సహించాలి.

10) **నినాదాలు :** నినదించడానికి ఉపయోగించే మాటలు / వాక్యాలు ఉద్యమాలు, ఉత్సవాలు, ఊరేగింపులు, ధర్నాలు, పికెటింగులు తదితర కార్యక్రమాల్లో వీటిని వాడుతుంటారు.

చిన్న చిన్న వాక్యాల రూపంలో ఉండటం, ప్రాస పదాలను కల్గిఉండడం, శ్రోతల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపడం, గుండెల్లోకి గుచ్చుకపోవడం, నినాదాల ప్రత్యేక లక్షణాలు.

ఉదా॥ 1) పిల్లలు బడిలో –
పెద్దలు పనిలో

2) ఇల్లాలి చదువు
ఇంటికి వెలుగు

3) మొక్కలు నాటండి
చెట్లను పెంచండి

4) పరోపకారం పుణ్యమురా
పరపీడనమే పాపమురా

11) **సూక్తులు :** సంస్కృత సూక్తి (సు + ఉక్తి = మంచిమాట) ని తెలుగులో యథాతథంగా ఉపయోగిస్తున్నాం. దీని అర్థం మంచిమాట. మంచిని తెలిపేమాట (వాక్కు / వాక్యం). ఇందులో భావం ప్రధానం. వాక్యం పట్టుకోగలిగేటట్లు (క్యాచీగా) అంటే ధారణకు అనువైందిగా ఉండాలి. మంచిని ప్రబోధించాలి. కుప్తంగా ఉండాలి (అంటే మరీ పెద్ద పెద్ద సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల రూపంలో ఉండకూడదు).

భర్తృహరి సుభాషితాలు, వేమన నీతులు, పంచతంత్రంలోని వాక్యాలు, శతక పద్యాల్లోని భావాలు, భారత రామాయణాది ఇతిహాసాల్లోని సందేశాత్మక వాక్యాలు. మత గ్రంథాల్లోని నీతి వాక్యాలు, మహనీయుల అనుభవాల్లో నుంచి పుట్టిన మంచిమాటలు... అన్నీ సూక్తులే. వీటిని పిల్లల అవగాహనకు మాత్రమే చెప్పాలి. ఇచ్చిన అంశంపై పిల్లలు స్వతంత్రంగా రాసేలా ప్రోత్సహించాలి.

ఉదా ॥ తల్లిదండ్రులు కనిపించే దేవతలు! ఎంతకాలం జీవించామనేది కాదు. ఏం సాధించామనేదే ముఖ్యం. మొక్కైవంగనిది మానైవంగుతుందా (వంగదు) సాధనమున పనులు సమకూరుతాయి.

**12) వర్ణన :** సాధారణ విషయాన్ని వర్ణించి రాయడమే వర్ణన. అంటే ఒక మామూలు విషయాన్ని ఆలంకారికంగా, ఉపమానయుక్తంగా, అనుభూతి భరితంగా వివరించి వ్యక్తీకరించడమే వర్ణన. ఇది స్థాయినిబట్టి వేర్వేరుగా ఉంటుంది.

ఉదా ॥ సంధ్యాసమయం.

ఈ విషయాన్ని మామూలుగా చెప్పినపుడు...

'పడమటి దిక్కున సూర్యుడు అస్తమిస్తున్నాడు....'

- **6, 7, 8 త॥ స్థాయిలో –** సూర్యుడు రోజంతా పనిచేసి అలసిపోయి ఎర్రబారిన ముఖంతో పడమటి కొండలను చేరుకున్నాడు. ఆకాశం చీకటిని ఆహ్వానిస్తున్నట్లు బంగారు రంగును అలముకున్నది. వేగం తగ్గించిన సూర్యుడు మెల్లమెల్లగా పడమటి కొండమెట్లుదిగి, చీకటి గదిలో విశ్రాంతి తీసుకోవడానికి వెళ్ళసాగినాడు.
- **9, 10 త॥ స్థాయిలో –** రోజంతా ఆకాశవీథిలో అలసటనెరుగకుండా యుద్ధం చేసిన భాస్కరుడు పశ్చిమాద్రిని చేరగానే విశ్రాంతికి ఉద్యుక్తుడవుతున్నట్లు తన తాపం తగ్గించుకొన్నాడు. గాలులు చల్లగా ఊపిరిపీల్చుకోసాగినాయి. పక్షులకు తమ పిల్లలు గుర్తుకొచ్చి గూళ్ళవైపు పరుగులు తీస్తున్నాయి. కొండలు సూర్యుని ఆగమనానికి ఆనందం ప్రకటిస్తున్నట్లు అంచులను బంగారుహారతులుగా మార్చి ఆహ్వానం పలికినాయి. కొండకోనలు సూర్యుని నిర్గమనాన్ని భరించలేనట్లు చీకటినిండిన గుండెలను బిగబట్టుకున్నాయి. క్రమక్రమంగా చీకట్లు పరుచుకుంటుంటే చుక్కల సైన్యాన్ని వెంటబెట్టుకొని, ఆ చీకటి రాక్షసునితో యుద్ధం చేయడానికి చంద్రుడు సిద్ధమైనాడు. యుద్ధం మీది మక్కువతో చుక్కలు ఆకాశానికెక్కి తళుక్కుమన్నాయి.

**వర్ణన అంటే దృశ్యాలను వర్ణించడం మాత్రమే కాదు. మానసికస్థితిని, అనుభూతులను, సామాజిక పరిస్థితులను... మూర్త, అమూర్త పదార్థాలనన్నింటినీ వర్ణించవచ్చు. అందుకు తగిన శబ్దజాలం, ఉపమానాలు, అలంకారాలు ఎంపిక చేసుకొని వివరించడం ముఖ్యం.**

**13) ప్రశ్నావళి :** ఏదైనా ఒక విషయానికి సంబంధించిన వివరాలు తెలుసుకోడానికి రూపొందించుకునే ప్రశ్నల సమూహం. 1. సాధారణంగా పెద్దవాళ్ళ గురించి (ఇంటర్వ్యూ ద్వారా) తెలుసుకునే సందర్భంలో, 2. ఏదైనా ఒక రంగానికి సంబంధించిన వ్యక్తుల నుండి సమాచారం సేకరించేటప్పుడు, 3. ఒక పదవికి, ఉద్యోగానికి యోగ్యులైన వారిని ఎంపిక చేసుకునేటప్పుడు ఈ ప్రశ్నావళి అవసరమౌతుంది. పాఠ్యపుస్తకంలో ప్రశ్నావళి – మొదటి రెండు సందర్భాలలోనే ఉపయోగించడం జరుగుతున్నది.

ప్రశ్నావళిలోని ప్రశ్నలు 3 విభాగాలుగా ఉంటాయి.

1) వ్యక్తిగత సమాచారం రాబట్టేవి.

2) వృత్తి / రంగానికి సంబంధించినవి

3) అనుభవాలు, ఆశయాలు, ఆకాంక్షలు, సందేశం ఆశించేవి.

తరగతి స్థాయినిబట్టి ప్రశ్నల సంఖ్యలో హెచ్చుతగ్గులున్నా, పైన సూచించిన విభాగాలు ప్రశ్నావళిలో తప్పక చోటుచేసుకోవాలి.

ఉదా॥ **6, 7, 8 త॥ స్థాయిలో**

1) పూర్తిపేరు; పుట్టిన ప్రదేశం; తలిదండ్రులు; కుటుంబ నేపథ్యం –

2) వృత్తి / రంగంలోకి ప్రవేశించిన సందర్భం; ఆ రంగంలో చేసిన కృషి; కృషికి గుర్తింపు; ప్రస్తుత స్థితి...

3) అనుభవాలు : ఆశయం, ఆకాంక్ష; సందేశం...

**9, 10 త॥ స్థాయిలో** (పై అంశాలకు అదనంగా...)

1) బాల్యం గురించి, గ్రామ విశేషాల గురించి, కుటుంబం గురించి, ప్రభావం చూపిన వ్యక్తుల గురించిన వివరాలు అడగవచ్చు.

2) ఎంచుకున్న రంగం పట్ల అభిమానం కల్గడానికి కారణాలు, ఆ రంగంపట్ల అభిప్రాయం, స్థితిగతులు, చేసిన కృషి వివరాలు అడగవచ్చు.

3) ప్రేరణాత్మకమైన జీవిత సంఘటనలు, ఆ రంగం మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి చేపట్టవలసిన పనులు, ఆశయాలు నిర్ణయించుకోవడం వెనుకగల కారణాలూ చేర్చవచ్చు.

**14) ప్రకటన :** ఏదైనా ఒక విషయాన్ని ప్రకటించడం – అంటే బహిరంగంగా (అందరికీ) తెలిసేటట్లు చేసే ప్రక్రియ ప్రకటన. ఇది మౌఖిక రూపంలో, లిఖితరూపంలోనూ ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ఇచ్చిన వ్యవహారరూపం లిఖితరూప ప్రకటనను ఉద్దేశించిందే. దీన్నే ఇంగ్లీషులో Notice అంటున్నారు.

ఏదైనా ఒక విషయం పట్ల అవగాహన, చైతన్యం కల్పించడం, సమాచారం తెల్పడం, హెచ్చరించడం కోసం ప్రకటనను ఉపయోగిస్తారు.

ప్రకటనలో విషయం, భాష అందరికీ అర్థమయ్యేటట్లు ఉండాలి. క్లుప్తంగా ఉండాలి.

ఉదా॥ సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి.

దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఆధారం సమగ్ర కుటుంబసర్వే. ప్రభుత్వ పథకాలు, ప్రణాళికలు అందరికీ సక్రమంగా చేరాలంటే ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలు నమోదుచేయడం అవసరం. అందుకు ప్రజలందరూ సహకరించాలి. సర్వే అధికారులు వచ్చినప్పుడు కుటుంబంలోని వాళ్ళందరూ ఇంట్లోనే ఉండాలి. మీ కుటుంబానికి సంబంధించిన అందరి వివరాలు తెలియజేయాలి. ఈ వివరాలు గోప్యంగా ఉంచబడతాయి (ఇతరులకు తెల్పడం జరుగదు). మీరిచ్చే సమాచారంలో లోపాలుంటే అది చిక్కులను కల్గించవచ్చు. అందుకే అన్ని వివరాలు వాస్తవమైన విషయాలు నమోదుచేయించండి. ప్రభుత్వానికి సహకరించండి.

కుటుంబ వికాసమే దేశ వికాసం.

ప్రచురించినవారు
తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరా శాఖ,
సమాచార విభాగం.

తరగతి స్థాయి, ప్రకటనాంశం - ఆధారంగా ప్రకటనల్లో వైవిధ్యం ఉంటుంది.

**15) ఆహ్వానపత్రం :** ఏదైనా ఒక కార్యక్రమానికి రమ్మని పిలవడానికి లిఖిత రూపకంగా ఉండే పత్రమే ఆహ్వానపత్రం. వివాహాది శుభకార్యాలకు, జాతరలు, ఉత్సవాలు, సంగీత, సాహిత్య నృత్యాది కళారూపాల ప్రదర్శనలకు, విద్యావైజ్ఞానిక అంశాల సభలు, సమావేశాలకు, పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఆహ్వానించడానికి ఇటువంటి పత్రాలను రాస్తారు / ముద్రిస్తారు.

ఉదా॥ వార్షికోత్సవాహ్వానం

<u>**ఆహ్వానం**</u>

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నూరు.

29వ వార్షికోత్సవము

5 ఫిబ్రవరి 1016 శుక్రవారం సాయంత్రం 5 గం॥ 30 ని॥లకు మా పాఠశాల ప్రాంగణంలో నిర్వహింపబడే 'వార్షికోత్సవం' కార్యక్రమానికి రావలసిందిగా మా మనవి.

**అధ్యక్షులు** : గౌ॥ పాఠశాల ప్రధానోపాధ్యాయిని గారు

**ముఖ్య అతిథి** : గౌ॥ రాష్ట్ర విద్యాశాఖామాత్యులు గారు

**ఆత్మీయ అతిథి** : గౌ॥ జిల్లా విద్యాధికారి గారు

**ప్రత్యేక ఆహ్వానితులు** : కవులు, కళాకారులు

<u>**కార్యక్రమం**</u>

జ్యోతిప్రజ్వలన

అతిథుల సందేశాలు

విద్యార్థులకు బహుమతి ప్రదానం

సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన

వందన సమర్పణ

సూచన : దూరప్రాంతం వెళ్ళవలసిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, రాత్రి భోజనం, వసతి ఏర్పాటు ఉంది. గమనించగలరు.

ఇట్లు
ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషక కమిటి సభ్యులు, చెన్నూరు

**16) అభినందన పత్రం :** ఏదైనా ఒక రంగంలో విజయం సాధించిన సందర్భంగా గాని, బదిలీ అవుతున్నప్పుడు గానీ, పదవీ విరమణ పొందుతున్నప్పుడుగానీ, ప్రత్యేక గుర్తింపు పొందినప్పుడు గానీ ఆ వ్యక్తిని / వ్యక్తులనూ అభినందిస్తూ / ప్రశంసిస్తూ రాసే పత్రం. దీన్నే ప్రశంసాపత్రం అని కూడా అంటారు. అభినందన పత్రం వ్యక్తి ప్రశంసను ప్రధానాంశంగా కల్గి ఉంటుంది.

అభినందన పత్రాలు పద్యాత్మకంగా, కవితాత్మకంగా, వచనాత్మకంగా, గద్యపద్యాత్మకంగా కూడా ఉంటాయి.

వీటిలో 4 అంశాలు ప్రధానంగా ఉంటాయి.

1) వ్యక్తిగత వివరాలు / అంశాలు.

2) వృత్తి / సంబంధిత రంగానికి చెందిన అంశాలు.

3) సంబంధిత రంగంలో సాధించిన విజయాలు / గుర్తింపు

4) వ్యక్తిత్వం

ఉదా॥ విద్యారంగంలో ఉపాధ్యాయుడుగా పనిచేసి, పదవీ విరమణ పొందుతున్న ఒక వ్యక్తికి సంబంధించిన అభినందన పత్రం.

**నిరాడంబరులు, నిగర్వి, నిరంతర కృషీవలురు. ఉత్తమోపాధ్యాయులు,**
**జి.ప.ఉ.పా. పరిగి పాఠశాల సహాయకులు (ఎస్.ఎ.)**
**మాన్యశ్రీ శ్రీనివాసరావు గారి**
**పదవీవిరమణ సందర్భంగా సమర్పించిన**

## అభినందన పత్రం

శ్రీలు పొంగే తెలంగాణ రాష్ట్రంలో, బంగారం వంటి రంగారెడ్డి జిల్లాలో పచ్చదనానికి పెట్టిందిపేరైన హరిదాసుపల్లిలో రామయ్య సీతమ్మల గర్భశుక్తి ముక్తాఫలంగా 1958వ సం॥ ఆగస్ట్ 2వ తేదీన చింతకింది వంశంలో జన్మించిన ఓ విద్యాతపస్వీ! నీకివే మా జేజేలు!

ప్రకృతి ఒడిలాంటి పల్లెసీమలో ఎదిగి, ఉన్నత విద్యనభ్యసించి, భాషాప్రవీణులై, శిక్షణను పూర్తిచేసి వేలాది మంది పిల్లలను తీర్చిదిద్దడానికి 1978లో భాషోపాధ్యాయుడుగా గడిసింగాపురం అనే పల్లెటూళ్ళో నీ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించినావు. ధారూర్, పెద్దేముల్, కోట్‌పల్లి, కరన్‌కోట్‌లలో నీసేవలతో మెప్పుపొంది 2010 సం॥లో పాఠశాల సహాయకునిగా పదోన్నతి పొందినావు.

పాఠశాల సహాయకునిగా ఉన్నత పాఠశాలల విద్యార్థులను మహోన్నతంగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేసినావు. మేడ్చల్‌లో, శంషాబాద్‌లో పనిచేసి టంగుటూరు పిల్లల పుణ్యవశాన ఇక్కడికి దయచేసినావు.

అంకితభావం, సమయపాలన, చక్కనిబోధన, అందుకు తగిన అందమైన గాత్రం, స్నేహం, సౌజన్యం, వాగ్భూషణం జీవలక్షణాలుగా కలిగిన నీ బోధనతో విద్యార్థులను రత్నాలుగా తీర్చిదిద్దినావు : నీ స్నేహ సౌజన్యాలతో తోటి ఉపాధ్యాయుల హృదయాలను గెలుచుకున్నావు; సేవా భావంతో అధికారుల మెప్పు పొందినావు; విద్యార్థుల తలిదండ్రుల గౌరవాదరాలను అందుకున్నావు.

నీ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం 'ఉత్తమోపాధ్యాయ' బిరుదుతో నిన్ను సత్కరించింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు నిన్ను గౌరవించినాయి.

నిరుపమానమైన నీ సేవలు, నీ బోధలు, నీమైత్రి, నీ ప్రవర్తనను విద్యార్థిలోకంతోపాటు సమాజమంతా గుర్తుంచుకుంటుంది. పదికాలాలపాటు నిలిచిపోయేకీర్తిని సంపాదించిన ఓ మహోన్నతా!

నీ మేధస్సుకు, వ్యక్తిత్వానికి, వైదుష్యానికి, సేవలకు మేమంతా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. నీ భావి జీవితం ఆనందమయంగా, శాంతియుతంగా, సుఖవంతంగా కొనసాగాలని ఆ భగవంతుడ్ని కోరుకుంటూ...

మీ

తేది : 31-08-2015 ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయబృందం,

స్థలం : గొట్టిముక్ల విద్యార్థులు, పాఠశాల అభివృద్ధి కమిటీ,

జి.ప.ఉ.పా., గొట్టిముక్ల, రంగారెడ్డి జిల్లా.

17) **అభినందన వ్యాసం :** ఏదైనా ఒక రంగంలో పేరుగాంచిన వ్యక్తుల గురించి రాసే ప్రశంసాత్మక అంశాలను తెలిపేవ్యాసం. ఇందులో ప్రశంసతోపాటు జీవిత విశేషాలను, సంఘటనలు తెలియజేయడానికి ప్రాముఖ్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒకటి రెండు సంఘటనలను వివరించడంతోనే వ్యాసం పూర్తికావచ్చు.

ఉదా: గ్రామంలో సేంద్రియ ఎరువులనుపయోగించి అధిక దిగుబడి సాధించిన అనంతయ్య అనే రైతు గురించిన అభినందన వ్యాసం.

రామాపురం గ్రామం నిన్నటిదాకా ఎవరికీ తెలియదు. ఇప్పుడు దేశంలోని వాళ్ళంతా రామాపురం వైపే చూస్తున్నారు. అందుకు కారణం అనంతయ్య.

తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గ్రామమైన రామాపురంలో మూడెకరాల పొలం సాగుచేస్తున్న అనంతయ్య మొదట్లో సరైన దిగుబడి లేక తరచూ కష్టనష్టాలకు గురిం అవుతుండేవాడు. రెండేళ్ళ క్రితం ఆయన సేంద్రియ ఎరువుల ప్రాముఖ్యత గురించి, వాటి వినియోగవిధానం గురించి తెలుసుకున్నాడు.

మిగతా రైతులకు కూడా ఈ విషయాలు తెలిసినా, ఆ విధానాన్ని అనుసకనిరించే సాహసం చేయలేదుకాని అనంతయ్యకు సేంద్రియ యెరువుల వాడకం మీద నమ్మకం కలిగింది. ఎంతో శ్రద్ధతో, పట్టదలతో అసాధ్యమనుకున్నదాన్ని సుసాధ్యం చేసి చూయించినాడు అనంతయ్య. దిగుబడి కూడా ఆయన అనుకున్న దానికంటె అధికంగా రావడం అతనికి ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇప్పుడు జాతీయస్థాయిలో గుర్తింపురావడంతో అదిరెట్టింపయ్యింది.

అనంతయ్య క్రమశిక్షణ, శ్రద్ధ, అంకితభావం, నిరంతర శ్రమ అతడ్ని ఈ స్థాయికి చేర్చింది. అతనిప్పుడు రైతులందరికీ ఆదర్శమైనాడు. అతని ఇంటర్వ్యూలు రేడియోల్లో, టీవీల్లో ప్రసారమైనాయి. ఇంతటి పేరు సంపాదించినా ఎంతో సాదాసీదాగా ఉండే అనంతయ్య తన మంచి ప్రవర్తనతో అందరి హృదయాలు గెలుచుకున్నాడు.

'ఇటువంటివాళ్ళు ఊరికొక్కరున్నా ఈ దేశం బాగుపడుతుం'దని అందరూ అనుకునేటట్లు చేసిన అనంతయ్య సదా అభినందనీయుడు.

**18) ప్రసంగ వ్యాసం :** ఉపన్యసించడం కోసం ముందుగా సిద్ధం (తయారు) చేసుకున్న వ్యాసం.

సాధారణంగా రేడియోల్లో, టీవీల్లో చదవడానికి, పెద్దపెద్ద (రాష్ట్రస్థాయి, జాతీయ అంతర్జాతీయస్థాయి) సెమినార్‌లలో ప్రసంగించడానికి, మేథావుల సభల్లో సమర్పించడానికి ఇటువంటి (ప్రసంగ) వ్యాసాలను సిద్ధం చేసుకుంటారు.

ప్రసంగవ్యాసాల్లో అనవసర విషయాలు చోటుచేసుకోవడం జరగదు. సమయం నిర్దిష్టంగా ఉపయోగించుకోబడుతుంది. కాకపోతే మాట్లాడే వక్తకు స్వేచ్ఛ ఉండదు. జనరంజకత లోపించి, శైలిలో శిథిలత కనిపిస్తుంది. అయితే చెప్పదలచుకున్న విషయం సూటిగా, స్పష్టంగా, నిర్దుష్టంగా చెప్పడానికి ఇంతకుమించిన పద్ధతి లేదన్నమాట మాత్రం నిజం.

విద్యార్థుల వక్తృత్వ ప్రతిభను పెంపొందించడానికి ఈ మార్గం మొదట్లో అనుసరించడం మంచి ఫలితాన్నిస్తుంది. పాఠశాల స్థాయిలో నిర్వహించే ఉత్సవాల్లో (స్వాతంత్ర్య, ఉపాధ్యాయ, బాలల, గణతంత్ర దినోత్సవాల్లో) ఈ ప్రక్రియ సహకారం తగుమేర తీసుకోవచ్చు.

**19) స్వగతం :** ఇది ఆత్మకథ వంటిదే కాని, ఆత్మకథలో పాత్ర ప్రకాశంగా (బయటికి) మాట్లాడుతుంది. స్వగతం అంటే తనలో తాను మాట్లాడుకోవడం అన్నమాట. ఈ పరిధిని తెలుసుకొని ప్రక్రియను విస్తరింపజేయాలి. తరగతి స్థాయిననుసరించి భాష, నిడివి నిర్ణయించాలి.

**20) సంపాదకీయ వ్యాసం :** దేశకాలమాన పరిస్థితులను గమనిస్తూ, సమకాలీన సంఘటనలకు ప్రతిస్పందించి, సామాజిక హితం లక్ష్యంగా పత్రికా సంపాదకులు రచించే వ్యాసాలను సంపాదకీయ వ్యాసాలంటారు. (కొన్ని పత్రికలు తెప్పించి, పరిశీలించండి.)

**21) పుస్తక పరిచయం (పీఠిక) :** పుస్తక పరిచయానికి సంబంధించిన వివరణ 'నిర్మాణాత్మక మూల్యాకనం' అధ్యాయంలో ఇవ్వడం జరిగింది.

పీఠిక, పుస్తక పరిచయం రెండూ వేర్వేరు. కాకపోతే రెండింటిలో పుస్తకానికి సంబంధించిన విషయవిశ్లేషణ ఉంటుంది. పీఠికలో పుస్తక నేపథ్యాన్ని గురించి, రచయిత ప్రయత్నాన్ని గురించి, పుస్తక ప్రయోజనం గురించీ చర్చించడం జరుగుతుంది. పుస్తక పరిచయంలో ప్రాథమిక సమాచారం ప్రత్యేకంగా పేర్కొనడం జరుగుతుంది.

**22) కరపత్రం :** చేతిలో అనువుగా ఒదిగి ఒక విషయానికి సంబంధించిన వివరాలను ఇచ్చే కాగితాన్ని 'కరపత్రం' అంటారు. దీన్నే ఆంగ్లంలో 'పాంప్లెట్' అంటారు.

ఒక సమాచారాన్ని లేదా విషయాన్ని అందరికీ తెలియజేయడమే కరపత్రం ప్రధాన ఉద్దేశం.

కరపత్రంలో శీర్షిక, ప్రచురణ కర్తలు, సందేశం మొదలగునవి ఉంటాయి.

# Chapter-XI

## అనుబంధాలు

### 1) పిల్లలూ- భాష

*- ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మానవ నాగరికతను మలుపు తిప్పింది భాష అని మనకు తెలుసు. భాష మానవుడి ప్రమేయాన్ని బయటి ప్రపంచంలో విప్లవీకరించడమే కాదు మానవుణ్ణి అంతర్గతంగా కూడా విప్లవీకరించింది. వానరుడి నుండి నరావతారం జరిగాక నరుడిలోని అనేక మార్పులకు భాష ఒక కారణమని ఆధునిక శాస్త్రవేత్తల అభిప్రాయం. అప్పటి దాకా బయటి శక్తులు పరిణామక్రమాన్ని నిర్ణయిస్తే భాష పుట్టాక అంతర్గత శక్తి (భాష) పరిణామాన్ని నిర్దేశించిందన్నమాట.

ఇప్పుడు భాష సార్వత్రికం, సార్వజనీనం. లిపిలేని భాషలున్నాయి గానీ ధ్వనుల్లేని, మాటల్లేని భాషలు లేవు. అత్యంత ప్రాథమిక స్థాయి (Primitive) భాష సైతం అద్భుతంగా ఆయా జాతుల అవసరాల్ని తీర్చగల స్థాయిలో ఉంది. అలాగే అవసరాలు పెరిగేకొద్దీ భాష తనకు తాను అద్భుతంగా మార్పులకు లోనవుతుంది. ఎప్పటికప్పుడు జవసత్వాలు సమకూర్చు కొంటోంది. భాషా, మానవుడూ చెట్టాపట్టాలేసుకొని పాతాళపుపొరల్నీ, గగనాంతరాళాల్నీ పిడికిట్లో బిగించుకొంటున్న యుగం మనది.

**భాషా నిర్మాణం :**

మనమందరం మాట్లాడుతున్నాం. అలవోకగా మాట్లాడుతున్నాం. మాట్లాడ్డమంత సులభం మరేముంది గనుక? కానీ కొంచెం లోతుగా చూస్తే భాషకు ఎంత సంక్లిష్టం!!!

అలాగే భాషకున్న ఈ ప్రాథమిక నిబంధనలన్నీ సార్వత్రికాలు, అన్ని భాషలకు సమానంగా వర్తించేవి.

ప్రతి భాషలోనూ హల్లు - అచ్చు - హల్లు - అచ్చు పద్ధతే ఉంటుంది. హల్లుల్ని అచ్చులేకుండా పలకలేము. ఒకవేళ పలికినా రెండు మూడు హల్లులకు మించి ఒకటిగా పలకలేము. మూడు హల్లుల సంయుక్తాక్షరాలు గల పదాలు ఏ భాషలోనైనా పట్టుమని పది చెప్పండి. చూద్దాం. స్త్రీ, శాస్త్రం, స్ట్రీట్, స్ట్రక్చర్ ఇలా చెప్పొచ్చు. ఎంత చెప్పినా ఎస్,టి,ఆర్ ధ్వనులతో తప్ప ఇతర ధ్వనులతో (హల్లులు) గల సంయుక్తాక్షరాలు ఎక్కడా చిక్కవు. ఇక నాల్గు హల్లులు గల సంయుక్తాక్షరం అసాధ్యం.

మన వాగ్యంత్రం ఎక్కువ హల్లుల కలయికను అంగీకరించదు. అందుకే మనం 'ఇస్కూలు' అంటాం. సూర్యుణ్ణి సూరీడు అని సరిపెట్టుకొంటాం.

ప్రతి భాషలోనూ మాటలకూ వాటి అర్థాలకూ సంబంధం లేదు. 'గాడిద' అని గుడ్డలు మోసేదాన్నే ఎందుకనాలి? ఇంటికావలి ఉండే జంతువుని పంది అని ఎందుకనగూడదు? దీనికి జవాబెక్కడా చిక్కదు. అంటే మాటలన్నీ కేవలం కొండ గుర్తులు (సింబల్స్), అమూర్తాలు.

ఒక రకంగా చూస్తే భాష అత్యంత సంక్లిష్టమైంది. అంతా సంకేతాలతోనే నిండిఉంటుంది. చిన్న మార్పు చేసినా కొంప మునిగిపోతుంది.

సీత వంట చేస్తుంది.

సీత వంట చూస్తుంది.

ఒక్క దీర్ఘమే తేడా, అర్థంలో బోలెడు మార్పు.

రాముడు బడికి పోతున్నాడు సీత బడికి పోతూ ఉంది.

ఇక్కడ కర్త లింగాన్ని బట్టి క్రియ మారిపోతుంది. అదే సీత గానీ రాముడు గానీ తమను గురించి చెప్పుకొంటే 'నేను బడికి పోతున్నాను' అని ఒకే రకంగా చెప్పవచ్చు. ఇలా ప్రతి భాషలోనూ చిన్న మార్పులు పెద్ద తేడాల్ని తెస్తుంటాయి.

వాక్యాల్లోనూ ఇంతే. ఒక క్రమం ఉంటుంది. మనం ఆ క్రమంలోనే మాట్లాడతాం.

'పోతున్నాడు బడికి రాముడు' అనొచ్చు. అయినా ఇది కృతకం.

పదాలు కొన్నే వాక్యాలు లక్షలు. ఎన్ని వాక్యాలైనా మనం తయారు చేసుకోగలం. నిజానికి ఒకసారి చేసిన వాక్యం మరోసారి చెయ్యం.

***అంతా సందర్భం మీద (contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే! మూడేళ్ల బిడ్డ భాషా పరంగా పెద్దవాడి కిందే (linguistic adult) లెక్క.***

ఎప్పటికప్పుడు కొత్త వాక్యాల్ని సృష్టించుకోగలం. ప్రతి భాషకూ అంత వివిధత, సృజనాత్మకత అత్యంత సాధారణం.

భాష నిరంతరం పరిణామశీలి. ఒక లెక్క ప్రకారం మాట్లాడేవాడు చెప్పేదీ. వినేవాడు స్వీకరించేది నూటికి నూరుపాళ్లు ఒక్కటిగానే ఉండదు. తాత భాషా, తండ్రి భాషా, తన భాషా ఒకటి కానేగాదు. అసలు మనం మాట్లాడేప్పుడు కూడా ఒకసారి ఒక చోట పలికేది, మరోసారి మరోచోట పలికేది ఒకటిగాదు.

భాషా పండితులు ఎంత గీపెట్టినాసరే అది తనకు తాను మారుతూనే ఉంటుంది. ఈ వాక్యాల కంటే పదాలు, పదాల కంటే ధ్వనులు ఎక్కువగా మార్పుకు లోనవుతాయి.

ఈ మార్పులు సందర్భాన్ని బట్టి ఉంటాయి. అంతా సందర్భం మీద (Contextual) ఆధారపడి ఉంటుంది. అసలు భాష ఉనికీ, బ్రతుకూ, పెరుగుదలా, ఉపయోగమూ అంతా సందర్భం నుంచే!

భాషకూ భావాలకూ మధ్య అంతు చిక్కని సంబంధం ఉంటుంది. 'తోడేలు' అనగానే 'భయం' కమ్ముకొంటుంది. 'ఐస్‌క్రీం' అనగానే నోరు ఊరుతుంది.

ఒకే మాట పలు సందర్భాల్లో పలు అర్థాలివ్వవచ్చు. 'నా మాట ఏం చేశావ్' అన్నప్పుడూ 'మాటా మాటా పెరిగింది' అన్నప్పుడూ 'మాట' వినడానికి ఒకటే. అర్థం మాత్రం ఒకటి గాదు.

ఇలా చూస్తే భాష అత్యంత క్లిష్టమైంది, అత్యంత గహనమైంది. ఎవరైనా పరాయిభాషను వయసొచ్చాక నేర్చుకొంటూంటే ఈ సంక్లిష్టత అర్థమవుతుంది. ఇంత 'న్యూసెన్సు' ఏమిటా అని తల తిరిగి పోతుంది.

**పిల్లలు భాష ఎలా నేర్చుకొంటారు? :**

మరి ఇంత క్లిష్టమైన భాషని పిల్లలు అలవోకగా ఎలా నేర్చుకొంటున్నారు? ఒకటి గాదు రెండు, మూడు భాషలు కూడా ఏకకాలంలో ఎలా నేర్చుకొంటున్నారు? అంటే మూడేళ్ల బిడ్డ భాషాపరంగా పెద్దవాడి కిందే లెక్క.

ప్రతి బిడ్డా మూడేళ్ల వయసులో భాష నేర్చుకొంటోంది. ఇదొక సార్వజనీన సూత్రం. కొంచెం క్రమంలో తేడా ఉండవచ్చు, వేగంలో అటూ ఇటూ ఉండొచ్చు. కానీ మాతృభాష మాత్రం అందరికీ మూడేళ్లలో అనర్గళంగా వచ్చి తీరుతుంది. ఇదెలా సాధ్యం?

విచిత్రమేమంటే పిల్లలు నేర్చుకొనే క్రమం కూడా ప్రపంచమంతా ఒకటే. ముందు చిన్న చిన్న సరళ వాక్యాలు మాట్లాడతారు.

'నాన్న' అంటే అదీ వాక్యమే, 'నాన్న వచ్చాడు' 'నాన్న పోతున్నాడు', 'నాన్న కన్పించడం లేదు' ఇలా ఏదైనా కావచ్చు! ఆ తర్వాత రెండు పదాలతో వాక్యాలుంటాయి.

సరళ వాక్యాల తర్వాత వ్యతిరేక వాక్యాలు పిల్లలకు వస్తాయి. ఆ తర్వాత ప్రశ్నార్థకాలు నేర్చుకొంటారు.

ప్రతి బిడ్డకూ హల్లు-అచ్చు, హల్లు-అచ్చు (CVCV) సూత్రం తెలుసు. వీటిని కలగాపులగం చేసి గందరగోళపడినట్టు ఎక్కడా కన్పించదు.

ఒక వాక్యాన్ని సందర్భానుసారంగా అర్థం చేసుకోవడం పిల్లలకీ వచ్చు. నవ్వుతూ 'నేను రాను' అంటే 'వస్తానులే' అన్న ధ్వని అందులో ఉందని బిడ్డకు తెలుసు. చివర మనం చేసే చిన్న మార్పు వల్ల ప్రశ్నలుగా వాక్యాలు మారుతుంటాయి. వీటిని పిల్లలు అట్టే పట్టేస్తారు.

'సీత పుస్తకం చదువుతున్నాడు' అని మనం అంటే ఏ మూడేళ్ల పాపైనా 'ఇందులో ఏదో తప్పుందన్న'ట్టు మనల్ని వెక్కిరిస్తుంది. కాకుంటే తప్పేమిటో ఆ పిల్ల స్పష్టంగా చెప్పలేకపోవచ్చు.

భిన్నార్థాల మాటలని సందర్భాన్ని బట్టి పిల్లలు అర్థం చేసుకొంటున్నారు. వాక్యంలోని పదాల క్రమాల్ని కర్త ఆధారంగా క్రియలో వచ్చే మార్పుల్ని, కర్తా కర్మల విభక్తుల్ని తెలుసుకోడమేగాదు అవసరాన్ని బట్టి వాక్యాల్ని వివిధ విన్యాసం చేయగల నేర్పునీ పిల్లలు అత్యంత సహజంగా పొందుతున్నారు.

అంతకంటే అద్భుతం తమకు తెలిసిన పరిమిత పదాలతోనే వారు వేలాది వాక్యాలు కొత్త కొత్తవి స్వంతంగా తయారుచేసుకోవడం. ఇదంతా పెద్దల్లాగానే వాళ్లూ చెయ్యగల్గుతున్నారు.

మరీ విచిత్రం - పిల్లలు రెండు మూడు భాషల నియమాల్ని కూడా పట్టేస్తున్నారు. ఇంత సంక్లిష్ట నిర్మాణం గల నైరూప్య విషయాన్ని ఇంత సులభంగా పిల్లలెలా గ్రహిస్తున్నారు? ఇంత గొప్పగా ఎలా ఉపయోగించుకోగల్గుతున్నారు?

**దీన్ని భాషా శాస్త్రవేత్తలు, మానసిక శాస్త్రవేత్తలూ ఇలా విశ్లేషిస్తున్నారు.**

- ఆసక్తికర వాతావరణంలోనే పిల్లలు భాష నేర్చుకొంటున్నారు. అవసరమైన వాతావరణమే ఆసక్తికరమైంది. సహజమైందీ.
- ఈ భాషాభ్యసన క్రమంలో తప్పని సరిగా మనం అందజేసేది (ఇన్‌పుట్) ఉంటుంది. కానీ ఫలితం (అవుట్ పుట్) ఉండదు. అంటే ఇన్‌పుట్‌కు సమానంగా – అవుట్‌పుట్ ఉండదు. దీనర్థం పిల్లలకి ఎన్నో మాటలు వినిపిస్తుంటాయి. వాటిని వాళ్లు కొన్నింటిని గ్రహిస్తుంటారు. గ్రహించినవి తిరిగి ఒప్పజెప్పాల్సిన అవసరం ఈ నేర్చుకొనే క్రమంలో లేదు.
- ఒక్క సంవత్సరం పాటు పిల్లలు వింటూనే ఉంటారు. జవాబు చెప్పాల్సిన, ఉపయోగించుకోవాల్సిన పని ఉండదు. ఎవ్వరూ అలా ఒత్తిడి చెయ్యరు. ప్రతి చర్య అవసరంలేని స్వీకరణ ఇది. ఇదొక మౌన మహాయుగం.
- ప్రతీది సందర్భం నుంచే పిల్లలు నేర్చుకొంటారు. తాము పాల్గొనని తమకు సంబంధం లేని, అమూర్త నిర్వికారాంశాలకు ఇక్కడ తావులేదు.
- ఇలా నేర్చుకొనేప్పుడు వాళ్లకేమో ఒక క్రమం లేదు. ముందు అక్షరాలు, తర్వాత పదాలు, ఆ తర్వాత వాక్యాలు ఇలాంటి వరుస లేదు. ముందు 'అ' చివర 'క్ష' అనే క్రమం అసలే లేదు.
- ముందు సులభం, తర్వాత క్లిష్టం అనే వరస కూడా లేదు. దీర్ఘాలు ముందురావచ్చు. హ్రస్వాలు వెనక రావచ్చు. పిల్లలకందుతున్న భాష ఒక నిర్ధారిత క్రమంలో ఉండదు. దానికో ప్రణాళికా పద్ధతీ ఏమీ ఉండవు.
- ఈ అభ్యసన క్రమంలో ఏమి మాట్లాడారన్నది ప్రధానం కాదు. ఏదైనా మాట్లాడవచ్చు. మాట్లాడకుండానూ ఉండొచ్చు. ఎలాంటి ఒత్తిడీ లేదు.
- తమ స్వంత పద్ధతిలో పిల్లలు నేర్చుకొంటారు. దాన్ని ఎవ్వరూ రూపకల్పన చెయ్యరు. 'టీ' అనే ఒక మాటను ఒక పాపెలానైనా వాడు కొంటుంది. తాను పాలు తాగుతున్నా, అమ్మమ్మ కాఫీ తాగుతున్నా, నాన్నా టీ తాగుతున్నా, అన్నిటినీ 'టీ' అనే అంటుంది. ముందు తాను పట్టుకొన్న ఒక పేరు అన్న పానీయాలకూ పెట్టి, తర్వాత వేర్వేరు పేర్లు పెట్టుకొనే ఒక స్వంత క్రమం ఆ పాప ఏర్పరచుకొన్నదన్నమాట.
- ప్రతి రూలునూ తనకు తానే బిడ్డ తెలుసుకొంటుంది. వ్యాకరణం ఎవ్వరూ చెప్పరు.
- విచిత్రంగా అన్ని భాషల పిల్లలూ మొదట ప, బ, మ ధ్వనుల్ని ఇష్టపడతారు. 'అమ్మ, బాబా, పాపా' వంటివి వారికిష్టం.

భాష ఇంత సంక్లిష్టంగా ఉండే అంశం కావడమేమిటీ? నేర్చుకోవడం ఇంత సులభతరంగావడమేమిటి? భాషకున్న నిబంధనలు ఇంత సార్వత్రికం కావడమేమిటి? నేర్చుకొనే క్రమం ఇంత సార్వజనీనం కావడమేమిటి? అంతా విచిత్రంగా ఉంది గదూ! అవును పెద్దలకు, మనకు విచిత్రమే! పిల్లలకేమో ఇది అత్యంత సహజం.

ఇప్పుడు పెద్దలం, మనం పట్టుకోవల్సిందల్లా ఈ అభ్యసన క్రమాన్నీ, రహస్యాన్నీ.

## 2) మన చదువుల్లో కథల స్థానం ఏమిటి?

*- ప్రొఫెసర్ కృష్ణకుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయం*

మన స్కూళ్ళలో ఒకటీ రెండు తరగతులకైనా రోజూ ఒక పీరియడ్ కథలు చెప్పుకోడానికుంటే ఎంత బావుంటుంది! ఛ్ఛ! మన పిల్లలు ఆ మాత్రం భాగ్యానికైనా నోచుకోలేకపోతున్నారు. ఈ అవకాశమే ఉంటే బడిలో చేరిన పిల్లలు బడి నుంచి జారిపోకుండా సగం సమస్య పరిష్కారమయ్యేది. 'కథలు చెప్పుకొంటే డ్రాపౌట్ తగ్గుతారా' అని నన్ను చాలా మంది ఎగతాళిగా చూడొచ్చు. ఇంత పెద్ద సమస్యను ఇంత తక్కువగా పరిగణిస్తున్నానని నన్ను ఎద్దేవా చెయ్యొచ్చు. ఇలాంటి సలహా నేనిచ్చినప్పుడు నాపట్ల వెటకారంగా (సానుభూతితోనూ) చూసిన సీనియర్ అధికార్ల నెందరినో నేనెరుగుదును. ఏం చేద్దాం మరి? వారి 'అపార పరిపాలనానుభవం' వాళ్ళనలా తయారు చేసింది! ఒకప్పుడు ఈ అధికార్లూ నాలానే ఎంతో కొంత ఆలోచించి ఉండకపోరు. కానీ పాపం వాళ్ళు సీనియర్లయిపోయాక ఇలా మారిపోయారు!

ఇంతకన్నా ఘోరం ఏమంటే మన ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో కథలకు కాసింత చోటయినా చిక్కడంలేదు. "కథల ప్రాధాన్యం' మీద మొత్తం శిక్షణా కోర్సుల్లో ఎక్కడయినా ఓ పాఠం ఉంటే ఉండొచ్చు. అంతకంటే కొంచెం లోతుకు పోయిన పాపాన ఈ సంస్థలెప్పుడూ పోవు.

నాకో తీరని కల ఉంది. అదేమంటే మన టీచర్లకు కనీసార్హతగా ముప్ఫై కథలయినా తడుముకోకుండా చెప్పడం ఉండే రోజు ఎప్పుడొస్తుందా అని. మన ప్రాచీన కథల మీద ఈ మాత్రం పట్టు ఉండే టీచర్లుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో గదా అని! 'పట్టు' అంటే గందరగోళపరచకుండా, గజిబిజి చెయ్యకుండా సాఫీగా చెప్పగల్గడం అన్నమాట.

కథలు చెప్పుకోవటం మన సమాజపు సహస్రాబ్దాల సంప్రదాయం, వారసత్వం! ఒకటీ రెండా? వేలాది సాంప్రదాయక కథలు చెవి నుంచి చెవికి, గుండె నుంచి గుండెకు ఎన్ని శతాబ్దాల పాటు ఎక్కిపొయ్యాయో! అంత దూరం నేనాశించడం లేదు గానీ కనీసం ముప్ఫై కథలు చెప్పగల్గితే మన ఒకటి రెండు తరగతుల పిల్లలు ఎన్నో విలువలు నేర్చుకొంటారు. ఇతర సబ్జక్టులతో పాటు కథలకింత చోటివ్వగల్గితే ఎన్నో విషయాలు పిల్లలకు తెలుస్తాయి. మనం చెప్పే ఇతర పాఠ్యాంశాలు కూడా కావల్సినన్ని తెలుస్తాయి.

### కథలెక్కడ దొరుకుతాయి?

సాంప్రదాయిక కథలంటే ఏమిటి? వీటి ప్రాధాన్యత ఏమిటి? దీన్ని మనం పరిశీలించాలి. ఈ కాలపు కుర్ర టీచర్లను కథలు చెప్పమంటే పిల్లల పత్రికల్ని తిరగేస్తున్నారు. కామిక్స్‌ను, వాస్తవగాథల్ని, చివరికి పెద్ద పెద్ద జోక్స్‌ను సైతం పిల్లలకి కథలుగా చెప్పడానికి పూనుకొంటున్నారు. ఇవన్నీ కథల జాబితాలోనే వస్తాయి? వస్తే రావచ్చు. కానీ మన ఆరేడేళ్ళ పిల్లల్ని ఇవి మన పాత కథలంత ప్రభావితం చేస్తాయా అనేది మాత్రం అనుమానాస్పదం.

మన సాంప్రదాయక కథలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. ఆ లక్షణాలు ప్రస్తుత పత్రికల్లో వస్తున్న కథల్లో కన్పించడం లేదు. మంచి కథకుండే లక్షణాలేమిటి? వీటిని తర్వాత పరిశీలిద్దాం. దీనికి ముందు ఇలాంటి మంచి కథలెక్కడ దొరుకుతాయో చూద్దాం.

పంచతంత్రం, జాతక కథలు, మహాభారతం, అరేబియన్ నైట్స్, విక్రమాదిత్య కథలు, వివిధ ప్రాంతాల జానపద కథలు మనకు ఎన్ని మంచి కథల్నయినా అందిస్తాయి. ఇదొక పెద్ద భాండాగారం. గులిస్తాన్, బోస్టన్, బీర్బల్, తెనాలి రామలింగడు, జానపదాలు లాంటివి కావల్సినన్ని దొరుకుతాయి. ఒక్క మన దేశానికే గాదు ప్రపంచమంతా మంచి కథలు కోకొల్లలు. 'ఇంత పరిశోధన మాకెక్కడ సాధ్యం' అని మీరనవచ్చు. కథలు చెప్పాలనే అనుకొంటే మంచి కథల్ని ఎన్నుకోవడం, వెతుక్కోవడం చాలా చిన్నపని అని నా అభిప్రాయం.

**మంచి కథ ఎలా ఉంటుంది? :**

ఏది మంచి కథ అని నన్నెవరైనా ప్రశ్నిస్తే పిల్లలు తరతరాల నుంచి దేన్ని అద్భుతంగా ఆస్వాదిస్తున్నారో అదే మంచి కథ అని నేను జవాబిస్తాను. ఇక్కడ న్యాయ నిర్ణేతలు పిల్లలే తప్ప మనం కాదని నా దృఢ విశ్వాసం. మన పంచతంత్రంలోని 'సింహం-కుందేలు' కథనే తీసుకోండి. దీన్ని మనం చాలా సీదాసాదా కథగా భావిస్తాం. కానీ లోతుల్లోకి వెళ్లితే ఇందులోని మంచి కథ లక్షణాల్ని మనం పసిగట్టవచ్చు. ఈ కథలోని మలుపుల్ని ఇప్పుడు కొంచెం పరిశీలిద్దాం.

మన బుజ్జి కుందేలు సింహానికి కవళంగా వెళ్ళాల్సిన దుర్దినం వచ్చింది. తీరిగ్గా కుందేలు సింహం గుహ దగ్గరకెళ్ళేటప్పటికి ఆకలితో సింహం నకనకలాడిపోతోంది. మిన్నూ మన్నూ తెలిసే స్థితిలో లేదది. ఇప్పుడు మన కుందేలు తన అబద్ధాల పురాణాన్ని ప్రారంభించాలి. సింహంతో కనీసం మాట్లాడ్డానికయినా తగిన సందర్భమేనాయిది? ఏ మాత్రం కాదని కథ వినే వాళ్ళందరికీ తెలుసు. అయినా కుందేలు తానెందుకు ఆలస్యంగా రావల్సి వచ్చిందో, దారిలో తనని మరో సింహం ఎలా అడ్డగించిందో ప్రాణాలకు తెగించి చెప్పింది. ఆకలి కంటే కోపం తీవ్రమైందని కుందేలుకు తెలుసు. సరిగ్గా ఆ పాయింటునే అది పట్టుకొంది. పెత్తందార్లకు అహంకారం ఎక్కువ. అది ఏ మాత్రం దెబ్బతిన్నా వాళ్ళు ఓర్చుకోలేరు. అందుకే సింహం ఆకల్ని అవతలబెట్టి శత్రువు సంగతి తేచ్చుకోవాలని కుందేలు వెంట నడిచింది. గుడ్డిగా బావి దగ్గరికి చేరింది.

మళ్ళీ ఇది కుందేలుకు కష్టకాలం (కథలో ఇదో మలుపు). ఇక్కడ కూడా కుందేలు తెలివిగా సింహం తెలివితక్కువ ఆవేశం మీదా, అసూయ మీద ఆధారపడింది. సింహం బావిలోకి చూసి తన బింబాన్ని శత్రుసింహం అనుకొని దూకి దిక్కులేని చావు చచ్చింది.

ఇన్నాళ్ళూ ఇంత ప్రచారం పొందిన ఈ కథను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. ఈ కథా వస్తువేమీ సామాన్యమైంది కాదు. దుర్మార్గమైన అధికార పిశాచం ముందు ప్రాణాల్ని ఉంచి బయటపడ్డం దాదాపు అసాధ్యమైన వేళ కుందేలు లాంటి బడుగు ప్రాణి పాపం ఏం చెయ్యాలి? అనేది ఇక్కడున్న సమస్య. నిజానికిది చాలా పెద్ద విషయం. సాధారణంగా ఇంత పెద్ద విషయాల్ని మనం పిల్లలకు దూరంగా ఉంచాలనుకొంటాం. విచిత్రమేమంటే పిల్లలు ఇంత పెద్ద విషయాన్నే ఇష్టపడతారు! ఎందుకిష్టపడతారు? దాన్ని తర్వాత పరిశీలిద్దాం.

ఇక్కడ మరో అంశం కూడా మనం పరిశీలించాలి. ఒక బక్క ప్రాణి మహా బలవంతుడైన ఒక శత్రువు బారిన పడి కష్టాల్లో చిక్కుకొన్న సందర్భమిది. ఇందులోంచి బయటపడ్డానికి ఈ బక్క జీవి ఒక ఎత్తుగడ వేసింది. ఈ ఎత్తుగడలో ఏ మాత్రం 'నీతి' లేదు. మరో సందర్భంలో ఇలాంటి అబద్ధాలు చెపితే మనం కుందేల్ని టక్కరి కుందేలు కింద లెక్కగడతాం. కానీ ఇక్కడ ఈ బడుగు ప్రాణి అసాధారణమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించింది. అమోఘమైన ధైర్యాన్నీ, ఆత్మ విశ్వాసాన్ని చూపింది. చిట్టచివరి దాకా ఏ మాత్రం తొణక్కుండా నిలబడికార్యం సాధించింది. ఇందుకోసం ఒక పెత్తందారుతో సాధారణ బడుగు వ్యక్తి మాట్లాడినట్టే భయం భయంగా మాట్లాడింది. అనుకొన్న పని నెరవేర్చుకొంది.

ఈ కథ నడకను కూడా మనం పరిశీలించాలి. కథారంభంలో జంతువులు సింహంతో కుదుర్చుకొన్న ఒప్పందం ఫలితంగా ఒక వింత శాంతి నెలకొంటుంది. పైకి కాలం సజావుగా నడుస్తున్నట్లు కన్పించినా ఇది దినదినగండమే. ఉన్నట్టుండి కుందేలు వంతు రావడంతో అసలు కథ తెరమీదికి వచ్చేస్తుంది.

ఇక మన కథ ఒక్క క్షణం కూడా ఆగకుండా చకచకా సాగిపోతుంది. మన కుందేలు ఈ కష్టం నుంచి బయటపడాలంటే ఒక్క నిమిషం వ్యర్థం చేసినా కొంప మునుగుతుంది. అదొక ఎత్తుగడ వేసింది. ఆ ఎత్తుగడేమీ నల్లేరు మీద నడక కాదు. మహా ప్రమాదకరమైంది. అయినా కుందేలు దానికే పూనుకొంది. శ్రోతకిక్కడ గుక్క తిప్పుకొనే వీలుండదు. ఏ మాత్రం తటపటాయింపుకు అవకాశం ఉండదు. అతడిప్పుడు కుందేలు పక్షపాతి. అది ఏం చేసినా అతనికది ఎంతో న్యాయంగా ఉంటుంది! ప్రతిదీ మన శ్రోత కుందేలు వైపు నుంచే ఆలోచించడం మొదలు పెడతాడు!

ఈ కథని పిల్లలెందుకంతగా ఇష్టపడుతున్నారో గుర్తించడానికి ఈ పరిశీలన సరిపోతుందనుకొంటాను. తమను అందులో చూసుకొని మమైకం కాగల ఒక పాత్ర, ఒక హీరో ఈ కథలో వారికి చిక్కింది. అదే కుందేలు. పిల్లల రోజువారీ జీవితంలో కూడా కుందేలు ఎదుర్కొన్న సవాళ్ళ వంటివి ఎన్నో ఎదురవుతుంటాయి.

పిల్లలు చిన్నవాళ్ళు, బలహీనులు, ఎక్కువ సందర్భాల్లో వాళ్ళకిష్టం లేనిదాన్ని వాళ్ళు చెయ్యాల్సివస్తుంటుంది. అధికారం, శారీరకాధిక్యత గల వారి వల్ల వాళ్ళెప్పుడూ కష్టాల పాలవుతుంటారు. భయాందోళనలకు గురవుతుంటారు. కుందేలు ఎదుర్కొనే సవాళ్ళతో పిల్లలెదుర్కొనే సవాళ్ళకెంతో సామ్యం ఉంది. దీన్ని మనం ఎప్పుడూ గుర్తించం. మన పద్ధతిలో మనం అధికారమంతా మన చేతిలోనే పెట్టుకొని వాళ్ళతో నిత్యవ్యవహారాలు జరుపుతుంటాం.

హఠాత్తుగా ఒక బంధువో, మరొకరో చనిపోతే పిల్లల మీద అది ఎంత ప్రభావం కల్గిస్తుందో, వాళ్ళెంత ఆందోళనకు గురవుతారో మనం గుర్తించం. అలాగే వాళ్ళు తమ కంటే శక్తివంతులైన పెద్దలతో పడే ఘర్షణను కూడా మనం గమనించం.

అందువల్లనే కథా ప్రారంభంలోనే పిల్లలు కుందేలులో తమను చూసుకొంటారు. కథ నడిచే కొలదీ కుందేలు వారికి పెద్ద ఆకర్షణగా మారుతుంది. కుందేలు ఒక ఎత్తుగడ పన్నింది. అది ఫలించింది. దీంతో తన సమస్యనేగాదు అందరి సమస్యనూ కుందేలు పరిష్కరించింది. పిల్లలు ఇలాంటి పరిష్కారాన్నే ప్రేమిస్తారు. కుందేలు ఎత్తుగడలో పిల్లలకు నచ్చే మరో అంశం కూడా ఉంది. అదేమంటే ఏదో ఒక సాకు చెప్పి అది తప్పించుకొనజూడ్డం. ఎందుకు ఆలస్యమైంది? అని సింహం అడిగితే కుందేలు చెప్పిన సాకు పిల్లల్ని ఎందుకాకర్షిస్తుందో చెప్పగలరా? ఎందుకేముంది పిల్లలు కూడా ఇలా సాకులు చెప్పి 'కష్టాల్నించి' బయటపడేవాళ్ళే గదా! అందుకని ఈ ఎత్తుగడతో కుందేలు తనను కాపాడుకోవడమే గాదు సింహాన్ని అంతంచేసింది. శత్రువును హతమారిస్తే తప్ప పాపం కుందేలు ప్రమాదం నుంచి బయటపడలేదు. అంటే ఈ కథ మనుగడ కోసం సాహసంతో చేసే విధ్వంసాన్ని నాటకీయంగా మన ముందు పెడుతోంది. ఇందులో ఏమి నీతి ఉంది? మనుగడకోసం చేసే పోరాటం తప్ప ఇందులో ఏ నీతి లేదు. పిల్లల వైపు నుంచి చూస్తే తప్ప నిజానికి కథలో మనం అభినందించదగ్గది ఏదీ లేదు. పెద్దలుగా మనం చూస్తే ఈ కథ నీతిలేని కథ. కుందేలు చేసింది పచ్చి మోసం తప్ప మరేమీ కాదు.

**కథల ప్రయోజనం ఏమిటి? :**

అంటే పిల్లలకు చెప్పడానికి ఎన్నుకొనే మంచి కథల్లో నీతి తప్పనిసరి కాదన్నమాట! అయితే 'సింహం – కుందేలు' కథలో ప్రత్యక్ష నీతి గాకపోయినా పరోక్షనీతి లేకపోలేదు. పిల్లల్ని భావోద్రేకానికి గురిచేసే అంశం ఇందులో ఒకటి ఉంది. ఒక ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఎంత నిబ్బరంగా నిదానంగా ఉండాలో అది చెపుతుంది. సరైన ఆలోచన చురుకుదనం అప్పుడే సాధ్యమని కూడా ఈ కథ చెపుతుంది.

కానీ సాంప్రదాయకార్థంలో ఇలాంటి పరోక్ష నీతిని కథా నీతిగా లెక్కించలేం. నీతి స్పష్టంగా ఉండాలి గానీ ఏదో డొంక తిరుగుడుగా వెతికి వెతికి చూస్తే తప్ప కనబడకుండేదిగా ఉండకూడదు.

ఈ చర్చా సారాంశం ఏమిటి? పిల్లల్లో నైతిక విలువల్ని పెంచడం మన సాంప్రదాయక కథల ప్రధానోద్దేశం కాదు. కథలు చెప్పడం వల్ల వచ్చే అసలైన లాభాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు వాటిని చూద్దాం.

**మంచి శ్రవణం :**

మంచి శ్రోత అంటే ఎవరు? చివరి దాకా వినేవాడే మంచి శ్రోత. కానీ చాలా మంది చివరిదాకా వినరు. మనం పిచ్చాపాటీ మాట్లాడేటప్పుడు కూడా చాలామంది మధ్యలోనే అడ్డం వస్తుంటారు. మనం చెప్పబొయ్యేది ముందే తెలిసి వాళ్ళిలా చేస్తే కొంత అర్థం చేసుకోవచ్చు కానీ అసలు వీళ్ళకి అంతదూరం వినడానికే ఓపిక ఉండదు. పెద్ద పెద్ద మేనేజిమెంటు, పరిపాలనా కోర్సుల్లో సైతం ఈ రోజుల్లో ఓపిగ్గా వినడాన్ని ఓ నైపుణ్యంగానే గాక ఓ మంచి లక్షణంగా కూడా పరిగణిస్తున్నారు. కథలు చెప్పడం చాలా చిన్న వయస్సు నుంచే ఇలా జాగ్రత్తగా ఓపిగ్గా వినే లక్షణాన్ని పెంపొందిస్తుంది. పెద్దయ్యాక ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కథలు చెప్పడం, వినడం ఒక మహత్తర సంప్రదాయంగా గల మన దేశంలో ఎదుటి వాడిని ఓపిగ్గా వినేవాళ్ళ సంఖ్య ఈ రోజుల్లో తగ్గిపోవడం చాలా విచిత్రంగా అన్పించవచ్చు. కానిది వాస్తవం. చిన్న వయస్సులో పిల్లలకు కథలు చెప్పకపోవడం దీనికొక ప్రధాన కారణమని నా అభిప్రాయం. నాగరికత పెరిగాక పిల్లలకు కథలు చెప్పడానికి మనకు తీరిక చిక్కడంలేదు. దీని ఫలితం మనల్ని ఈ దుస్థితికి తెచ్చింది.

**ఊహించడం, తర్కించడం :**

తమకు నచ్చిన కథను పిల్లలు మళ్ళీ మళ్ళీ వినాలనుకొంటారు. తమకు తెలియకుండా ఇలాంటి కథల పట్ల వాళ్ళు మక్కువ పెంచుకొంటారు. రెండోసారో మూడోసారో కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందో ముందే వాళ్ళు చెప్పగల్గుతారు. ఇలా జరగబొయ్యేది ముందుగా చెప్పగల్గడం ఒక సామర్థ్యం. మళ్ళీ మళ్ళీ ఒకే కథ వినడంవల్ల ఇలాంటి సామర్థ్యం పెరుగుతుంది. వాళ్ళ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వాళ్ళ సర్వతోముఖాభివృద్ధికిది దోహదపడుతుంది. మొదటి రెండు తరగతుల పిల్లలు చదవడం నేర్చుకొనేదశలో ఈ 'ముందుగా చెప్పగల్గడం' అనే సామర్థ్యం ఎంతైనా ఉపయోగపడుతుంది.

గణితం నేర్చుకోవడంలో కూడా ఈ సామర్థ్యం విలువ ఎనలేనిది. గణిత సూత్రాలన్నీ 'ముందుగా ఊహించి చెప్పగల్గడం' మీదనే కదా ఆధారపడతాయి. అందువల్ల గణిత అభ్యసనానికీ ఈ కథా శ్రవణ సామర్థ్యానికి మధ్య ఓ సామ్యం, సంబంధం ఉందని నా అభిప్రాయం. కథకు కూడా కొన్ని నిబంధనలు, పద్ధతులు ఉంటాయి. వాటిని పిల్లలు కథలు వినేకొద్దీ పట్టుకొంటారు. ఇలా పట్టుకొనే కొద్దీ వాళ్ళు ముందుగా ఏం జరగబొయ్యేదీ ఊహించి మరింత బాగా చెప్పగల్గుతారు. అలాంటి పిల్లలు గణిత సూత్రాల్ని కూడా ఇంతే బాగా పట్టుకోగలుగుతారు.

**మరో ప్రపంచం :**

పిల్లలు తమ చుట్టూ చూస్తున్న ప్రపంచాన్ని కథలు విస్తృతపరుస్తాయి. తాము ఎప్పుడూ పాల్గొనని సందర్భాలను, చూడని మనుషులను, పాత్రలను వాళ్ళు కథల్లో చూస్తారు. ఇలాంటి వాటితో మనకేం పని అని మీరనుకోవచ్చు. కానీ ఇవి కూడా మన జీవితంలో భాగాలు! వాటిని ఎప్పుడూ మనం చూడకున్నా అవి మనల్ని, మన ఆలోచనల్ని కదిలిస్తాయి. చిన్న వయస్సులో ఈ కదలిక మరింత ఎక్కువగా ఉంటుంది. జీవితాంతం ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుంది. తమ చుట్టూ ఒక్క చెడ్డమనిషి కూడా లేకున్నా పిల్లలు చెడ్డవాళ్ళను గురించి ఆలోచిస్తారు. అలాగే అసాధారణ ప్రతిభావంతుల్నీ, బుద్ధిమంతుల్నీ, అందగాళ్ళనూ కలుసుకొనే ఛాన్సు తమకెప్పుడైనా దక్కకపోతుందా అని ఆరాటపడతారు. ఆదర్శమూర్తుల్ని అభిమానించడం పిల్లల మనస్తత్వంలో ఒక భాగం. అలాగే ప్రమాదాలన్నా దుష్టశక్తులన్నా భయపడ్డం కూడా వాళ్ళ స్వభావంలో భాగం. మన సాంప్రదాయక కథలు పిల్లల ఈ మనస్తత్వాన్ని కనుగుణంగా ఉండటం వల్లనే ఇంత కాలం పిల్లల్నిలా ఆకర్షింపగల్గుతున్నాయి. అక్షర ప్రపంచంలోకి ఇంకా అడుగు పెట్టని బిడ్డ ఓ అమ్మమ్మ కథలో అద్భుతమైన మరో ప్రపంచాన్ని చూస్తుంది. అది తన వాస్తవ ప్రపంచం కంటే ఎంతో విస్తృతంగా ఉంటుంది. పిల్లలకు కథల్లో కన్పించే ఈ మరో ప్రపంచం గజిబిజిగా గందరగోళంగా ఉండదు. అందులో ఓ క్రమబద్ధత ఉంటుంది. ఆ క్రమబద్ధతలోనే కొన్ని నైతిక విలువలుంటాయి. కానీ ఆ విలువలు మనం నమ్మే సాంప్రదాయకార్థంలో ఉండవు. ఆ కథల్లో వంచితుడే గెలుస్తాడు. అయితే ఇలా గెలవడానికి వాడు కొన్ని పద్ధతులు పాటిస్తాడు. అవి అనైతికమైనవిగా మనకు సాంప్రదాయకార్థంలో కన్పించవచ్చు. ఆకలితో నకనకలాడే సింహానికి కుందేలు చెప్పిన అబద్ధాలు ఇలాంటివే.

**నూతన పదజాలం :**

కథలు చెప్పడం పిల్లల భాషా ప్రపంచాన్ని ఎలా విస్తృతం చేస్తుందో కూడా మనం చూడొచ్చు. మాటలు పూర్తిగా వ్యక్తిగత ఆస్తి, ఆ మాటలతో ప్రపంచానికి మనం పేర్లు పెట్టే తీరు కూడా వ్యక్తిగతమైనదే. కానీ ఇదే పదజాలం సామాజిక ఆస్తి కూడా. ఎందుకంటే మన అనుభవాల్ని ఇతరులతో పంచుకోవడానికి ఈ మాటలే ఆధారం. పదాలకున్న ఈ వ్యక్తిగత, సామాజిక లక్షణాలే పదాల అర్థాల్ని నిర్ధారిస్తాయి. ఉదాహరణకు పిల్లవాడికి 'ఆకలి' అంటే ఏమిటో అనుభవం నుంచి తెలుసు. దీన్నుంచే సింహం 'ఆకలి'తో ఉన్నప్పుడు ఎలా ఉండి ఉంటుందో పిల్లవాడు గ్రహించగలడు. ఇలా 'ఆకలి' అనే తనకు తెలిసిన పదం సింహానికి కూడా వర్తింప చేసుకునేలా ఈ కథ శ్రోతకు సహకరిస్తుంది. మరికొన్ని కథలు వినేకొలదీ మరికొన్ని పదాల సామాజికార్థాలు పిల్లలకు తెలుస్తాయి. తన స్వంత పదజాలాన్ని ఇతరులకు వర్తింపజేసుకొనే క్రమం వేగిరమవుతుంది. తర్వాత 'చదవడం'లోకి వెళ్ళే పిల్లలకు ఇది చాలా ఉపకరిస్తుంది.

పైన మనం చెప్పుకొన్న నాలుగు కథాప్రయోజనాల్లోని అంశాలు చదవడానిక్కూడా వర్తిస్తాయి. పిల్లలు చదివేకొలదీ భాషాసూత్రాలను, నిర్మాణాన్ని అర్థం చేసుకోగల్గుతారు. ముందుగా ఊహించి చెప్పగల్గడం పెరిగే కొలదీ చదవడంలో సామర్థ్యం పెరుగుతుంది. భాషా నిర్మాణంలో సూత్రాలతో పరిచయం పెరిగే కొద్దీ వాక్యంలో తర్వాత ఏమీ వచ్చేదీ పిల్లలు గ్రహిస్తారు. ఇలా చూస్తే కథలు చెప్పడం పిల్లల భాషా జ్ఞానాన్ని పెంచడానికి అమోఘంగా ఉపకరిస్తుంది!

**కథా నైపుణ్యం :**

కథలు చెప్పాలనుకొన్నప్పుడు మనకా కథ బాగా మనసుకు పట్టి ఉండాలి. అందులో తడబాటు ఏమీ ఉండకూడదు. తడబడితే మధ్యలో అతుకు కన్పిస్తే కథను ఖూనీ చేసినట్టే లెక్క. బాగా మనసుకు పట్టిన కథ అయితే మనం సాఫీగా చెప్పగలం. అలా చెప్పగల్గినప్పుడే కథ చెప్పేవాడికీ, వినేవారికీ మధ్య ఒక సజీవ సంబంధం ఉంటుంది.

అలాగే కథ బాగా మన మనసుకు పట్టి ఉంటే ఆ కథకు సంబంధించిన ఒక స్కెచ్ మన మనస్సులో ఉంటుంది. అప్పుడు శ్రోతల పరిస్థితిని బట్టి మనం ఇష్టం వచ్చినట్లు దాన్ని మార్చుకోగలం. ఒక్కోసారి కథను పెంచాల్సి వస్తుంది. ఒక్కోసారి తగ్గించాల్సి వస్తుంది. కుందేలు సింహం ముందు నిలబడ్డప్పుడు కథను మనం సాగదియ్యలేం. అక్కడే వేగంగా కథ నడవాలి. సింహం ఆకలితో నకనకలాడుతూ ఆలోచిస్తున్నప్పుడు కథను మనం నెమ్మదిగా చెప్పొచ్చు. అలాగే కుందేలు భయం భయంగా తన ఎత్తుగడను నెమరేసుకొంటూ అడవిలోంచి వస్తున్నప్పుడు కథను అంత వేగంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఇదంతా మనకు కథ మీద ఉన్న పట్టునుబట్టి ఉంటుంది.

ఇక కథలోని సంభాషణల సంగతేమిటి? వాటినెలా చెప్పాలి అనే ప్రశ్నలున్నాయి. దీనికి మనం పలు మార్గాల్ని రెండు రకాల స్వరాలతో పలకొచ్చు. హావభావాల్ని ప్రదర్శిస్తూ చెప్పొచ్చు. చిన్నసైజు తోలుబొమ్మల్ని ఆడిస్తూ చెప్పడం వల్ల సంభాషణలు చాలా రక్తికడతాయి. ఒక్కో పాత్రను గురించి చెపుతున్నప్పుడు తరగతి గదికి ఈవైపు నుంచి ఆవైపునకు పచార్లు చేస్తూ చెప్పొచ్చు. ఇలా ఎన్నో సృజనాత్మక పద్ధతుల్ని పాటించవచ్చు. ఇవన్నీ పిల్లలకు చాలా ఉత్తేజాన్నిస్తాయి. ఒకే కథను ప్రతి సంవత్సరం చెప్పాల్సిరావచ్చు. ఒకే కథను ఒకే సంవత్సరంలో పలుసార్లు చెప్పాల్సి రావచ్చు. దీనికి తగ్గట్టుగా మనం తయారుకావాలి. ఒక కళగా కథాకథనాన్ని అధ్యయనం చెయ్యాలి. అలవరచుకోవాలి. ఇది ప్రతి టీచరుకూ ఒక తప్పనిసరి సవాలు.

కథలు చెప్పడం తన జీవితంలో విడదీయరాని భాగమైతే ఏ టీచరు జీవితమూ నిస్సారంగా ఉండదని నా గట్టి నమ్మకం. ఇది జరగాలంటే ప్రాథమిక పాఠశాలల పాఠ్యాంశాల పట్ల మన దృక్పథంలో కూడా తీవ్రమైన మార్పు రావాలని నా దృఢ విశ్వాసం.

*"నేను చెప్పదలచుకున్నదంతా రెండు మాటల్లో చెపుతాను. "పిల్లల్ని నమ్మండి". పిల్లల్ని నమ్మాలంటే ముందు మనల్ని మనం నమ్మాలి. మనం పిల్లలుగా ఉన్నప్పుడు మన టీచర్లూ, పెద్దలూ మనల్ని నమ్మలేదు కదా! మనల్ని మన పెద్దలు చూసినట్లే మనమూ పిల్లల్ని చూస్తాం. మనం చెయ్యాల్సిందల్లా ఈ తరతరాల భయాన్ని, అపనమ్మకాన్ని వదులుకోవడం. దాంతో ఊహించని ఫలితాలు వస్తాయి.*


*– జాన్ హోల్ట్*

# సార్వత్రిక గురువులు

## (Universal Teachers)

## రవీంద్రనాథ్ ఠాగూర్

**(07.05.1861 - 07.08.1941)**




స్కూలంటే పెద్దపులి బోనులాగా, ద్వీపాంతరవాస శిక్షలాగా ఉందని తరచూ రవీంద్రుడు బాధపడేవాడు. బ్రిటిష్‌వారి గుమాస్తాలను తయారుచేసే విద్యా పరిశ్రమ పాఠశాలకు భిన్నంగా, శాంతినికేతన్, విశ్వభారతి విద్యా సంస్థలను స్థాపించి స్వేచ్ఛగా విద్యను ఎలా నేర్చుకోవాలో మనకు నేర్పించారు. మాతృభాషలో విద్యాబోధనను సమర్థించారు రవీంద్రకవి. కేవలం నాలుగు గోడల మధ్య చదువులూ – పరీక్షల ద్వారా సమగ్రజ్ఞానం రాదనీ, స్వయంకృషీ, ఆలోచన ద్వారా మాత్రమే జ్ఞానం సంపాదించాలని అన్నారు. బట్టీపట్టడం విద్యకాదనీ, నేర్చుకోవడంలో పొందే ఆనంద అనుభవమే నిజమైన విద్య అనీ తన శాంతినికేతన్ ద్వారా నిరూపించారు. శాంతినికేతన్‌లో రవీంద్రుని మార్గంలో చదువుకున్న సరోజినీ నాయుడు వంటి ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. విద్యపైన రవీంద్రుడి అద్భుత వ్యంగ్య రచన 'చిలకమ్మ చదువు' ప్రతి ఒక్కరూ చదివితీరాలి.

---

## గాంధీ

**(01.10.1869 - 30.01.1948)**



ఇంగ్లాండ్‌లో విద్యాభ్యాసం చేసిన గాంధీ భారతదేశంలో ప్రాతిపదిక విద్య ప్రయోజనాన్ని తన రచనల ద్వారా ప్రచారం చేయడమేకాదు, స్వయంగా తన కుమారుడికీ, ఇతరులకూ విద్యను నేర్పే బాధ్యతను కూడా చేపట్టారు. విద్యార్థులకు వ్యాయామంతోబాటు వృత్తివిద్యానూ నేర్పాలని, ప్రవర్తన వ్యక్తిత్వం, శీలం వంటి వాటి ద్వారా ఆత్మశిక్షణను పొందే విధంగా విద్యార్థులను తయారుచేయాలనీ చెప్పిన గాంధీ విదేశీ భాషలో విద్యాబోధనను తీవ్రంగా వ్యతిరేకించారు. 1937లో సేవాగ్రాంలో గాంధీ స్థాపించిన పాఠశాలలో మూడు గంటల వృత్తివిద్యా శిక్షణ, రెండు గంటలు పుస్తక పఠనమూ తప్పనిసరి. ఉపాధ్యాయులు కేవలం బోధించడమే కాదనీ పాఠాలలోని సారాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యపుస్తకాలకు బానిసల్లా మారకుండా, తమ సొంత అనుభవజ్ఞానంతో బోధించాలని గాంధీ భావించారు.

## మరియా మాంటిస్సోరి

**(31.08.1870 - 06.05.1956)**



ఉపాధ్యాయులే పిల్లల్ని అనుసరించాలనే మాంటిస్సోరి శిశుకేంద్ర విద్యకు ఆద్యురాలు. ఆట పాటలద్వారా విద్యబోధించే ఈ విధానం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమంలా మాంటిస్సోరి బడులు వెలిశాయి. బాలలకు కూడా తమదైన ఒక ప్రపంచం ఉంటుందనీ, అందులో హాయిగా జీవించేహక్కు వారికుందనీ, వారిని పువ్వుల్లా స్వేచ్ఛగా పెంచాలని ఆమె ప్రపంచాన్ని కోరేవారు. వెలుగునిచ్చే తరగతి గదులు. ఉత్సాహాన్ని కలిగించే బోధనోపకరణాలు వంటి కొత్త అంశాలతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన మాంటిస్సోరి ఇటలీ దేశపు తొలి మహిళా డాక్టరు. స్త్రీవాది. ఆరేళ్ళలోవున్న పిల్లల గ్రహణశక్తి పెంచేందుకు, వికలాంగులకోసం నూతన బోధనోపకరణాలు తయారుచేశారు. ఇటలీలో ముసోలినీ ఈమె ఆధ్వర్యంలో స్కూళ్ళను నడిపినప్పటికీ ఆ పిల్లలకు జాతీయ ఉన్మాదాన్ని నూరిపోయడం సహించలేక ఆ బాధ్యత నుండి వైదొలిగారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో మన దేశంలో 6 సంవత్సరాలు జీవించిన మాంటిస్సోరి మన దేశంలో గిజూభాయి వంటి విద్యావేత్తలకు ఆదర్శంగా నిలిచారు

---

## ఎ.యస్.నీల్


**(17.10.1883 - 23.09.1973)**



ప్రస్తుతం అమలులోవున్న పెట్టుబడిదారీ విద్యావిధానంపై విసుగెత్తిపోయిన ఏ.ఎస్.నీల్ అనే స్కాట్లాండ్ ఉపాధ్యాయుడు ఇంగ్లాండులోని ఒక కొండపైన సమ్మర్‌హిల్ అనే స్కూలును ప్రారంభించారు. ఈ స్కూల్లో టైంటేబుల్ లేదు. పరీక్షలు అసలేలేవు. ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఈ స్కూలును ప్రయోగాత్మకంగా నడిపారు. ఆడ, మగ పిల్లలకు కలిపి చదువు చెప్పడం ద్వారా వారి మధ్య చెడుప్రవర్తనా సమస్యలు ఉండవని రుజువుచేశారు. ఈ ప్రయోగాత్మక విద్యావేత్త. సహజంగా చురుకుగా, తెలివిగా జన్మించిన పిల్లల్ని నేటి స్కూళ్ళు తమ బట్టీ పద్ధతులతో ప్రస్తుత పెట్టుబడిదారీ సమాజానికి విధేయుల్లా, బానిసల్లా తయారుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు నీల్. కఠినమైన క్రమశిక్షణ పిల్లల్ని మేధావులుగా కాదు విలన్లుగా తయారుచేస్తుందంటారు. ఎవరికినచ్చిన అంశాన్ని వారు నేర్చుకునే అవకాశం కల్పిస్తే పిల్లలు స్వేచ్ఛగా ఎదుగుతారనే నీల్ అటువంటి నూతన బోధనాపద్ధతిని పాటించారు. టీచర్లకు మానసిక రుగ్మతలుంటే (ప్రాబ్లం టీచర్) అనే ఆయన రాసిన పుస్తకాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తప్పక చదవాలి.

## గిజూభాయి బగేకా

**(15.11.1885 - 23.06.1939)**



**పి**ల్లల విద్య, మానసిక వికాసాల కోసం తన జీవితాన్నే అంకితం చేసిన గిజూభాయ్ బగేకా గుజరాత్‌లోని చిట్టల్‌లో జన్మించారు. పిల్లలు ఇతన్ని ఆప్యాయంగా 'మీసేల అమ్మ' అని పిలిచేవారు. 1922లో కస్తూర్బాగాంధీతో కలసి బాలమందిర్‌ను స్థాపించిన గిజూభాయి మాంటిస్సోరి విద్యా పద్ధతిని ప్రచారం చేసేందుకు పలు సభలు నిర్వహించారు. పిల్లల మానసిక వికాసం, పెంపకం వంటి అంశాలపై గిజూభాయి ఎన్నో పుస్తకాలు రాశారు. పిల్లల అభివృద్ధి ఆయా పౌర సమాజాలపై ఆధారపడి ఉంటుందని, ఏ దేశపు అభివృద్ధినైనా నిర్ధారించాలంటే ఆ దేశంలోని పిల్లల జీవితాల్ని ప్రామాణికంగా తీసుకోవాలని చెప్పారు గిజూభాయి. ప్రాథమిక విద్యారంగంలో అమూల్యమైన మార్పులకు ఆద్యుడయ్యారు. పిల్లలలో ప్రేరణ కల్పించడం - నైతిక విలువలతో ఉండం, సామాజిక బాధ్యతను కలిగివుండడం. ఉపాధ్యాయుని కనీస అర్హతలుగా గిజూభాయి పేర్కొంటారు. "భారత విద్యా రంగానికి గిజూభాయి ఆదర్శం" అని పలువురిచే మన్ననలు అందుకున్న మహోన్నతుడు మన గిజూభాయి. తన అనుభవాలను క్రోడీకరించి 'పగటికల' వంటి పలు పుస్తకాలు రాశారు.

---

## మకరెంకో

**(13.01.1888 - 01.04.1939)**



**అ**ల్లరి పిల్లల్లో సైతం అద్భుత మార్పులు తీసుకువచ్చిన ఆచరణశీలి మకరెంకో. విప్లవానికి పూర్వం రష్యాలోని దోపిడీ వ్యవస్థలో దొంగలుగా తయారైన పిల్లల్ని, వేలాది యువజనుల్ని విద్యా శిక్షణ ద్వారా మేధావులుగా తయారుచేసే లోకాన్ని ఆశ్చర్యపరిచారు మకరెంకో. విద్యాబోధన శాస్త్రం అన్ని శాస్త్రాలకన్నా ప్రాముఖ్యమైనదనీ, ఉపాధ్యాయులు సమిష్టికృషి చేయడం ద్వారా మాత్రమే బాలబాలికలను ఆదర్శ పౌరులుగా తయారుచేయగలరనీ, నిజమైన విద్యాబోధన వ్యక్తిని సమిష్టిగా మారుస్తుందనీ అంటారు. సమిష్టి విద్యా బోధనలో వ్యక్తిగత శ్రద్ధ అంతర్భాగమనీ, విద్యను బోధించే సాధనాలన్నీ పరిస్థితులకు అనుకూలంగా మారుతూ ఉండాలనీ, నిరంతర అధ్యయనం, శిక్షణ, అనుభవం ద్వారా మాత్రమే మంచి విద్యాబోధనా నైపుణ్యం అలవడుతుందనే మకరెంకో మాటలు ఉపాధ్యాయ లోకానికి అనునిత్య ఆచరణ సూత్రాలు. విద్యపైన 100కు పైగా పుస్తకాలను మకరెంకో రాశారు.

## జ్యోతిబా పూలే (11.04.1827 - 28.11.1890)
## సావిత్రీబా పూలే (03.01.1831 - 10.03.1897)



**అం**బేద్కర్‌కి గురువైన జ్యోతిబాపూలే విద్యార్థి దశ నుంచే సమాజంలో అసమానతలకు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. శూద్రకులస్తుల కోసం దేశంలో మొట్టమొదిి పాఠశాల పూలే స్థాపించారు. అణగారిన ప్రజల కోసం ఎన్నో గ్రంథాలయాలనూ, పాఠశాలలనూ ప్రారంభించి గొప్ప రచనలు చేశారు. తన భార్య సావిత్రీబా పూలేకి చదువు నేర్పించి ఆమె చేత బాలికల పాఠశాల ప్రారంభించారు. ఆ పాఠశాలలోనే సావిత్రి టీచర్‌గా మారి దళిత బాలికలకు పాఠాలు నేర్పారు. మన దేశ మొదటి స్త్రీ ఉపాధ్యాయురాలు సావిత్రే. ఎన్నో అగ్రకుల, పెత్తందార్ల, రౌడీల పీడననూ, అవమానాన్ని ఎదుర్కొంటూ ఆమె ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు. తమ కాలంలో దళిత, అణగారిన జనం అభ్యున్నతి కోసం ఈ దంపతులు తమ ఆస్తినీ, జీవితాన్ని త్యాగం చేసి విద్య నేర్పించడం ద్వారా దళిత, శూద్ర సమాజాలలో విప్లవాత్మకమైన ఆలోచనా విధానం చోటు చేసుకొనేందుకు ఆద్యులయ్యారు. విద్యను ఆయుధంగా అసమాన సమాజంపై ఎక్కుపెట్టిన ఘనులు ఈ దంపతులు.

---

## సొసాకు కొబయాషి
## (18.06.1893 - 1962)



**త**మకళ్ళముందు జరిగే విషయాలను చూసి పిల్లలు నేర్చుకొంటారని. అందుకు తగినట్లుగా వాస్తవికంగా బోధించాలనే కొబయాషి టోక్యోలో జన్మించారు. ఇందుకోసం టోక్యోలో ఏకంగా రైలుబడి అనే పాఠశాలను ప్రారంభించారు. 7 రైలు పెట్టెలే ఈ బడి తరగతి గదులు. రైతులు, కార్మికులు, చేతిపనివారు కూడ అధ్యాపకులే. ఏ రోజుకారోజు, ఏ పాఠ్యాంశాలు నేర్చుకోవాలో చెబుతారు. పిల్లలు ఇష్టం వచ్చిన సబ్జెక్టును నేర్చుకోవచ్చు. రోజూ షికార్లు, ఆట, పాటలూ, సంగీతం తప్పనిసరి. తిట్టం, కొట్టడం, అవమానించడం, ఒక బిడ్డతో ఇంకొకర్ని పోల్చడం నిషేధం. క్రమబద్ధమైన సంగీతంలా ఈ స్కూలు నడిచిన తీరును టెట్సుకో కురొయనాగి అనే రచయిత్రి 'రైలుబడి' అనే పుస్తకంగా రాశారు. ఈమె కూడా ఆ స్కూల్‌లో చదివిన విద్యార్థే. ఒక అజరామమైన విద్యావిధానాన్ని రైలుబడి ద్వారా ప్రవేశపెట్టిన కొబయాషి సంగీతపట్టభద్రుడు. 1945లో టోక్యోపై జరిగిన బాంబుదాడిలో ఈ పాఠశాల సర్వనాశనమైంది. మనకూ ఇటువంటి బళ్ళు ఉంటే మన పిల్లఉ అసలు ఇంట్లో నిలుస్తారా?

## పాలో ఫ్రేరి

**(19.09.1921 – 02.05.1997)**



ప్రస్తుతం అమలులో ఉన్న విద్యావిధానం బానిసలకు బానిసలనే తయారుచేస్తుందని నినదించి – పీడితతాడిత ప్రజల ముంగిటకి విద్యను నడిపించిన ఘనుడు ఫ్రేరి. పీడితులగు పేదలకు పాలక వర్గాల విద్య సరిపోదని – నిత్యమూ వారెదుర్కొంటున్న పీడనను సంఘిటితంగా నిరోధించే విద్యను వారికందించారు ఫ్రేరి. ఈ భావాలతో ఫ్రేరి రాసిన 'పెడగాగి ఆఫ్ ది అప్రెస్ట్' 19 ప్రపంచ భాషల్లోకి (తెలుగులో 'పీడితుల విద్యాశాస్త్రం') అనువాదమై విద్యావేత్తల సంప్రదాయ ఆలోచనా పునాదుల్ని కదిలించింది. దీనితో ఫ్రేరిని బ్రెజిల్ నుంచి వెళ్ళగొట్టారు. పిల్లలు సమాచారాన్ని వల్లెవేసే యంత్రాలు కారనీ, ఉపాధ్యాయుడు సమాచారాన్ని నింపే పనివాడుకాదనీ, ఇదంతా బ్యాంకింగ్ విద్య అనీ అవహేళన చేస్తారు ఫ్రేరి. పీడితులకు చదువు అధ్యయనం నుంచే కాదు. పోరాటం ద్వారానే సాధింపబడుతుందని చెప్పే ఫ్రేరి విద్య గురించీ, సంస్కృతి గురించి చేసిన లోతైన పరిశోధనా విశ్లేషణలు ఈ దోపిడీ వ్యవస్థను పునాదులతో సహా కదిలించి పెకలించివేస్తాయి.

---

## ఎస్.ఏ.వార్నర్

**(17.12.1905 – 28.04.1984)**



మన దేశంలోని గిరిజనులకంటే వెనకబడిన జాతి న్యూసిలాండ్‌లోని 'మొయిరీ' జాతి. నిత్యమూ యూరోపియన్ దోపిడీ పదఘట్టన కింద నలిగిపోయే ఈ జాతి వారి బుర్రలకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన పద్ధతులు కనిపెట్టి వారిని విద్యావంతుల్ని చేసిన సృజనశీలి ఎస్.ఏ.వార్నర్. ఈ క్రమంలో ఆమె రూపొందించిన బోధనాపద్ధతే ఆర్గానిక్ టీచింగ్. ఈమె మెయిరీలపైన యూరోపియన్ పాఠ్యపుస్తకాలను రుద్దకుండా వారి ప్రకృతి జీవనంలోని వివిధ అంశాల నుండే సులభంగా వారికి విద్యను నేర్పించి వారికోసం ప్రత్యేకంగా ఎన్నో శిశుమందిరాలను స్థాపించారు. వారికి తెలిసిన పదాలతోనే అంచెలంచలుగా వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దింది. బోధనలో ఈమె ఆవిష్కరించిన సూత్రాల ఆధారంగానే ప్రముఖ విద్యావేత్త పాలోఫ్రెయిరీ అణచివేతకు గురవుతున్న పీడితులకోసం విద్యాబోధన సూత్రాలలో విప్లవాత్మక మార్పులు తెచ్చి బ్రెజిల్ యువతను విద్యావంతుల్ని చేశారు. ప్రపంచ విద్యాబోధనలో వార్నర్‌కృషి అపురూపం. అనితరసాధ్యం.

## సుహోమ్లీన్స్కీ

**(1918 - 02.09.1970)**



నేటి చదువులు పిల్లలలోని సృజనాత్మకతను చంపే హింసా విధానంగా ఉన్నాయని చెప్పే సుహోమ్లీన్స్కీ నిస్సారమైన యాంత్రిక బోధనకు ప్రత్యామ్నాయంగా జీవశక్తిగల పద్ధతులను కనిపెట్టి ప్రచారంచేశారు. బోధన అంటే పిల్లల బుర్రల్లోకి విసయపరిజ్ఞానాన్ని బలవంతంగా చొప్పించడం కాదనీ, పిల్లలు బుద్ధితోనే కాదు హృదయంతో కూడా నేర్చుకుంటారనీ, పిల్లలు ఇళ్ళ దగ్గర కోల్పోయిన బాల్యాన్ని పాఠశాల వారికివ్వాలనే సుహోమ్లీన్స్కీ తన అనుభవాలను క్రోడీకరించి విద్యాబోధనపై 'పిల్లలకే నా హృదయం అంకితం' అనే అద్భుతపుస్తకాన్ని రాశారు. తన అనుభవసారమే బోధనా పద్ధతిగా 'సంతోషచంద్రశాల' అనే పిల్లలబడిని పల్లెప్రకృతిలో నడిపిన సుహోమ్లీన్స్కీ పిల్లల విద్యావేత్తేకాదు - రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ నాజీ సేనలపై వీరోచితంగా పోరాడి తన భార్యను, బిడ్డను పోగొట్టుకొన్ని యుద్ధ యోధుడు కూడా.

---

## జాన్ హోల్ట్

**(14.04.1923 - 14.09.1985)**



విద్యార్జనకు స్కూలే అవసరంలేదనే విప్లవాత్మక విద్యాబోధనా పద్ధతికి మార్గదర్శకులు జాన్ హోల్ట్, మన పిల్లలు బడి అంటే ఎందుకు భయపడతారు? చదవమంటే మొండికెందుకు వేస్తారు? లాంటి అనేక అంశాలపై జాన్‌హోల్ట్ చేసిన పరిశోధనలు ప్రస్తుత విద్యా విధానంలోని డొల్లతనాన్ని, దోపిడీ తత్వాన్ని నగ్నంగా మనముందు నిలబెడతాయి. ఈ దోపిడీ వ్యవస్థలోని పాలకులు తయారుచేస్తున్న సిలబస్ మూలంగా పిల్లలు ఎలా నాశనం అవుతున్నారో, ఉపాధ్యాయ శిక్షణ నిస్సారంగా ఎలా మారుతుందో, అంతిమంగా పాఠశాలలు మానసిక వ్యాకులత కలిగించే పిచ్చాసుపత్రుల్లా మారిపోయి బిడ్డల ఆత్మహత్యలకు ఎలా కారణమవుతున్నాయో తన రచనల్లో అద్భుతంగా వివరించారు హోల్ట్. నేర్చుకోవడం పిల్లల సహజనజం అనీ, తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ వారికి సహకరిస్తే చాలనే హోల్ట్ పిల్లల కుటుంబాలలో కలిసిపోయి వారికి అభద్రతలేని విద్యనూ, వివేకాన్ని బోధించిన అభ్యుదయ విద్యా పథగామి.

## నీల్‌బాగ్ డేవిడ్

**(18.08.1921 - 08.08.1984)**



గ్రామీణ తెలుగు విద్యార్థుల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూలును స్థాపించిన ఘనులు డేవిడ్ హాస్బిరో. ఈయన భారతీయ దంపతులకు ఇంగ్లాండ్‌లో జన్మించారు. భారతదేశంపై మమకారం పెంచుకున్న ఈయన బ్రిటిష్ కౌన్సిల్ ఉద్యోగిగా మద్రాసు కార్పొరేషన్ స్కూళ్ళ పిల్లలకోసం పాఠ్యపుస్తకాలు రూపొందించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ఋషివ్యాలి, నీలగిరి, బ్లూమౌంటెన్ స్కూళ్ళలో కొంతకాలం పనిచేశారు. ఆతర్వాత కర్ణాటక, ఆంధ్ర సరిహద్దులలో 'నీల్‌బాగ్' పేరుతో స్కూలు స్థాపించారు. క్లాసుల వారీ విభజన లేకుండా పిల్లల నుండి ఇరవై సంవత్సరాల పెద్ద పిల్లల వరకు ఒకేచోట కలిసి చదువుకోవడం ఈ స్కూలు ప్రత్యేకత. నేర్చుకోవడానికి తమకంటే చిన్నవారికి పెద్ద పిల్లలు సాయపడతారు. ఉపాధ్యాయులు కేవలం పర్యవేక్షకులు మాత్రమే. సంగీతం, కవిత్వం, లలితకళలు, మట్టి బొమ్మలు చేయడం, కొయ్యపని వంటివి పిల్లల పాఠ్యక్రమంలో భాగాలు. శారీరక, మేధోశ్రమలను ఏకం చేసి శ్రమ గౌరవాన్ని అనుభవ పూర్వకంగా అర్థం చేయించే విద్యావిధానం ఈ స్కూలు ప్రత్యేకత. తన కొడుకుతో కలసి డేవిడ్ పిల్లల కోసం వందకు పైగా పుస్తకాలు రాశారు.

# తెలంగాణ

కదనాన శత్రువుల కుత్తుకల నవలీల
నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి
వీరులకు కాణాచిరా ... తెలగాణ
ధీరులకు మొగసాలరా!

✤ అబల యని దేశమును కబళింప తలపడిన
పరరాజులకు స్త్రీల పటుశౌర్యమును జూపి
రాజ్యతంత్రము నడిపెరా ... తెలగాణ
రాణి రుద్రమదేవిరా!

✤ కల్పనాతీతమౌ కమనీయ శిల్పమును
వేయి కంబాలలో వెలయించి మించినది
అడుగడుగు శిల్పాలతో ... తెలగాణ
అందాలు విరజిమ్మెరా!

✤ కులవర్ణ సంకీర్ణ కలహాల నిర్జించి
బోధిసత్త్వుని ధర్మబోధనల నేర్పింది
శ్రీగిరి చైత్యమ్మురా ... తెలగాణ
చైతన్యమును చాటెరా!

✤ శ్రీవైష్ణవుల భక్తి చిందు గీతాలతో
బసవన్న శివతత్త్వ పారవశ్యములోన
ఉగ్రూతలూగిందిరా ... తెలగాణ
వెల్లువై పొంగిందిరా!

✤ కవితలో విక్రాంతి కాహళిని పూరించి
కమ్మ తెనుగున తేటకావ్యాలు విరచించె
పాల్కురికి ఆనాడెరా ... తెలగాణ
ప్రగతి బాటలు దీర్చెరా!

✤ భాషా వధూ నయన బాష్పతతి నణగింప
రాజసమ్మాన వైరాగ్యమును ప్రకటించి
కృషికుడై జీవించెరా ... తెలగాణ
'కృష్ణకవి' పోతన్నరా!

✤ భూగర్భమున నిధులు పొంగిపారెడు నదులు
శృంగార వనతతుల బంగారముల పంట
నా తల్లి తెలగాణరా... వెలలేని
నందనోద్యానమ్మురా!

**- రావెళ్ళ వేంకట రామారావు**

(కార్మిక, కర్షక, దళిత, బడుగు బలహీనవర్గాల స్థితిగతుల నెరిగిన కవి రావెళ్ళ వేంకటరామారావు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లి గ్రామంలో 1924 జనవరి 21న జన్మించాడు. పేదలకోసం కలాన్ని పట్టుకుని నైజాంపై గళం విప్పిన ధీరుడాయన. పెద్దగా చదువుకోలేకపోయినా తల్లిదండ్రుల సాంగత్యం నుంచి అలవడిన జ్ఞానంతోనే ఆశుకవిత్వం చెప్పాడు. నిస్వార్థ జీవనానికి నిలువెత్తు అద్దం రావెళ్ళ.